www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

నేడే ఇంటర్ ఫలితాలు
ఉదయం 11 గంటలకు విడుదల
3

ఈపీఎఫ్‌వో వేతన పరిమితి
రూ.21 వేలకు!
రూ.15 వేల నుంచి పెంచే యోచన
2

శుక్రవారం | 12-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 358 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్లపక్షం; తిథి: చవితి మ. 1.12 తదుపరి పంచమి; నక్షత్రం: రోహిణి రా 12.51 తదుపరి మృగశిర; వర్జ్యం: సా. 5.06-6.39; దుర్ముహూర్తం: ఉ. 8.33-9.22, మ. 12.40-1.30; అమృతఘడియలు: రా. 9.45-11.18; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.04; సూర్యాస్తమయం: 6.27 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



రైతాంగానికి చల్లని కబురు!

ఈ ఏడాది ముందే రానున్న నైరుతి రుతుపవనాలు

క్షీణిస్తున్న ఎల్‌నినో.. జూన్‌కల్లా లానినా పరిస్థితులు.. అనుకూలంగా పాజిటివ్ ఇండియన్ ఓషన్ డైపోల్

మంచి వర్షాలు కురుస్తాయని నిపుణుల అంచనా.. 'నైరుతి'పై త్వరలోనే ఐఎండీ తొలి అంచనా విడుదల

విశాఖపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైతాంగానికి చల్లని కబురు... గతేడాది వాతావరణ శాఖ అంచనా వేసిన దానికంటే ఏడు రోజులు ఆలస్యంగా భారత్‌లోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు ఈ సారి నిర్ణీత తేదీ కంటే ముందుగానే రానున్నాయి. ప్రపంచంలో అనేక దేశాల వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపిన సూపర్ ఎల్‌నినో క్షీణత వేగంగా సాగుతుండడంతో.. వచ్చేనెల నాటికి తటస్థ పరిస్థితులు, జూన్‌కల్లా లానినా దశ ప్రారంభమవుతుందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు

మిగతా 2వ పేజీలో...

'సుమోటో' నాటకం!

ఇంటింటికీ వెళ్లి కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలట..

ఎన్నికల వేళ వైసీపీ సర్కారు కొత్త కుయుక్తి

జగన్ కోసం సీసీఎల్ఏ అధికారి ప్రయత్నాలు

సుమోటోగా కుల ధ్రువీకరణ పత్రాల పునఃపరిశీలన

ఇంటింటికీ తిరగాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు

జగన్ తరపున ప్రచారం చేయడమే అసలు ఉద్దేశం

పైఅధికారికి తెలియకుండానే ప్రభాకర్ రెడ్డి అత్యుత్సాహం

కోడ్ ఉల్లంఘించలేమని జేసీలు, తహసీల్దార్ల ఆందోళన



ఎన్నికల విధుల్లో తలమునకలై ఉన్న రెవెన్యూ సిబ్బందిని 'సుమోటో కుల ధ్రువీకరణ, పరిశీలన' పేరిట ఇంటింటికీ తిప్పుతారట! దీని అసలు ఉద్దేశం ప్రజలకు మేలు చేయడం కాదు! ఏదో ఒక రూపంలో ఉద్యోగులను జనంలోకి పంపించి.. జగన్ భజన చేయించడమే!

కుల ధ్రువీకరణ పత్రాల కోసం జిల్లాల్లో వేలకొద్దీ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆర్‌ఐల పరిశీలన కోసం ఎదురు చూస్తున్నాయి. వాటిని పరిష్కరించి 'మీ సేవ' ద్వారా సర్టిఫికెట్లు జారీ చేయవచ్చు. కానీ... ఇప్పుడు ఇంటింటికీ వెళ్లి.. అడగని వాళ్లకూ కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేస్తారట! దరఖాస్తు చేసుకోకున్నా ధ్రువపత్రాలు ఇవ్వడం ఇప్పటిదాకా ఎక్కడా లేదు!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారువన్నీ వక్ర మార్గాలు... వంకర వ్యూహాలే! ఎన్నికల వేళ అవి మరింత ముమ్మరంగా తెరపైకి వస్తున్నాయి. తన అనుకూల అధికారుల ద్వారా ప్రభుత్వ కార్యక్రమం ముసుగులో పార్టీ ప్రచారం చేసుకోవడమే దీని లక్ష్యం. ఇందులో భాగంగా... 'కుల సమాచార సేకరణ, పునఃపరిశీలన' పేరిట రెవెన్యూ సిబ్బందిని గ్రామ, వార్డు స్థాయుల్లో ఇంటింటికీ పంపేందుకు వైసీపీ సర్కారు ప్రయత్నిస్తోంది. దీనికి 'సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన' (సుమోటో క్యాస్ట్ వెరిఫికేషన్) అనే పేరుపెట్టింది. భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) కార్యాలయంలో ఇటీవల కీలక బాధ్యతల్లోకి వచ్చిన ప్రభాకర్ రెడ్డి అనే అధికారి జగన్మోహన్ రెడ్డి కోసం ఎన్నికల వేళ ఈ డ్రామాకు తెరలేపినట్లు సమాచారం. ఈ కార్యక్రమాన్ని ఇప్పటికిప్పుడే అమలు చేయాలంటూ జిల్లా జాయింట్ కలెక్టర్‌లు, మండల తహసీల్దార్లను

మిగతా 11వ పేజీలో...

ఆర్డీవో కోసం
అడ్డదారులు!

విచారణ తీరే మార్చేసిన తిరుపతి జేసీ

ఫిర్యాదు చేసిన వ్యక్తికే బెదిరింపులు

లంచం ఇచ్చి నువ్వూ నేరం చేశావని వింత వాదన 12

సీఎస్, సీసీఎల్ఏ ఆదేశాలూ బేఖాతరు

ప్రభుత్వ పెద్దలు కోరినట్టు నడుచుకున్న జేసీ

విచారణలో కీలక అంశాలు దాటవేత



అమలాపురం సభకు హాజరైన జనం.. అంతకుముందు రోడ్‌షోలో చంద్రబాబు, పవన్ అభివాదం

బీసీలకు 50 ఏళ్లకే
4 వేల పింఛను

రూ.లక్షన్నర కోట్లతో సబ్ ప్లాన్: చంద్రబాబు

చంద్రన్న బీమా పది లక్షలకు పెంపు

శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు

ఒక్క చాన్స్‌తో
మాఫియా రాజ్

మరో చాన్స్ ఇస్తే రాష్ట్రం ఖాళీ: చంద్రబాబు

'శాంతి' సీమలో కులచిచ్చు.. సిద్ధం అంటున్న జగన్‌కు ఇక యుద్ధమే

చంద్రబాబు, పవన్ కల్యాణ్ గర్జన.. కోనసీమలో ఉమ్మడి సభలు

జగన్ ఎక్స్‌పైరీ సీఎం.. ఆయనది జగన్నాటకం

అధికారమిస్తే మాఫియా సామ్రాజ్యాన్ని నడిపాడు

పగ్గాలిస్తే దోపిడీకి లైసెన్స్‌గా మార్చుకున్నాడు

మళ్లీ గెలిస్తే ప్రజలను చంపేసి డోర్ డెలివరీ

ఆయన ఉదయం టిఫిన్‌గా తినేది ఇసుక

మధ్యాహ్న భోజనం మద్యం.. రాత్రి తినేది గనులు

సిద్ధం.. సిద్ధం అంటున్న జగన్‌ను తరిమికొట్టాలి: చంద్రబాబు

కాకినాడ/అమలాపురం/అంబాజీపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు మారుపేరైన కోనసీమలో సీఎం జగన్ కులచిచ్చు పెట్టాలని చూశాడని టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ విరుచుకుపడ్డారు. ఒక్క చాన్సిస్తే రాష్ట్రాన్ని మాఫియా రాజ్ చేశారని.. మళ్లీ అవకాశమిస్తే రాష్ట్రం ఖాళీ అయిపోతుందని హెచ్చరించారు. దళితులపై దాడులు పెరిగిపోయాయని, జగన్ పాలనలో వారికి తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. కులమతాలు దాటి, ప్రాంతాలు దాటి, జిల్లాస్థాయి దాటి ఆలోచించకపోతే అందరం నష్టపోతామని

మిగతా 11వ పేజీలో...

జగన్ జైలుకే

జైలు, బెయిల్‌కు మధ్య ఊగిసలాట

కూటమిని ఎవడ్రా ఆపేది?

పచ్చని కోనసీమలో కుల చిచ్చు రగిల్చింది జగనే: పవన్

మత విద్వేషాల సృష్టికి.. జగన్ వేచి చూస్తున్నాడు

నా గొంతులో ప్రాణముండగా ఏపీలో ముస్లింలకు అన్యాయం జరగనివ్వను

వారికి 4% రిజర్వేషన్లు అమలుచేస్తాం

10 లక్షల మందికి రంజాన్ తోఫా

దుకాణ్-మకాన్, మసీదులకు సాయం

ఇమామ్‌లకు గౌరవ వేతనాలిచ్చా

ఇవన్నీ జగన్ ఇస్తున్నాడా? 11

రంజాన్ వేడుకల్లో బాబు ధ్వజం

ఎన్నికల స్పెషల్



ఇప్పటికి 100 కోట్లు 11

కోడ్ వచ్చాక స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ ఇది: మీనా

మధ్యాహ్నానికే మందు ఖాళీ 3

ఎన్నికల కోడ్‌తో.. కోటా మేరకే అమ్మకాలు

కోటా పూర్తికాగానే మద్యం షాపుల మూత

దీంతో ఉదయాన్నే షాపుల ముందు బారులు

వైసీపీ వాళ్లకైతే కోరినంత!

సరుకు వదలకుంటే నీ అంతు తేలుస్తా!

మద్యం పట్టుకున్న సెబ్ ఎస్‌ఐకి మంత్రి అంబటి బెదిరింపు 11

ఈద్ ముబారక్



కర్నూలులోని పాత ఈద్గా వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

ఆలయం కాదు..
ఆదాయం ముఖ్యం

సీఎస్‌డీఎస్ లోక్‌నీతి ప్రీపోల్ సర్వేలో ఓటర్ల మనోగతం



నిరుద్యోగం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్న 27 శాతం మంది 2

రామమందిరానికి 8% మంది మాత్రమే ఓటు

ధరల పెరుగుదలపైనా జనంలో ఆగ్రహం

నిమ్నాదాయ వర్గాల్లో కేంద్రంపై అసంతృప్తి

ఉన్నత, మధ్య తరగతి ప్రజల్లో సానుకూలత



పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టు రిజర్వాయర్ల నమూనా 2

గిరిజన చట్టాలు తుంగలోకి..

మన్యంలో స్టోరేజ్ హైడ్రో పవర్
అదానీ చేతికి!

గిరిజనేతరులకు ఇవ్వకూడదని స్పష్టంగా నిబంధనలు

అయినా అదానీతోపాటు మరో సంస్థకు కేటాయింపు

2 వేల ఎకరాలకు పైగా భూములు కట్టబెట్టే ఏర్పాట్లు

బస్తీవాసులపై బాదుడే బాదుడు

ఆస్తిపన్ను మరోసారి 15% పెంపు



పెంచిన పన్నుతో డిమాండ్ నోటీసులు జారీ

దేశంలో ఎక్కడా లేని విధంగా పన్ను పీకుడు

ఆస్తి విలువ ఆధారితంగా పన్ను విధింపు

టీడీపీ హయాం ఐదేళ్లలో ఒక్కసారీ పెంపులేదు

పైగా పట్టణాల్లో మెరుగైన వసతుల కల్పన

జగన్ వచ్చాకే పట్టణాలపై భరించలేని భారం

ఇప్పటికే మూడు దఫాలు పెరిగిన పన్ను

దీనికి అదనంగా చెత్త పన్ను వసూలు

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సొంత ఇంట్లో ఉంటున్న సత్యనారాయణరావు మూడేళ్ల కిందట గ్రంథాలయ పన్ను, నీటిపన్ను, ఇంటి పన్ను కలిపి రూ.3600 చెల్లించారు. అదే చాలా ఎక్కువ అని అప్పట్లో బస్తీ వాసులు గగ్గోలు పెట్టారు. అలాంటిది ఏప్రిల్ నుంచి మొదలైన కొత్త ఆర్థిక సంవత్సరంలో ఆయన రూ.11,763 చెల్లించాల్సిన పరిస్థితి. ఆస్తి పన్నును ఏటా 15 శాతం చొప్పున పెంచుతూ పోవడంతో ఆయన కట్టాల్సిన పన్ను మొత్తం మూడేళ్లలోనే ఏకంగా 226 శాతం పెరిగిపోయింది. ఎన్నికల ఏడాదిలోనైనా పన్నుపోటు నుంచి వెసులుబాటు దొరుకుతుందని పట్టణవాసులు ఆశలు పెట్టుకున్నారు. కానీ, అలాంటిదేమీ లేదంటూ మరింత బాదుడుకు జగన్ సర్కారు సిద్ధమైంది.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆస్తిపన్ను పెంచలేదు. అయినా సరే... 'బాదుడే బాదుడు' అంటూ జగన్ ఊరూరా మైకు పట్టుకుని ఊదరగొట్టారు. ఆయన అధికారంలోకి రాగానే 'అసలు బాదుడు' ఇదీ అంటూ పట్టణ వాసులకు పన్ను వాత పెట్టారు. విలువ ఆధారిత ఆస్తి పన్ను ప్రవేశ పెట్టి.. దానిని ఏటా 15 శాతం పెంచుతూ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. ఇప్పుడు ఎన్నికల ముందు కూడా 15 శాతం పెంచిన పన్నుతో ఇంటి యజమానులకు డిమాండ్ నోటీసులు అందిస్తున్నారు. దీనికి చెత్త పన్ను

మిగతా 12వ పేజీలో...

దిగ్గజ రియల్టర్‌కు మరణ శిక్ష

- వియత్నాంలో రూ.3.6 లక్షల కోట్ల బ్యాంకింగ్ కుంభకోణం
- మహిళా వ్యాపారవేత్త ట్రూంగ్ దోషి




న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 : బ్యాంకింగ్ రంగంలోనే అతి పెద్ద కుంభకోణం కమ్యూనిస్టు పాలనలో ఉన్న వియత్నాంలో వెలుగు చూసింది. అంతేకాక, ఈ కేసులో విచారణ పూర్తయి.. దోషిగా తేలిన ఓ మహిళా వ్యాపారవేత్తకు అక్కడి న్యాయస్థానం మరణశిక్ష విధిస్తూ గురువారం సంచలన తీర్పు ఇచ్చింది. రూ.3.6 లక్షల కోట్ల కుంభకోణంకు సంబంధించిన ఈ వ్యవహారంలో వియత్నాంకు దిగ్గజ మహిళా రియల్టర్ ట్రూంగ్ మైలాన్(67) దోషి. వియత్నాంలోని సైగాన్ కమర్షియల్ బ్యాంకు(ఎస్‌సీబీ) నుంచి ట్రూంగ్ మైలాన్ 11 ఏళ్లలో 44 బిలియన్ డాలర్లు(దాదాపు రూ.3.68 లక్షల కోట్లు) రుణంగా తీసుకున్నారు. ఇందులో 27 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.2.25 లక్షల కోట్లు)ను ఆమె నుంచి రికవర్ చేయలేమని ప్రాసిక్యూటర్లు న్యాయస్థానానికి చెప్పారు. 2022లో వెలుగుచూసిన ఈ కుంభకోణం ఆ దేశాన్నే కుదిపేసింది. ఈ కేసుకు సంబంధించి ట్రూంగ్ మైలాన్ సహా 85 మందిని దర్యాప్తు సంస్థలు అప్పట్లోనే అరెస్టు చేశాయి. అరెస్ట్ అయిన వారిలో సెంట్రల్ బ్యాంకు మాజీ అధికారులు, మాజీ ప్రభుత్వ ఉద్యోగులు, ఎస్‌సీబీ మాజీ ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఉన్నారు. కాగా, నిందితులపై విచారణ జరిపి మైలాన్‌ను దోషిగా తేల్చిన న్యాయస్థానం.. ఆమెతోపాటు మిగిలిన నిందితులకు కూడా శిక్షలు ఖరారు చేసింది.

ఎలా మోసం చేశారంటే.. ?

2011 నాటికి వియత్నాం రియల్ ఎస్టేట్ రంగంలో బడా వ్యాపారిగా ఎదిగిన ట్రూంగ్ మైలాన్.. దేశంలో నగదు కొరత ఉన్న మూడు బ్యాంకులను ఓ పెద్ద సంస్థగా విలీనం చేసేందుకు అనుమతి పొందారు. దాని ప్రకారం సైగాన్ కమర్షియల్ బ్యాంకు(ఎస్‌సీబీ)ని నెలకొల్పారు. స్థానిక నిబంధనల ప్రకారం ఓ వ్యక్తికి ఏ బ్యాంకులోనైనా 5% కంటే ఎక్కువ వాటాలు ఉండకూడదు. దీంతో వందలాది షెల్ కంపెనీలు, బినామీలను సృష్టించుకున్న ట్రూంగ్ మైలాన్ ఎస్‌సీబీలో 90% షేర్లు దక్కించుకున్నారు. అనంతరం తన సొంత మనుషులను బ్యాంకులో కీలక పదవుల్లో నియమించి ఆయా షెల్ కంపెనీలకు రుణాలు మంజూరు చేయించారు. ఇలా ఎస్‌సీబీ జారీ చేసిన రుణాల్లో మైలాన్ 93 శాతం తీసుకున్నారు. 2019 ఫిబ్రవరి నుంచి మూడేళ్లపాటు మైలాన్ తన డ్రైవర్‌తో బ్యాంకు నుంచి 4 బిలియన్ డార్లు(రూ.33 వేలు కోట్లు) విత్ డ్రా చేయించి రహస్య ప్రదేశానికి తరలించారని ప్రాసికూట్యర్లు కోర్టుకు తెలిపారు.

లోకం తీరు



గిరిజన చట్టాలు తుంగలోకి..

- మన్యంలో స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టులు అదానీకి
- 2 వేల ఎకరాలకు పైగా భూములు కట్టబెట్టే ఏర్పాట్లు

రంపచోడవరం, ఏప్రిల్ 11: 'అదానీ' కోసం రాష్ట్ర ప్రభుత్వం గిరిజన చట్టాలను సైతం తుంగులో తొక్కుతోంది. మన్యంలో జలాశయాల నుంచి నీటిని ఎత్తిపోస్తూ విద్యుత్‌ను ఉత్పత్తి చేసి నిల్వచేసే ప్రాజెక్టులను చట్ట విరుద్ధంగా అదానీ పవర్ సంస్థలకు కట్టబెట్టింది. దేశవ్యాప్తంగా పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి కోసం ఆయా ప్రభుత్వాలు ప్రత్యేక విధానాలను రూపొందించి అనేక రాయితీలతో ఆయా విద్యుత్ సంస్థలకు ప్రాజెక్టులు కట్టబెడుతున్నాయి. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ జగన్ సర్కారు 2022లో ప్రత్యేక విధానాన్ని అమలులోకి తెచ్చింది. దీని ప్రకారం 14,680 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, నిల్వ చేసేందుకు గానూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రాజెక్టులను వివిధ సంస్థలకు కేటాయించింది. వీటిలో నాలుగు ప్రాజెక్టులు అల్లూరి, పార్వతీపురం మన్యం గిరిజన జిల్లాల్లో ఉన్నాయి. అయితే గిరిజన ప్రాంతంలో ఉన్న ఈ ప్రాజెక్టులను చట్ట విరుద్ధంగా గిరిజనేతర సంస్థలకు కట్టబెట్టడం వివాదాస్పదంగా మారింది.

అల్లూరి జిల్లాలోని కొయ్యూరు మండలం ఎర్రవరంలో 1200 మెగావాట్లతో, అనంతగిరి మండలం పెదకోటలో 1000 మెగావాట్లతో, పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలోని కురుకుట్టిలో 1200 మెగావాట్లతో, కర్రివలసలో 1000 మెగావాట్లతో ఈ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్టులను మంజూరు చేసింది. వీటిలో పెదకోట మినహా తక్కిన మూడు ప్రాజెక్టులను అదానీ పవర్ కంపెనీకి కట్టబెట్టింది. పెదకోట ప్రాజెక్టును షిరిడీసాయి ఎలక్ట్రికల్స్‌కు కట్టబెట్టారు. ఈ ప్రాజెక్టుల కోసం మొత్తంగా 2వేల ఎకరాలకుపైగా భూమి కావాలి. వీటిలో 25 శాతం వరకూ అటవీ భూములు ఉండగా, తక్కినవి పట్టా భూములు, ప్రభుత్వ భూములు. భూ సేకరణ ద్వారా ఈ భూములను చేపట్టేందుకు చట్టం ఉన్నా, వాటిని గిరిజనేతర సంస్థలకు కట్టబెట్టేందుకు మాత్రం చట్టాలు అనుమతించడం లేదు. అంతేకాకుండా ఈ ప్రాజెక్టుల మూలంగా నిరాశ్రయులయ్యే గిరిజనులు, గిరిజన గూడేలు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. వీటిపై ఇప్పటికే ఆయా ప్రాంతాలలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా ప్రభుత్వం పట్టనట్టే వ్యవహరిస్తోంది. గిరిజన చట్టాల ప్రకారం గిరిజనులకు, గిరిజనులు సభ్యులుగా ఉన్న సంఘాలకు తప్ప ఇతరులకు గిరిజన ప్రాంతాల్లో ఏ రూపంలోనూ భూములను బదలాయించేందుకు అవకాశం లేదు. కానీ, జగన్ ప్రభుత్వం మాత్రం ఈ చట్టాలను తుంగలో తొక్కుతూ అదానీ పవర్‌కు మూడు ప్రాజెక్టులు, షిరిడీసాయి ఎలక్ట్రికల్స్‌కు ఒక ప్రాజెక్టును కట్టబెట్టింది.

సుప్రీం కోర్టు చెప్పినా...

బాక్సైట్ తవ్వకాల విషయంలోనూ ఇలాంటి వ్యవహారమే చోటు చేసుకుంటే అది వివాదాస్పదంగా మారి సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. సమతా కేసుగా ప్రాచుర్యం పొందిన సదరు కేసులో గిరిజన ప్రాంతాలలో స్థిరాస్తులను గిరిజనేతరులెవ్వరికీ కట్టబెట్టే వీలు లేదని, ప్రభుత్వాన్ని కూడా గిరిజనేతరునిగానే పరిగణిస్తారని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఈ విషయం ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు తెలిసినా గిరిజన హక్కులను, చట్టాలను హరించేసి పవర్ ప్రాజెక్టులను ఆయా గిరిజనేతర సంస్థలకు కట్టబెట్టారు. దీనిపై న్యాయపోరాటానికి పలు సంస్థలు సిద్ధమవుతున్నాయి.

ఉగ్రవేట..వారి ఇలాకాలోనే

- ఇళ్లలోకి చొరబడి మట్టుబెడుతున్నాం
- పటిష్ఠ ప్రభుత్వంతోనే ఇది సాధ్యం: మోదీ
- ఉత్తరాఖండ్, రాజస్థాన్‌లలో ప్రచారం

జైపూర్/రిషికేశ్, ఏప్రిల్ 11: కేంద్రంలో శక్తిమంతమైన బీజేపీ ప్రభుత్వం ఉందని.. అందుకే మన సైనిక బలగాలు ఉగ్రవాదులను వారి నేలపైనే మట్టుబెడుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. వారి ఇళ్లలోకి చొచ్చుకెళ్లి మరీ చంపుతున్నాయని చెప్పారు. దేశాన్ని లూటీ చేయకుండా అవినీతిపరులను అడ్డుకున్నానని.. దీంతో తనపై వారి కోపం పతాకస్థాయికి చేరిందని చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆయన ఉత్తరాఖండ్‌లోని రిషీకేశ్, రాజస్థాన్‌లోని కరౌలీల్లో జరిగిన సభల్లో ఆయన ప్రసంగించారు. గతంలో అస్థిర, బలహీన ప్రభుత్వాలు ఉన్నప్పుడు శత్రువులు ఆ అవకాశాన్ని ఉపయోగించుకుని ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేశారని.. ఇప్పుడు జాతీయ భద్రతకు కట్టుబడిన, యుద్ధ క్షేత్రాల్లోనూ దృఢంగా ఉన్న బలమైన సర్కారు కేంద్రంలో ఉందని, మన బలగాలు శత్రువుల ఇళ్లలోకి చొరబడి చంపేస్తున్నాయని చెప్పారు. అవినీతిపరులు ఏ పరిస్థితుల్లోనూ జైలుకే వెళ్తారని.. ఇది తన గ్యారెంటీ అని పేర్కొన్నారు. తననెంత బెదిరించినా వెనక్కి తగ్గేది లేదన్నారు. 'దేశవ్యాప్తంగా అవినీతిపరులపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. అందుకే నాకు వ్యతిరేకంగా విపక్షాలు ఇండీ కూటమిని ఏర్పాటుచేశాయి. 2024 ఎన్నికలు ఎవరు ఎంపీ అవుతారు.. ఎవరు కారన్నది తేల్చడానికి కాదు.. వికసిత్ భారత్ సంకల్పానికి కొత్త శక్తి ఇచ్చేందుకే ఈ ఎన్నికలు. గరీబీ హటావో అని కాంగ్రెస్ దశాబ్దాల పాటు నినాదం చేసింది. కానీ 25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేయడానికి నేను కృషిచేశాను' అని అన్నారు. తన జీవితంలో ప్రతి క్షణం దేశానికే అంకితమని చెప్పారు. విశ్రాంతి తీసుకోవడానికో, వినోదానికి మోదీ పుట్టలేదు. మోదీకి దేశ ప్రజలకు సంబంధించిన పెద్ద పెద్ద లక్ష్యాలు ఉన్నాయి. వాటి సాధనకు కష్టపడుతున్నాడు' అని వ్యాఖ్యానించారు.



రాముడి ఉనికినే ప్రశ్నించింది..

కాంగ్రెస్ శ్రీరాముడి ఉనికినే ప్రశ్నించిందని.. రామాలయ నిర్మాణాన్ని వ్యతిరేకించిందని, పైగా అనేక అడ్డంకులు సృష్టించిందని మోదీ ధ్వజమెత్తారు. అయినప్పటికీ ఆలయ నిర్మాణకర్తలు కాంగ్రెస్ పాపాలన్నీ క్షమించి ప్రాణప్రతిష్ఠకు ఆహ్వానిస్తే దానినీ బహిష్కరించిందని ఆక్షేపించారు. ఉత్తరాఖండ్ 'బ్రహ్మ కమల్'కు జన్మస్థానమని.. పోలింగ్ రోజున కమలం పువ్వు గుర్తుపై బటన్ నొక్కి అన్ని స్థానాలను బీజేపీ ఖాతాలో వేయాలని పిలుపిచ్చారు. జమ్మూకశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణ రద్దు తన ప్రభుత్వం తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయమని తెలిపారు.

బలమైన నేతకే భారతీయుల మద్దతు

భారతదేశంలోని ప్రజల్లో అత్యధికులు బలమైన నాయకుడిని తమ నేతగా కోరుకుంటున్నారని, ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వ పని తీరుపై సంతృప్తికరంగా ఉన్నారని ఇంటర్నేషనల్ ఐడీఈఏ(ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ డెమొక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్) అనే సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. దేశంలోని 59% మంది కేంద్ర ప్రభుత్వ పనితీరుపై సంతృప్తికరంగా ఉన్నట్టు ఈ అధ్యయనం వెల్లడించింది. ప్రధాని మోదీ నాయకత్వంపై దేశంలోని ఇతర సర్వేలు కూడా ఇదే తరహా అభిప్రాయాన్ని వెల్లడించాయని పేర్కొంది.

మోదీ పిరికితనం పరాకాష్ఠకు!

- సరిహద్దు విషయంలో 'న్యూస్‌వీక్'తో మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: చైనాతో నెలకొన్న సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులపై అమెరికాకు చెందిన న్యూస్‌వీక్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన వ్యాఖ్యల ద్వారా ప్రధాని మోదీ పిరికితనం పరాకాష్ఠకు చేరినట్లయిందని కాంగ్రెస్ పేర్కొంది. భారత సార్వభౌమత్వంపై చైనా పదే పదే దాడులు చేస్తున్నా కూడా మోదీ మాత్రం ఇంటర్వ్యూలో ఆ దేశంతో సరిహద్దుల్లో సుదీర్ఘకాలంగా నెలకొన్న పరిస్థితులను వెంటనే పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని మాత్రమే పేర్కొన్నారని ఎక్స్ వేదికగా కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. చైనా విషయంలో మోదీ పేలవమైన ప్రతిస్పందన చైనాను ప్రోత్సహించినట్లుగానే ఉందని ఆరోపించారు. చైనా విషయంలో ప్రధాని స్పందన సిగ్గుచేటు అని, తన వ్యాఖ్యల ద్వారా మోదీ 2020లో సరిహద్దులోని వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వద్ద చైనా సైనికులతో నెలకొన్న ఘర్షణలో అమరులైన 20మంది భారత జవాన్ల త్యాగాన్ని అవమానించారని ఆరోపించారు.

సత్సంబంధాలనే కోరుకుంటున్నాం: చైనా

సరిహద్దు అంశాల మీద అమెరికాకు చెందిన న్యూస్‌వీక్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై చైనా స్పందించింది. మోదీ చెప్పినట్లుగానే ఇరుదేశాల సరిహద్దుల్లో సుదీర్ఘకాలంగా నెలకొన్న పరిస్థితులను వెంటనే పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఇరుదేశాల ఉమ్మడి ప్రయోజనాల కోసం.. శాంతి సుస్థిరత, అభివృద్ధి కోసం భారత్‌తో ప్రాధాన్యంతో కూడిన దృఢమైన, సుస్థిరమైన సంబంధాలను కొనసాగించాలని కోరుకుంటున్నట్లు పునరుద్ఘాటించింది.

ఆలయం కాదు.. ఆదాయం ముఖ్యం

- సీఎస్‌డీఎస్ లోక్‌నీతి ప్రీపోల్ సర్వేలో ఓటర్ల మనోగతం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు ఓటు వేయటానికి ప్రాతిపదికగా తీసుకునే ప్రధాన అంశాలు నిరుద్యోగం, ధరల పెరుగుదల, అభివృద్ధి అని 'సీఎస్‌డీఎస్ (సెంటర్ ఫర్ ద స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీస్) లోక్‌నీతి' నిర్వహించిన ప్రీపోల్ సర్వేలో వెల్లడైంది. బీజేపీ ఆశలు పెట్టుకున్న రామమందిరం అంశానికి ఓటర్లు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వటం లేదని తెలిపింది. అవినీతి అంశాన్ని కూడా జనం అంతగా పట్టించుకోవటం లేదని పేర్కొంది. సీఎస్‌డీఎస్ లోక్‌నీతి నిర్వహించిన ప్రీపోల్ సర్వే ఫలితాలను గురువారం వెల్లడించారు. నిరుద్యోగం తమను తీవ్రంగా ఆందోళనపరుస్తున్న అంశమని సర్వేలో పాల్గొన్న పలువురు చెప్పారు. 2019 ఎన్నికలకు ముందు నిరుద్యోగం ముఖ్యమైన అంశమని 11శాతం మంది మాత్రమే చెప్పారు. ప్రస్తుత సర్వేలో వీరిసంఖ్య 27శాతానికి పెరిగింది. తమకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని.. 75 శాతం మంది స్పష్టం చేశారు. మూడింట రెండొంతుల మంది గత ఐదేళ్లతో పోల్చితే ధరలు పెరిగాయని తెలిపారు. గత ఐదేళ్లలో తమ జీవితాలు ఎంతోకొంత మెరుగుపడ్డాయని దాదాపు సగం మంది భావించగా, మూడోవంతు మంది మాత్రం తమ జీవితం మరిన్ని సమస్యలతో అధ్వానంగా తయారైందని చెప్పారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కార్యక్రమాలు, పథకాలతో సంపన్నులకే మేలు జరిగిందని 8శాతం మంది అభిప్రాయపడ్డారు. కాగా, సర్వేలో పాల్గొన్నవారిలో కేవలం 8శాతం మంది మాత్రమే రామమందిరం, అవినీతి అంశాలను ఓటు వేయటానికి అత్యంత ముఖ్యమైన విషయాలుగా పేర్కొన్నారని సీఎస్‌డీఎస్ లోక్‌నీతి తెలిపింది.

ఐఫోన్లపై నిఘా!

- నిర్ణీత వ్యక్తులపై పెగాసస్ తరహా మెర్సినరీ స్పైవేర్ దాడి
- పలువురు ఐఫోన్ యూజర్లకు యాపిల్ సంస్థ హెచ్చరిక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: భారత్‌లోని పలువురు రాజకీయనాయకులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తల ఫోన్లపై గతంలో జరిగిన పెగాసస్ నిఘా గుర్తుందా? అలాంటి నిఘా సాఫ్ట్‌వేర్లను 'మెర్సినరీ స్పైవేర్'లుగా వ్యవహరిస్తారు. తాజాగా అదే తరహా మెర్సినరీ స్పైవేర్‌తో నిఘా ముప్పు పొంచి ఉందంటూ భారత్ సహా 92 దేశాల్లోని తన వినియోగదారులకు యాపిల్ గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఓ హెచ్చరిక సందేశాన్ని పంపింది. తన సందేశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని కూడా అందులో సూచించింది. ఇవి సాధారణ సైబర్ క్రిమినల్ దాడులో, కన్స్యూమర్ మాల్‌వేర్ దాడులో కావని.. నిర్ణీత వ్యక్తులను (అంటే.. రాజకీయ నాయకులు, పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలవంటి వారిని) లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడులని యాపిల్ పేర్కొంది. ఈ ముప్పు నుంచి తప్పించుకోవాలంటే వినియోగదారులు తమ ఐఫోన్‌లో లాక్‌డౌన్ మోడ్‌ను ఎనేబుల్ చేయాలని సూచించింది. ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. భారత్ సహా 60 దేశాల్లో ఈ ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో యాపిల్ ఈ థ్రెట్ నోటిఫికేషన్‌ను తన వినియోగదారులకు పంపడం గమనార్హం.

ఈపీఎఫ్‌వో వేతన పరిమితి రూ.21 వేలకు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్‌వో) పరిధిలోని ఉద్యోగుల వేతన పరిమితిని రూ.15వేల నుంచి రూ.21వేలకు పెంచాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఉద్యోగులకు సామాజిక భద్రతను విస్తరించడంలో భాగంగా ఈ అంశాన్ని పరిశీలిస్తున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. వేతన పరిమితిని పెంచాలనే డిమాండ్లు కొన్నేళ్లుగా ఉండగా, ఉద్యోగులు సైతం ఎప్పటినుంచో దీనికి అనుకూలంగా ఉన్నారు. ఈఎస్ఐసీ ఇప్పటికే వేతన పరిమితిని రూ.21వేలకు పెంచిన నేపథ్యంలో ఈపీఎఫ్‌ను కూడా ఆ మేరకు పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. వేతన పరిమితిని చివరిగా 2014లో సవరించారు. అప్పట్లో ఈ పరిమితి రూ.6,500 ఉండగా దాన్ని కేంద్రం రూ.15,000కు పెంచింది. గరిష్ఠ వేతన పరిమితి పెంపుతో ఉద్యోగి, యాజమాన్యాలు చెల్లించే నెలవారీ చందా కూడా ఆ మేరకు పెరగనుంది. పీఎఫ్ ఖాతాకు జమ అయ్యే మొత్తం పెరగడంతో ఉద్యోగికి పదవీ విరమణ అనంతరం అధిక పెన్షన్ లభిస్తుంది.

హరియాణాలో బడి బస్సు బోల్తా.. ఏడుగురి మృతి

- డ్రైవర్ మద్యం తాగి నడపడం వల్లే ప్రమాదం

చండీగఢ్, ఏప్రిల్ 11: హరియాణాలో ఘోర బస్సు ప్రమాదం జరిగింది. డ్రైవర్ మద్యం తాగి నడపడంతో ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు బోల్తా పడి ఏడుగురు విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. మరో 20 మంది చిన్నారులు గాయపడ్డారు. ఈ దుర్ఘటన హరియాణాలోని మహేంద్రగఢ్ జిల్లాలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీఎల్ పబ్లిక్ పాఠశాల బస్సు 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 30 మంది విద్యార్థులను పాఠశాలకు తరలిస్తోంది. మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ ధర్మేంద్ర బస్సును వేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేయాలని ప్రయత్నించాడు. ఈ క్రమంలో బస్సుపై నియంత్రణ కోల్పోయాడు. విషయం గ్రహించిన వెంటనే బస్సు నుంచి దూకేశాడు. దాంతో బస్సు ఓ చెట్టును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులు మృతి చెందగా, 20 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గురువారం రంజాన్ సందర్భంగా అధికారిక సెలవు అయినప్పటికీ సదరు ప్రైవేట్ పాఠశాలలో తరగతులు నిర్వహించడంపై విచారణ జరుపుతున్నట్లు విద్యామంత్రి సీమా త్రిఖా వెల్లడించారు. ఆ బస్సు ఫిట్‌నెస్ గడువు 2018లోనే తీరిపోయిందని పోలీసులు తెలిపారు.

సూర్యగ్రహణ సమయంలో నాసా రాకెట్ల ప్రయోగం

- మిషన్‌కు ప్రవాస భారత పరిశోధకుడు ఆరోహ్ సారథ్యం

ముంబై, ఏప్రిల్ 11: ఈ నెల 8న ఉత్తర అమెరికాలో ఏర్పడిన సంపూర్ణ సూర్యగ్రహణం సందర్భంగా అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా మూడు సౌండింగ్ రాకెట్లను ప్రయోగించింది. ఈ మిషన్‌కు భారత సంతతికి చెందిన పరిశోధకుడు ఆరోహ్ బర్జాత్య సారథ్యం వహించడం విశేషం. సూర్యగ్రహణం సందర్భంగా భూమి ఎగువనున్న వాతావరణం ఏవిధంగా ప్రభావితం అవుతుందో అధ్యయనం చేయడానికి ఈ రాకెట్లను ప్రయోగించారు. ఆరోహ్ హైదరాబాద్‌లో స్కూల్ విద్య పూర్తి చేశారు. షోలాపూర్‌లోని వాల్చంద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. 2001లో అమెరికా వెళ్లారు.

మోదీ దార్శనికుడు

- దేశ ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చేశాడు
- కోయంబత్తూర్ బీజేపీ సభలో లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పదేళ్లలో దేశ ఆర్థిక ముఖ చిత్రాన్ని మార్చేసిన దార్శనికుడు ప్రధాని నరేంద్ర మోదీ అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలకు ప్రతిరూపం మోదీ అని ప్రశంసించారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కోయంబత్తూరు ఎంపీ అభ్యర్థి అన్నామలై కుప్పుస్వామికి మద్దతుగా గురువారం పీలమేడులో బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... 'మోదీ అంటే ఆత్మగౌరవం, ఆత్మ విశ్వాసం. మోదీ అంటే ప్రపంచం మెచ్చిన నాయకత్వం. సంక్షేమ పథకాలను అందిస్తూనే దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా మార్చడానికి మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, భారత్‌మాల వంటి అభివృద్ధి కార్యక్రమాలతో సంపద సృష్టించారు. చిన్న వయస్సులో ఐపీఎస్ వదులుకుని, ప్రజలకు సేవ చేయడానికి ముందుకు వచ్చారు అన్నామలై. కర్ణాటకలో ఆయన సింగం ఐపీఎస్. తమిళనాడులో ఆయన టీపీఎస్. అంటే తమిళ్ పీపుల్స్ సర్వీస్. నేను అన్నామలై ఫ్యాన్. నాకు మంచి మిత్రుడు. దమ్మున్న నాయకుడు. అన్నామలైకి విజన్ ఉంది. తమిళనాడు దశ, దిశ మార్చే మాస్టర్ ప్లాన్ ఆయన దగ్గర ఉంది. మార్పు కోసం పోరాడుతున్న ఆయన తమిళ ప్రజల మనసు గెలుచుకున్నారు' అని లోకేశ్ అన్నారు.

రైతాంగానికి చల్లని కబురు!

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారతదేశ వ్యవసాయ రంగానికి మేలు చేసే నైరుతి రుతుపవనాలు నిర్ణీత తేదీకంటే ముందే కేరళలో ప్రవేశించే అవకాశాలున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం పసిఫిక్, హిందూ మహాసముద్రాలలోని వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశిస్తాయని, మంచి వర్షాలు కురుస్తాయని చెబుతున్నారు. పసిఫిక్ మహాసముద్రంలో లానినా, హిందూ మహాసముద్రంలో ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐవోడీ) పాజిటివ్‌గా మారనుండడం నైరుతి రుతుపవనాలకు అనుకూలమని పేర్కొంటున్నారు. దీంతో దేశంలో అనేక ప్రాంతాల్లో మంచి వర్షాలు కురుస్తాయని వివరించారు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదవుతుందని ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ రెండు రోజుల క్రితం వెల్లడించిన విషయం తెలిసిందే. నైరుతి రాక, వర్షాల తీరుపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) త్వరలో తొలి అంచనా నివేదిక విడుదల చేయనుంది. దానికంటే ముందుగానే కొందరు నిపుణుల సానుకూల విశ్లేషణ వేసవి తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనంగా పేర్కొనవచ్చు. సాధారణంగా నైరుతి రుతుపవనాలపై పసిఫిక్, హిందూ మహాసముద్రాల్లో నెలకొనే వాతావరణం తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం మధ్య, తూర్పు పసిఫిక్ మహాసముద్రంలో సాధారణం కంటే ఎక్కువగా ఉన్న ఉపరితల ఉష్ణోగ్రతలు క్రమేపీ చల్లబడుతున్నాయి. వచ్చే నెలకు వేడి మరింత తగ్గి జూన్‌కల్లా చల్లబడతాయి. దీంతో పసిఫిక్ మహాసముద్రంలో లానినా ఏర్పడుతుంది. అదే సమయంలో రానున్న రెండు నెలల్లో హిందూ మహాసముద్రంలో ఐవోడీ పాజిటివ్‌గా మారుతుందని పలు మోడల్స్ అంచనా వేస్తున్నాయి. ఈ రెండింటి ప్రభావంతో జూలై నుంచి సెప్టెంబరు మధ్యకాలంలో విస్తారంగా వర్షాలు కురిసేందుకు అనువైన వాతావరణం ఏర్పడనుంది. ఈ సమయంలో వరుసగా బంగాళాఖాతంలో అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడి మధ్య, వాయవ్య భారతం వైపు పయనిస్తాయి. దీంతో ఇటు బంగాళాఖాతం అటు అరేబియా సముద్రం నుంచి తేమ రావడంతో పశ్చిమ తీరం, దానికి ఆనుకుని వాయువ్య భారతం ఇంకా కోర్ మాన్‌సూన్ ఏరియా (మధ్యభారతం పరిసరాలు)లో ఎక్కువ వర్షాలు కురుస్తాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాగా గతేడాది ఎల్‌నినో ప్రభావం వలర నైరుతి రుతుపవనాలు నిరాశపరచాయి. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో వ్యవసాయ దిగుబడులు తగ్గాయి. తాగునీటికి కటకటలాడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణం వేడెక్కడంతో దేశంలో అనేక ప్రాంతాలు ఉడుకుతున్నాయి. మరోవైపు వడగాడ్పులు కొనసాగుతున్నాయి. జూన్ వరకు గాడ్పులు, ఎండలు కొనసాగుతాయన్న ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో నిర్ణీత సమయం కంటే ముందే నైరుతి రుతుపవనాల వస్తాయని నిపుణులు అంచనా వేయడం చల్లని కబురే!

కాస్త తగ్గిన వడగాలి

అమరావతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు, వడగాల్పులు కాస్త తగ్గాయి. గురువారం నంద్యాల జిల్లా నందవరంలో 42.6 డిగ్రీలు, కడప జిల్లా చక్రాయపాలెంలో 42.5, ప్రకాశం జిల్లా దరిమడుగులో 41.6, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో 41.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 20 మండలాల్లో వడగాల్పులు, శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి మండలంలో తీవ్ర వడగాల్పులు వీచాయి. శుక్రవారం శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 62 మండలాల్లో వడగాల్పులు వీస్తాయని, అల్లూరి జిల్లా చింతూరు మండలంలో తీవ్ర వడగాల్పులు ఉంటాయని విపత్తుల నిర్వహణసంస్థ తెలిపింది.

బీజేపీకి రాజ్‌పుత్‌లు దూరం!

- ఎన్నికల్లో తమకు తగినన్ని టికెట్లు ఇవ్వటం లేదని విమర్శ
- పశ్చిమ యూపీలో పెరుగుతున్న వ్యతిరేకత
- మహాపంచాయత్‌లలో బీజేపీ వ్యతిరేక తీర్మానాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: దశాబ్దాలుగా బీజేపీకి మద్దతిస్తూ వస్తున్న రాజ్‌పుట్‌లు ఈసారి ఆ పార్టీపై కారాలు మిరియాలు నూరుతున్న విచిత్ర పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా యూపీ, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో రాజ్‌పుత్‌లు ఏకంగా బీజేపీని వ్యతిరేకిస్తూ బహిరంగ సభలు, సమావేశాలు, కుల పంచాయతీలు నిర్వహిస్తున్నారు. పశ్చిమ యూపీలోని సహారన్‌పూర్‌లో ఈ నెల 7వ తేదీన రాజ్‌పుత్‌లు మహా పంచాయత్ నిర్వహించారు. పశ్చిమ యూపీలో తమ జనాభా దాదాపు 10 శాతం ఉన్నప్పటికీ బీజేపీ తమకు కేవలం ఒక్క టికెట్ (మొరాదాబాద్) కేటాయించి అవమానించిందని సదరు పంచాయత్‌లో పలువురు రాజ్‌పుత్ నేతలు విరుచుకుపడ్డారు. ఘజియాబాద్ నుంచి ఎంపీగా ఉన్న తమ సామాజికవర్గానికి చెందిన జనరల్ (రిటైర్డ్) వీకే సింగ్‌ను బీజేపీ ఈసారి పక్కనపెట్టి టికెట్‌ను మరొకరికి కేటాయించటంపైనా రాజ్‌పుత్‌లలో తీవ్ర ఆగ్రహం కలిగించింది. పశ్చిమ యూపీలో బీజేపీపై వ్యతిరేకత రాజ్‌పుత్‌లకే పరిమితం కాలేదు. త్యాగి, సైని వంటి ఇతర అగ్రకులాలు కూడా తమకు చాలా తక్కువగా టికెట్లు కేటాయించటంపై ఆగ్రహంతో ఉన్నాయి. అవి కూడా ఇటీవలి కాలంలో మహా పంచాయత్‌లను నిర్వహించి బీజేపీ వ్యతిరేక తీర్మానాలు చేశాయి. మరోవైపు, గుజరాత్‌లో కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలా ఇటీవల దళిత సామాజికవర్గంతో నిర్వహించిన ఓ ఎన్నికల సభలో మాట్లాడుతూ.. రాజులు, మహారాజులు బ్రిటీష్ వారితో లాలూచీ పడ్డారని, వారికి తమ కుమార్తెలను ఇచ్చి వివాహాలు చేశారని, దళితులు మాత్రం ఎన్ని అణిచివేతలు ఎదురైనా విలువలకు కట్టుబడి ఉన్నారని వ్యాఖ్యానించటంపై గుజరాత్‌తోపాటు పలు రాష్ట్రాల్లో రాజ్‌పుత్‌లు భగ్గుమన్నారు. తీవ్ర నిరసన తెలుపుతున్నారు. మంత్రి క్షమాపణ చెప్పినప్పటికీ.. వారు శాంతించటం లేదు. రాజ్‌కోట్ నుంచి రూపాల అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించాలని, లేదంటే బీజేపీని ఓడిస్తామని హెచ్చరిస్తున్నారు. రాజ్‌పుత్‌ల నాయకుడు ఠాకూర్ పూరన్‌సింగ్ దీనిపై స్పందిస్తూ.. 'మా చరిత్రను వక్రీకరించటం, ఆర్థికంగా బలహీన వర్గాలకు ఇచ్చే ప్రోత్సాహకాల్లో మాకు న్యాయం చేయకపోవటం, లోక్‌సభ ఎన్నికల్లో మాకు తగిన ప్రాతినిధ్యం కల్పించకపోవటం వంటి అనేక పనులకు బీజేపీ పాల్పడుతోంది. మొత్తంగా రాజ్‌పుత్ సామాజికవర్గాన్నే అణచివేయాలని చూస్తోంది. ఈ నేపథ్యంలోనే బీజేపీకి గుణపాఠం చెప్పాలని మేం నిశ్చయించుకున్నాం' అని తెలిపారు. ఇతర సామాజికవర్గాలు సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నా వారికి ఎంపీ టికెట్ల పరంగా, మంత్రిపదవుల పరంగా ప్రాధాన్యం కల్పిస్తున్నారని, కానీ, తమను ఉద్దేశపూర్వకంగా తొక్కేస్తున్నారని ఆయన ఆరోపించారు. బీజేపీ సంప్రదాయ ఓటు బ్యాంకు అని ఓవైపు మమ్మల్ని భ్రమల్లో ముంచుతూనే మరోవైపు మోసగిస్తున్నారని, కాబట్టే, ఈసారి బీజేపీని ఓడించే పార్టీకే మద్దతివ్వాలని నిర్ణయించామని ఠాకూర్ పూరన్‌సింగ్ తెలిపారు.



ఈ నెల 7న సహరణ్‌పూర్‌లో రాజ్‌పుత్‌ల మహాపంచాయత్(ఫైల్)

సంక్షేమం పేరిట దోచేశాడు

- హైకోర్టు తప్ప జగన్ అన్నీ తాకట్టు పెట్టేశాడు
- 'నిజం గెలవాలి' యాత్రలో నారా భువనేశ్వరి



కొలకలూరులో మాట్లాడుతున్న భువనేశ్వరి

తెనాలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): 'సంక్షేమం పేరుతో నిధులన్నీ దోచేసింది చాలక రాష్ట్రాన్నే తాకట్టు పెట్టేశాడు. హైకోర్టు మినహా ఏమీ మిగలనివ్వలేదు. మొత్తం దోచేసి జేబులు నింపుకొని తినేస్తున్నాడు. ఇక మిగిలింది ప్రజల ఆస్తులే. అవైనా ఉన్నాయో లేదో ఒకసారి సరిచూసుకోవాలి. చంద్రబాబు తెచ్చిన పథకాలను ఆపేసి పేదల జీవితాల్లో అంధకారం నింపిన రాక్షసుడు జగన్‌మోహన్‌రెడ్డి. ఇలాంటి రాక్షసుణ్ణి తరిమేయడానికి రేపటి ఎన్నికల్లో ఓటనే ఆయుధాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి' అని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా గురువారం ఆమె గుంటూరు జిల్లా తెనాలి మండలం కొలకలూరులో పర్యటించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో గుండె ఆగి మరణించిన దాచేపల్లి శివరామయ్య కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. అనంతరం ప్రజల్ని ఉద్దేశించి భువనేశ్వరి మాట్లాడారు. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని, రౌడీ మూకలు రాజ్యమేలుతున్నాయని అన్నారు. పేదల కోసం అన్న క్యాంటీన్లు పెడితే వాటిని కూడా మూయించిన జగన్‌ను రాక్షసుడు అని కాకుండా మరేమనాలని ప్రశ్నించారు. జగన్ అరాచకాలను అడ్డుకోవాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

రూ.వేల కోట్ల అప్పులు తెచ్చి ఏం చేస్తున్నారు?

- దీనిపై ఎన్నికల కమిషన్ విచారణ చేపట్టాలి
- ఈ ఆర్థిక అరాచకానికి కాగ్, ఈసీ అడ్డుకట్ట వేయాలి
- టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం డిమాండ్



అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో వైసీపీ ప్రభుత్వం అప్పుగా తీసుకొస్తున్న రూ.వేల కోట్లను ఏం చేస్తోందో ఎన్నికల కమిషన్ విచారణ చేపట్టాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసింది. ఇష్టానుసారం అప్పులు తెచ్చి, వాటిని తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా పందేరం చేయడం కోడ్‌కు వ్యతిరేకమని, ఇందులో కాగ్ కూడా జోక్యం చేసుకోవాలని ఆ పార్టీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ గురువారం కోరారు. ఈ ఆర్థిక అరాచకానికి కాగ్, ఈసీ అడ్డుకట్ట వేయాలని, ఏప్రిల్, మే నెలల్లో ఆదాయం, ఖర్చుల వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. 'ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఏ చెల్లింపులు చేయాలన్నా స్ర్కీనింగ్ కమిటీ అనుమతి తప్పనిసరి. బిల్లుల చెల్లింపు సీనియారిటీ ప్రకారమే చేయాలి. అప్పులు తేవడానికి ఒక నిర్దిష్ట చట్టం ఉంది. దానికి విరుద్ధంగా తేవడానికి వీల్లేదు. కానీ వైసీపీ ప్రభుత్వం దీనికి పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోంది. ఖనిజాభివృద్ధి సంస్థ ద్వారా రూ.7వేల కోట్ల విలువైన బాండ్లు స్టాక్ మార్కెట్‌లో జారీ చేయించి ఆ డబ్బును ప్రభుత్వం తన అవసరాలకు వాడుకొంది. అదే నెలలో మారిటైం బోర్డు ద్వారా మచిలీపట్నం పోర్టు భూములు తనఖా పెట్టి రూ. 4వేల కోట్ల అప్పులు తెచ్చారు. వీటికి రాష్ట్ర ప్రభుత్వ సొంత పన్ను ఆదాయం కలిపి ఆ నెలలో మొత్తం రూ.13వేల కోట్లు వస్తే ఆ డబ్బు మొత్తాన్ని స్ర్కీనింగ్ కమిటీ ఆమోదం, వరుస క్రమంతో సంబంధం లేకుండా చెల్లింపులు చేసేశారు. ఇప్పుడు మళ్లీ ఖనిజాభివృద్ధి సంస్థ నుంచి రెండో వాయిదా సొమ్ము మే నెలలో మరో రూ.7వేల కోట్లు తీసుకోబోతున్నట్లు 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. ఈ సొమ్ము దేనికి తీసుకొంటున్నారో, దేనికి ఖర్చు చేస్తున్నారో ప్రభుత్వం చెప్పడం లేదు. కాగ్‌కు రెండు నెలల వరకూ సమాచారం ఇవ్వడం లేదు. ఈలోపు ఎన్నికలు పూర్తయిపోతాయి. ఎన్నికల సమయంలో ఒక పక్షానికి అనుచిత లబ్ధి, అనుచిత అవకాశాలు ఇవ్వరాదన్న సహజ న్యాయ సూత్రానికి ఇది విరుద్ధం. ఈ అప్పులు, ఖర్చుల వివరాలను తక్షణం బయట పెట్టించాలి. దీనికి ఎన్నికల కమిషన్ బాధ్యత తీసుకోవాలి' అని ఆయన విజ్ఞప్తి చేశారు. ఏ లెక్కలూ చెప్పకుండా ఎడాపెడా రూ.వేల కోట్ల అప్పులు తెచ్చి ఇష్టానుసారం ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. ఈ ఖర్చులు, చెల్లింపుల ప్రామాణికతపై విచారణ జరపాలని కూడా నీలాయపాలెం విజయ్‌కుమార్ కోరారు.

సుజలాన్‌తో భాగస్వామ్యం కొనసాగుతుంది

- సర్కార్ నుంచి ప్రత్యేక రాయితీలు పొందలేదు
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై 'యాక్సిస్' వివరణ

అమరావతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు రాలేదని చెబుతున్న యాక్సిస్ సంస్థ.. విద్యుత్తు కొనుగోలు ఒప్పందం రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సహేతుకమైన వివరణ ఇవ్వలేదు. ఈ నెల ఏడో తేదీన ఆంధ్రజ్యోతి ప్రచురించిన 'యాక్సిస్‌పై ఎంత ప్రేమో' అనే కథనానికి ఆ సంస్థ చీఫ్ కంపెనీస్ ఆఫీసర్ జె.వీర్రాజు స్పందించారు. "సంప్రదాయేతర ఇంధనోత్పత్తి సంస్థలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో సంయుక్తంగా సుజలాన్, మా సంస్థ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశాయి. ప్రభుత్వం మాకు ఎలాంటి ప్రయోజనాలూ ప్రత్యేకంగా కల్పించలేదు. సుజలాన్‌తో భారీ వ్యాపార నష్టాలను చవిచూసినా, ఆ సంస్థతో మా భాగస్వామ్యం కొనసాగుతుంది. సామర్థ్యాల పెంపునకు సంబంధించి కొత్తగా మా రెండు సంస్థలు ప్రభుత్వంతో ఎటువంటి ఒప్పందం చేసుకోలేదు" అని వీర్రాజు వెల్లడించారు.

ఈ ప్రశ్నలకు సమాధానాలేవి?

డిస్కమ్‌లతో యూనిట్‌కు రూ.4.76 చొప్పున 774 మెగావాట్ల కరెంటును సరఫరాచేసేందుకు 2017-18 చేసుకున్న ఒప్పందాన్ని ఈఆర్‌సీ ఆదేశాల మేరకే రద్దు చేసుకున్నామని యాక్సిస్ చెబుతోంది. జగన్ సర్కారు పీపీఏలను రద్దుచేస్తూ తీసుకున్న నిర్ణయంపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించలేదని వెల్లడించింది. ఇతర సంస్థలు ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పుడు సుజలాన్, యాక్సిస్ ఎందుకు వెళ్లలేదని నిపుణులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. 2016-17నాటికి ఈ సంస్థల సామర్థ్యం 575.5 మెగావాట్లు. అలాంటిది 774 మెగావాట్ల విద్యుత్తును అవి సరఫరా చేయగలవా అనే ప్రశ్నలకు బదులు లేదు. అనంతపురం జిల్లా కూడేరులో రూ.200 కోట్లతో బ్లేడ్ తయారీ సంస్థను స్థాపించి స్థానికంగా ఉన్న 1200 మందికి ఉపాధి కల్పిస్తామని సుజలాన్ తెలిపింది. దాని ప్రస్తుత స్థితిగతులేమిటో తెలియదు. నైపుణ్యాభివృద్ధి సెంటర్‌ను ఏర్పాటు చేసే బాధ్యతను తీసుకుంటామని యాక్సిస్, సుజలాన్ చెప్పాయి. కానీ, ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ బాధ్యత రాష్ట్రానిదే నంటూ తప్పుకొన్నాయి. గతంలో ఎనర్జీ యూనివర్సిటీ స్థాపిస్తామని ఆనాడు చెప్పి.. ఇప్పుడేమో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసే వర్సిటీకి చైర్ చేస్తామని మాత్రమే చెప్పామని మాట మార్చాయి.

'ఎస్ఎల్‌డీసీ' సమాచారం నిలిపేశాం

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై ట్రాన్స్‌కో వివరణ

అమరావతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డీసీ) సమాచారం వెల్లడి విషయంలో రక్షణ చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర నిఘా విభాగం అధిపతి హెచ్చరించినందువల్లే ప్రజలకు అందుబాటులో ఉంచడం లేదని ట్రాన్స్‌కో వివరించింది. గురువారం సంచికలో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన "ఇంధన శాఖ తీరు ఇంతింత కాదయా" కథనంపై ఆ సంస్థ స్పందించింది. ఎస్ఎల్‌డీసీ సమాచారాన్ని రక్షణ చర్యల కోసం ఏపీటీఎస్ సీఈఆర్‌టీ ఎంపానల్డ్ ఏజెన్సీకి అందజేశామని వివరించారు. ఏపీటీఎస్ నుంచి గ్రీన్‌సిగ్నల్ రావడంతోనే, ఆ సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచుతామని తెలిపింది.

బైక్‌ను ఢీకొన్న లారీ: ముగ్గురి మృతి


ప్రమాద దృశ్యం

అచ్యుతాపురం, ఏప్రిల్ 11: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో గురువారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌ను వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. దుప్పితూరుకు చెందిన గొల్లపల్లి శేఖర్ (19), నర్మాల అమల (38), కశింకోట మండలం ఉగ్గినపాలేనికి చెందిన డి.జ్యోతిప్రకాష్ (14) మధ్యాహ్నం బైక్‌పై ఎలమంచిలి వైపు వెళుతున్నారు. అచ్యుతాపురం జంక్షన్ సమీపంలో వీరి వాహనాన్ని ఫ్లైయాష్ లోడ్‌తో వస్తున్న లారీ ఢీకొంది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురు లారీ వెనుక చక్రాల కింద పడి మృతిచెందారు. చుట్టుపక్కల వాళ్లు శేఖర్, అమలను దుప్పితూరు వాసులుగా గుర్తుపట్టి బంధువులకు సమాచారం అందించారు. అయితే జ్యోతిప్రకాష్ తల ఛిద్రం అవడంతో ఎవరూ పోల్చుకోలేకపోయారు. శేఖర్ స్నేహితులు దుస్తులను బట్టి జ్యోతిప్రకాశ్‌గా గుర్తుపట్టారు. ఉగ్గినపాలేనికి చెందిన ప్రకాష్ పూడిమడక రోడ్డులో గల ఒక నర్సరీలో పనిచేస్తున్నాడని తెలిసింది.ప్రమాదానికి కారణమైన లారీ పరవాడ వద్ద గల ఎన్‌టీపీసీ నుంచి ఫ్లైయాష్‌ను రాజమండ్రి తీసుకువెళుతోంది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ శివ పరారైపోయాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బుచ్చిరాజు తెలిపారు.

మధ్యాహ్నానికే మందు ఖాళీ

- ఎన్నికల కోడ్‌తో.. కోటా మేరకే అమ్మకాలు
- కోటా పూర్తికాగానే మద్యం షాపుల మూత
- దీంతో ఉదయాన్నే షాపుల ముందు బారులు
- వైసీపీ వాళ్లకు కోరినంత మందు!



అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం దుకాణాలు మధ్యాహ్నానికే మూతపడుతున్నాయి. మధ్యాహ్నం దాటితే షాపుల్లో మద్యం దొరుకుతుందన్న గ్యారంటీ లేకుండా పోయింది. ఈరోజు కోటా అయిపోయిందంటూ సిబ్బంది షాపులు మూసి వెళ్లిపోతున్నారు. ఉదయం షాపులు తెరిచిన వెంటనే వివిధ పార్టీల కార్యకర్తలు షాపుల వద్ద పెద్ద ఎత్తున బారులు తీరడమే దీనికి కారణం. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక మద్యం అమ్మకాలపై ఆంక్షలు ప్రారంభమయ్యాయి. ఎన్నికల నిబంధనల ప్రకారం గతేడాది ఈ సమయంలో ఎంత మద్యం విక్రయించారో, ఇప్పుడు కూడా అంతే అమ్మాలి. దీనిని రోజువారీ ప్రాతిపదికగా అమలుచేస్తారు. అంటే గతేడాది ఈ తేదీన ఎంత అమ్మారో, ఈ ఏడాది ఆ తేదీన అంతకుమించి అమ్మకూడదు. కానీ రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తుండటంతో మద్యం వినియోగం బాగా పెరిగింది. ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న పార్టీల శ్రేణులకు మద్యం పంపిణీ తప్పనిసరి. దీంతో నాయకులు ఉదయాన్నే కార్యకర్తలను షాపులకు పంపి మద్యం తెప్పించుకుంటున్నారు.

కోటా మేరకే అమ్మకాలు

రాష్ట్రంలో సగటున రోజుకు రూ.70కోట్ల విలువైన మద్యం అమ్ముతున్నారు. అయితే దానిని విలువ ఆధారంగా కాకుండా.. పరిమాణం ఆధారంగా తీసుకుని విక్రయాలు చేస్తున్నారు. ఉదాహరణకు 2023 మార్చి 31న 6,71,959 లీటర్ల లిక్కర్, 2,09,792 లీటర్ల బీరు అమ్మారు. ఈ ఏడాది ఆ తేదీన 6,89,163 లీటర్ల లిక్కర్, 2,02,740 లీటర్ల బీరు విక్రయించారు. అదనంగా అమ్మితే ఆ తర్వాత రోజున తగ్గించి అమ్ముతున్నారు. అదనంగా ఎందుకు అమ్మాల్సి వచ్చిందనే కారణాన్ని రాసి పంపాలని ఎన్నికల కమిషన్ కోరుతోంది. దీంతో ప్రతిరోజూ ఉదయాన్నే గతేడాది ఫలానా షాపులో ఎంత మద్యం అమ్మారనే లెక్కలను షాపుల సిబ్బందికి బేవరేజెస్ కార్పొరేషన్ పంపుతోంది. ఆ మొత్తం అవ్వగానే వెంటనే షాపు మూసేయాలని అధికారులు చెబుతున్నారు. దీంతో టార్గెట్ మేరకు మద్యం విక్రయించిన వెంటనే సిబ్బంది షాపులు మూసేస్తున్నారు. సాధారణ రోజుల్లో ఒక్కో వ్యక్తికి గరిష్ఠంగా మూడు సీసాలు అమ్మితే, ఎన్నికల నేపథ్యంలో ఇప్పుడు ఒకరికి ఒక్క సీసానే ఇస్తున్నారు. దీంతో పార్టీల కార్యకర్తలు గుంపులు గుంపులుగా మద్యం షాపులకు వస్తున్నారు. కొన్నిచోట్ల నలభైయాభై మంది ఒకేసారి వచ్చి లైనులో నిల్చొంటున్నారని, ఒక సీసా చొప్పున తీసుకుని మళ్లీ వచ్చి లైనులో నిలుచుంటున్నారని సిబ్బంది చెబుతున్నారు. సాధారణ రోజుల్లో సాయంత్రం వరకు పెద్దగా వ్యాపారం ఉండేది కాదు. ఇప్పుడు అందుకు భిన్నంగా షాపులు తెరిచిన వెంటనే మందు కోసం బారులు తీరుతున్నారు. గత ఎన్నికల సమయంలో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో మద్యం షాపులు ఉన్నందున ముందుగానే కొన్ని బాటిళ్లు స్కాన్ చేసుకుని, వ్యాపారులు రోజంతా విక్రయాలు చేసేవారు. ఇప్పుడు ప్రభుత్వ షాపులు కావడంతో కోటా మేరకు సరుకు అమ్మిన వెంటనే సిబ్బంది షాపులు మూసేస్తున్నారు. బార్లకు కూడా ఇవే నిబంధనలు వర్తిస్తున్నందున పలుచోట్ల బార్లు కూడా ముందుగానే అమ్మకాలు ఆపేస్తున్నాయి. ఎన్నికల నేపథ్యంలో బార్లలో ధరలు భారీగా పెంచారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో రెండు వారాల కిందటే 30శాతం ధరలు పెంచారు. మిగిలినచోట్ల కూడా బార్లలో మద్యం రేట్లు పెరిగాయి. బార్లకు ఎమ్మార్పీ నిబంధనలు వర్తించనందున బార్ యజమానులు ఎన్నికలను అవకాశంగా తీసుకుని భారీగా లాభాలు ఆర్జిస్తున్నారు.

వైసీపీ వాళ్ల తర్వాతే.. ఎవరికైనా!

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అనేకచోట్ల మద్యం షాపుల్లో వైసీపీకి కావాల్సినంత మద్యం దొరుకుతోంది. కోటా పరిమితి ఉన్నా.. మొత్తం మద్యాన్ని తమకే ఇవ్వాలని అధికార పార్టీ నేతలు ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వ మద్యం షాపులే కావడంతో చాలాచోట్ల వైసీపీ నేతలకు అడిగినంత ఇచ్చి, ఆతర్వాత మిగిలిన పార్టీలకు, సాధారణ వినియోగదారులకు అమ్ముతున్నారు. మరోవైపు అధికార పార్టీ నేతలు పక్క రాష్ట్రాల నుంచి ఎన్‌డీపీఎల్‌ను యథేచ్ఛగా తెచ్చుకుంటున్నారు. గోవా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మద్యాన్ని తీసుకొచ్చి పంపిణీ చేస్తున్నారు.

కొట్టిందీ వారే.. కేసులు పెట్టిందీ వారే!

- ఒంగోలులో పెచ్చుమీరిన వైసీపీ రౌడీయిజం
- రాష్ట్రమంతా చూసిన బాలినేని వర్గం దౌర్జన్యకాండ
- అధికార పార్టీ ఒత్తిళ్లలో పోలీసులు, జీజీహెచ్ అధికారులు
- 36 మంది కూటమి నేతలపై తప్పుడు కేసులు
- జీజీహెచ్ ఘటనపై వివరణ కోరిన కలెక్టర్
- సీసీ ఫుటేజీలు మాయం చేసేందుకు యత్నాలు


బుధవారం అర్ధరాత్రి రిమ్స్ క్యాజువాలిటీలోకి దూసుకుపోతున్న బాలినేని, ఆయన అనుచరులు (ఫైల్)

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 11: ఒంగోలులో వైసీపీ రౌడీ రాజకీయం శ్రుతిమించింది. బుధవారం నగరంలో టీడీపీ నాయకులతోపాటు, సామాన్యులపైనా దాడి చేసి, బీభత్సం చేసిన ఆ పార్టీ నేతలు.. తిరిగి తెలుగుదేశం వారిపైనే అట్రాసిటీ కేసులు పెట్టారు. దీనికి పోలీసులు కూడా వత్తాసు పలుకుతూ వారు ఫిర్యాదిచ్చిందే తడవుగా కేసు నమోదు చేయడం విమర్శలకు తావిస్తోంది. బుధవారం అర్ధరాత్రి స్థానిక సమతానగర్‌లో నిర్వహించిన వైసీపీ ప్రచార కార్యక్రమంలో వలంటీర్ పాల్గొనడంపై ప్రశ్నించిన పాపానికి సీహెచ్ ప్రభావతి కుటుంబంపైనా, పలకరించడానికి వచ్చిన టీడీపీ నేత మోహన్‌రావుపైనా దాడిచేసిన బాలినేని వర్గం ఆ తర్వాత బాధితులు చికిత్సపొందుతున్న రిమ్స్ దగ్గరకు వెళ్లి మరీ దౌర్జన్యానికి పాల్పడిన విషయం తెలిసిందే!. గొడవకు కారణమైన వైసీపీ నేతల నుంచి తమకు ముప్పు ఉన్నట్లు గుర్తించిన టీడీపీ నేతలు.. వెంటనే ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. అయితే ఈలోపే దాడి చేసిన వైసీపీ నేతలే నేరుగా రిమ్స్ వెళ్లి తమకే గాయాలైనట్లు అబద్ధాలు చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడి, రక్తపు మడుగులో ఉన్న టీడీపీ నాయకుడు మేడికొండ మోహన్‌రావు, ఆయనకు అండగా నిలిచిన టీడీపీ నాయకులు 36 మందిపై కౌంటర్‌గా అట్రాసిటీ కేసులు పెట్టడం గమనార్హం.

ఏకపక్షంగా పోలీసుల తీరు

ఇదిలాఉంచితే ఒంగోలులో రణరంగాన్ని సృష్టించిన వైసీపీ నేతలకు పోలీసులు వత్తాసు పలకడంపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వారి కళ్లముందు జరిగిన ఘటనపై కనీసం కాలు కదపని పోలీసులు ఏకంగా టీడీపీ కూటమి నేతలపై కేసులు పెట్టారు. జీజీహెచ్ వద్ద ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడు ప్రణీత్ రెడ్డి తమ అనుచరులతో మూడు గంటలపాటు చేసిన దౌర్జన్యకాండ రాష్ట్రమంతా చూసింది. అయినా తాము సచ్ఛీలురమంటూ మాట్లాడుతున్న వైసీపీ నేతలకు అధికారులు వత్తాసు పలుకుతున్నారనేందుకు బాధితులపైనే కేసులు పెట్టడం నిదర్శనం. తమ పార్టీకి చెందిన వారిపై హత్యాయత్నం చేశారని ఎంపీ మాగుంట, దామచర్ల జనార్దన్ ఇతర నేతలు ఎస్పీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోని పరిస్థితి. ఇదేమీ లెక్కచేయని వైసీపీ శ్రేణులు మరోసారి రిమ్స్‌లో దాడులకు తెగబడటం, అద్దాలు, కారులను ధ్వంసం చేయడం ఇప్పుడు నగర ప్రజల్లో చర్చనీయాంశమైంది. అయితే అధికారపార్టీ నేతల ఒత్తిళ్లతో అటు పోలీసులు, ఇటు జీజీహెచ్ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. దాడులకు పాల్పడింది బాలినేని వర్గం కాగా డ్యూటీ డాక్టర్ తన ఫిర్యాదులో మాత్రం ఇరువర్గాలు కారణమని పేర్కొనడం గమనార్హం.

జీజీహెచ్‌లో గొడవపై కలెక్టర్ ఆరా

బుధవారం అర్ధరాత్రి జీజీహెచ్‌లో వైసీపీ మూకల వీరంగంతో రోగులు వణికిపోయారు. బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన టీడీపీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్‌పైన దాడి చేసే ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో మూడు గంటలపాటు బాలినేని, ఆయన తనయుడు ప్రణీత్‌రెడ్డి, ఆయన అనుచరులు జీజీహెచ్ క్యాజువాలిటీ అద్దాలను పగులగొట్టి, వైద్యులపై దౌర్జన్యం చేశారు. దీనిపై అటు వైద్యులు, ఇటు రోగులు వైసీపీ చర్యలపై అసహనం వ్యక్తం చేశారు. కాగా, ఘటన జరిగిన తీరుపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్ కుమార్ జీజీహెచ్ అధికారులను వివరణ కోరారు. అక్కడ జరిగిన పరిణామాలపై నివేదిక ఇవ్వాలని కోరారు. అయితే జీజీహెచ్ అధికారులు అధికార పార్టీ వారి ఒత్తిళ్లతో మొక్కుబడి నివేదికకు పరిమితమైనట్లు సమాచారం. దీనిపై జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్‌నాయక్‌ను వివరణ కోరగా, జీజీహెచ్‌లో జరిగిన విషయాలు తనకేమీ తెలియదని దాటవేయడం గమనార్హం!.

సీసీ ఫుటేజ్‌లు మాయం చేయాలని చూస్తున్నారు!

జీజీహెచ్‌లో వైసీపీ మూకలు చేసిన అలజడి, దౌర్జన్యకాండ ఆసుపత్రిలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. అయితే అబద్ధాలతో అందరినీ మభ్యపెట్టాలని చూసినా, సీసీఫుటేజ్‌లో వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉండటంతో ఆ పార్టీ నేతలు వాటిని కాపీ చేసుకుని, హార్డ్ డిస్కుల నుంచి తొలగించాలని జీజీహెచ్ సిబ్బందిని ఆదేశించినట్లు సమాచారం. ఇదే సమయంలో పోలీసులు కూడా మొక్కుబడి విచారణ చేసి మమ అనిపించడమే కాకుండా, జీజీహెచ్‌లో జరిగిన ఘటనలో టీడీపీ వారిపై కేసులు నమోదు చేయాలని చూస్తున్నారు. ఇదంతా చూస్తుంటే అధికార పార్టీకి పోలీసుల అండదండలు ఏ విధంగా ఉన్నాయో స్పష్టమవుతోంది.

శ్రీవారి సేవలో సుప్రీం న్యాయమూర్తులు


నడకమార్గంలో జస్టిస్ సంజయ్ కరోల్


జస్టిస్ రవికుమార్

తిరుమల, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సీటీ రవికుమార్, జస్టిస్ సంజయ్ కరోల్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్ కుమార్ మీనా గురువారం రాత్రి తిరుమల చేరుకున్నారు. శుక్రవారం ఉదయం అయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

నేడే ఇంటర్ ఫలితాలు

- ఉదయం 11 గంటలకు విడుదల

అమరావతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాలు శుక్రవారం వెలువడనున్నాయి. ఉదయం 11గంటలకు తాడేపల్లిలోని ఇంటర్మీడియట్ కార్యాలయంలో ఇంటర్ విద్యామండలి కార్యదర్శి సౌరభ్ గౌర్ ఫలితాలు విడుదల చేయనున్నారు. ఫలితాలను https://resultsbie.ap. gov.in/ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని ఇంటర్ విద్యామండలి తెలిపింది. కాగా, దాదాపు 10.5లక్షల మంది విద్యార్థులు ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు.

రాష్ట్ర ప్రజలు మార్పు కోరుతున్నారు

- ముస్లిం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడలేదు: పురందేశ్వరి



రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 11: 'రాష్ట్రంలోని ప్రజలంతా మార్పు కోరుకుంటున్నారు.పార్లమెంట్, అసెంబ్లీలకు పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులను కచ్చితంగా గెలిపించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు' అని బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయం వద్ద గురువారం విలేకరులతో మాట్లాడారు. 'కచ్చితంగా మార్పు జరుగుతుంది. రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని విశ్వసిస్తున్నా. నేను ముస్లిం మైనార్టీల రిజర్వేషన్లపై కామెంట్ చేశానంటూ వస్తున్న వార్తలు అసత్యం. నేను ఎక్కడా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడలేదు. ఆ ప్రచారం నమ్మవద్దు' అని పురందేశ్వరి స్పష్టం చేశారు.

పోటీ ఖాయం... ఎలా అన్నదే తేలాలి

- పవన్ కల్యాణ్‌ను కలసిన ఎంపీ రఘురామరాజు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 11: 'ఈ ఎన్నికల్లో నేను పోటీ చేయడం ఖాయం. అసెంబ్లీనా, పార్లమెంటా అనేది తేలాలి' అని రఘురామకృష్ణరాజు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గురువారం జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను ఆయన కలిశారు. ఇప్పటి వరకూ ఆయనకు ఏ పార్టీ నుంచి టికెట్ దక్కలేదు. అయినా సరే పవన్ కల్యాణ్‌ను కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా రఘురామ మాట్లాడుతూ, పోటీ తప్పకుండా చేస్తానని పేర్కొన్నారు.

సీపీఎస్ ఇవ్వలేకపోయాం: మంత్రి బొత్స

విజయనగరం, ఏప్రిల్ 11: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం) ఇవ్వలేక పోయామని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం నెల్లిమర్ల రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరిగిన ఉమ్మడి విజయనగరం జిల్లా విస్తృతస్థాయి సమావేశంతో పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డితో కలసి మంత్రి బొత్స పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు సంబంధించి అన్ని సమస్యలు పరిష్కరించాం. సీపీఎస్‌పై ఇచ్చిన హామీ మాత్రం నెరవేర్చలేకపోయాం. ఎన్నికల్లో జగన్, ఫ్యాన్ గుర్తే మనకు ప్రధానం. పార్టీలో ఉండి.. కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్న ఆఫ్ మైండ్ నాయకులను పట్టించుకోకుండా వదిలేయాలి. సోషల్ మీడియాను శత శాతం వినియోగించుకోవాలి' అని పిలుపునిచ్చారు.

తిరుమలలో నకిలీ ఐఏఎస్

- జాయింట్ సెక్రటరీ హోదాలో దర్శనానికి లేఖ
- అదుపులోకి తీసుకున్న పోలీసులు


ఐఏఎస్ పేరిట గుర్తింపు కార్డు


నరసింహమూర్తి

తిరుమల, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): తాను ఐఏఎస్ అధికారినంటూ శ్రీవారి దర్శనానికి లేఖ సమర్పించిన ఓ నకిలీ ఐఏఎస్‌ను తిరుమల పోలీసులు గురువారం అరెస్టు చేశారు. గుంటూరుకు చెందిన నరసింహమూర్తి బుధవారం తిరుమలకు వచ్చాడు. మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ జాయింట్ సెక్రటరీ హోదాతో ఉన్న గుర్తింపుకార్డును చూపి 11వ తేదీకి నాలుగు ప్రొటోకాల్ వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు జారీ చేయాలని సిఫార్సు లేఖను సమర్పించాడు. అనుమానించిన టీటీడీ ఈవో కార్యాలయ సిబ్బంది విజిలెన్స్ సిబ్బందికి సమాచారమిచ్చారు. నరసింహమూర్తిని అదుపులోకి తీసుకుని విచారించగా నకిలీ అని తేలడంతో తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో నరసింహమూర్తి ఐఏఎస్ అధికారే కాదని స్పష్టమైంది. గతంలో కూడా ఇలానే గుంటూరు, విజయవాడల్లో మోసాలకు పాల్పడినట్టు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మాటలు-మర్మాలు

భారతదేశానికి చైనా ఎంతో ముఖ్యమైనదని, ఉభయదేశాల మధ్య స్థిరమైన, శాంతియుత సంబంధాలు నెలకొనాలని, ఆ శాంతి ఈ రెండింటికే కాక, యావత్ ప్రపంచానికి కీలకమైనదని ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యల మీద ఇప్పుడు విస్తృతమైన చర్చ జరుగుతోంది. రెండుదేశాలు ద్వైపాక్షిక చర్చలద్వారా, పరస్పర సహకారంతో సరిహద్దు ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని, వివాదాలను పరిష్కరించుకోవాలని అమెరికాకు చెందిన న్యూస్‌వీక్ మేగజైన్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ వ్యాఖ్యానించారు. రెండుదేశాల మధ్య దౌత్య సైనికస్థాయి చర్చలు జరుగుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తంచేయడంతో ఆగకుండా, మేము సరిహద్దుల్లో శాంతి పునరుద్ధరించి, కొనసాగించగలం అంటూ హామీ ఇవ్వడం చాలామందికి ఆశ్చర్యం కలిగిస్తున్నది. దాదాపు నాలుగేళ్ళుగా వాస్తవాధీనరేఖ రగులుతున్నా, చొరబాట్లు, కుమ్ములాటలు సాగుతున్నా వాటిని గుర్తించేందుకు, అంగీకరించేందుకు, వ్యాఖ్యానించేందుకు సిద్ధపడని ప్రధాని ఇప్పుడు ఉభయదేశాల మధ్య సుదీర్ఘకాలంగా రాజుకుంటున్న వేడి వెంటనే చల్లారాలని, శాంతినెలకొనాలని చెప్పడం విశేషమైన పరిణామమే.

ప్రధాని వ్యాఖ్యలు పేలవంగా, బలహీనంగా ఉన్నాయని కాంగ్రెస్ అంటోంది. ఈ మాటలతో మన చేయి కిందపడేట్టు చేశారని, దురాక్రమించుకున్న భూభాగాల విషయంలో గట్టిగా వాదించడానికి, పట్టుసాధించడానికి చైనాకు మోదీ వ్యాఖ్యలు ఉపకరిస్తాయని కాంగ్రెస్ వాదన. చొరబడిన దేశాన్ని తీవ్రంగా హెచ్చరించడానికి బదులు, సరిహద్దుల్లో ఉద్రిక్తతలను చల్లార్చేపేరిట దానితో చర్చలకు సిద్ధపడటం పిరికితనంగా కనిపిస్తుందన్నది కాంగ్రెస్ ఉద్దేశం కావచ్చు. మోదీ వ్యాఖ్యలమీద చైనా సానుకూలంగా, ఆచితూచి స్పందించింది. విభేదాల పరిష్కారం విషయంలో భారత్ మాతో కలిసివస్తుందని ఆశిస్తున్నామని పేర్కొంది. ఉభయదేశాల దౌత్య సంబంధాలంటే సరిహద్దులు ఒక్కటే కాదని చైనా అంత ప్రత్యేకంగా ఎందుకు అన్నదో తెలియదుకానీ, ఈ ఇంటర్వ్యూద్వారా మోదీ చైనాకు ఒక సానుకూల సందేశాన్నయితే ఇవ్వదల్చుకున్నట్టు ఉంది. తాను మళ్ళీ అధికారంలోకి వస్తే చైనాతో చక్కగా వ్యవహరిస్తానని, ఉద్రిక్తతలు తగ్గిస్తానని ఆయన హామీ ఇస్తున్నారు. అమెరికాతో చర్చలు పునరుద్ధరించుకొని, యూరప్, రష్యాలతోనూ సన్నిహితంగా ఉంటున్న చైనాతో భారతదేశం కూడా ఇకపై చక్కగా వ్యవహరిస్తుందేమో! 2020 జూన్‌లో తూర్పు లద్దాఖ్‌లోని గాల్వాన్ లోయలో తీవ్రమైన ఘర్షణలు చోటుచేసుకున్నప్పటినుంచి ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ మోదీ చైనా ఊసెత్తలేదు. ఆయన మంత్రులు మాత్రం అతిజాగ్రత్తగా, చిన్నచిన్న విమర్శలు చేస్తుంటారు. ఎల్ఏసీ దగ్గర సైన్యాన్ని పెద్ద ఎత్తున మోహరించి ఒప్పందాలను చైనా ఉల్లంఘిస్తున్నదని ఇటీవల విదేశాంగమంత్రి ఓ మాటన్నారు. గత ఏడేళ్ళలో నాలుగోసారి అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలకు చైనా తన పేర్లుపెట్టిన తరువాత మన రక్షణ మంత్రి ఓ ఎన్నికల సభలో మాట్లాడుతూ మేమూ ఇలాగే చేస్తే ఎలా ఉంటుంది అని ప్రశ్నించారు. మోదీ అధికారంలో ఉన్నంత కాలం భారతభూభాగాన్ని చైనా ఒక్క అంగుళం కూడా ఆక్రమించుకోలేదని అమిత్ షా పాతపాటే పాడారు. భారతభూభాగాల్లోకి చైనా చొరబడిందని, అయా ప్రాంతాల్లో తన సైనికులను మోహరించి, స్థావరాలు కడుతున్నదని స్థానికులు, సైనికులు చెబుతున్నప్పటికీ ప్రభుత్వం దానిని కొట్టిపారేస్తున్నది. కేవలం గాల్వాన్ ఘటనలోనే దాదాపు వెయ్యి చ.కి. భూభాగాన్ని భారత్ కోల్పోయిందన్న వాదనలున్నాయి. గతంలో మన గస్తీలో ఉన్న ప్రాంతాలు ఇప్పుడు దాని వశమైనాయన్న విమర్శలూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో 21 రౌండ్ల కమాండర్ చర్చలు చైనాను వెనక్కునెట్టిందేమీ లేదు. అమెరికా–చైనా మధ్య ఈనెల ఆరంభం నుంచి ఎడతెగకుండా చర్చలు సాగుతున్న నేపథ్యంలో, చైనాతో భారత్ సత్సంబంధాలగురించి ప్రధానిమోదీ మాట్లాడి ఉండవచ్చు. అమెరికా, చైనా అధ్యక్షుల టెలిఫోన్ చర్చల తరువాత, అమెరికా మంత్రులు వరుసపెట్టి చైనా పర్యటనలు చేస్తున్నారు. ఉక్రెయిన్ యుద్ధం, ఆర్థిక ఆంక్షలు రష్యాను ఏమాత్రం బలహీనపరచకపోగా ఉత్తరకొరియా, చైనా, ఇరాన్ తదితర దేశాలసాయంతో అది మరింత ఎక్కువగా రెచ్చిపోతున్నది. మరోపక్క గాజాయుద్ధం ఎడతెగకుండా సాగుతూ, చాలా దేశాలను చుట్టబెడుతూ బైడెన్‌కు ప్రమాదకరంగా పరిణమిస్తున్నది. ఈ నేపథ్యంలో చైనాతో సానుకూలంగా వ్యవహరించడం అమెరికాకు అవసరం, దానిని అనుసరించడం మనకు క్షేమమని పాలకులు భావిస్తున్నట్టుంది.

అస్తిత్వం కోసమే లద్దాఖ్ ఆదివాసీల పోరు







జమ్మూ, కశ్మీర్ దశాబ్దాలుగా అనుభవిస్తున్న పాక్షిక స్వతంత్రప్రతిపత్తిని, రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని కేంద్రప్రభుత్వం 2019 ఆగస్టులో రద్దు చేసింది. కశ్మీర్‌లోని కార్గిల్, లేహ్ సహా కొన్నిప్రాంతాలను లద్దాఖ్‌తో కలిపి కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించింది. కేంద్రప్రభుత్వం తీసుకున్న ఈ రాజకీయ నిర్ణయం చట్టరూపం పొందినప్పుడు జమ్మూ, కశ్మీర్ పాలన నుంచి విముక్తి లభించినందుకు లద్దాఖ్, లేహ్, కార్గిల్ ప్రజలు ఎంతో సంతోషించారు. అప్పటివరకు ఉన్న ప్రభుత్వాలు తమ ఆకాంక్షలను సరిగా పట్టించుకోకపోవడమే కాక ఎందులోనూ తమకు సరైన ప్రాతినిధ్యం సైతం కల్పించలేదనే అసంతృప్తి వారిలో ఉండేది. ఆ ప్రాంతాల్లోని బౌద్ధ మతస్థులు కూడ తమకు సాంస్కృతికంగా తగినంత స్వేచ్ఛ ఉండేదికాదని, బౌద్ధసంప్రదాయాలకు అనుగుణంగా జీవించలేకపోయామనే అభిప్రాయంతో ఉండేవారు. కేంద్రం నిర్ణయం కారణంగా లద్దాఖ్ వాసులు భారతీయజనతా పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించి తమ సంతోషాన్ని చాటుకున్నారు.

కానీ లద్దాఖ్ ప్రాంత ప్రజల సంతోషం ఎక్కువ కాలం నిలువలేదు. తమపై ఢిల్లీ పెత్తనం కొనసాగుతోందని తెలియడానికి వాళ్లకు ఎంతోకాలం పట్టలేదు. క్షేత్రస్థాయిలో వాటి ఫలితాలు వీక్షించిన ప్రజలు ఖిన్నులయ్యారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కానీ, స్థానిక ఎంపీ కానీ తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ప్రయత్నమే చేయడం లేదని, బీజేపీ తన ప్రత్యేక అజెండాను అమలుపరచడానికే చూస్తోందని ఏడాది తిరగకముందే తేటతెల్లం కావడంతో వాళ్లలో అసంతృప్తి రగులుకుంది. అయితే కేంద్రప్రభుత్వానిది హిందుత్వ అజెండా అనే విషయం మాత్రం వాళ్ళకు ఒకపట్టాన అర్థంకాలేదు. కేంద్రపాలిత ప్రాంతంగా మారిన కొద్దిరోజుల్లోనే స్థానికభాషలను పక్కకు నెట్టి హిందీ, సంస్కృత భాషలను బలవంతంగా రుద్దే ప్రయత్నం జరిగింది. ఆ ప్రాంతంలో చాలా సంస్థల పేర్లు సింధూతో మొదలవుతాయి. కేంద్రం వాటన్నింటిని హిందీలోకి మార్చేసింది. స్థానికపేర్లతో ఉన్న ఆసుపత్రులను ఆరోగ్యమందిరాలుగా మార్చింది. ఈ చర్యలను ముస్లింలు, బౌద్ధులు తీవ్రంగా వ్యతిరేకించారు.

లద్దాఖ్‌లో బౌద్ధమతస్థుల సంఖ్య ఎక్కువ. ముస్లింలు ఉన్నా వారి జనాభా తక్కువ. లేహ్ ప్రాంతంలో 67 శాతం మంది ఆదివాసీలు ఉంటారు. జంస్కర్ ప్రాంతంలో 99 శాతం మంది వివిధ తెగలకు చెందిన వారే. ఈ మూడుప్రాంతాల్లో కలిపి పదిహేను ఆదివాసీ తెగలు నివసిస్తున్నాయి. అందులో ప్రధానంగా బాల్టి, బోటా, బ్రోక్పా, షిన్, గార్రా, మోన్, డ్రోక్పా తెగలు చిన్నచిన్న ఆవాసాలలో కొండచరియల్లో నివసిస్తాయి. వాళ్ళది ప్రత్యేకమైన జీవనవిధానం. ఎక్కువ ఉన్ని ఇచ్చే ప్రత్యేకమైన గొర్రెజాతులను అక్కడి ప్రజలు పెంచుతారు. వాటితోనే వాళ్ళ జీవనవిధానం ముడిపడి ఉంటుంది. ఆ గొర్రెలమందలతో వాళ్ళు సంచరించే భూములను పరిశ్రమలకు కేటాయించడంతో ఆయా తెగల ప్రజల్లో ఆందోళన మొదలైంది.

తమ ప్రాంతాలలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలన్నీ సైన్యాన్ని బలోపేతం చేయడానికి ఉద్దేశించినవేనన్న సంగతి కూడ ప్రజలకు బోధపడింది. కేంద్రం అక్కడ 750 కి.మీ మేర రోడ్ల నిర్మాణంతో పాటు సైనికుల రవాణా కోసం ఇదివరకే ఉన్న బ్రిడ్జిలకు అదనంగా 29 కొత్తబ్రిడ్జిల నిర్మాణాన్ని ప్రారంభించింది. 39 హెలీప్యాడ్ల నిర్మాణానికి ఏర్పాట్లు సాగిస్తోంది. హరితఇంధనం (గ్రీన్‌ఎనర్జీ) పేరిట రూ. 20వేల కోట్లతో సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు ప్రకటించింది. కేంద్రం ఒక్క లద్దాఖ్‌లోనే దాదాపు 15 వేల ఎకరాల భూమిని రకరకాల ప్రాజెక్టుల కోసం కేటాయించింది. ఆ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి పరచడంపై దృష్టి సారించి కొత్త రవాణాసౌకర్యాలు కల్పిస్తూ, ఆధునిక గృహసముదాయాలు, హోటళ్ళు నిర్మిస్తోంది. కొండలమయమైన ఈ ప్రాంతాలన్నీ మంచుతో కప్పబడి ఉంటాయి. మంచు కరిగి ప్రవహించే నదులలోని నీటినే అక్కడి ప్రజలు తాగడానికి, దైనందిన కార్యక్రమాలకు వినియోగిస్తుంటారు. పర్యాటకుల సంఖ్య పెరగడంతో వాళ్లకు నీటి కొరత మొదలైంది. కేంద్రపాలిత ప్రాంతమయ్యాక తాము సంప్రదాయికంగా అనుభవించే భూముల మీద హక్కు కోల్పోతామనే విషయాన్ని స్థానికతెగలు గ్రహించాయి. చాలామంది పారిశ్రామికవేత్తలు పోటీలుపడి ఆ ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చారు. వారితో పాటు సాంకేతికంగా, ఇతరత్రా నైపుణ్యం కలిగిన ఉద్యోగుల్ని బయటనుంచి తెచ్చుకుంటున్నారు. చివరకు సాధారణస్థాయి కార్మికులను కూడా ఇతరప్రాంతాల నుంచి రప్పించుకుంటున్నారు. స్థానికప్రజలకు అభివృద్ధిలో భాగస్వామ్యం మాట అటుంచి కనీసం కూలిపనులు కూడా దొరకడం దుర్లభమైంది.

ఈ పరిస్థితి తమ అస్తిత్వాన్నే నాశనం చేస్తుందనే కలవరం లద్దాఖ్ వాసుల్లో పెరిగిపోయింది. సరిగ్గా అదే తరుణంలో జరిగిన షెడ్యూలుకులాల, షెడ్యూలు తెగల కమిషన్ సమావేశం లద్దాఖ్‌లోని పరిస్థితులను సమీక్షించి, అక్కడి ప్రజల సంప్రదాయహక్కులకు భంగం వాటిల్లుతోందని, వాళ్ళ హక్కుల పునరుద్ధరణకు వీలుగా ఆ ప్రాంతాలను రాజ్యాంగంలోని ఐదు లేదా ఆరో షెడ్యూల్లో చేర్చాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేసింది. భీతావహులై ఉన్న లద్దాఖ్ ప్రజలకు ఈ తీర్మానం మనోధైర్యాన్ని, బలాన్నీ చేకూర్చింది. మాజీ పార్లమెంట్ సభ్యుడు థుప్‌స్టాన్ చేవాంగ్ నేతృత్వంలో ఏర్పడ్డ 'లేహ్ శిఖరాగ్ర అభివృద్ధి సమితి', అంతకు మునుపు నుంచే ప్రజల సమస్యలపై పనిచేస్తున్న 'కార్గిల్ డెమోక్రాటిక్ అలయన్స్' సంస్థలు ప్రజలను ఒకతాటిపైకి తెచ్చే ప్రయత్నం మొదలెట్టాయి. కార్గిల్ డెమోక్రాటిక్ అలయన్స్‌లో అన్ని రాజకీయపార్టీలవాళ్లు సభ్యులుగా ఉన్నారు. ప్రముఖ పర్యావరణవేత్త, రామన్ మెగసెసె అవార్డుగ్రహీత సోనమ్ వాంగ్‌చుక్ జనవరిలో ఐదురోజుల నిరాహారదీక్ష చేశారు. కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన విధ్వంసకర అభివృద్ధి ప్రాజెక్టులు లద్దాఖ్‌లోని సున్నితమైన పర్యావరణాన్ని, విచ్ఛిన్నం చేస్తాయంటూ ప్రాంతాన్ని రాజ్యాంగం ఆరో షెడ్యూల్లో చేర్చాలనే డిమాండును ఆయన ముందుకు తెచ్చారు. దాంతో అన్నిప్రాంతాలలో నిరసనలు మొదలయ్యాయి. తరువాత ఉద్యమానికి సారథ్యం వహించిన మాజీ ఎంపీ థుప్‌స్టాన్ చేవాంగ్, తమ ప్రజలు గొంతెమ్మ కోరికలేవీ కోరడం లేదని, రాజ్యాంగబద్ధమైన హక్కునే పరిరక్షించమంటున్నారని స్పష్టం చేశారు.

ఫిబ్రవరి ఒకటోతేదీన వాంగ్‌చుక్ సారథ్యంలో లేహ్ పట్టణంలో జరిగిన పెద్దబహిరంగసభకు 8 డిగ్రీల చలిలో కూడా ముప్పైవేలమంది ప్రజలు హాజరయ్యారు. లద్దాఖ్‌ను ఆరో షెడ్యూల్లో చేర్చడంతో పాటు పారిశ్రామికవేత్తలకు ఇచ్చిన అనుమతులను రద్దుచేయాలని, స్థానిక యువకులకు ఉద్యోగాలలో ప్రాధాన్యమివ్వాలని, ఉద్యోగ నియామకాల కోసం పబ్లిక్‌సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేయాలని ఈ సభ తీర్మానించింది. కార్గిల్, లేహ్ ప్రాంతాలకు ఒక్కొక్క పార్లమెంట్ స్థానం మంజూరు చేయాలనే అంశాన్ని కూడా ఈ తీర్మానంలో చేర్చారు. ఆ ప్రాంతంలో ప్రస్తుతం 144వ సెక్షన్ అమలులో ఉంది. వైఫై, ఇంటర్‌నెట్ ప్రసారాలు నిలిపివేశారు. ప్రభుత్వం ఎంతగా నిర్బంధవిధానాలు అనుసరిస్తున్నా ప్రజలు నిగ్రహంతో ప్రజాస్వామిక పద్ధతుల్లో ఆందోళన కొనసాగిస్తున్నారు. వాంగ్‌చుక్ చైనాసరిహద్దుల వరకు ప్రారంభించిన 24 రోజుల పాదయాత్రను 21 రోజునే ముగించారు. ప్రభుత్వానికి, రక్షణదళాలకు ఇబ్బంది కలిగించడం, ఘర్షణ వాతావరణం సృష్టించడం తమ అభిమతం కాదని, అందుకే సంయమనం పాటిస్తూ పాదయాత్ర విరమిస్తున్నామని ఆయన వివరించారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేవరకు ఆందోళన ప్రజాస్వామికంగా, గాంధేయపద్ధతుల్లో కొనసాగుతుందని నాయకులు ప్రకటించారు. గాంధీలాగా 21 రోజుల నిరాహారదీక్ష చేస్తానని వాంగ్‌చుక్ ప్రకటించారు.

'ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టడం మా ఉద్దేశ్యం కాదు, మా పర్యావరణం విధ్వంసమవుతోంది. మా ఆదివాసీ, సంచారజాతుల జీవనోపాధి దెబ్బతింటోంది. మా భూములను పారిశ్రామికవేత్తలకు అప్పచెబుతున్నారు. ఈ విధ్వంసకర అభివృద్ధి మాకు వద్దే వద్దు. మా స్వయంనిర్ణయహక్కును పునరుద్ధరిస్తే ఎలాంటి అభివృద్ధి కావాలో మేమే పథకాలు రచించుకుంటాం' అని లద్దాఖ్ ప్రజలు అంటున్నారు. జమ్మూ, కశ్మీర్ పూర్తిగా కేంద్రప్రభుత్వం అజమాయిషీలోకి వచ్చిన తరువాత ఒక్క సంవత్సర కాలంలోనే 185 మంది వెలుపలి వ్యక్తులు కశ్మీర్‌లో భూములు కొన్నారు. అదే రీతిలో తమ భూములు కూడా పరాయివాళ్ళ చేతుల్లోకి పోతాయంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రం నాలుగుసార్లు చర్చలకు పిలవగా లద్దాఖ్‌లోని అన్నివర్గాలకు చెందిన 14 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రతిసారీ హోంమంత్రి అమిత్‌షా, అన్ని రక్షణలు కల్పిస్తామని, ప్రభుత్వం తరఫున ఒక కమిటీని వేస్తామని, దాని సమ్మతితోనే ఏ అభివృద్ధి కార్యక్రమమైనా జరుగుతుందనే హామీ ఇస్తామనీ అంటున్నారు.

లద్దాఖ్ ప్రజలకు సంఘీభావంగా, దేశంలో అనేక చోట్ల నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. గత వారం హైదరాబాద్‌లో కూడా ఒక సభ జరిగింది. లద్దాఖ్ ప్రజల సమస్యలను పరిష్కరించి వారి ఆకాంక్షలను నెరవేర్చితీరాలని ప్రజాస్వామికవాదులందరూ ప్రస్తుత ఎన్నికల సమయంలో ఎలుగెత్తి చాటితే తప్ప కేంద్రం మాట వినదు. కలిసికట్టుగా అందరం ఆ పని చేద్దాం.

> 'ప్రభుత్వాన్ని ఇబ్బందిపెట్టడం మా ఉద్దేశం కాదు, మా పర్యావరణం విధ్వంసమవుతోంది. మా ఆదివాసీ, సంచారజాతుల జీవనోపాధి దెబ్బతింటోంది. మా భూములను పారిశ్రామికవేత్తలకు అప్పచెబుతున్నారు. ఈ విధ్వంసకర అభివృద్ధి మాకు వద్దే వద్దు. మా స్వయంనిర్ణయ హక్కును పునరుద్ధరిస్తే ఎలాంటి అభివృద్ధి కావాలో మేమే పథకాలు రచించుకుంటాం' అని లద్దాఖ్ ప్రజలు అంటున్నారు. జమ్మూ, కశ్మీర్ పూర్తిగా కేంద్రప్రభుత్వం అజమాయిషీలోకి వచ్చిన తరువాత ఒక్క సంవత్సర కాలంలోనే 185 మంది వెలుపలి వ్యక్తులు కశ్మీర్‌లో భూములు కొన్నారు. అదే రీతిలో తమ భూములు కూడా పరాయివాళ్ళ చేతుల్లోకి పోతాయంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

• యస్. జీవన్‌కుమార్
మానవహక్కుల వేదిక

మన నగరాల జల భవితవ్యం

మట్టివాసన




■ సునీతా నారాయణ్

ప్రకృతి శాపం కానేకాదు, మానవ తప్పిదాల ఫలితమే బెంగళూరు జల సంక్షోభం. ఈ కఠోర వాస్తవాన్నే ఇదే కాలమ్‌లో క్రితంసారి ('బెంగళూరు 'జల' పాఠాలు'లో) నేను స్పష్టంగా చెప్పాను. ఆ నగర నీటి సరఫరా నిర్వహణకు బాధ్యత వహిస్తున్న పౌర, ఇంజినీరింగ్ అధికారులు పెట్టుబడి సాంద్ర–నీటి వనరుల సాంద్ర విధానాలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఫలితంగా నగర ప్రజలకు నీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగించడం అసాధ్యమైపోయింది. పైగా మురికి నీటి పారుదల వ్యవస్థ నిర్వహణ అసమర్థంగా ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే అది యోగ్యమైన రీతిలో లేదు. దీనికి తోడు వాతావరణ మార్పు ప్రభావాలు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. వర్షపాతం సమరీతిలో ఉండటం లేదు. అతివృష్టి ఘటనలు పెచ్చరిల్లుతున్నాయి. మరి మార్గాంతరమేమిటి?

బెంగళూరుకు, ఆ మాట కొస్తే మన నగరాలు అన్నిటికీ నీటిభద్రత సమృద్ధిగా ఉండే భవిష్యత్తును సమకూర్చాలంటే నీటి సరఫరా తక్కువ వ్యయంతో కూడుకున్నదిగా ఉండితీరాలి. అప్పుడే అది నిరంతరాయంగా నిర్వహించదగిన విధంగా ఉంటుంది. బెంగళూరు విషయానికి వస్తే ఆ నగరానికి, 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న కావేరీ నది నుంచి నీటిని తోడి, రవాణా చేస్తున్నారు. దూరా భారం వ్యయభరితం కాదూ? భారీ వ్యయానికి మించిన సమస్య రవాణాలో నీరు లీక్ అవడం. కావేరీ నది నుంచి బెంగళూరు నగరానికి జరుగుతున్న నీటి రవాణాలో 50 శాతం నీరు వృథా అవుతున్నది మరి! నీటి సరఫరాకు బాధ్యత వహిస్తున్న ప్రభుత్వ సంస్థలు కొత్త పైప్‌లైన్స్‌ను నిర్మించలేక పోతున్నాయి. నీటి ధర అధికంగా ఉండడం వల్ల ట్యాంకర్ల ద్వారా సరఫరా, గొట్టపు బావుల నిర్మాణం మొదలైన ప్రత్యామ్నాయాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నాయి. బెంగళూరు నగరంలో జరుగుతున్న నీటి సరఫరాలో సగం నీరు ఆ నగర భూగర్భ జలాశయాల నుంచి వస్తున్నట్టు అంచనా.

సమస్యేమిటంటే భూ గర్భ జలాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. నీటి సరఫరా, మురుగు నీటి పారుదల వ్యవస్థల వినియోగాన్ని లెక్కించడం లేదు. ఎందుకంటే దాని సరఫరాపై వాటికి ఎటువంటి నియంత్రణ లేకపోవడమే ఆ అలక్ష్యానికి కారణం. జరుగుతోన్న నీటి సరఫరాలో ఏ మేరకు భూగర్భ జల వనరుల నుంచి జరుగుతుందన్న విషయమై వాటికి ఎటువంటి అంచనా కూడా ఉండడం లేదు అయితే 'అధికారికం'గా ఆ నీటినీ సరఫరా చేస్తున్నారు. దానికి ధర నిర్ణయించి వసూలు చేస్తున్నారు! మరి వినియోగించుకుంటున్న భూగర్భ జలాల పరిమాణాన్ని అంచనా వేయడం ఎలా? ఒకే ఒక్క మార్గం ఉన్నది. నగరంలో నీటి డిమాండ్‌ను అంచనావేయడమే. దీన్ని తలసరి ప్రాతిపదికన అంచనా వేయాలి. నగరంలోని విభిన్న వర్గాలకు చెందిన ప్రతి వ్యక్తి వినియోగ అవసరాల ప్రాతిపదికన నీటి పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. ఢిల్లీ, బెంగళూరు నగరాలలో తలసరిన 150 లీటర్ల నీటిని సరఫరా చేయాలని నిపుణులు సిఫారసు చేశారు. సరే, లీకేజీ వల్ల జరిగే వృథాను దృష్టిలో ఉంచుకుని సిఫారసు చేసిన పరిమాణానికి 15 శాతం అధికంగా నీరు సరఫరా చేయడం ఉత్తమం. మరి 'అధికారిక సరఫరా', డిమాండ్ మధ్య అంతరాన్ని భర్తీ చేస్తున్న నీరు భూగర్భ జల వనరుల నుంచి వస్తున్నట్టుగా భావిస్తున్నారు అయితే ఈ నీటి వినియోగాన్ని తరచు తక్కువగా అంచనా వేస్తున్నారు. తోడి, సరఫరా చేయడంలో సంభవిస్తున్న నష్టాలను లెక్కించడం లేదు బెంగళూరు నగరంలో 'అధికారిక సరఫరా', డిమాండ్‌కు మధ్య అంతరం 50శాతంగా ఉన్నట్టు అంచనా. లీకేజీని పరిగణనలోకి తీసుకుంటే ఆ అంతరం 60 నుంచి 70 శాతం మేరకు ఉండవచ్చని భావించడం సముచితంగా ఉంటుంది. నగర నీటి సరఫరా వ్యవస్థ నిర్వాహకులు భూగర్భ జలాశయాలను తాగునీటికి కీలక వనరులుగా అంగీకరించి, వాటిని నగరానికి సుస్థిర నీటి భద్రతను సమకూర్చే సదుపాయాలలో భాగంగా చేస్తే పరిస్థితిలో మౌలిక మార్పు ఖాయంగా వస్తుంది. మరి భూగర్భ జలాలను నిరంతరాయంగా ఉపయోగించకోవడమెలా? ఇదీ ఇప్పుడు మనముందున్న ప్రశ్న. వర్షపు నీటి ద్వారా భూగర్భ జలాశయాలను పునశ్శక్తిమంతం చేయడమే ఆ ప్రశ్నకు సమాధానం. సరస్సులు లేని నగరం ఏదైనా ఉన్నదా? అయితే సరస్సుల సంరక్షణ అనేది నగరాల సుందరీకరణకు కాకుండా ఒక ప్రాథమిక అవసరంగా భావించి తీరాలి. వాస్తవమేమిటంటే సరస్సులు, తటాకాలు మొదలైనవి నగరాలలో వర్షపు నీటిని నిల్వ చేస్తున్నాయి. తద్వారా భూగర్భ జలాశయాలను పునశ్శక్తిమంతం చేస్తున్నాయి. నీటి కాటకం కాలంలో భూగర్భ జలాలే నీటి అవసరాలకు ఆసరా అవుతున్నాయి. వాతావరణ మార్పు ప్రభావంతో తరచు అతివృష్టి సంభవించడం సాధారణమైపోయింది. నగరాలు ఈ వాననీటి వెల్లువను కాల్వలలోకి పారించాలి. ఇదే గనుక చేస్తే భూగర్భ జలాశయాలు పునశ్శక్తిమంతం కావడానికి విశేషంగా దోహదం జరుగుతుంది. తత్ఫలితంగా సుదీర్ఘ నీటి కాటకాన్ని సమర్థంగా ఎదుర్కోగలగడం సుసాధ్యమవుతుంది.

బెంగళూరు నగరం చాలా దశాబ్దాలుగా తన సరస్సుల వ్యవస్థను కాపాడుకునేందుకు తీవ్ర పోరాటమే చేస్తున్నది. అయితే రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు, కాలుష్య భూతాల కారణంగా ఆ పోరాటం సఫలమవడం లేదు. గ్రేటర్ బెంగళూరు పరిధిలో 189 సరస్సులు ఉన్నాయని, ఈ సరస్సులనే కాకుండా వాటి ఆరగాణి ప్రాంతాలను మురుగు నీటి పారుదల వ్యవస్థను సైతం పరిరక్షించవలసిన అవసరమున్నదని 2011లో రాష్ట్ర హై కోర్టుకు సమర్పించిన ఒక నివేదిక స్పష్టం చేసింది. అయితే ఈ నివేదిక కార్యరూపం ధరించలేదు. సరస్సులను సంరక్షించడం ఎలా సాధ్యమవుతుంది? నగరాల జల సంబంధిత భవిష్యత్తులో భాగమయితే ఆ జలరాశులు తప్పక సంక్షించబడతాయి. 100 కిలో మీటర్ల దూరంలో ఉన్న కావేరీ నది నుంచి నీటిని తోడి బెంగళూరుకు రవాణా చేసి నగర నీటి అవసరాలను తప్పక తీర్చగలుగుతామనే భ్రాంతి లేనట్టయితే స్థానిక జల వ్యవస్థలను బెంగళూరు అధికారులు సంరక్షించి వుండేవారు.





> బెంగళూరుకు, ఆ మాట కొస్తే మన నగరాలు అన్నిటికీ నీటిభద్రత సమృద్ధిగా ఉండే భవిష్యత్తును సమకూర్చాలంటే నీటి సరఫరా తక్కువ వ్యయంతో కూడుకున్నదిగా ఉండితీరాలి. అప్పుడే అది నిరంతరాయంగా నిర్వహించదగిన విధంగా ఉంటుంది. భూగర్భ జలాశయాలను తాగునీటికి కీలక వనరులుగా అంగీకరించాలి. వాటిని నగరానికి సుస్థిర నీటి భద్రతను సమకూర్చే సదుపాయాలలో భాగంగా చేస్తే పరిస్థితిలో మౌలిక మార్పు ఖాయంగా వస్తుంది.

అలా చేసి ఉన్నట్టయితే ఆ చిన్న చిన్న జలరాశులు నగర నీటి సరఫరా వ్యవస్థలో భాగమయి వుండేవి. నీటి సరఫరా వ్యయం తగ్గి ఉండేది. నీరు చౌకగా అందరికీ అందుబాటులో ఉండి ఉండేది. ఇందుకు మురుగునీటి పారుదల వ్యవస్థ తీరుతెన్నులను మార్చివేయవలసి ఉన్నది. అప్పుడు వ్యర్థ జలాలను స్థానికంగా నిలిపివేసి శుద్ధి కేంద్రాలకు పంపి, సరస్సు జలాలను పునశ్శక్తిమంతం చేసేందుకు ఉపయోగించడం జరిగేది.

వాస్తవమేమిటంటే మురుగు నీరుగా మనకు సమకూరుతున్న ఆ నీటిలో 80 శాతాన్ని సరైన విధంగా ఉపయోగించుకోకుండా విసర్జిస్తున్నాం. సుదూర ప్రాంతాల నుంచి రవాణా చేస్తున్న నీటి కంటే ఈ నీరే మరింత పదిలమైనది. ఈ కారణంగానే వ్యర్థ జలాలకు కీలక ప్రాధాన్యమున్నదని స్పష్టం చేశాను. మరి మన నగర మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఈ వాస్తవాన్ని ఎప్పుడు గుర్తిస్తారు? అందుకు వారి ఆలోచనా ధోరణి మారవలసి ఉన్నది. అది జరిగే లోగా మనం ఎన్నో నీటి కరువులను చవిచూడాల్సి ఉన్నదనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

అరుదైన ప్రతిభామూర్తి



ఉత్తరాంధ్ర సాహిత్యం, సంగీత వారసత్వాన్ని ప్రవాసాంధ్రలోనే కాక, ఖండాంతరాలలో చాటి చెప్పిన డా. పప్పు వేణుగోపాలరావు ఆకస్మిక మరణం ఆవేదనకు గురిచేసింది. శ్రీకాకుళ సాయుధ పోరాటానికి పురిటిగడ్డ అయిన పార్వతీపురంలో ఆయన జన్మించారు. కళాశాల విద్య పార్వతీపురం, విజయనగరంలో అభ్యసించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. తెలుగు చదువుకున్నారు. చిన్నతనం నుంచి పాండితీ ప్రకర్షతో పెద్దల మన్ననలందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత (మణి ప్రవాళం) జాతీయాచార్యులు ఎస్వీ జోగారావు పర్యవేక్షణలో ఎం.ఫిల్ చేశారు.

మిసెస్ ఎ.వి.ఎన్ కళాశాలలో మూడేళ్లపాటు అధ్యాపకునిగా పనిచేశారు. 1980లో మద్రాసులోని 'అమెరికన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ స్టడీస్'లో ఉద్యోగంలో చేరారు. ఆయన భార్య రావాడ జయ ఆచార్య ఎస్వీ జోగారావు మేనకోడలు. శిష్యునిగా, బంధువుగా వేణుగోపాలరావును పుత్రవాత్సల్యంతో ఆదరించి ప్రోత్సహించేవారు జోగారావు.

"నేనెంతో భక్తితో పరిశోధన చేసిన యక్షగాన వాఙ్మయాన్ని నువ్వే ఆంగ్లంలోకి అనువదించగల ప్రజ్ఞావంతుడివి" అని ఆచార్య జోగారావు తరచూ వేణుగోపాలరావుతో అంటుండేవారు. ఏమి చిత్రమో? విధివిలాసం... పప్పు వేణుగోపాలరావు తన చివరి రచన 'మోనోగ్రాఫ్ ఆన్ యక్షగాన' ఇటీవలే ఆవిష్కరణ జరిగింది. భవిష్యవాణి తెలిసినట్లుగా, వేణుగోపాలరావు ఆ పుస్తకంలోని తన మాటలో "బహుశా! ఇదే నా చివరి రచన" అంటూ మొదటి వాక్యంలోనే రాశారు. ఆవిష్కరణ జరిగిన పదిరోజులలో ఆయన మరణించడం, బంధువులు, శ్రేయోభిలాషులు, అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.

గొప్ప సాహిత్య, సంగీత అవధాన విద్వత్తు కలిగిన వేణుగోపాలరావు వందలాదిగా అభిమానులను సంపాదించుకున్నారు. ఎంత ఎత్తుకు ఎదిగినా, ఎంత విద్వత్ సంపద కలిగినా, ఎదుటివారిలో ఏ మాత్రం ప్రతిభ ఉన్నా, గుర్తించి గౌరవించే సహృదయులు. రాజాలక్ష్మి ఫౌండేషన్ స్థాపకులు స్వర్గీయ పి.వి. రమణయ్య రాజా, చాలాకాలం పాటు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన రాజాలక్ష్మి ఫౌండేషన్ పురస్కార సభలు ఎక్కడ జరిగినా, వేణుగోపాలరావే వ్యాఖ్యాత. ఆయనది అద్భుతమైన వాగ్ధాటి.

పూర్వ ముఖ్యమంత్రి డా. బెజవాడ గోపాలరెడ్డి ఒకసారి స్వయంగా వేణుగోపాలరావును కలిసి, తాము నెల్లూరులో దిగ్దంతులకు ప్రదానం చేసే 'కవిత్రయం' పురస్కారం అందజేయనున్నట్లు ప్రకటించారు. ఆ సందర్భంగా ఒక సాహితీ అంశంపై ప్రసంగం చేయాలని షరతు పెట్టారు. దానికి వేణుగోపాలరావు బదులిస్తూ, ఎప్పటినుంచో తన మనసులోని కోరిక "శ్రీనాథకవి భక్తి–పోతనామాత్యుని శృంగారం" అనే అంశంపై ప్రసంగిస్తానని చెప్పారు. బెజవాడ గోపాలరెడ్డి ఆనందంగా అంగీకారం తెలిపారు. అనుకున్నట్లుగానే నెల్లూరులో జరిగిన 'కవిత్రయం' పురస్కార సభలో ఆ అంశంపై డా. వేణుగోపాలరావు చేసిన ప్రసంగం సభికుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది.


చెన్నైలోని సాహితీ, సినీ ప్రముఖులందరూ ఆయన అభిమానులే! వేణుగోపాలరావు కోరిక మేరకు ఆచార్య జోగారావు గారి 'ప్రసన్న కుసుమాయుధం' కావ్యానికి శ్రీశ్రీ ముందుమాట రాయడం, సాహితీ దిగ్గజాలతో ఆయనకున్న అనుబంధం, ఆత్మీయతకు నిదర్శనం.

ఈ నెల మూడవ తేదీన వేణుగోపాలరావుతో మాట్లాడుతున్న సందర్భంలో "మీ చిరునామా పంపండి. నా 'యక్షగాన' పుస్తకం పంపిస్తాను" అన్నారు. అంత గొప్ప సాహితీస్రష్ట, సంగీతకారులు ఎంతో ప్రేమతో గుర్తుగా ఆ పుస్తకం పంపించారు. అది క్రోధి నామ ఉగాది నాడే నాకు అందింది. గంట తర్వాత ఆయన ఆదివారం రాత్రే అస్తమించారు అన్న పిడుగులాంటి వార్త తెలిసింది. ఆయనకు నా నివాళి.

○ బి.వి అప్పారావు

విప్లవ నిర్మాణ సూత్రకారుడు

> సిద్ధాంత రాజకీయ రంగంలో కొండపల్లి సీతారామయ్య అవిరళ కృషి జరిపారు. మన దేశం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ చర్చించారు. ఆకలి, పేదరికం, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, కుల సమస్య, జాతుల పోరాటాలు, కార్మిక సంఘాలు మొదలుకొని పాక్షిక పోరాటాలు, భారత ప్రజాస్వామిక విప్లవ వ్యూహం ఎత్తుగడలు, అంతర్జాతీయ పరిస్థితి, ప్రపంచ ఆర్థిక సంక్షోభం, పార్టీ నిర్మాణం వరకు అనేక సమస్యలను చర్చించి వాటిని మార్క్సిజం వెలుగులో విశ్లేషించారు. కొత్త విధానాలను, నిర్మాణ సూత్రాలను ఆవిష్కరించారు.



కొండపల్లి సీతారామయ్య గొప్ప మార్క్సిస్టు–లెనినిస్టు. ఆయన భారత కమ్యూనిస్టు విప్లవోద్యమ నిర్మాత. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు–లెనినిస్టు) మహోన్నత నాయకులు. శ్రామికవర్గ విప్లవ సారథి. భారత ప్రజాస్వామిక విప్లవ సుదీర్ఘ కాలంలో ఆయన మార్క్సిజం–లెనినిజం మావో ఆలోచనా విధానాన్ని మన దేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి నక్సల్బరీ విప్లవ పథాన్ని కాంతివంతం చేశారు. రివిజనిజాన్ని తిప్పికొట్టి ప్రజాపంథా ఆధారంగా విప్లవాచరణను సుసంపన్నం చేశారు.

ఆయన సిద్ధాంత రాజకీయ రంగంలో అవిరళ కృషి జరిపారు. మన దేశం ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ చర్చించారు. ఆకలి, పేదరికం, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, కుల సమస్య, జాతుల పోరాటాలు, కార్మిక సంఘాలు మొదలుకొని పాక్షిక పోరాటాలు, భారత ప్రజాస్వామిక విప్లవ వ్యూహం ఎత్తుగడలు, అంతర్జాతీయ పరిస్థితి, ప్రపంచ ఆర్థిక సంక్షోభం, పార్టీ నిర్మాణం వరకు అనేక సమస్యలను చర్చించి వాటిని మార్క్సిజం వెలుగులో విశ్లేషించారు. కొత్త విధానాలను, నిర్మాణ సూత్రాలను ఆవిష్కరించారు.

మహోజ్వలమైన తెలంగాణ పోరాటకాలంలో ఆయన రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ అత్యున్నత నాయకత్వ కమిటీలో ఉండి ఉద్యమాన్ని నడిపారు. దేశం మొత్తంలోనే అత్యధిక పార్టీ సభ్యత్వం కలిగిన కృష్ణా జిల్లాకు కార్యదర్శిగా బాధ్యతల్ని నిర్వహించటం ప్రత్యేకించి పేర్కొనదగింది. అపుడు ఆయన కొన్ని వ్యాసాలు మాత్రమే రాశారు. గ్రామసీమలలో ఐక్య సంఘటన, వలంటీర్ల శిక్షణలపై ఆయన వ్యాసాలు ప్రచురితమయ్యాయి. కె.ఎస్ రచనా వ్యాసంగం నక్సల్బరీ పోరాట కాలం నుంచే ప్రధానంగా ఆరంభమయింది. అప్పటి నుంచి ఆయన విస్తృతంగా రచనలు చేశారు. సత్యప్రసాద్, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్, కృష్ణమూర్తి, విశ్వేశ్వరయ్య వంటి పలు కలం పేర్లతో ఆయన అనేక వ్యాసాలు రాశారు. ఇవి 'పిలుపు', 'క్రాంతి' పత్రికలలో అచ్చయ్యాయి. ఆయన రచనలలో అత్యధిక భాగం పార్టీ డాక్యుమెంట్స్, సర్క్యులర్స్ రూపంలోనే ఉన్నాయి. అవన్నీ గతంలో ప్రచురించబడి రహస్యంగా సర్క్యులేట్ అయ్యాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (మా–లె) ఆంధ్ర రాష్ట్ర కమిటీ పేరుతోనో, కేంద్ర కమిటీ పేరుతోనో అవి పార్టీ కేడర్‌కు అందాయి. పార్టీ శ్రేణులు వాటిని విస్తృతంగా అధ్యయనం చేశారు. ఇంకా ఆయన జైలు జీవితం గడిపినపుడు అనేక లేఖలు రాశారు.

కొండపల్లి సీతారామయ్య అద్భుతమైన రచయిత. ఆయన శైలి విలక్షణమైనది. పది లైన్లతో కూడుకున్న ఒక పేరాలో ఒకే వాక్యం ఉన్నా, అది సూటిగా చాలా స్పష్టంగా ఎలాంటి గందరగోళానికీ, సంక్లిష్టతకూ తావు లేకుండా ఉండేది. భావంలో ఉన్న స్పష్టత వల్లనే పాఠకులు ఆయన రచనల్ని సులభంగా ఆకళింపు చేసుకునేవారు. సాధారణ కార్మికులకు సైతం అవి సుబోధకమయ్యేవి. అవసరమైన చోట సామెతలను వాడుతూ ఆయన చేసిన వాదనలు అందరినీ ఒప్పించేవి. వివిధ కోణాల నుంచి సమస్యను తడిమి, సమస్య పూర్వాపరాలను వివరించి నాటి పరిస్థితులను విప్పి చెప్పి సమగ్రమైన అవగాహనను కలిగించేవారు. ఆయన మార్క్సిస్టు విషయ పరిజ్ఞానం అద్వితీయమైనది.

కొండపల్లి సీతారామయ్య రచనలన్నింటినీ సేకరించి వాటిని మొదట వరస తేదీల వారీగా కూర్చి ఒక జాబితా ఏర్పరిచాం. అవి 3,500 పేజీలకు మించి ఉన్నాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (మా–లె) చరిత్రకు సంబంధించిన ముఖ్యమైన వివిధ కాలాలను లేదా పీరియడ్స్‌ను పరిగణనలోకి తీసుకుని ఆయన రచనల్ని వేరు చేసినపుడు అవి పది సంపుటాలుగా రూపొందాయి. కె.ఎస్. మెమోరియల్ కమిటీ ఆ పది సంపుటాలను ప్రచురిస్తోంది.

భారత విప్లవోద్యమ అనుభవసారమే కె.ఎస్. రచనలు. సుదీర్ఘమైన తన విప్లవ జీవితానుభవాన్నంతా ప్రోదిచేసి ఆయన మనకందించిన రచనలు అమూల్యమైనవి. అవి పీడిత ప్రజల ఘనమైన సంపద. అందుకే అవి బహుళ ప్రాచుర్యాన్ని పొందుతున్నాయి. రష్యా, చైనా విప్లవ వైఫల్యాల మూలంగా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో ఏర్పడిన స్తబ్దతను ఆసరా చేసుకుని నేడు రివిజనిస్టులు, ట్రాట్స్కైట్లు మార్క్సిజంపై ముప్పేట దాడిని కొనసాగిస్తున్నారు. కె.ఎస్. ప్రాసంగికత గురించి చర్చించటమే అసంబద్ధమనీ, కమ్యూనిస్టు విప్లవాలు ఒక పూర్తి ఊహాకల్పిత వ్యవస్థ కోసం అమానవీయ చర్యలకు పాల్పడుతున్నాయనీ కొందరు చేస్తున్న ప్రకటనలు ఈ దాడిలో భాగమే తప్ప మరేమీ కాదు. ఈ దాడిని తిప్పికొట్టి మార్క్సిజాన్ని పరిరక్షించడానికి, వీరి కుట్రల్ని భగ్నం చేసి ఉద్యమాన్ని మున్ముందుకు తీసుకుపోవడానికి కె.ఎస్. రచనలు బలమైన సాధనాలుగా నిలుస్తాయి.

కొండపల్లి సీతారామయ్య రచనలలోని మార్గదర్శక సూత్రాలు, సిద్ధాంత రాజకీయ అంశాలు సరైనవి. అవి సమకాలీన పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఎంతో దోహదపడతాయి. అవి నేటికీ ఆచరణీయమైనవనీ మన అనుభవం అడుగడుగునా నిరూపిస్తోంది. యావత్తు పీడిత ప్రజానీకం ఈ అనుభవాలను సమీక్షించుకుని మహత్తర విప్లవ ఆశయానికి పునరంకితం కావాలి.

• డాక్టర్ శ్రీనివాస్
కె.ఎస్. మెమోరియల్ కమిటీ
(నేడు కొండపల్లి సీతారామయ్య వర్ధంతి)

దృశ్యాదృశ్యాల నడుమ...!

ఏది సత్యం ఏది అసత్యమనే
మీమాంస ఇప్పుడిక అక్కరలేదు
రాజకీయ దృశ్యాదృశ్యాల నడుమ
వికృత విధ్వంస రూపాలనేకం
చాణక్యనీతులు వల్లిస్తున్నాయి,
విశ్వగురువు ప్రవచనాలతో
దేశ సంపదంతా కొందరికే కైంకర్యం
శేషమంతా పరంపరాగత దారిద్ర్యం,
సాంత్వనగా గుళ్లగోపురాల చుట్టూ
చెక్కభజనలతో
భజ గోవిందం భజ గోవిందం
ప్రశ్నించేవాడు మూఢమతి
శాసిస్తున్నవాడు సర్వంతర్యామిగా
నిఘానేత్రాలతో
నిర్బంధ నివాసాలు నిర్మిస్తున్నాడు
ఇకనైనా గోడల్ని కూల్చక తప్పదు,
వోటుహక్కు చివరికిలా
మార్కెట్ సరుకుగా మిగిలితే
మన తరతరాల మానసిక దాస్యం
పౌరాణిక మూఢ భావజాలం
మనందరి చేతికి చిప్పనిచ్చి
విశ్వవిపణిలో
బరిబత్తల నిలుచోబెడతాయి,
ఇక గతిలేక–
"ఏమి చేతురా లింగా
ఏమి చేతురా..." అంటూ
చేతులు పిసుక్కుంటూ
మన కర్మను–
తిట్టుకోవలసింది మనమే!!


– నిఖిలేశ్వర్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్
నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com



ఈద్ ముబారక్

ముస్లిం ఈద్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో గురువారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సామూహిక ప్రార్థనలు చేశారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



ఎన్నికల సన్నాహం

- నేడు నియోజకవర్గాల వారీగా ఈవీఎంల ర్యాండమైజేషన్
- కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల సమక్షంలో..
- కంప్యూటర్ ప్రోగ్రామ్ ద్వారా ప్రారంభంకానున్న ప్రక్రియ
- నియోజకవర్గాల వారీగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు..

- 6లో..





అమ్మ చెంగు నీడలో..

చిన్న బ్రేక్

కాస్త తగ్గిన ఉష్ణోగ్రతలు

- నేడు, రేపు కొంచెం తక్కువగానే..
- ఎల్లుండి నుంచి మళ్లీ పెరుగుదల
- సైక్లోనిక్ సర్కిల్ ప్రభావం కారణంగానే

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : వాతావరణంలో భిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు హెచ్చుతగ్గుల మధ్య సాగుతున్నాయి. నగరంలో గురువారం ఈ పరిస్థితి స్పష్టంగా కనిపించింది. ఇప్పటి వరకు ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు భానుడి భగభగలాడేవాడు. ఉక్కపోతలతో జనం అల్లాడిపోయేవారు. గురువారం మాత్రం కొద్దిసేపు ఎండ, కొద్దిసేపు దట్టమైన మబ్బులు కనిపించాయి. ఉత్తర ఈశాన్య రాష్ట్రాల్లో ఏర్పడిన సైక్లోనిక్ సర్కిల్ కారణంగా ఈ మార్పులు వచ్చాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల వాతావరణంలో చల్లదనం ఏర్పడిందంటున్నారు. ఇప్పటి వరకు 40 డిగ్రీల వద్ద నమోదవుతున్న ఉష్ణోగ్రతలు రెండు, మూడు రోజుల పాటు 38-39 డిగ్రీలకు తగ్గుతాయని వాతావరణ శాఖ ఫోర్‌కాస్ట్ విడుదల చేసింది. ప్రస్తుతం నమోదవుతున్న ఉష్ణోగ్రతలకు ఒకటి నుంచి రెండు డిగ్రీల వరకు తగ్గే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

నేటి నుంచి విజయవాడలో ఉష్ణోగ్రతలు ఇలా.. (వాతావరణ శాఖ అంచనా)

తేదీ	ఉష్ణోగ్రత
ఏప్రిల్ 12	39.88
13	39.07
14	40.31
15	41.91
16	41.05
17	40.76

రెండు రోజులు తగ్గుదల

విజయవాడలో గురువారం 40.75 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శుక్ర, శనివారాల్లో ఒక డిగ్రీ మేరకు తగ్గుతుంది. శుక్రవారం 39.78 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావచ్చని వాతావరణ శాఖ అంచనా. శనివారం 39.24 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ రెండు రోజులు మాత్రమే భానుడు కాస్తంత ఉపశమనం కలిగించనున్నాడు. ఇక ఆదివారం నుంచి పరిస్థితి మామూలుగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. నగరంలో ఆదివారం 40.31 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావచ్చని ఆ శాఖ ఫోర్‌కాస్ట్ విడుదల చేసింది. ఇక ఆ తర్వాత నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు 41 నుంచి 42 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

తప్పులను సవరించండి

బీఎల్వోలకు కలెక్టర్ ఆదేశాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఓటర్ కార్డుల్లో తప్పులపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనంపై జిల్లా ఎన్నికల యంత్రాంగం స్పందించింది. తప్పులకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కరించాల్సిందిగా కలెక్టర్ దిల్లీరావు ఆదేశించటంతో బీఎల్వోలు గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలన ప్రారంభించారు. గతంలో తప్పుల సవరణకు దరఖాస్తు చేసుకున్న వారికి బీఎల్వోలు కొందరు ఫోన్లు చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి ఆధార్ కార్డు కాపీలను పంపించాల్సిందిగా కోరారు.

కోడ్ ఉల్లంఘించిన 11 మంది ఉద్యోగులపై వేటు

చర్యలు తీసుకున్న జిల్లా ఎన్నికల యంత్రాంగం

- 6లో..



మధ్యలో వచ్చి..

సెంట్రల్‌లో వెలంపల్లి అనుచరుల పెత్తనం

అనుకున్నదొకటి.. అయినదొకటి.. అన్నట్టుగా ఉంది వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు పరిస్థితి. ఏదో చేద్దామని వస్తే.. అంతా తలకిందులై.. మరేదో జరిగినట్టు ఆయన తెగ సతమతమవుతున్నారు. పొరుగు నుంచి వచ్చి తమపై పెత్తనమేమిటంటూ సెంట్రల్‌లోని వైసీపీ కార్పొరేటర్లు, స్థానిక నేతలు అసలే అగ్గి మీద గుగ్గిలమవుతుంటే.. వారి స్థానే పశ్చిమ నుంచి వచ్చిన తన అనుయాయులకు వెలంపల్లి బాధ్యతలు అప్పగించడం, తాజాగా పేరున్న పక్క పార్టీ నాయకులతో తెరవెనుక మంత్రాంగాలు జరుపుతుండటంతో మరింత రగిలిపోతున్నారు. వెలంపల్లి పర్యటనలకు కాస్త దూరం పాటిస్తున్నారు. ఇదంతా చూస్తుంటే.. ఇంట గెలవడమేమో కానీ, ఈ రచ్చ గెలిచేసరికి వెలంపల్లికి ముచ్చెమటలు పడుతున్నాయని సొంత పార్టీ నాయకులే గుసగుసలాడుకుంటున్నారు.

సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది అనుచరులకు తగ్గిన ప్రాధాన్యం

- స్థానిక వైసీపీ కార్పొరేటర్లు, నేతల నుంచి నిరసన
- ఊరించి ఉసూరుమనిపించారంటూ ఆగ్రహం
- వెలంపల్లి పర్యటనలకు నామమాత్రంగా హాజరు
- అనుచరుడు బుజ్జిబాబుదే హవా అంతా..
- డివిజన్ ఇన్‌చార్జులందరూ పశ్చిమవారే..
- సొంతవారిని కాదని.. పక్క పార్టీలవైపు చూపులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ నియోజకవర్గంలో 21 డివిజన్లు ఉన్నాయి. వీటిలో 16 డివిజన్లకు వైసీపీ కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అన్ని డివిజన్లకు కార్పొరేటర్లతో పాటు కో-ఆర్డినేటర్లు ఉన్నారు. వీరంతా మల్లాది విష్ణు మనుషులు కావడంతో వెలంపల్లి వారిపై అపనమ్మకంతో పశ్చిమానికి చెందిన తన సొంత మనుషులను నియమించుకున్నారు. 29వ డివిజన్‌కు ఇన్‌చార్జిగా నియమితుడైన కొండపల్లి బుజ్జి ప్రస్తుతం వెలంపల్లి తరఫున అన్నీ తానై చక్రం తిప్పుతున్నారు. డబ్బు పంపిణీ మొదలు డివిజన్లలో వెలంపల్లి పర్యటన సమయంలో డివిజన్ కార్పొరేటర్‌కు, స్థానిక నాయకులకు నగదు ముట్టజెప్పడం వంటివన్నీ ఆయన కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. తొలుత డివిజన్ పర్యటనల సమయంలో లక్ష రూపాయల వరకు ఖర్చు చేసిన వెలంపల్లి శిబిరం రానురానూ అందులో కోత పెడుతూ ప్రస్తుతం రూ.10 వేలు చేతిలో పెడుతుండటం స్థానిక నాయకత్వానికి మింగుడుపడటం లేదు. దీంతో వారు వెలంపల్లి పర్యటనల్లో హాజరుకు మాత్రమే పరిమితమవుతున్నారు. కనీసం తమ వెంట పట్టుమని పదిమంది అనుచరగణాన్ని కూడా తీసుకురావడం లేదు. పశ్చిమ నియోజకవర్గానికి చెందిన నాయకులు సెంట్రల్ నియోజకవర్గంలో తిష్టవేసి పెత్తనం చలాయించడాన్ని వారంతా జీర్ణించుకోలేకపోతున్నారు.

రగిలిపోతున్న మల్లాది వర్గం

సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు వర్గం అసంతృప్తితో రగలిపోతోంది. వెలంపల్లికి టికెట్ ఇచ్చిన వెంటనే విష్ణు పార్టీ మారిపోవాలని భావించారు. అయితే వైసీపీ పెద్దలు బుజ్జగించి ఆయనకు విజయవాడ నగర బాధ్యతలు అప్పగించారు. అయితే, అది ఎలాంటి ఉపయోగం లేని పదవిగా వైసీపీ నాయకులు భావిస్తుంటారు. గత ఎన్నికల్లో విజయవాడ తూర్పు నుంచి పోటీచేసి ఓడిపోయిన బొప్పన భవకుమార్‌కు కొంతకాలం ఆ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. ఎప్పుడైతే దేవినేని అవినాశ్ వైసీపీలోకి వచ్చారో విజయవాడ నగర పార్టీ బాధ్యతలు అప్పగించారు. ఉత్సవ విగ్రహంలాంటి ఆ పదవిలో కొంతకాలం కొనసాగిన బొప్పన చివరికి టీడీపీలో చేరారు. మల్లాది విష్ణు సైతం ఇప్పుడు అదే ఆలోచనలో ఉన్నారు. తనకు నగర పార్టీ బాధ్యతలు అప్పగించి చేతులు కట్టేసి కూర్చోబెట్టారన్న భావన విష్ణుతో పాటు ఆయన అనుచరుల్లో ఉంది. దీనికంతటికీ కారణం వెలంపల్లి అని రగిలిపోతున్నారు. దీంతో వారెవరూ మనస్ఫూర్తిగా వెలంపల్లికి పనిచేయడం లేదు. ఆయన సెంట్రల్‌లో పాతుకుపోకుండా చూడాలన్న ఆలోచనతో పలువురు వైసీపీ నేతలు తీవ్రస్థాయిలో తెరవెనుక చక్రం తిప్పుతున్నారు. వెలంపల్లి ఇక్కడ తిష్ట వేసుకుంటే తమకు రాజకీయంగా ఎదుగుదల ఉండదన్న ఆలోచనలో వారున్నారు.

ప్రత్యర్థులకు ఎర

జరుగుతున్న పరిణామాలన్నీ వెలంపల్లికి గుక్క తిప్పుకోనివ్వడం లేదు. దీంతో సొంత ఇంటిని చక్కదిద్దుకోవడం కంటే ప్రత్యర్థులకు గేలం వేయడమే బెటర్ అన్న నిర్ణయానికి వెలంపల్లి వచ్చినట్టు సమాచారం. టీడీపీలో డివిజన్ స్థాయిలో కాస్త బలమున్న నాయకులపై ఆయన దృష్టి సారించారు. వారికి కాసులు ఎరవేసి లోపాయికారిగా తనకు పనిచేసేలా మాట తీసుకుంటున్నారు. ఈ తంతు కూడా సొంత పార్టీ నాయకుల్లో ఆగ్రహం తెప్పిస్తోంది. తమను నమ్మకుండా వేరే నియోజకవర్గం వారిని తమపై పెత్తనం చేయించడం.. ఇతర పార్టీ నాయకులకు డబ్బులు ఇస్తూ తమను పట్టించుకోకపోవడం వారిలో అసంతృప్తిని రేకెత్తిస్తోంది. మొత్తం మీద సెంట్రల్ నియోజకవర్గ వైసీపీలో వెలంపల్లికి సానుకూలాంశాలు ఏమీ కనిపించడం లేదు.





పళ్లెంలో డబ్బు పెట్టేందుకు సిద్ధమవుతున్న నాని



వెనుక నోట్ల కట్టలతో అనుచరుడు

హారతి పడితే రూ.వెయ్యి

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని తాయిలాలు

పత్తాలేని ఎన్నికల అబ్జర్వర్ టీమ్

గుడివాడ : గుడివాడ పట్టణం 20వ వార్డులో ఇంటింటి ప్రచారానికి వెళ్తున్న వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కొడాలి నాని హారతి పట్టేవారికి బహిరంగంగానే రూ.1,000 పళ్లెంలో వేస్తున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా హారతి పళ్లెంలో డబ్బుల పంపిణీ యథేచ్ఛగా జరుగుతోంది. ఈ నెల 2వ తేదీన ఇదే తరహాలో హారతి పట్టిన వారికి పళ్లెంలో నాని నగదు వేసిన విషయాన్ని టీడీపీ నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారులు స్పందించలేదు. నాని ప్రచారంలో ఓటర్లను ప్రలోభపెడుతున్నారని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము బహిరంగంగా ఆరోపిస్తున్నా ఎన్నికల అధికారుల్లో చలనం లేదు.

ములకలమ్మలో మళ్లీ తవ్వకాలు

ములకలమ్మ చెరువును మళ్లీ మింగేస్తున్నారు. నెల రోజులుగా అక్రమంగా తవ్వకాలు సాగిస్తూ ఇటుక బట్టీలకు అమ్ముకుంటున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారుల అండ ఉండటంతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చినా కొద్దిరోజులు ఆపి మళ్లీ రాత్రిపూట తవ్వకాలు చేపడుతున్నారు. టీడీపీ నాయకులు.. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువయ్యారు.

- రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు
- అధికారులు, అధికార పార్టీ అండతోనే..
- నెల రోజులుగా ఇటుక బట్టీలకు తరలింపు

గన్నవరం, ఏప్రిల్ 11 : గన్నవరం మండలం వీరపనేనిగూడెం ములకలమ్మ చెరువులో వైసీపీ నాయకుల అక్రమ తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటుక బట్టీల ప్రయోజనార్థం జేసీబీలను పెట్టి రోజూ రాత్రివేళ సుమారు 300కు పైగా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవట్లేదు. గ్రామ ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ తంతు జరుగుతోంది. రాత్రయితే చాలు.. వందలాది ట్రాక్టర్లకు మట్టిని లోడ్ చేస్తున్నారు. ఇటుక బట్టీల నిర్వాహకులు తమ పొలాలు మెరక చేసుకుంటున్నామని చెబుతూ.. మట్టి తోలి, అక్కడి నుంచి ఇటుక బట్టీలకు తరలిస్తూ భవిష్యత్తు అవసరాలకు దాచిపెడుతున్నారు.

చీకటిపడితే చాలు..

గ్రామంలో వైసీపీకి చెందిన జేసీబీలు ఉండటంతో చీకటి పడితే చాలు.. ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. దీనిపై స్థానికులు అధికారులకు సమాచారం ఇస్తున్నా పట్టించుకోవట్లేదు. తవ్వకాలు లేనప్పుడు వచ్చి, పరిశీలించి, మామూళ్లు అందుకుని వెళ్లిపోతున్నారు. తవ్వకాలను అడ్డుకోవాలంటూ ఇరిగేషన్ అధికారులు.. తహసీల్దారు, పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలిచ్చి చేతులు దులుపుకొన్నారు. రెవెన్యూ అధికారులేమో ఎన్నికల హడావిడి అంటూ పక్కకు తప్పుకొన్నారు. అయితే, ఎవరికి అందాల్సిన వాటాలు వారికి అందుతున్నాయని తెలుస్తోంది. వైసీపీ గన్నవరం అభ్యర్థి వల్లభనేని వంశీని అడ్డుపెట్టుకుని ఈ తవ్వకాలు జరుపుతున్నారు. దాడులకు వెళ్లినప్పుడు వైసీపీ జేసీబీలైతే వదిలేయడం, వేరే వారివైతే కేసులు పెట్టడం చేస్తున్నారు. ఇటుక బట్టీల కోసం తవ్వకాలపై ఇప్పటికే పలుమార్లు గ్రామంలో వైసీపీ నాయకులు, తవ్వకందారుల మధ్య పంచాయితీలు జరిగాయి. అప్పట్లో ఇటుక బట్టీలకు మట్టి తరలించకుండా ఆపారు. అప్పట్లో గ్రామాభివృద్ధి కోసం సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ, పీఏసీఎస్ అధ్యక్షుడి సమక్షంలో డబ్బు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. సుమారు రూ.5 లక్షల వరకూ వైసీపీకి చెందిన ఉప సర్పంచ్ బండి నాగసాంబిరెడ్డి తీసుకున్నాడని, ఇప్పటివరకు గ్రామాభివృద్ధికి ఉపయోగించలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ చేపడుతున్న అక్రమ తవ్వకాలు ఆపాలని గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.



చెరువులో ఏర్పడిన గుంతలు



బూరగడ్డ వేదవ్యాస్‌ను పరామర్శిస్తున్న మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి, ఎంపీ బాలశౌరి

వేదవ్యాస్ మాతోనే.. మరో ఆలోచన లేదు

- రెండ్రోజుల్లో చంద్రబాబు, పవన్‌ను కలుస్తా
- సమస్య పరిష్కరిస్తా : బాలశౌరి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 11 : మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్ కూటమితోనే ఉంటారని ఎంపీ, ఉమ్మడి పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. గురువారం ఉదయం భాస్కరపురంలోని వేదవ్యాస్ ఇంటికి బాలశౌరి వెళ్లారు. వేదవ్యాస్‌తో భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం బాలశౌరి మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా చాలాకాలంగా బూరగడ్డ వేదవ్యాస్, ఆయన తండ్రి బూరగడ్డ నిరంజనరావులు 1967 నుంచి పెడన, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలకు సేవలందిస్తున్నారన్నారు. కొన్ని కారణాల వల్ల పెడన అసెంబ్లీ సీటు టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్‌కు ఇచ్చినప్పటికీ వేదవ్యాస్‌కు సముచిత న్యాయం కల్పిస్తామన్నారు. దీనికోసం చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లతో చర్చిస్తామన్నారు. రెండురోజుల్లో వ్యాస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు. వేదవ్యాస్ మాట్లాడుతూ, తనకు అనారోగ్యంగా ఉన్నందున బాలశౌరి పరామర్శకు వచ్చారని.. రాజకీయంగా ఉన్న సమస్యలపై చర్చించామన్నారు. బాలశౌరి తెనాలి ఎంపీగా ఉన్నప్పటి నుంచి తనకు పరిచయం ఉందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వైసీపీలో చేరను..

- ఎమ్మెల్యే సీటు వస్తుందని ఆశించా
- బాలశౌరి హామీ మేరకే తుది నిర్ణయం

- బూరగడ్డ వేదవ్యాస్ వెల్లడి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 11 : సీటు రానందున కొందరు నాయకులు తాను వైసీపీలో చేరుతున్నట్టు దుష్ప్రచారం చేస్తున్నారని.. తాను వైసీపీలో చేరే ప్రసక్తే లేదని మాజీ ఉపసభాపతి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెడన అసెంబ్లీ నియోజకవర్గం సీటును ఆశించానని, అది దక్కకపోవడంతో మానసికంగా అనారోగ్యానికి గురవడం వల్ల చాలా రోజుల తరువాత మీడియాతో మాట్లాడుతున్నానన్నారు. పెడన, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలతో తనకు సత్సంబంధాలున్నాయన్నారు. సీటు కోసం చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌ను కలిశానని, అయినప్పటికీ కొన్ని కారణాల వల్ల తనకు సీటు ఇవ్వలేదన్నారు. రెండు రోజుల్లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ను కలిసి తనకు సముచిత స్థానం కల్పిస్తానని బాలశౌరి వాగ్దానం చేశారని, ఆయన వాగ్దానాన్ని అనుసరించి ఏ నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. నియోజకవర్గ నేతలు, ప్రజలు తనపై చూపిన అభిమానాన్ని మరచిపోలేనన్నారు.

ప్రజాస్వామ్యం మంటగలిపారు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ
- బ్రహ్మయ్యలింగం చెరువును రిజర్వాయర్ చేస్తా : యార్లగడ్డ వెంకట్రావు
- వైసీపీ పాలనలో సంపద సృష్టి లేదు.. ఇసుక దోపిడీనే : బాలశౌరి
- గన్నవరంలో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి సమావేశం



గన్నవరంలో కూటమి పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ

గన్నవరం, ఏప్రిల్ 11 : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మంటగలిసిందని, అరాచకం పెరిగిపోయి ఒక నియంతృత్వ పాలన కొనసాగుతున్నదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. కక్ష సాధింపుతో గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేసి కార్లను దహనం చేసి, పలువురిని గాయపరిస్తే.. వారిపైనే ఎదురు కేసులు పెట్టి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తమ అధినేత చంద్రబాబు నాయుడుని కూడా అరెస్టు చేసి జైలుకు పంపింది దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వమే అన్నారు. గన్నవరం ఏటీ కన్వెన్షన్‌లో టీడీపీ-బీజేపీ-జనసేన పార్టీల ఉమ్మడి సమావేశం గురువారం రాత్రి జరిగింది. తొలుత జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ, చంద్రబాబు అరెస్టును ఖండించి దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు టీడీపీతో కలుస్తున్నానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారన్నారు. గన్నవరం నియోజకవర్గానికి, మచిలీపట్నం పార్లమెంటుకు సమర్థులైన అభ్యర్థులున్నారని, వారిని మంచి మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, గన్నవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో నిలుపుతానన్నారు. ఎంఎస్‌సీ కంపెనీ తీసుకువస్తానని చెప్పారు. ఓడిపోతే అమెరికా వెళ్లిపోతానని దుష్ప్రచారం చేశారని, తాను ఎక్కడికి వెళ్లేది లేదని, తన ఫొటోను 32 మంది తమ గుండెలపై పచ్చబొట్లు పొడిపించుకున్నారని, వారితో పాటు ఎంతోమంది అభిమానుల కోసం గన్నవరంలో పోటీ చేస్తానని ఆనాడే స్పష్టం చేశానన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అవమానాలు మోస్తే.. టీడీపీలో భావోద్వేగాలు మోయాల్సి వస్తున్నదన్నారు. ఏ మూలకు వెళ్లినా గన్నవరం సీటు గెలవాలని పదేపదే చెబుతున్నారని అన్నారు. బ్రహ్మయ్యలింగం చెరువును రిజర్వాయర్ చేసి.. 12వేల ఎకరాలకు సాగునీరు అందిస్తానని, పోలవరం కుడికాలువ నీటిని ఏలూరు కాలువకు అనుసంధానం చేసి తీరుతానని స్పష్టం చేశారు.

మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ, ఐదేళ్లు ఎంపీగా అభివృద్ధి చేసి చూపించానన్నారు. వైసీపీ ముఖ్య నాయకులు పవన్ కళ్యాణ్, చంద్రబాబును తిట్టమని చెప్పారని, తాను అలాంటి వ్యక్తిని కాదని అభివృద్ధి పరంగా తనను ఉపయోగించుకోవాలని సూచించానని తెలిపారు. బందరు పోర్టుకు రూ.4వేల కోట్లు తీసుకువచ్చానని, ఈ నగదును వైసీపీ ప్రభుత్వం ఎక్కడ వాడుకుంటుందోనని ప్రత్యేక ఖాతాను తెరిచి పక్కదారి వెళ్లకుండా ఉండేలా నిబంధనలు పెట్టడం జరిగిందన్నారు. బందరులో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేశానన్నారు. హనుమాన్ జంక్షన్‌లో రూ.కోటితో వంగవీటి మోహన రంగా కళ్యాణ మండపం పాటు మరో 15 కమ్యూనిటీ హాలు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో సంపద సృష్టి లేదన్నారు. దోచుకోవటమే తప్ప మరొకటి లేని ముఖ్యమంత్రిని ఎన్నడు చూడలేదన్నారు. అరాచక శక్తుల పాలన పోవాలంటే కూటమి అభ్యర్థులు గెలవాలన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పార్టీల నేతలు పాల్గొన్నారు.



బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న వసంత

శుభకార్యంలా చేయాలి

- పార్టీ శ్రేణులకు వసంత దిశా నిర్దేశం

గొల్లపూడి, ఏప్రిల్ 11 : పార్టీ కార్యక్రమాలను ఇంట్లో శుభకార్యాలుగా భావించి విజయవంతం చేయాలని బీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. కొండపల్లి మున్సిపాలిటీ బూత్ కమిటీ సభ్యులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈనెల 14న మైలవరంలో నిర్వహించనున్న జయహో బీసీ, 16న ఎస్సీ సదస్సులను జయప్రదం చేయాలన్నారు. ఈనెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నట్టు తెలిపారు. వచ్చే 6 రోజులు కొండపల్లి మున్సిపాలిటీలో విస్తృతంగా పర్యటించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో జంపాల సీతారామయ్య, చెన్నబోయిన చిట్టిబాబు, చనమోలు నారాయణ, చుట్టుకుదురు శ్రీనివాసరావు, ధరణికోట విజయలక్ష్మి, వాసు, సైదులు, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ ప్రజాదరణ కోల్పోయింది : రవీంద్ర



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 11 : వైసీపీ ప్రజాదరణ కోల్పోతున్నదని, అందుకు నిదర్శనమే పెద్ద ఎత్తున వైసీపీ కార్యకర్తలు టీడీపీ, జనసేనలో చేరుతున్నారని మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం రాత్రి నిజాంపేట రంగాబొమ్మ సెంటర్ వద్ద 48, 50 డివిజన్లలో విన్నకోట శ్రీను, పడమట నాగరాజు ఆధ్వర్యంలో పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి రవీంద్ర, బండి రామకృష్ణలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సైకో జగన్‌రెడ్డిని, అక్రమాల పేర్ని నానిని ప్రజలు వదిలించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లపాటి సుబ్రహ్మణ్యం, కరెడ్ల సుశీల, పల్లపాటి అభినవ్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనతో విసిగెత్తారు : కాగిత



కృత్తివెన్ను : వైసీపీ ప్రభుత్వం, జగన్ పాలనపై విసిగిపోయి, అసంతృప్తితో పలువురు నాయకులు గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పెడన నియోజకవర్గ పరిధిలోని గూడూరు మండలం ముక్కొల్లు ఆర్బీకె చైర్మన్ సమ్మెట రాఘవ ప్రసాద్ ఆధ్వర్యంలో కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు సమ్మెట బాబు, తులసీరావులతో పాటు సుమారు 200 మంది వైసీపీ వీడి టీడీపీ, జనసేన పార్టీలో చేరారు. వారికి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ టీడీపీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కృత్తివెన్ను మండలం వాలంకలో సుమారు 50మంది యువత టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి తనయుడు అనుదీప్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తోటివారిని ఆదుకోవటమే రంజాన్ ఆంతర్యం : నెట్టెం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 11 : తోటివారిని ఆదుకోవటం, సహాయం అందించటం రంజాన్ పర్వదిన ఆంతర్యమని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు



నెట్టెం రఘురాం అన్నారు. రంజాన్ సందర్భంగా బలుసుపాడురోడ్‌లోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజులు ఉపవాస దీక్షల్లో పాల్గొన్న ముస్లింలు పేదలు, తోటివారికి దానం చేయటం మంచి సాంప్రదాయమన్నారు. ఆయనతో పాటు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి అన్వర్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సత్తార్, జనసేన నేత మోసిన్ తదితరులు ఉన్నారు.



కుచికాయిలపూడి గ్రామంలో గజమాలతో స్వాగతం

అభివృద్ధి మరిచిన నానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధం

- ఎన్నికల ప్రచారంలో వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు : అభివృద్ధి మరిచిన ఎమ్మెల్యేకి గుడివాడ ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని.. ఎన్నికల రోజు కోసం ఎదురు చూస్తున్నారని గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. గురువారం పోలిమెట్ల, కుచికాయిలపూడి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన మరుసటి రోజు నుంచి గుడివాడ ప్రజలకు అభివృద్ధిని చేసి చూపుతానని వెనిగండ్ల అన్నారు. కుచికాయిలపూడిలో భారీ గజమాలతో కార్యకర్తలు రాముకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

1142 ఫిర్యాదుల పరిష్కారం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు



వన్‌టౌన్, ఏప్రిల్ 11 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 1142 ఫిర్యాదులను పరిష్కరించినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.దిల్లీరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఎన్‌జీఎస్‌పీ తదితర మార్గాల ద్వారా 1156 ఫిర్యాదులు రాగా 1142 పరిష్కరించినట్టు చెప్పారు. సీ-విజిల్‌లో తిరువూరు నియోజకవర్గంలో 55, విజయవాడ పశ్చిమలో 6, సెంట్రల్‌లో 58, తూర్పులో 73, మైలవరంలో 18, నందిగామలో 134, జగ్గయ్యపేటలో 103, ఇతర పోలింగ్ స్టేషన్‌ల పరిధి నుంచి 4 ఫిర్యాదులు వచ్చినట్టు తెలిపారు. ప్రతికూల వార్తలకు సంబంధించి 60 అంశాలను పరిశీలించి 56 అంశాలలో చర్యలకు ఆదేశించినట్టు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.6.74 కోట్ల విలువైన నగదు, మద్యం ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు కలెక్టర్ తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో రూ.1.13 కోట్ల సీజర్‌లు జరిగినట్టు మైలవరంలో రూ.35.62 లక్షలు నందిగామలో రూ.18.33లక్షలు, తిరువూరులో రూ.84.57 లక్షలు, విజయవాడ సెంట్రల్‌లో రూ.2.75 కోట్లు, విజయవాడ తూర్పులో రూ.64.12లక్షలు, విజయవాడ పశ్చిమలో రూ.82.44లక్షల మేరకు సీజర్‌లు జరిగినట్టు ఆయన వెల్లడించారు.

కోడ్ ఉల్లంఘించిన 11 మంది ఉద్యోగులపై వేటు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన 11 మంది ఉద్యోగులపై జిల్లా ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. వీరిలో కాంట్రాక్టు, రోజువారీ ఉద్యోగులే ఎక్కువగా ఉన్నారు. ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు, ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులు, రెన్యూమరేషన్ తీసుకునే ఉద్యోగులు ఏడుగురు చొప్పున మొత్తం 11 మంది కోడ్ ఉల్లంఘనలకు పాల్పడ్డారని, వీరిపై చర్యలు తీసుకున్నట్టుగా జిల్లా ఎన్నికల యంత్రాంగం, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువచ్చింది. వీరు ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడ్డారు? పేర్లను మాత్రం బహిర్గత పరచలేదు.



గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట చర్యలు

- కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

గన్నవరం, ఏప్రిల్ 11 : ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. గన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్‌లను గురువారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ గీతాంజలి శర్మతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారా లేదా అని పరిశీలించినట్టు తెలిపారు. చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే వాటిని సరిచేసి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దారు పవన్‌కుమార్, సీఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం



గుడివాడ : రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పోతురాజు సుదర్శనకుమార్ అదుపులోకి తీసుకుని 26 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు టూటౌన్ సీఐ ఎం.ఎన్ దుర్గారావు తెలిపారు. ఎస్సై పి.నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల సన్నాహం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన 'ఈవీఎం ర్యాండమైజేషన్' శుక్రవారం ప్రారంభం కానుంది. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు, రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఈ ప్రక్రియను నిర్వహిస్తారు. ఈవీఎంలను అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కేటాయిస్తారు. ఈవీఎంలో బ్యాలెట్ యూనిట్ (బీయూ), కంట్రోల్ యూనిట్ (సీయూ)లు ఉంటాయి. ఒక్కో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌కు ప్రత్యేక కోడ్ ఉంటుంది. ఏ కోడ్ కలిగిన బ్యాలెట్ ఏ పోలింగ్ స్టేషన్‌కు వెళుతుందో ఎవరికీ తెలియకుండా చేసే పద్ధతినే 'ఈవీఎం ర్యాండమైజేషన్' అంటారు. ఇది కంప్యూటర్ ఆధారంగా రాజకీయ పార్టీల సమక్షంలో నిర్వహిస్తారు. ఈవీఎంల కోడ్స్‌ను పరిగణనలోకి తీసుకుని కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ద్వారా ఒక్కో నియోజకవర్గానికి అవసరానికి తగినట్టుగా ఆటోమేటిక్‌గా ఈవీఎంలను కేటాయిస్తుంది. ఎలాంటి అభ్యంతరాలు లేవన్న తర్వాతనే ఎన్నికల గోడన్‌లో భౌతికంగా ఈ ప్రక్రియ చేపడతారు. డేటా ప్రాతిపదికన అత్యంత రహస్యంగా ఈవీఎంలను బాక్సుల్లో సర్దుతారు. బాక్సులో సర్దే ఈవీఎంలు ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలోకి వెళతాయో కూడా అక్కడి సిబ్బందికి కూడా తెలియదు. అత్యంత రహస్యంగా, పారదర్శకంగా ఉండే ఈ పద్ధతిని శుక్రవారం గొల్లపూడి లోని జిల్లా ఈవీఎంల గోడౌన్‌లో నిర్వహిస్తారు. రాజకీయ పార్టీలతో సమావేశం ముగిసిన తర్వాత జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు గొల్లపూడి వచ్చి భౌతికంగా ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తారు.

- నేడు నియోజకవర్గాల వారీగా ఈవీఎంల ర్యాండమైజేషన్
- కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల సమక్షంలో కేటాయింపు
- కంప్యూటర్ ప్రోగ్రామ్ ద్వారా ప్రారంభం కానున్న ప్రక్రియ
- నియోజకవర్గాల వారీగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు తరలింపు



పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎం, వీవీప్యాట్లు

ఎన్టీఆర్ జిల్లా పరిధిలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం మొత్తం 1792 పోలింగ్ స్టేషన్లున్నాయి. ఈవీఎంలకు సంబంధించి బ్యాలెట్ యూనిట్లు (బీయూ) 2150 అవసరం కాగా ప్రస్తుతం గోడౌన్‌లో 2787 బ్యాలెట్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. కంట్రోల్ యూనిట్లు (సీయూ) 2150 అవసరం కాగా 2222 వరకు ఉన్నాయి. వీవీ పాట్లు 2330 అవసరం కాగా 2661 అందుబాటులో ఉన్నాయి.

- అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి తిరువూరు పరిధిలో 234 పోలింగ్ స్టేషన్ల నిర్వహణకు 281 బ్యాలెట్ యూనిట్లు (బీయూ), కంట్రోల్ యూనిట్లు (సీయూ) కావాల్సి ఉన్నాయి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 253 పోలింగ్ స్టేషన్లకు గాను 304 బీయూ, సీయూలు కావాల్సి ఉన్నాయి. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో 267 పోలింగ్ స్టేషన్లకు 320 బీయూ, సీయూలు, తూర్పు నియోజకవర్గంలో 298 పోలింగ్ స్టేషన్లకు 358 బీయూ, సీయూలు, మైలవరం నియోజకవర్గంలో 296 పోలింగ్ స్టేషన్లకు 355 బీయూ, సీయూలు, నందిగామ నియోజకవర్గంలో 222 పోలింగ్ స్టేషన్లకు 266 బీయూ, సీయూలు, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 222 పోలింగ్ కేంద్రాలకు 266 బీయూ, సీయూలు అవసరం ఉంది.
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎంలకు సంబంధించి 2150 బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు అవసరం కాగా 2820 బీయూ, 2221 సీయూలు అందుబాటులో ఉన్నాయి. వీవీప్యాట్లు 2330 కావాల్సి ఉండగా 2702 అందుబాటులో ఉన్నాయి.
- పార్లమెంట్, అసెంబ్లీ మొత్తంగా 1792 పోలింగ్ స్టేషన్లకు 4300 బ్యాలెట్ యూనిట్లు అవసరం కాగా 5607 బీయూలు అందుబాటులో ఉన్నాయి. 4300 కంట్రోల్ యూనిట్లు అవసరం కాగా 4443 కంట్రోల్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 4660 వీవీప్యాట్లు అవసరం కాగా 5363 అందుబాటులో ఉన్నాయి.
- బ్యాలెట్ యూనిట్లు 130 శాతం అందుబాటులో ఉన్నాయి. కంట్రోల్ యూనిట్లు 123 శాతం అందుబాటులో ఉన్నాయి. వీవీప్యాట్లు 129 శాతం ఉన్నాయి.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు ఈవీఎంల తరలింపు

ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించిన ఈవీఎంలను డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్ (డీసీ)కు తరలిస్తారు. ప్రతి రిసెప్షన్ సెంటర్లలో ఉండే స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను భద్రపరుస్తారు. తిరువూరులో బాలికల జెడ్పీ హైస్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి గాంధీజీ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, సెంట్రల్‌లో ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఎన్‌ఎస్ఎం పబ్లిక్ స్కూల్, మైలవరానికి సంబంధించి లకిరెడ్డి బాలిరెడ్డి ఇండోర్ స్టేడియం, నందిగామ నియోజకవర్గానికి సంబంధించి కేవీఆర్ కాలేజీ, జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించి జీవీజే బాలుర జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తారు. ఇక్కడి నుంచి పోలింగ్ ముందు రోజున పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు, వీవీప్యాట్లు, ఇతర స్టేషనరీని అందజేస్తారు.

ఉద్దేశపూరకంగానే గొడవలు

- ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మణిదీప్



గుడివాడ, ఏప్రిల్ 11 : ఈ నెల 7వ తేదీన విజయవాడలో నిర్వహించిన అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం సమావేశంలో వైసీపీ నాయకులు వెలంపల్లి శ్రీనివాస్, కొండపల్లి బుజ్జిలు ఉద్దేశపూరకంగానే గొడవ చేశారని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు యక్కలి మణిదీప్ ఆరోపించారు. గురువారం స్థానిక ఆర్యవైశ్య మహాసభ గుడివాడ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, సంఘ పిలుపు మేరకు విజయవాడ సెంట్రల్ కూటమి అభ్యర్థి బొండా ఉమా సభకు హాజరయ్యారని, పార్టీలకతీతంగా నిర్వహించిన సమావేశంలో మిగిలిన పార్టీలకు చెందిన నాయకులను ఆహ్వానించడం జరిగిందన్నారు. ఉద్దేశ్యపూర్వకంగానే దూండి రాకేశ్‌పై వైసీపీ కార్యకర్తలు దాడిచేశారని, దీనికి కారకుడైన కొండపల్లి బుజ్జిపై రాష్ట్ర మహాసభ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. హనుమాన్‌పేటలోని కార్యాలయాన్ని తిరిగి సంఘానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. గుడివాడ నడిబొడ్డులోని ఆర్యవైశ్య కళ్యాణమండపం పక్కన స్థానిక వైసీపీ నాయకులు ఉద్దేశ్యపూరకంగానే డంపింగ్ సేకరణ పాయింట్‌ను ఏర్పాటు చేశారని, ఎన్నికల సమయం కావడంతో ఆర్యవైశ్యులను మభ్యపెట్టేందుకు సదరు పాయింట్‌ను మూసివేసారని మణిదీప్ ఆరోపించారు.

ఇసుక అక్రమ తవ్వకాలు.. అడ్డుకున్న టీడీపీ, జనసైనికులు



ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న టీడీపీ, జనసైనికులు

ఘంటసాల, ఏప్రిల్ 11 : ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం కరకట్ట వద్ద డంపింగ్ యార్డు నుంచి జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను టీడీపీ నేత, శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), జనసైనికులు గురువారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ, గత రెండు వారాలుగా శ్రీకాకుళం డంపింగ్ యార్డులో యంత్రాల సహాయంతో టిప్పర్లతో ఇసుక లోడింగ్ జరుగుతోందని తెలిపారు. రెవెన్యూ, పోలీసు శాఖలను అనుమతి పత్రాలు చూపాలని కోరగా, అధికారులు జగనన్న లే అవుట్లకు పర్మిషన్ ఉందని చెబుతున్నారని ఆరోపించారు. జగనన్న లే అవుట్లకు వెళ్తుంటే ఈ ఇసుక లారీల దగ్గర నుంచి ఒక టన్నుకి రూ.650 రూపాయల చొప్పున ఎందుకు వసూళ్లు చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే జిల్లాస్థాయి అధికారులు స్పందించి ఇసుక డంపింగ్ యార్డు నుంచి అక్రమంగా ఇసుక బయటికి తరలించకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కొల్లా రుచిత్, మాదాసు వినయ్, సుగ్గున పవన్ కుమార్, కోన హరీష్, తాడికొండ సాయితేజ, లంక త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణలంక పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

వన్‌టౌన్, ఏప్రిల్ 11: ఎన్నికలను పురస్కరించుకుని ప్రజల్లో విశ్వాసం కల్పించేందుకు కృష్ణలంక రాణిగారితోటలో గురువారం మిలటరీ బలగాలు, పోలీసుల ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కృష్ణలంక సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కవాతులో స్థానిక ఓటర్లకు, ప్రజలకు మనోధైర్యాన్ని కల్పించారు. సమస్యాత్మక పోలింగ్ బూత్‌ల పరిధిలో ఈ కవాతును నిర్వహించారు.



తాగునీటి సమస్యను పరిష్కరించాలి

● బోయి సత్యబాబు

చిట్టినగర్, ఏప్రిల్ 11: కొండప్రాంతంలో ప్రజలు మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు అన్నారు. సరఫరా సక్రమంగా జరగకపోవడంతోపాటు నీరు రంగు మారి వస్తోందన్నారు. గురువారం గొల్లపాలెంగట్టు కొండ ప్రాంతంలో ఆయన పర్యటించి మంచినీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల రంగుమారి వస్తున్న మంచినీటి శాంపిల్స్ తీసి పరిశీలించారు. వేసవిలో మంచినీటి సమస్య ఉందని పలుమార్లు కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలన్నారు.






ఈద్గా మసీద్‌లో ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ఇమామ్ నజీర్ అహ్మద్, ప్రార్థనల్లో ముస్లిం సోదరులు, 39వ డివిజన్‌లోని షాదీఖానా ప్రాంగణంలో ప్రార్థనలు, స్వీట్లు పంపిణీ చేస్తున్న పైలెట్ సర్వీస్ స్టేషన్ ఉద్యోగులు

సర్వమత సౌభ్రాతృత్వానికి రంజాన్ ప్రతీక

మోతీ మసీద్ ఇమామ్ నజీర్ అహ్మద్ ● ఘనంగా రంజాన్ ప్రార్థనలు

చిట్టినగర్, ఏప్రిల్ 11: సర్వమత సౌభ్రాతృత్వానికి రంజాన్ ప్రతీక అని మోతీ మసీద్ ఇమామ్ నజీర్ అహ్మద్ అన్నారు. పవిత్ర ఖురాన్ అవతరించిన రంజాన్ నెల మానవులందరికీ మార్గదర్శకమన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం చిట్టినగర్ మోతీ మసీద్, అల్లీనగర్ మసీదుల్లో వేల సంఖ్యలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఇమామ్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ ఇస్లాం ధర్మం సర్వమత సౌభ్రాతృత్వాన్ని, శాంతిని ప్రబోధిస్తోందన్నారు. ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరు తోడ్పడాలన్నారు. ఇస్లాం ప్రబోధాలు సర్వమానవాళికీ మార్గదర్శకమన్నారు. అనంతరం ఒకర్నొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వన్‌టౌన్: ఈద్-ఉల్-ఫితర్‌ను పురస్కరించుకుని గురువారం పశ్చిమ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో ముస్లిం సోదరులు నమాజ్ నిర్వహించారు. ముస్లిం పెద్దలు, గురువులు పలువురు పాల్గొన్నారు. గాంధీజీ మహిళా కళాశాల ఆవరణలో రంజాన్ సందర్భంగా జరిగిన ప్రార్థన కార్యక్రమంలో పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

● పశ్చిమ నియోజకవర్గంలోని 54వ డివిజన్ షాహీ మసీద్‌లో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్‌ను నిర్వహించారు. పరస్పరం శుభాకాంక్షలు అందజేసుకున్నారు. అల్లాహ్ దీవెనలు అందరికీ కలగాలంటూ కోరుకున్నారు. మసీద్ పెద్దలు సందేశాలను ఇచ్చారు.

● 39వ డివిజన్‌లోని మదీనా మసీద్‌లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీద్ కమిటీ ప్రెసిడెంట్ షేక్ మౌలాలి, సెక్రటరీ ఎండీ హుస్సేన్, వైస్ ప్రెసిడెంట్ గాలి షాహిద్, కమిటీ సభ్యులు షేక్ సుభాని, షేక్ వసీమ్, షేక్ బాషా, షేక్ బషీర్‌ల ఆధ్వర్యంలో మైనార్టీ నాయకులు, ముస్లిం సోదరులు అందరూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మైనార్టీల ఐక్యతను గురించి పేర్కొన్నారు.

భవానీపురం: 41వ డివిజన్‌లోని హజ్రత్ సయ్యద్ గాలిబ్ షహీద్ దర్గాలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా కమిటీ అధ్యక్షుడు ముస్తాక్ అహ్మద్, కార్యవర్గ సభ్యులు రెహమాన్, ఇషాక్, సత్తార్ ఈద్ ముబారక్ తెలిపారు. రజా మసీదులో జరిగిన ప్రార్థనల్లో కార్పొరేటర్ మహ్మద్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

లబ్బీపేట: రంజాన్ పండుగ వేడుకలను బందర్ రోడ్డులోని పైలెట్ సర్వీస్ స్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జిల్లా సేల్స్ ఆఫీసర్ కె.వరప్రసాద్ వినియోగదారులకు, ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఖర్జూరం, స్వీట్లు పంపిణీ చేశారు.

సర్వీస్ స్టేషన్ అధిపతి మామిడి వీర వెంకట సత్యనారాయణ, నందకిషోర్, మేనేజర్ వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న గద్దె రామ్మోహన్

రంజాన్ ప్రార్థనల్లో గద్దె

లబ్బీపేట: లబ్బీపేటలోని లబాబీన్ మసీదులో జరిగిన రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లబ్బీపేటలోని ముస్లిం పెద్ద, ప్రముఖ పారిశ్రామికవేత్త బుల్‌డోజర్ సలామ్‌ను కలిసి మద్దతు కోరారు. స్పందించిన ఆయన మద్దతు తెలిపారు.

పటమట: పప్పుల మిల్లు సెంటర్, అశోక్‌నగర్‌లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రంజాన్ నమాజ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.



తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో



బుద్దా వెంకన్న కార్యాలయంలో



18వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో

సామాజిక మార్పునకు జ్యోతిబా పూలే ఆద్యుడు

వన్‌టౌన్, ఏప్రిల్ 11: సామాజిక మార్పునకు మహాత్మా జ్యోతిరావు పూలే ఆద్యుడని సీపీఐ నాయకులు కొనియాడారు. పూలే 196వ జయంతిని పురస్కరించుకుని గురువారం తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రం వద్ద ఉన్న పూలే విగ్రహానికి సీపీఐ నాయకులు నివాళులు అర్పించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జెల్లి విల్సన్, సీపీఐ జిల్లా అధ్యక్షుడు దోనేపూడి శంకర్, సంగుల పేరయ్య, బుట్టి రాయప్ప, ప్రత్తిపాటి రాజు, కాళ్ల ప్రకాశరావు, రాహేల్‌బాబు, నివాళులర్పించారు. దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ దేశంలో సామాజిక మార్పును తీసుకొచ్చిన మహనీయుడు పూలే అని కొనియాడారు.

బుద్దా వెంకన్న కార్యాలయంలో ...

పశ్చిమ నియోజకవర్గంలోని బుద్దా వెంకన్న కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తొలుత పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిబా పూలే మహిళల చదువుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు బడుగు, బలహీన వర్గాల వారికి ఆశాజ్యోతిగా నిలిచారని కొనియాడారు. కామాదేవరాజ్, శిరంశెట్టి నాగేంద్ర, పల్లంటి గంగాధర్, నందం భవాని ప్రసాద్, పేరం సత్యనారాయణ, కొట్టేటి సరిత, మట్టి శ్రీలక్ష్మి ఇంకా పలువురు పాల్గొన్నారు. **అజిత్‌సింగ్‌నగర్:** అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బొండా ఉమామహేశ్వరరావు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు ఎరుబోతు రమణారావు, పరుచూరి ప్రసాద్, దాసరి కనకారావు, నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణమోహన్, బెజవాడ తిరుపతి పాల్గొన్నారు. **పాత రాజరాజేశ్వరిపేట:** నూతన సమాజానికి బాటలు వేసిన జ్యోతిరావు పూలే మహనీయుడని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. అయోధ్యనగర్ వద్ద ఉన్న నాయీబ్రాహ్మణ వృత్తి విద్యా శిక్షణాలయంలో జరిగిన కార్యక్రమంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి జల్లి విల్సన్ పూలమాల వేసి నివాళులర్పించారు. **రాణిగారితోట:** రాణిగారితోట 18వ డివిజన్‌లో టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. డివిజన్ అధ్యక్షులు వేములు దుర్గారావు, పీరుబాబు, ప్రసాద్, శ్రీను, కాశి, వెంకటేశ్వరరెడ్డి, మర్రి వెంకటరమణ, దుర్గ పాల్గొన్నారు. **భవానీపురం:** 43వ డివిజన్ హెచ్‌బీ కాలనీ ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. యశోధ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

32వ డివిజన్‌లో బొండా ఎన్నికల ప్రచారం

సత్యనారాయణపురం, ఏప్రిల్ 11 : టీడీపీకి సంపద సృష్టించి అభివృద్ధి చేయడం తెలుసు అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 32వ డివిజన్ లోటస్ ల్యాండ్ మార్క్‌లో ఆ పార్టీ నేతలు గురువారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను స్థానికులకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు.

స్వర్ణాంధ్రప్రదేశ్ చేయగల సత్తా చంద్రబాబుకే ఉంది

● కేశినేని జానకీ లక్ష్మి



స్థానికులకు కరపత్రాలను అందజేస్తున్న కేశినేని జానకీ లక్ష్మి

సత్యనారాయణపురం, ఏప్రిల్ 11 : సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో పతనమైన ఆర్థికాభివృద్ధితో పాటు, రాష్ట్రాభివృద్ధిని పునరుద్ధరించి రాష్ట్రాన్ని తిరిగి స్వర్ణాంధ్రప్రదేశ్ చేయగల సత్తా, సామర్థ్యం చంద్రబాబు నాయుడుకే ఉందని విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని చిన్ని భార్య కేశినేని జానకీ లక్ష్మి అన్నారు. 33వ డివిజన్ సత్యనారాయణపురంలో గురువారం టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేశినేని జానకీ లక్ష్మి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి టీడీపీని గెలిపించాలని కోరారు. బొండా సుజాత, గార్లపాటి విజయ్‌కుమార్, పాల్గొన్నారు.

సిక్కుల వైశాఖీ వేడుకలను పురస్కరించుకుని
టర్బన్ ఆప్



తలపాగా ధరించిన సందర్శకులతో సిక్కు సంస్థల ప్రతినిధులు

లబ్బీపేట, ఏప్రిల్ 11: సిక్కుల వైశాఖీ వేడుకలను పురస్కరించుకుని టర్బన్ ఆప్ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ సిక్స్ సంస్థ రాష్ట్ర ఇన్‌చార్జ్ కరమ్ కౌర్ తెలిపారు. బందర్ రోడ్డులోని ఒక షాపింగ్ మాల్ వద్ద గురువారం సిక్స్, గురు గోవింద్ సింగ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో టర్బన్ ఆప్ కార్యక్రమం జరిగింది. మాల్‌కు వచ్చిన సందర్శకులకు సిక్కుల మత ఆచారమైన తలపాగాలను కట్టి వారి మత ఆచారాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా కరమా కౌర్, గురు గోవింద్ సింగ్ ఫౌండేషన్ కార్యదర్శి హర విందర్ సింగ్‌లు మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఉగాది పర్వదినాన్ని నూతన సంవత్సరంగా ఎలా జరుపుకుంటారో, అదే విధంగా సిక్కులు వైశాఖీ పండుగను ఎంతో ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. సిక్కుల ఆచారమైన తలపాగా విశిష్టతను ప్రజలకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని, ప్రజలు ఎంతో సంతోషంగా తలపాగాన్ని కట్టించుకున్నారని తెలిపారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు కుల్దీప్ కౌర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థను బలోపేతం చేస్తాం: గద్దె అనురాధ

పటమట, ఏప్రిల్ 11 : టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ల వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు వారికి గౌరవ ప్రదమైన జీవనం కల్పిస్తామని, చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత వారికి నెలకు రూ.10వేలు జీతం ఇస్తారని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. 12వ డివిజన్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ ఆమె బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. పొట్లూరి సాయిబాబు, ఎస్.బుజ్జి, ఎం.నీరజ, ఎం.చిన్నితల్లి, సీహెచ్. మహేశ్, ఎం.సత్యనారాయణ, ఏ. కిషోర్, కె.రవి, టి. శేషుబాబు, విజయలక్ష్మిలు పాల్గొన్నారు.

9వ డివిజన్‌లో..

9వ డివిజన్ పటమటలంక మసీదు రోడ్డు చివర నుంచి జనసేన, బీజేపీ బలపర్చిన టీడీపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌ల విజయాన్ని కాంక్షిస్తూ గద్దె అనురాధ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో టీడీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి తప్ప వైసీపీ చేసిందేమీ లేదన్నారు. చెన్నుపాటి గాంధీ, కాంతి శ్రీ, వై. దేవేంద్ర, ఈ. ప్రదీప్, సీహెచ్. లక్ష్మీ పాల్గొన్నారు.



9వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో గద్దె అనురాధ

వైసీపీకి ఓటు వేస్తే అభివృద్ధిని వద్దనుకున్నట్టే ..

మొగల్రాజపురం: రాబోయే ఎన్నికల్లో వైసీపీకి ఓటేస్తే అభివృద్ధి వద్దనుకున్నట్టేనని, ప్రజలు మంచి చెడు ఆలోచించి టీడీపీకి ఓటేయాలని తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె క్రాంతి అన్నారు. 8వ డివిజన్‌లో గురువారం జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో జనసేన, బీజేపీ బలపరచిన ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను, ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నిని సైకిల్ గుర్తుమీద ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, జాస్తి లక్ష్మిపతి, మల్లెల రామకృష్ణ, కొత్తపల్లి రమేష్, వీరారెడ్డి పాల్గొన్నారు.

3వ డివిజన్‌లో...

భారతీనగర్: మూడవ డివిజన్ ఆయూష్ హాస్పిటల్ సమీపంలోని భాయన బాజ్జీ రోడ్డులోని సాయి క్లాసిక్ అపార్ట్‌మెంట్ వద్ద నుంచి గురువారం సాయంత్రం గద్దె క్రాంతికుమార్, గద్దె హేమాన్షులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జనసేన, బీజేపీ బలపరిచిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను, పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రామలింగేశ్వరనగర్: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు న్యూ బ్రిడ్జి సెక్షన్, న్యూ బ్రిడ్జి విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ పోలీస్ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ తెలిపారు. సత్యనారాయణ నగర్, పోలీస్ కాలనీ తదితర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.



ఈ ప్రచారాన్ని.. అరికట్టాల్సిందే!

తెలుగు సినీ పరిశ్రమలోని అగ్రనిర్మాతల్లో దిల్‌రాజు ఒకరు. ఇటీవల ఆయన నిర్మించిన 'ఫ్యామిలీ స్టార్' సినిమా విడుదలయింది. చాలా ప్రాంతాల్లో సినిమా చూసి ఎంతో మంది బాగుందన్నారు. కానీ సినిమా విడుదలకు ముందే కొన్ని యూట్యూబ్ రివ్యూలు వచ్చేశాయి. సినిమా బాగోలేదనే ప్రచారం విస్తృతంగా జరిగింది. ఈ కారణంగా సినిమా ఓపెనింగ్స్ దెబ్బ తిన్నాయి. దీంతో దిల్‌రాజే స్వయంగా మైక్ పట్టుకొని- 'పబ్లిక్ ఓపినియన్' అడిగి సోషల్ మీడియాలో పెట్టారు. తమను కావాలని టార్గెట్ చేశారని- ఫ్యామిలీ స్టార్ హీరో విజయ్ దేవరకొండ మేనేజర్ అనురాగ్ పర్వతనేని పోలీసు కేసు కూడా పెట్టారు. నిజంగా ఒక సినిమా జయాపజయాలను ప్రభావితం చేసే శక్తి సోషల్ మీడియాకు ఉందా? ఎవరైనా కావాలని సోషల్ మీడియాలో ఇలాంటి పనులు చేస్తే ఏం చేయాలి? ఈ అంశాలపైనే ప్రస్తుతం ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది.

సినిమా విడుదలకు ముందు ఫ్యాన్స్ వార్స్ జరగటం మామూలే! కొన్ని సెటైర్లు.. కొన్ని నెగెటివ్ కామెంట్స్.. రికార్డులు తవ్వితీయ్యడాలు సోషల్ మీడియాలో జరుగుతూనే ఉంటాయి. కానీ ఈ మధ్యకాలంలో ఈ దాడులు మరింతగా పెరిగిపోయాయి. ఒకప్పుడు సినిమా విడుదలకు ముందు ఇంత హడావిడి ఉండేది కాదు. పైగా పత్రికలు, ఛానల్స్, వెబ్‌సైట్స్ సంఖ్య చాలా పరిమితంగానే ఉండేది. వాటిలో వచ్చే రివ్యూలు చాలా పాజిటివ్‌గానే ఉండేవి. సోషల్ మీడియా విస్తృతి బాగా పెరగటం.. అందరికీ ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి రావటంతో పరిస్థితులు మారాయి. "ఫ్యాన్స్ మధ్య వార్స్‌కు మేము వ్యతిరేకం కాదు. సరదాగా వచ్చే ట్రోల్స్‌కు కూడా మేము వ్యతిరేకం కాదు. కానీ సినిమా విడుదల కాకముందే- సినిమా పోస్టర్ ముందు నిలబడి- సినిమా బాగోలేదని యూట్యూబ్ రివ్యూలు ఇవ్వటం ఇప్పటి దాకా జరగలేదు. అందుకే మేము వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను అప్రోచ్ అయ్యాం. దీనికి కారణమయిన వారిని శిక్షించమని కోరాం" అని విజయ్ దేవరకొండ మేనేజర్ అనురాగ్ పర్వతనేని పేర్కొన్నారు. ఇలా రివ్యూలు ఇచ్చిన వారిని, వారి ఛానల్స్‌ను గుర్తించటానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారని వెల్లడించారు.

ప్రభావితం చేస్తున్నారు..

సాధారణంగా మన కంటే అమెరికాలో షోలు ముందుగా వేస్తారు. దీని వల్ల అమెరికాలో సినిమా చూసిన వారు వెంటనే రివ్యూలు పోస్ట్ చేస్తుంటారు. . ఈ రివ్యూలతో పాటుగా- బుక్‌మై షో వంటివి కూడా ప్రేక్షకుల దగ్గర నుంచి రేటింగ్స్‌ను కలెక్ట్ చేస్తూ ఉంటాయి. ఈ రెండింటిని నచ్చినట్లు నియంత్రించగలిగితే- దాని ప్రభావం కలెక్షన్లపై పడుతుంది. ఉదాహరణకు అమెరికాలో షో పూర్తయ్యే సమయానికి - మన దేశంలో షోలు పడుతూ ఉంటాయి. సినిమా బాగోలేదని ట్విట్టర్‌లో నెగెటివ్ రివ్యూలు వరసగా రావటం మొదలైతే - వాటి ప్రభావం ప్రేక్షకులపై పడుతుంది. సినిమాకు వెళ్లాలనుకున్నవారు ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు. మన దేశంలో షోలు పూర్తయిన తర్వాత నెగెటివ్ రివ్యూలు రావటం మొదలుపెడితే- సినిమా ఫ్లాప్ అనే భావన బాగా పెరుగుతుంది. కొందరు- బుక్‌మై షో వంటి అప్లికేషన్స్‌లో టిక్కెట్లు కొనుక్కోవాలనుకుంటారు. అలాంటి అప్లికేషన్లలో కూడా రేటింగ్స్ తక్కువ ఉంటే సినిమాకు వెళ్లరు. "గతంలో 'గుంటూరు కారం' విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు మా 'ఫ్యామిలీస్టార్' విషయంలో కూడా అదే జరిగింది. కొందరు బోట్స్ ద్వారా తక్కువ రేటింగ్స్ ఇప్పిస్తున్నారు. ఉదాహరణకు ఒకే సారి పది వేల నెగెటివ్ రివ్యూలు వస్తే- సినిమా రేటింగే పడిపోతుంది" అని చెప్పారు అనురాగ్. ఈ విషయంపై తాము బుక్ మైషోకు ఒక ఉత్తరం రాశామని.. సమాధానం కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు.

అసలు కారణాలేమిటి?

ప్రస్తుతం తెలుగు సినిమాలకు విదేశాలలో మార్కెట్ బాగా పెరిగింది. అక్కడ మంచి కలెక్షన్లు వస్తే- సినిమాకు ఇబ్బంది ఉండదు. కానీ అక్కడ కలెక్షన్లలో కోత పడితే- నిర్మాతకు నష్టం వస్తుంది. దీనిని గమనించి కొందరు కావాలనే నిర్మాతలను ఇబ్బంది పెడుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. సినిమా బావుండనప్పుడు- ఎంత గొప్ప రివ్యూ రాసినా ప్రేక్షకులు వెళ్లరు. కానీ సినిమా బావున్నా- బాగోలేదని రివ్యూలు వస్తే- ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు. ఈ సున్నితమైన అంశాన్ని కొంతమంది తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. "సినిమా విడుదల సమయంలో నిర్మాత చాలా ఒత్తిడిలో ఉంటాడు. దాన్ని కొందరు తమకు అనుకూలంగా మలుచుకుంటారు అని సినీ పరిశ్రమతో అనుబంధం ఉన్న ఒక నిర్మాత విశ్లేషించారు. ఒక ప్రముఖ వెబ్‌సైట్- అట్టర్ ఫ్లాప్ అయిన యాత్ర అనే సినిమాకు 4 రేటింగ్‌ను.. అదే సమయంలో విడుదలయిన గుంటూరు కారం సినిమాకు అతి తక్కువ రేటింగ్‌ను ఇచ్చింది. మనవాడైతే ఒక రేటింగ్.. కాకపోతే ఇంకో రేటింగ్.. ఇలాంటి సంఘటనలెన్నో" అంటారాయన.



> ఇదొక విష సంస్కృతి.. బావున్న సినిమాను కూడా బాగోలేదని ప్రచారం చేయటం.. కలెక్షన్లు రాకుండా అడ్డుకోవటం తగని పని. దీని వల్ల వ్యక్తుల కన్నా- సినీ పరిశ్రమకు ఎక్కువ నష్టం జరుగుతుంది. ఈ సమస్యను సృష్టిస్తున్నవారిని గుర్తించాలి. కఠినంగా శిక్షించాలి. ఈ సమస్యను అందరూ కలిసికట్టుగా ఎదుర్కొవాల్సిన అవసరం ఎంతైనా ఉంది..
>
> \- దిల్ రాజు

పరిష్కారమేమిటి?

ఈ మధ్యకాలంలో ఈ తరహా సంఘటనలు పెరిగిపోతూ ఉండటంతో- ఛాంబర్ తరపున కొన్ని నియంత్రణ చర్యలు తీసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగా గతంలో పోలీసు డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఉన్నత అధికారులతో కూడా చర్చలు జరిపారు. "ఇది ఒక విష సంస్కృతికి దారి తీస్తోంది. దీని వల్ల మొత్తం పరిశ్రమే దెబ్బతింటోంది. ఈ సారి నాకు నష్టం జరగవచ్చు. కానీ ఇదే కొనసాగితే ఇతరులకు కూడా నష్టం జరుగుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని అందరూ సంఘటితంగా ఉండాల్సిన అవసరముంది" అని దిల్‌రాజు తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

హీరో రామ్ చరణ్‌కు 'గౌరవ డాక్టరేట్'



చెన్నై, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): హీరో రామ్‌చరణ్‌కు చెన్నైలోని వేల్స్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనుంది. చిత్రపరిశ్రమతో పాటు సమాజానికి ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నట్టు వేల్స్ విశ్వవిద్యాలయం గురువారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 13 సాయంత్రం 4 గంటలకు చెన్నై పల్లావరంలోని వేల్స్ క్యాంపస్‌లో జరిగే యూనివర్శిటీ 14వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారామ్ పాల్గొని ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తారు. ఈ స్నాతకోత్సవంలో రామ్ చరణ్‌తో పాటు చంద్రయాన్-3 ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పి.వీరముత్తువేల్, త్రివిట్రన్ హెల్త్‌కేర్ మేనేజింగ్ డైరెక్టర్, ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ జీఎస్‌కే వేలు, టేబుల్ టెన్నిస్ ప్లేయర్ పద్మశ్రీ శరత్ కమల్ అచంటలకు కూడా ఈ గౌరవ డాక్టరేట్‌లను ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి వేల్స్ యూనివర్శిటీ చాన్సెలర్ డాక్టర్ ఐసరి కె.గణేశ్ అధ్యక్షత వహించనున్నారు.

వార్‌కు రెడీ



జూనియర్ ఎన్టీఆర్ 'వార్ 2' సెట్స్‌లోకి అడుగుపెట్టారు. గురువారం ముంబైలో ఆయన తన పాత్రకు సంబంధించిన షూటింగ్ మొదలుపెట్టారు. దీనికి సంబంధించిన వీడియో, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ఇందులో ఎన్టీఆర్ గూఢచారి పాత్రలో కనిపించనున్నారు. హీరోగా ఆయనకు ఇది తొలి హిందీ చిత్రం. వచ్చే ఏడాది ఆగస్టు 15న 'వార్ 2' ప్రేక్షకుల ముందుకు రానుంది. 'వార్'కు సీక్వెల్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో హృతిక్‌రోషన్ మరో హీరోగా నటిస్తున్నారు. కియారా అద్వానీ కథానాయిక. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది.

స్వచ్ఛమైన తెలుగింటి టైటిల్



రామ్‌కిరణ్, మేఘా ఆకాశ్ జంటగా నటిస్తున్న చిత్రం 'సఃకుటుంబానాం'. ఉదయ్ శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. రాజేంద్రప్రసాద్, బ్రహ్మానందం, సత్య, శుభలేఖ సుధాకర్, రాజశ్రీ నాయర్, రచ్చ రవి, గిరిధర్, తాగుబోతు రమేష్, బధ్రం కీలక పాత్రలు పోషిస్తున్నారు. హెచ్ మహదేవ గౌడ్ నిర్మిస్తున్నారు. గురువారం ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను, మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మహదేవ గౌడ్ మాట్లాడుతూ "అచ్చమైన తెలుగింటి టైటిల్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నందుకు చాలా మంది మెచ్చుకున్నారు. ఈ సినిమా మంచి కుటుంబ చిత్రంగా ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతుంది" అని అన్నారు. డైరెక్టర్ ఉదయ్ శర్మ మాట్లాడుతూ "రేషన్ కార్డులాగా ఉన్న ఫస్ట్ లుక్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాకి మణిశర్మ మ్యూజిక్ చాలా పెద్ద అసెట్. సినిమాలో చాలా మంచి కంటెంట్ ఉంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: శశాంక్ మలి, డీఓపీ: మధు దాసరి, సంగీతం: మణి శర్మ.

బ్యాంక్ క్యాషియర్ కహానీ



వివిధ భాషల్లో విభిన్న చిత్రాలు చేస్తూ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు దుల్కర్ సల్మాన్ తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను రంజాన్ సందర్భంగా విడుదల చేశారు. ఇందులో బ్యాంక్ క్యాషియర్‌గా ఇంతకుమునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో దుల్కర్ కనిపించారు. ఒక సాధారణ వ్యక్తి అసాదారణ స్థాయికి ఎలా చేరుకున్నాడు అనే ఆసక్తిని రేకెత్తిస్తూ రూపొందించిన టీజర్ ఆకట్టుకుంటోంది. టీజర్‌లో దుల్కర్ పలికిన సంభాషణలు, ఆసక్తిని పెంచుతున్నాయి. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: నిమిష్ రవి, ఎడిటింగ్: నవీన్ నూలి,

విశ్వం.. విధ్వంసం



కల్యాణ మండపంలో పెళ్లి జరుగుతోంది. పురోహితుడు పెళ్లి మంత్రాలు చదువుతున్నాడు. వాద్య బృందం రకరకాల వాయిద్యాలతో సందడి చేస్తోంది. మరో పక్క విందు కోసం రుచికరమైన ఆహార పదార్థాలను చెఫ్‌లు సిద్ధం చేస్తున్నారు. ఇంతలో గిటార్ బ్యాగ్‌ని భుజాన వేసుకుని అక్కడికి వచ్చాడు. ఒక చోట ఆగి ఆ బ్యాగ్ ఓపెన్ చేశాడు. అందులోంచి గిటార్‌ను కాదు.. మెషిన్ గన్‌ను తీసుకుని వధువరులతో సహా అందరినీ కాల్చడం ప్రారంభించాడు. వాళ్లంతా నేలకు ఒరిగిన తర్వాత అక్కడి ఫుడ్‌ని ఆస్వాదిస్తూ 'దానే దానే పే లిఖా .. ఖానే వాలే కా నామ్.. ఇస్పే లిఖా మేరా నామ్' అన్నాడు. ఎవరతను? పెళ్లిమంటపంలో ఎందుకీ విధ్వంసం సృష్టించాడు? ఈ ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే. గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రానికి 'విశ్వం' అని పేరు పెట్టి విడుదల చేసిన ఫస్ట్ స్ట్రైక్ వీడియోలో మాటర్ ఇది. ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే: గోపీమోహన్, సంగీతం: చైతన్ భరద్వాజ్, ఛాయాగ్రహణం: గుహన్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాతలు: టీజీ విశ్వప్రసాద్, వేణు దోనేపూడి.

దాసరి పురస్కారాలు



ప్రముఖ దర్శకుడు దాసరి నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన పేరిట పురస్కారాలు ఇవ్వడానికి దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, రేలంగి నరసింహారావు, నిర్మాత సి. కల్యాణ్, బీఎస్ఎన్ సూర్యనారాయణల ఆధ్వర్యంలో ఓ కమిటీ ఏర్పడింది. మే 5న శిల్ప కళావేదికలో దాసరి నారాయణరావు జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది. 'దర్శకరత్న డి.ఎన్.ఆర్ ఫిల్మ్ అవార్డ్స్' పేరుతో పురస్కారాలు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. పలు విభాగాల్లో విశేష కృషి చేసిన సినీ ప్రముఖులను ఎంపిక చేసి పురస్కారాలు అందిస్తామని తమ్మారెడ్డి భరద్వాజ చెప్పారు.

పాటలు ప్రత్యేకాకర్షణగా...



మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఆదిపర్వం'. సంజీవ్ కుమార్ మేగోటి దర్శకుడు. ఎం.ఎస్.కె నిర్మాత. ఈ చిత్రం ఆడియో విడుదల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. సంగీత దర్శకులు ఆర్ పీ పట్నాయక్, శ్రీలేఖ, రఘు కుంచె, ఘంటాడి కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక పీరియాడిక్ డ్రామా. అమ్మవారి భక్తురాలిని దుష్టశక్తుల బారి నుంచి కాపాడే క్షేత్రపాలకుడి కథ. ఐదు భాషల్లో రూపొందుతోంది' అన్నారు. పాటలు చాలా బావున్నాయి, ఈ సినిమా విజయంలో పాటలు ముఖ్య పాత్ర పోషిస్తాయి అని అతిథులు పేర్కొన్నారు. శివ కంఠంనేని, ఆదిత్య ఓం, ఎస్తర్ నోరానా కీలకపాత్రలు పోషిస్తున్నారు.

జనతా బార్‌లో కుస్తీ పోటీలు



రాయ్ లక్ష్మి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'జనతా బార్'. రమణ మొగిలి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు శక్తికపూర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని మే లో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'కుస్తీ పోటీల నేపథ్యంలో నడిచే కథ ఇది. నేటి సమాజంలో మహిళ ప్రాధాన్యాన్ని చెప్పే సినిమా ఇది.' అని చెప్పారు.

'బార్ గర్ల్‌గా ఉన్న యువతి మహిళలు గర్వపడే స్థాయికి ఎలా చేరిందన్న కథతో ఈ సినిమా ఉంటుంది. ఈ చిత్రం నేను చేయకపోతే ఓ మంచి అవకాశం కోల్పోయేదాన్ని' అన్నారు లక్ష్మీరాయ్. 'యానిమల్' తర్వాత మళ్లీ ఓ మంచి పాత్రను ఈ సినిమాలో చేసే అవకాశం లభించిందని శక్తి కపూర్ చెప్పారు. ఈ చిత్రానికి సమర్పణ: అశ్వద్ నారాయణ.

గీతాసారం

మనో నియంత్రణ



అర్జునుడు మనసును గాలితో పోలుస్తూ.... దాన్ని ఎలా అదుపులో పెట్టుకోవాలని ప్రశ్నిస్తాడు. అది కష్టమైనదని శ్రీకృష్ణుడు చెబుతూ... వైరాగ్యాన్ని అవలంబించడం ద్వారా దాన్ని సాధించగలమని బోధిస్తాడు. మనలోని జ్ఞాపకశక్తిని ఉపయోగించి... ఇంద్రియాలు అందించే సమాచారంలో ఏది సురక్షితమైనదో, ఏది సురక్షితం కాదో నిర్ధారించేలా మన మనసు శిక్షణ పొంది ఉంటుంది. మానవ పరిణామక్రమంలో ఆ సామర్థ్యమే మనం జీవించడానికి, అభివృద్ధి చెందడానికి ఉపయోగపడింది. మనసుకు ఉన్న ఇదే సామర్థ్యాన్ని అంతరాత్మను చేరడానికి కూడా ఉపయోగించవచ్చు. దాన్నే 'జాగరూకత' అని కూడా అంటారు. మనం ఈ సామర్థ్యం ద్వారా మన నిర్ణయాల నాణ్యతను మెరుగుపరుచుకోవచ్చు. అందుకోసం కొత్త ఆలోచనలను మనసుకు అందించాలి. మానవుల్లో ఇది సహజంగా రాదు. కాబట్టి ఆచరణ ద్వారా ఆ సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని శ్రీకృష్ణుడు సూచిస్తున్నాడు. ఇది మెదడులో కొత్త శక్తిని నింపడం లాంటిది.

రాగాన్ని అర్థం చేసుకోవడం ద్వారా వైరాగ్యాన్ని అర్థం చేసుకోవడం చాలా సులభం. 'రాగం' అంటే భౌతిక ప్రపంచంలో అందం, ఆస్తులు, అభివృద్ధి లాంటి ఆనందాల కోసం విస్తృతంగా పాకులాడడం. ద్వంద్వాల సూత్రం ప్రకారం ప్రతి రాగ భావం/ భావన వైరాగ్యంతో ముగుస్తుంది. కానీ మన దృష్టి ఎప్పుడూ రాగం పైనే ఉంటుంది. అందుకే వైరాగ్యాన్ని విస్మరిస్తాం.

స్టోయిసిజం లాంటి కొన్ని తత్త్వాలు వైరాగ్యానికి శిఖరం లాంటి మరణం ప్రయోజనాన్ని సమర్థిస్తాయి. దీన్ని 'మెమెంటో మోరీ' అంటారు. అంటే మరణాన్ని మళ్ళీ మళ్ళీ దర్శించడం లేదా అనుభూతి చెందడం. ఈ పద్ధతిలో వారు చావుకి గుర్తుగా (జ్ఞాపకార్థంగా) పని చేసే చోట లేదా ఇంట్లో ప్రముఖ స్థానంలో దేన్నైనా ఉంచి, దాన్ని మళ్ళీ మళ్ళీ చూస్తూ మృత్యువు మీద ధ్యాస నిలబడేలా చేస్తారు. భారతీయ వేదాంతం దీన్నే 'శ్మశాన వైరాగ్యం' అంటుంది. మనం వైరాగ్యాన్ని సాధన చేయడం మొదలుపెడితే... అది మనసును స్థిరపడేలా చేస్తుందని శ్రీకృష్ణుడు చెప్పాడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్

సందేశం

షవ్వాల్ ఉపవాసాలు



పవిత్రమైన రంజాన్ ఉపవాస దీక్షలు, ఈద్-ఉల్-ఫితర్ పండుగ ముగిశాయి. ఇస్లాం క్యాలెండర్‌లో పదో మాసమైన షవ్వాల్ కొనసాగుతోంది. రంజాన్ మాసంలో చేసినట్టే షవ్వాల్ నెలలో కూడా ఆరు రోజుల పాటు ఉపవాస దీక్ష పాటించే సంప్రదాయం ఉంది. దీనివల్ల ఉపవాస ఫలితం పదింతలవుతుందన్నది పెద్దల మాట. అంటే రంజాన్ మాసంలో 30 రోజులు చేసే ఉపవాసం 300 రోజులకు... అంటే 10 నెలలకు సమానం. షవ్వాల్ మాసంలో కొనసాగించే ఆరు రోజుల ఉపవాసం 60 రోజులకు, అంటే రెండు నెలలకు సమానం. ఈ 36 రోజుల ఉపవాసాన్ని శ్రద్ధ, నిష్ఠలతో ఆచరిస్తే... 12 నెలలు... అంటే ఏడాది మొత్తం ఉపవాసం చేసిన ఫలితం లభిస్తుందని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ పేర్కొన్నారు. రంజాన్ మాసంలో చేసిన ఉపవాసాల్లో ఏవైనా పొరపాట్లు జరిగితే... షవ్వాల్ మాసంలో చేసే ఆరు ఉపవాసాల ద్వారా అల్లాహ్ ఆ పొరపాట్లను మన్నిస్తాడనీ, నమాజుల్లో ఏర్పడిన లోపాలను భర్తీ చేస్తాడనీ ఆయన స్పష్టం చేశారు. రంజాన్ ఉపవాసాలను ఎలాంటి ఆటంకం లేకుండా చేయగలిగే శక్తినీ, భక్తినీ ప్రసాదించినందుకు అల్లాహ్‌కు ధన్యవాదాలు తెలపడం దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. అల్లాహ్‌కు నిజమైన కృతజ్ఞతాపూర్వక విధేయుడిగా తనను తాను ప్రకటించుకొనే అవకాశం. ఆయన పట్ల విశ్వాసులకు ఉన్న చిత్తశుద్ధికీ, స్వీయ సమర్పణకూ ఒక సంకేతం.

అయితే షవ్వాల్‌లో ఆరు రోజుల ఉపవాసం తప్పనిసరి కాదు. సహేతుకమైన, న్యాయబద్ధమైన కారణం ఉన్నప్పుడు... దాని నుంచి మినహాయింపు ఉంటుంది. షవ్వాల్ ఉపవాసాలను ఈద్ పండుగ మరునాటి నుంచో, ఆ తరువాత రోజు నుంచో ప్రారంభించడం ఉత్తమం. వరుసగా ఆరు రోజులు పాటిస్తే మంచిది. అలా వీలుకానప్పుడు విడివిడి రోజులలో... అంటే విరామం ఇచ్చి కూడా, షవ్వాల్ నెల ముగిసేలోగా చేయవచ్చు. అయితే ఆలస్యం చేసేకొద్దీ ఏవైనా ఆటంకాలు ఎదురు కావచ్చు. కాబట్టి మంచి పనులను వీలైనంత త్వరగా, క్రమబద్ధంగా, నిరంతరాయంగా చేయాలి. షవ్వాల్ మాసంలో ఆరు ఉపవాసాలను ఎవరు పాటిస్తారో... వారు ఏడాదంతా ఉపవాసంలో ఉన్నట్టేననీ, అప్పుడే తల్లి గర్భం నుంచి బయటకు వచ్చినంత పవిత్రులవుతారనీ దైవప్రవక్త మహమ్మద్ పేర్కొన్నారు.

మహమ్మద్ వహీదుద్దీన్

దైవమార్గం

పునరుత్థానం తరువాత...



దైవ కుమారుడైన క్రీస్తు తన తండ్రి ఆదేశం మేరకు ఈ లోకానికి వచ్చాడు. దివ్య సందేశం ఇచ్చాడు. ప్రజలను చైతన్యపరిచాడు. అద్భుతాలు చేశాడు. మానవాళి కోసం రక్తం చిందించి... శిలువపై మరణించాడు. మూడో రోజున... ఆయన సజీవుడై తిరిగి వచ్చాడు. నలభై రోజుల పాటు ఈ భూమి మీద సంచరించాడు. ఆ రోజుల్లో ఆయన ఏం చేశాడు, ఎవరికి కనిపించాడు? బైబిల్‌లోని వివిధ అధ్యాయాల్లో ఆ వివరాలు కనిపిస్తాయి.

ఏసు మరణించిన తరువాత... ఆయన శిష్యులందరూ చెల్లాచెదురైపోయారు. వారిని ఆయన సమైక్యపరిచాడు. ఒక చోటుకు చేర్చాడు. వారికి నైతిక శక్తిని ప్రసాదించాడు. తన సందేశాన్ని లోకానికి అందించమని ఆదేశించాడు. ఎలా బోధించాలో నేర్పించాడు. పరిచర్యలో కొత్త మెలకువలను చెప్పాడు. వారిలో కొత్త ఉత్తేజాన్ని నింపాడు.

పునరుత్థానం అనంతరం ఏసు క్రీస్తు పలుసార్లు దర్శనమిచ్చాడు. వాటిలో ప్రధానమైనవి:

- మేరీ మగ్దలేనాకు... తన సమాధి దగ్గరే తోటమాలి రూపంలో ప్రభువు కనిపించాడు. ఈ వార్త అందరికీ తెలియజేయాలని చెప్పాడు. రెండోసారి కూడా తన సమాధి దగ్గరే మరో మహిళకు... తను మరణించలేదనడానికి రుజువుగా దర్శనమిచ్చాడు.
- ఎమ్మావూస్‌కు వెళ్ళే మార్గంలో తన శిష్యులు ఇద్దరికి కనిపించి, తన పట్ల వారిలో ఉన్న అస్పష్టతను తొలగించాడు.
- తమ గురువుకే ఇలా జరిగితే తమ పరిస్థితి ఏమిటనీ, ఎటువంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయోననీ భయపడుతూ దాక్కున్న పది మంది శిష్యులకు ఆయన దర్శనం ఇచ్చాడు.
- ఆ తరువాత మరో పదకొండు మంది శిష్యులకు కనిపించాడు. తన గాయం లోపల వేలు పెట్టి పరీక్షించిన... అవిశ్వాసి అయిన తోమాస్‌లో అపనమ్మకాన్ని పోగొట్టాడు.
- ఆయన (క్రీస్తు) ఎవరో నాకు తెలియదని మూడుసార్లు అసత్యం ఆడిన.... మిగిలిన ముగ్గురు శిష్యులతో పాటు పేతురుకు కనిపించాడు.
- అలాగే పదకొండు మంది శిష్యులకు ఆయన దర్శనమిచ్చాడు. వారు గెలెలీ తీరంలోని ఒక కొండపైకి చేరుకున్నారు. అక్కడ వారికి అన్ని శక్తి సామర్థ్యాలనూ ఆయన సమకూర్చాడు. తన శిష్యరికం కొనసాగించడానికి, సువార్త విస్తరణకు ఒక వ్యవస్థను స్థాపించాడు.
- తదనంతరం... గుమిగూడిన 500 మంది ప్రజానీకానికి కనిపించాడు. "కాలాలను, సమయాలను తండ్రి తన స్వాధీనంలో ఉంచుకున్నాడు. వాటిని తెలుసుకోవడం మీ పని కాదు. అయినప్పటికీ పరిశుద్ధాత్మ మీ చెంతకు వచ్చినప్పుడు మీరు శక్తిని పొందుతారు. యెరూషలేములోను, యూదయ, సమరయ దేశాల్లో, భూదిగంతాల వరకూ సత్యాన్ని వ్యాపింపజెయ్యండి" అంటూ తన సందేశాన్ని ఇచ్చాడు అందరూ చూస్తూ ఉండగానే... ఆయన ఆకాశం వైపు పయనం సాగించాడు. ఇదీ పునరుత్థానం అనంతరం క్రీస్తు సాగించిన నలభై రోజుల ప్రస్థానం.

డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు, 9866755024

పర్వదినం

ఆ మార్గం ఏ యుగానికైనా ఆదర్శమే...



17న శ్రీరామ నవమి

పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే... అన్నాడు 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు. సాధుస్వభావులను రక్షించడానికి, దుష్ట కార్యాలు చేసేవారిని శిక్షించడానికి, ధర్మాన్ని స్థాపించడానికి ప్రతి యుగంలోనూ అవతరిస్తానంటూ భగవంతుడు చేసిన వాగ్దానం ఇది. శ్రీకృష్ణావతారం కన్నా ముందు... ధర్మ సంస్థాపన కోసం ఆయన ఈ భూవి మీద శ్రీరాముడిగా మహా విష్ణువు అవతరించాడు. కుమారుడిగా, సోదరుడిగా, భర్తగా, తండ్రిగా, పాలకుడిగా... అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ ఆదర్శంగా నిలిచాడు. ఆయన పాలన... రామరాజ్యంగా ప్రజా హృదయాల్లో సుస్థిరంగా నిలవడానికి కారణం... ఆయనలో మూర్తీభవించిన అనేక సుగుణాలు, నాయకత్వ లక్షణాలు.

శ్రీరాముడు ఎల్లప్పుడూ విలువలకే కట్టుబడ్డాడు. నీతి, నిజాయితీ, సమగ్రతలను ఎన్నడూ విడనాడలేదు. మంథర మాటలతో తన పినతల్లి కైకేయి ప్రభావితం అయిందనీ, తనను అడవులకు పంపేలా తన తండ్రి దశరథుణ్ణి ఒప్పించిందనీ శ్రీరాముడికి తెలుసు. కానీ ఎవరినీ ఆయన నిందించలేదు. తండ్రి మాటను పాటించి పద్నాలుగేళ్ళు అరణ్యవాసం చేశాడు. రాకుమారుడైనప్పటికీ అరణ్యవాసంలో అత్యంత సాధారణమైన జీవితం గడిపాడు. కందమూలాలు తిన్నాడు. కటిక నేల మీద నిద్రించాడు.

నాయకుడనేవాడికి తన లక్ష్యం మీద చిత్తశుద్ధి, స్పష్టమైన దృక్పథం ఉండాలి. రావణుడు అపహరించిన సీతను వెనక్కి తెచ్చుకోవడం శ్రీరాముడి లక్ష్యం. దాన్ని సాధించడానికి ఆయనకు కచ్చితమైన ప్రణాళిక ఉంది. సీతాన్వేషణ కోసం మొదట ఒక బృందాన్ని పంపాడు. సీతమ్మ జాడ తెలుసుకున్న తరువాత... లంకపై దండెత్తడానికి సేతువును నిర్మింపజేశాడు. తన సోదరుడు లక్ష్మణుడికి, సుగ్రీవ, విభీషణ, అంగదులకు వారివారి సామర్థ్యానికి అనుగుణంగా బాధ్యతలు అప్పగించాడు. శత్రువుకు సోదరుడైనప్పటికీ విభీషణుడి సూచనలు తీసుకున్నాడు. రావణుడి బలాబలాల గురించి సమాచారం తెలుసుకున్నాడు. అదే సమయంలో రావణుడి శక్తి యుక్తులను రాముడు ఏనాడూ తక్కువగా అంచనా వేయలేదు.

ఎటువంటి పరిస్థితి ఎదురైనా... తన అనుచరులను శ్రీరాముడు ముందుండి నడిపించాడు. లంకను చేరడానికి సేతువును నిర్మించే సమయంలో... దారి ఇవ్వడానికి అంగీకరించని సముద్రుణ్ణి లొంగదీశాడు. అన్ని సమయాల్లో తన ముఖ్య అంతరంగికులకే కాదు, వానర వీరులందరికీ అందుబాటులో ఉన్నాడు తప్ప... విశ్రాంతి మందిరంలో ఉండి ఆదేశాలు ఇవ్వలేదు. రావణుడి సేన కన్నా వానర సేన తక్కువ స్థాయిదని ఎప్పుడూ ఆలోచించలేదు. తన సేనపై నమ్మకం ఉంచాడు. వారి ప్రోత్సహించాడు, వారిలో ప్రేరణ కలిగించాడు.

సీతను వెనక్కి తీసుకురాగలననే విషయంలో రాముడికి ఏనాడూ సందేహం లేదు. తన సామర్థ్యం మీద ఆయనకు నమ్మకం ఉంది. అదే సమయంలో... రాక్షస సేనపై గెలుపు కోసం వానర సేనను నడిపించగలననే విశ్వాసమూ ఉంది. ఏ దశలోనూ ఆయనలోని ఆత్మవిశ్వాసం చెదరలేదు.

సహకారం అనేది పరస్పరం ఉండాలనే సంగతి రాముడికి తెలుసు. వానరులను తన అంతరంగికులుగా ఆయన పరిగణించాడు. సుగ్రీవుడి కోరిక ప్రకారం వాలిని చంపిన తరువాతే... సీతాన్వేషణ కోసం వానరుల సాయం తీసుకున్నాడు. రావణుడితో విభేదించి వచ్చిన విభీషణుణ్ణి ఆదరించాడు. లంకకు రాజును చేస్తానని మాట ఇచ్చి, దాన్ని నిలబెట్టుకున్నాడు.

రాజ్యాన్ని వదిలి అడవికి వెళ్ళాల్సి రావడం, సీతా వియోగం, ప్రాణ సమానుడైన లక్ష్మణుడు తీవ్రంగా గాయపడడం... ఇలా రాముడికి ఎన్నో సంక్షోభాలు ఎదురయ్యాయి. కానీ ఏనాడూ స్థైర్యాన్ని కోల్పోలేదు. క్లిష్ట సమయాల్లో... ప్రశాంత చిత్తంతో, సరైన నిర్ణయాలు తీసుకున్నాడు, స్థితప్రజ్ఞత ప్రదర్శించాడు.

'రాముడు మంచి బాలుడు'... ఈ మాట మనం తరచూ వింటూ ఉంటాం. కానీ ఆయన మంచి నాయకుడనీ, గొప్ప పాలకుడనీ రామాయణంలోని ప్రతి సందర్భం నిరూపిస్తుంది. "నా ఊహల్లోని రాముడు ఈ భూమి మీద పూర్వం జీవించి ఉండవచ్చు, లేకపోవచ్చు. కానీ 'రామరాజ్యం' అనే పురాతనమైన భావన అత్యంత ప్రజాస్వామికమైనదనడంలో సందేహం లేదు. అక్కడ అతి మామూలు వ్యక్తి కూడా తాత్సారంతో, ఖర్చుతో కూడిన తతంగం లేకుండా త్వరితమైన న్యాయాన్ని పొందుతాడు. రామరాజ్యం అంటే స్వచ్ఛమైన నైతికత ఆధారంగా ప్రజలకు సంక్రమించే సార్వభౌమాధికారం" అని మహాత్మా గాంధీ చెప్పారు. శ్రీరామనవమి శ్రీరాముని పుట్టిన రోజే కాదు... ఆయన పట్టాభిషిక్తుడైన రోజు.... నాడు రామరాజ్యం ఆరంభమైన రోజు. ప్రజాపాలనలో ఆయన చూపిన మార్గం... ఏ యుగానికైనా ఆదర్శమే.



"నా ఊహల్లోని రాముడు పూర్వం ఈ భూమి మీద జీవించి ఉండవచ్చు, లేకపోవచ్చు. కానీ 'రామరాజ్యం' అనే పురాతనమైన భావన అత్యంత ప్రజాస్వామికమైనదనడంలో సందేహం లేదు. అక్కడ అతి మామూలు వ్యక్తి కూడా త్వరితమైన న్యాయాన్ని పొందుతాడు. రామరాజ్యం అంటే స్వచ్ఛమైన నైతికత ఆధారంగా ప్రజలకు సంక్రమించే సార్వభౌమాధికారం" అని మహాత్మా గాంధీ చెప్పారు.

వారణాసి

ఒకటే లక్ష్యం... అదే మోక్షం



మోక్షానికీ, కాశీకీ ఉన్న సంబంధం గురించి నా సందేహాలకు సమాధానాలు అన్వేషిస్తూ... కాశీలో నేనూ, నా మిత్రుడు తిరుగుతున్నాం. కాశీ విశ్వనాథ మందిరానికి సమీపంలోని గొదలియాలో కాశీలాభ ముక్తి భవనం ఉంది. అక్కడ మేనేజర్ గోరఖ్‌పూర్‌కు చెందిన భైరవనాథ్ శుక్లా. ఆయన మాకు అతిథి మర్యాదలు చేశారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం... ఆ భవనాన్ని 1958లో శ్రీ దాల్మియా తన తల్లి జ్ఞాపకార్థం నిర్మించారు. దీనిలో పది గదులు ఉన్నాయి. ఎక్కువగా బిహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారు వస్తారు. మరణించే స్థితిలో ఉన్నవారికి... కేవలం పదిహేను రోజులకు మాత్రమే అద్దెకు ఇస్తారు. అక్కడ భోజనం, వస్త్రాలు, వసతులు ఉచితం. మాంసం, మద్యం నిషేధం.

అక్కడినుంచి లలితాఘాట్‌కు వెళ్ళాం. అది విశ్వనాథ మందిర గంగాముఖద్వారం పక్కన ఉంది. అక్కడే నేపాలీ మందిరం కూడా ఉంది. పగోడా శైలిలో చెక్కతో కట్టిన పశుపతినాథ దేవాలయం అది. ఆ మందిరానికి నేను చాలాసార్లు వెళ్ళాను. ఆ మందిరం వరండాలో కూర్చొని బనారస్ ఘాట్లు అన్నిటినీ చూడవచ్చు. రాజఘాట్ నుంచి అస్సీ ఘాట్ వరకూ రాత్రి దీపాల కాంతిలో... అర్ధ చంద్రాకారంలో దర్శనమిస్తుంది - కాశీ. నేపాల్ రాజు బహదూర్‌షా వైరాగ్యం చెంది కాశీ వచ్చారు. అక్కడ ఆరేళ్ళు ఉన్నారు. ఈ దేవాలయాన్నీ, తన భార్య లలితాదేవి పేరిట లలితాఘాట్‌నూ కట్టించారు.



నేపాలీ ముముక్షు భవన్ మేనేజర్ రోహిత్‌ను ఆలయ పూజారి పరిచయం చేశారు. రోహిత్ నేపాల్‌లో పుట్టి, అసోంలో పెరిగారు. కాశీలో చదువుకున్నారు. సంస్కృతంలో పిహెచ్‌డి చేశారు. వయసు ముప్ఫయ్యేడేళ్ళు కాషాయ వస్త్రాలు ధరించారు. పెద్ద గడ్డం, జుట్టు ఉన్నాయి. కళ్ళలో నిర్మలత పలకరిస్తోంది.

"నా స్నేహితులు ఉద్యోగాలు చేస్తున్నారు. నేను మోక్షగాములకు సేవ చేస్తున్నాను" అన్నారు రోహిత్.

బిల్వపత్రం మీద పూజారి గంధం పెట్టి రోహిత్‌కు ఇస్తే... ఆయన దాన్ని నా నుదుట రాశారు. "ఈ పూజారులు కూడా నేపాలీలే" అని చెప్పారు.

"నేపాల్‌నుంచి వచ్చి వీళ్ళంతా ఇక్కడ ఎలా ఉండగలుగుతున్నారు?" అని ప్రశ్నించాను.

"ప్రతి హిందువూ కాశీలో మరణించాలనుకుంటారు. ఆ అదృష్టం దక్కకపోతే... తమ దహన సంస్కారాలు ఇక్కడ జరగాలనుకుంటారు. అదీ కాకపోతే అస్థి నిమజ్జనమైనా గంగలో చేయాలనుకుంటారు" అంటూ ఆ వరండానుంచి మణికర్ణికా ఘాట్‌ను, అక్కడ దహనమవుతున్న మృతదేహాలను చూపించారు. "కాశీలో మరణం వరం. అది శోకం కాదు, భగవంతుని ఆశీర్వాదం" అని అన్నారు.

"కాలుతున్న శవాలను చూసి వీళ్ళు భయపడరా?" అని అడిగాను.

"లేదు. వీళ్ళకు చావు భయం కాదు, లక్ష్యం. ఇక్కడ శవయాత్రలు దైనందిన దృశ్యం. 'రామ్ నామ్ సత్య హై' అంటూ మృతదేహాలను తీసుకువెళ్తూ ఉంటారు" అన్నారు.

"మోక్షం కోసం కాశీ ఒక్కటేనా? మరే నగరమూ లేదా?" అంటూ నాలోపల దాగిన సందేహాన్ని బయటపెట్టాను.

"ఏడు మోక్ష నగరాలు ఉన్నట్టు హిందూ ధర్మ శాస్త్రాలు చెబుతున్నాయి. అయోధ్య, మధుర, హరిద్వార్, కాశీ, కంచి, ఉజ్జయిని, ద్వారక... ఇవి మోక్ష నగరాలు. కానీ అన్నిటిలో కాశీకే అగ్రతాంబూలం. 'అన్యాని ముక్త క్షేత్రాణి/ కాశీ ప్రాప్య విముచ్యంతో నన్యతా తీర్థ కోటిభిః...' - మిగతా క్షేత్రాల్లో దేహాన్ని విడిచినవారికి... తదుపరి జన్మలో కాశీవాస లాభం కలుగుతుందనే నమ్మకం ఉంది. కాశీలో మరణించినవారిపై యమునికి అధికారం లేదని పురాణాలు చెబుతున్నాయి. ఇక్కడ మరణించేవారికి... వారి కుడిచెవిలో... మరణ సమయంలో విశ్వనాథుడు తారకమంత్రం చెబుతాడట. తద్వారా వారికి జ్ఞానం, ఆ జ్ఞానం ద్వారా మోక్షం లభిస్తాయి. అంటే జనన మరణ చక్రం నుంచి ఆ ప్రాణికి విముక్తి కలుగుతుంది. అదే మోక్షం. అందుకే కాశీ మోక్షదాయని. ఆ విశ్వాసంతోనే కాశీ వాసం కోసం దేశ విదేశాల నుంచి వస్తారు" అని చెప్పారు రోహిత్. ఆయనకు ధన్యవాదాలు చెప్పి బయలుదేరాం.

ఆయన చెప్పినది వింటున్నప్పుడు 'ముంబయి-వారణాసి ఎక్స్‌ప్రెస్' అనే లఘుచిత్రం నాకు గుర్తుకువచ్చింది. వైరాగ్యభావన లేనివారు కాశీలో మరణించాలని వచ్చినా... అక్కడ చనిపోలేరని ఆ చిత్రం చెబుతుంది.

కాశీలో చాలా మోక్ష భవనాలు ఉన్నాయి. అద్దెకు ఇళ్ళు ఉన్నాయి. కొనుక్కొని ఉండడానికి గదులు ఉన్నాయి. సనాతన హిందూ ధర్మంలో చెప్పిన సన్యాసాశ్రమానికి ఇవన్నీ ఆధునిక రూపాలే. కాశీ మోక్షగాముల్లో ఉద్యోగులున్నారు, వ్యాపారులున్నారు, సమాజ సేవకులున్నారు, నిరుపేదలున్నారు, నిస్సహాయులున్నారు. వీరందరి లక్ష్యం ఒకటే... మోక్షం. వీరందరి మార్గం ఒక్కటే... వైరాగ్యం.

కిల్లాడ సత్యనారాయణ, లక్నో

నాలుగు క్షేత్రాలు

'పద్మపురాణం' కాశీ పరిధిలోనే ఉన్న నాలుగు క్షేత్రాల (ప్రదేశాల) గురించి చర్చిస్తుంది. వాటిలో మరణించేవారికి ప్రాప్తించే మోక్షాలు వేరు వేరని సూచిస్తుంది. వాటిలో మొదటిది... కాశీ క్షేత్రం. ఇది విశాలమైనది. వారణాసికి వెలుపల విస్తరించిన ప్రదేశం. పంచక్రోశి మార్గాన్ని కలుపుకొని ఉంటుంది. విస్తీర్ణం సుమారు డెబ్భై అయిదు మైళ్ళు. రెండోది వారణాసి క్షేత్రం. ఇది కాశీ లోపల ఉంటుంది. దీనికి ఉత్తరంలో వరుణ నది, దక్షిణంలో అసి నది, తూర్పున గంగ ఉంటాయి. పశ్చిమంలో పాశపాణి వినాయకుడు ఉంటాడు. మూడోది అంతర గృహం. ఇది వారణాసి లోపల ఉంటుంది. దీనికి ఉత్తరంలో భార్ భూటేశ్వర్ మందిరం, దక్షిణంలో బ్రహ్మేశ్వర్ మందిరం, తూర్పున మణికర్ణికేశ్వర్ మందిరం, పశ్చిమంలో గోకర్ణేశ్వర్ మందిరం ఉంటాయి. నాలుగోది... అవిముక్తేశ్వర క్షేత్రం. ఇది అంతరగృహం లోపల ఉంటుంది. ఉత్తరంలో ఘంటాకర్ణేశ్వర్ మందిరం, దక్షిణంలో భూతధాత్రీశ్వర్ మందిరం, తూర్పున అట్టహాసేశ్వర మందిరం, పశ్చిమంలో గోకర్ణేశ్వర మందిరం ఉన్నాయి. ఇది కాశీ విశ్వేశ్వరుడికి నాలుగువైపులా వ్యాపించి ఉంది. కాశీ క్షేత్రంలో మరణించిన వారికి సాలోక్య ముక్తి, వారణాసి క్షేత్రంలో సారుప్య ముక్తి, అవిముక్త క్షేత్రంలో సాయుజ్యం, అంతరగృహంలో మరణిస్తే కైవల్యం ప్రాప్తిస్తాయి. కానీ బలవన్మరణాలకు (హత్యలకు, ఆత్మహత్యలకు) ముక్తి లేదు. మరణం సహజమై ఉండాలి.


జెన్ కథ

జ్ఞానులు చూపిన మార్గం

ఒక జెన్ గురువు తన మఠంలో శిష్యులను, సందర్శకులను ఉద్దేశించి ప్రసంగిస్తున్నాడు. అందరూ ఆయన బోధను శ్రద్ధగా వింటున్నారు. అంతలో భూకంపం వచ్చింది. ఆ గురువు తప్ప మిగిలిన వారందరూ భయాందోళనలతో లేచి పరుగులు తీశారు. భూకంపం తీవ్రతకు గదిలోని అలమరలు, వాటి పైన, లోపల ఉన్న వస్తువులు, గోడలకు అమర్చిన వస్తువులు కింద పడి చెల్లాచెదురైపోయాయి. వాటిని దాటుకుంటూ కొందరు పక్క గదుల్లోకి, మరికొందరు మఠం ముఖద్వారంలోంచీ బయటకు పారిపోయారు.

కొంతసేపటికి ప్రకంపనలు తగ్గాయి. సాధారణ పరిస్థితి ఏర్పడింది. శిష్యుల భయం, ఆందోళన తగ్గాయి. అప్పుడు గురువుగారు గుర్తొచ్చారు. "అయ్యో! గురువుగారిని వదిలేసి మనం బయటకు వెళ్ళిపోయాం. తప్పు చేశాం" అనుకున్నారు. జాగ్రత్తగా అడుగులు వేసుకుంటూ... గురువు ఉన్న చోటుకు వచ్చారు. అక్కడ గురువు కదలకుండా, మెదలకుండా, నవ్వు ముఖంతో... ఉన్నచోటే కూర్చొని ఉన్నాడు. శిష్యులు ఆయనకు నమస్కరించి "మహాశయా! భూకంపం వచ్చిందని మేమందరం భయంతో బయటకు పరుగులు తీశాం కదా! మీకు భయం కలగలేదా? మీరెందుకు పారిపోకుండా కూర్చున్నారు?" అని ప్రశ్నించారు.

అప్పుడు గురువు ప్రశాంతంగా "నేనూ పారిపోయాను. మీరు బయటకు పారిపోతే నేను (నా) లోపలకు పారిపోయాను. ఈ గదిలోంచి మరో గదిలోకి పోయినా, భవనం నుంచి బయటకు పోయినా... భూకంపం ప్రభావాన్ని ఎలా తప్పించుకోగలం? అందుకే ఆ ప్రభావం ఏమాత్రం ఉండని నా హృదయంలోకి పరుగు తీశాను" అన్నాడు. అంటే ఆయన గాఢమైన ధ్యానంలోకి వెళ్ళాడన్నమాట.



ప్రపంచంలో భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, సునామీలు... ఇలా ఎన్నో విపత్తులు సంభవిస్తూ ఉంటాయి. జీవితంలోనూ ప్రమాదకరమైన సంఘటనలు చోటు చేసుకుంటాయి. ఆత్మీయుల మరణాలు, ఆస్తులన్నీ పోవడం లాంటి సంఘటనల వల్ల కలిగే బాధ... భూకంపం కన్నా, జలప్రళయం కన్నా తక్కువేం కాదు. భూకంపాలు, వరదల నుంచి తప్పించుకోవచ్చు కానీ... వ్యక్తిగత కష్టాలు మీద పడినప్పుడు తప్పించుకోలేం. బాధపడక తప్పదు. అవి మనకు ఆందోళన, భయం కలిగించకుండా ఉండాలంటే... జ్ఞానులు చూపిన మార్గం ఒక్కటే శరణ్యం. అదే... బయటకు పరుగులు తీసే మనసును లోపలికి మళ్ళించడం. దీనికి నిరంతర సాధన అవసరం.

రాచమడుగు శ్రీనివాసులు

ముంబై మురిసె..

వరుసగా రెండో గెలుపు ● ఇషాన్, సూర్య మెరుపు అర్ధసెంచరీలు ● చిత్తుగా ఓడిన బెంగళూరు

బుమ్రాకు ఐదు వికెట్లు

ముంబై: సొంత మైదానంలో ముంబై ఇండియన్స్ మరోసారి అదరగొట్టింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్సర్లతో 69) అందించిన మెరుపు ఆరంభానికి.. 'మిస్టర్ 360' సూర్యకుమార్ (19 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 52) ఇచ్చిన ఫినిషింగ్ టచ్‌కు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు బౌలర్లు చేష్టలుడిగిపోయారు. బంతి ఎక్కడ పడినా బౌండరీకే అన్నట్టుగా వీరి ఆట సాగడంతో 197 పరుగుల ఛేదనను ముంబై 27 బంతులుండగానే ముగించింది. దీంతో 7 వికెట్ల తేడాతో గెలిచిన హార్దిక్ సేన నాలుగు పాయింట్లు సాధించింది. బౌలింగ్‌లో బుమ్రా (4-0-21-5) చెలరేగాడు. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 8 వికెట్లకు 196 పరుగులు చేసింది. డుప్లెసి (40 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 61), దినేశ్ కార్తీక్ (23 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 53 నాటౌట్), రజత్ పటీదార్ (26 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 50) అర్ధసెంచరీలు సాధించారు. ఛేదనలో ముంబై 15.3 ఓవర్లలో 3 వికెట్లకు 199 పరుగులు చేసి నెగ్గింది. రోహిత్ (38) పర్వాలేదనిపించాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బుమ్రా నిలిచాడు.

1 ఐపీఎల్‌లో ఎక్కువసార్లు (17) డకౌటైన బ్యాటర్ మ్యాక్స్‌వెల్. దినేశ్ కార్తీక్, రోహిత్‌తో సమంగా నిలిచాడు.

ఇషాన్, సూర్య బాదుడు: ఫ్లాట్ పిచ్‌పై 197 పరుగుల ఛేదనను ముంబై అలవోకగా పూర్తి చేసింది. ఆరంభంలో ఇషాన్ ధనాధన్ ఆటతీరు.. మధ్య ఓవర్లలో సూర్యకుమార్ మెరుపులతో వాంఖడే దద్దరిల్లింది. వీరి ధాటికి ఆర్‌సీబీ బౌలర్లు చేతులెత్తేయడంతో 15.3 ఓవర్లలోనే మ్యాచ్ ముగిసింది. ఎడాపెడా భారీ షాట్లతో పవర్‌ప్లేలోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్న ఇషాన్.. రోహిత్‌తో కలిసి తొలి వికెట్‌కు 101 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. ఐదో ఓవర్‌లో ఇషాన్ 6,4,6.. రోహిత్ 6తో పేసర్ సిరాజ్ 23 పరుగులు సమర్పించుకున్నాడు. ఇక ఆరో ఓవర్‌లోనూ ఇషాన్ 4,6,4తో 23 బంతుల్లోనే అర్ధసెంచరీ సాధించాడు. అప్పటికి రోహిత్ స్కోరు 15 మాత్రమే. కానీ ఈ దూకుడుకు పేసర్ ఆకాశ్ దీప్ తొమ్మిదో ఓవర్‌లో చెక్ పెడుతూ ఇషాన్ వికెట్ తీశాడు. అటు సూర్యకుమార్ రాకతో ఆర్‌సీబీ బౌలర్లకు చుక్కలు కనిపించాయి. 11వ ఓవర్‌లో తను 24 పరుగులు రాబట్టాడు. తర్వాతి ఓవర్‌లో టోప్లే గాల్లోకి ఎగిరి ఒంటి చేత్తో పట్టిన సూపర్ క్యాచ్‌తో రోహిత్ వెనుదిరిగాడు. అయినా జోరు తగ్గించని సూర్య 13వ ఓవర్‌లో 4,6,4,4తో 17 బంతుల్లో ఐపీఎల్‌లో తన వేగవంతమైన ఫిఫ్టీని పూర్తి చేశాడు. మరుసటి ఓవర్‌లోనే వైశాక్ అతడి వికెట్ తీసినా ముంబై అప్పటికే విజయం అంచుల వరకు వచ్చింది. హార్దిక్ (21 నాటౌట్), తిలక్ (16 నాటౌట్) కూడా వేగం చూపడంతో 16వ ఓవర్‌లో లాంఛనం పూర్తయ్యింది.


బుమ్రా (4-0-21-5)

ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 69)


సూర్యకుమార్ (19 బంతుల్లో 52)

చివర్లో డీకే జోరు: ఆర్‌సీబీ నుంచి ఇప్పటి దాకా కోహ్లీ మాత్రమే 50+ స్కోరు చేయగా.. ఈ మ్యాచ్‌లో మాత్రం డుప్లెసి, రజత్, దినేశ్ కార్తీక్ రూపంలో ముగ్గురు బ్యాటర్లు ఈ ఫీట్ సాధించారు. దీంతో స్కోరు 200కి చేరువగా వెళ్లింది. పేసర్ బుమ్రా మాత్రం ఐదు వికెట్లతో పరుగులను సైతం కట్టడి చేశాడు. టాస్ ఓడిన బెంగళూరుకు ఆరంభంలోనే ఝలక్ తగిలింది. విరాట్ (3), ఐపీఎల్ అరంగేట్ర బ్యాటర్ విల్ జాక్స్ (8) తొలి నాలుగు ఓవర్లలోనే పెవిలియన్‌కు చేరారు. బుమ్రాను ఎదుర్కొనేందుకు తీవ్రంగా ఇబ్బందిపడిన కోహ్లీ అతడికే చిక్కాడు. ఈ దశలో కెప్టెన్ డుప్లెసితో పాటు రజత్ పటీదార్ జట్టును ఆదుకునే బాధ్యతను తీసుకున్నారు. రజత్ 12వ ఓవర్‌లో తొలి రెండు బంతులను సిక్సర్లుగా మలచడంతో స్కోరు వంద దాటగా, 25 బంతుల్లోనే అతడి మెరుపు అర్ధసెంచరీ కూడా పూర్తయ్యింది. కానీ తర్వాతి బంతికే అతడి దూకుడుకు పేసర్ కొట్జీ బ్రేక్ వేశాడు. తర్వాతి ఓవర్‌లోనే ప్రమాదకర మ్యాక్స్‌వెల్ (0)ను స్పిన్నర్ శ్రేయాస్ గోపాల్ ఎల్బీ చేశాడు. ఈసీజన్‌లో మ్యాక్సీకిది మూడో డకౌట్. అటు డుప్లెసి ఫోర్‌తో 35 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. అయితే బుమ్రా డెత్ ఓవర్లలో గట్టి షాకే ఇచ్చాడు. 17వ ఓవర్‌లో డుప్లెసి, లొమ్రోర్ (0)లను, 19వ ఓవర్‌లో సౌరవ్ చౌహాన్ (9), వైశాక్ (0)లను అవుట్ చేశాడు. ఇక ఆఖరి ఓవర్‌లో డీకే 6,6,4తో 19 రన్స్ అందించి, 22 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకోగా జట్టు సవాల్ విసిరే స్కోరు సాధించింది.

స్కోరుబోర్డు

బెంగళూరు: కోహ్లీ (సి) ఇషాన్ (బి) బుమ్రా 3, డుప్లెసి (సి) డేవిడ్ (బి) బుమ్రా 61, విల్ జాక్స్ (సి) డేవిడ్ (బి) మధ్వల్ 8, పటీదార్ (సి) ఇషాన్ (బి) కొట్జీ 50, మ్యాక్స్‌వెల్ (ఎల్బీ) శ్రేయాస్ 0, దినేష్ (నాటౌట్) 53, లోమ్రోర్ (ఎల్బీ) బుమ్రా 0, సౌరవ్ చౌహాన్ (సి) మధ్వల్ (బి) బుమ్రా 9, వైశాక్ (సి) నబీ (బి) బుమ్రా 0, ఆకాశ్ దీప్ (నాటౌట్) 2 ; **ఎక్స్‌ట్రాలు : 10 : మొత్తం 20 ఓవర్లలో 196/8 ; వికెట్లపతనం :** 1-14, 2-23, 3-105, 4-108, 5-153, 6-153, 7-170, 8-170 ; **బౌలింగ్:** నబీ 1-0-7-0, కొట్జీ 4-0-42-1, బుమ్రా 4-0-21-5, ఆకాష్ మధ్వల్ 4-0-57-1, శ్రేయాస్ గోపాల్ 4-0-32-1, షెపర్డ్ 2-0-22-0, హార్దిక్ 1-0-13-0.

ముంబై: ఇషాన్ (సి) కోహ్లీ (బి) ఆకాశ్‌దీప్ 69, రోహిత్ (సి) టోప్లే (బి) జాక్స్ 38, సూర్యకుమార్ (సి) లోమ్రోర్ (బి) వైశాఖ్ 52, హార్దిక్ (నాటౌట్) 21, తిలక్ వర్మ (నాటౌట్) 16 : **ఎక్స్‌ట్రాలు : 3 : మొత్తం 15.3 ఓవర్లలో 199/3 ; వికెట్ల పతనం** :1-101, 2-139, 3-176 ; **బౌలింగ్ :** టోప్లే 3-0-34-0, సిరాజ్ 3-0-37-0, ఆకాశ్‌దీప్ 3.3-0-55-1, మ్యాక్స్‌వెల్ 1-0-17-0, వైశాక్ 3-0-32-1, విల్ జాక్స్ 2-0-24-1.

పాయింట్ల పట్టిక

జట్టు	అ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	5	4	1	0	8	0.871
కోల్‌కతా	4	3	1	0	6	1.528
లఖ్‌నవూ	4	3	1	0	6	0.775
చెన్నై	5	3	2	0	6	0.666
హైదరాబాద్	5	3	2	0	6	0.344
గుజరాత్	6	3	3	0	6	-0.637
ముంబై	5	2	3	0	4	-0.073
పంజాబ్	5	2	3	0	4	-0.196
బెంగళూరు	6	1	5	0	2	-1.124
ఢిల్లీ	5	1	4	0	2	-1.370

గమనిక: అ: ఆడినవి; గె: గెలిచినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

నేటి మ్యాచ్
లఖ్‌నవూ x ఢిల్లీ
వేదిక: లఖ్‌నవూ
రా.7.30 గం.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	బుమ్రా (ముంబై)
316 పరుగులు	10 వికెట్లు

ప్రజ్ఞానంద గెలుపు



టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్లు ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతీలు కీలక విజయాలు నమోదు చేయగా.. గుకేష్ డ్రాతో గట్టెక్కాడు. గురువారం జరిగిన ఆరో రౌండ్‌లో అజర్‌బైజాన్ జీఎం నిజత్ అబసోవ్‌పై ప్రజ్ఞానంద గెలిచాడు. మరో గేమ్‌లో అలీరెజా (ఫ్రాన్స్)పై విదిత్ నెగ్గాడు. కాగా, హికరు నకమురా (అమెరికా)తో గుకేష్ పాయింట్ పంచుకొన్నాడు. మొత్తం 6 రౌండ్ల నుంచి గుకేష్ 4 పాయింట్లతో సంయుక్తంగా టాప్‌లో కొనసాగుతుండగా.. ప్రజ్ఞానంద (3.5), గుజరాతి (3) నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. కాగా, మహిళల విభాగం ఆరో రౌండ్‌లో లీ టింగ్జీ (చైనా) చేతిలో కోనేరు హంపి, కటిర్యానా చేతిలో వైశాలి పరాజయం పాలయ్యారు.

శాంసన్‌కు జరిమానా

జైపూర్: స్లో ఓవర్‌రేట్ కారణంగా రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్‌కు రూ. 12 లక్షలు జరిమానా విధించారు. గుజరాత్ టైటాన్స్‌తో బుధవారం మిక్కడ జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టు నిర్ణీత సమయానికి 20 ఓవర్లను పూర్తి చేయలేకపోయింది. ఈ సీజన్‌లో రాయల్స్‌కిది తొలి స్లో ఓవర్ రేట్ తప్పిదమైనందున కనిష్ఠంగా జరిమానా విధించారు. ఇక..వరుసగా నాలుగు మ్యాచ్‌లు గెలిచిన రాజస్థాన్ ఈ మ్యాచ్‌లో ఓడిన సంగతి తెలిసిందే.

హైదరాబాద్‌లో రేపటి నుంచి చెస్ టోర్నీలు


హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన వారస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి జూన్ రెండు వరకు వివిధ స్థాయిల చెస్ టోర్నీలు నిర్వహిస్తున్నారు. 13 ఏళ్ల లోపు చిన్నారులకు ఈనెల 13న చిల్డ్రన్స్ కప్, అలాగే 14వ తేదీన అండర్-15 ర్యాపిడ్ ఓపెన్ పోటీలను ఉప్పల్ డెకాథ్లాన్ వేదికగా నిర్వహించనున్నట్టు అకాడమీ ఫౌండర్-చీఫ్ కోచ్ రాఘవ్ శ్రీవాత్సవ్ తెలిపారు. ఇతర వివరాలకు 7396847937 నెంబర్‌లో సంప్రదించాలి.

ఒకే రకమైన ఫుడ్.. ఆర్నెల్లయినా తింటా!


విరాట్ కోహ్లీ

న్యూఢిల్లీ: ప్రపంచ క్రికెట్‌లో విరాట్ కోహ్లీ ఫిట్‌నెస్ అత్యున్నత స్థాయిలో ఉంటుంది. ఇందుకు అతడి ఆహార అలవాట్లు కూడా కారణమే. అలాగే ఒకే రకమైన ఆహారాన్ని నెలల తరబడి ఎలాంటి ఇబ్బందీ లేకుండా తినగలనని చెబుతున్నాడు. ఒక ఆటగాడు సరైన ఫిట్‌నెస్‌తో ఉండాలంటే చక్కటి శిక్షణతో పాటు ఆహారం కూడా ముఖ్యమని అభిప్రాయపడ్డాడు. 'ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడంలో నేనెదుర్కొనే సవాల్ ఆహారంతోనే ఉంటుంది. జిమ్‌కు వెళ్లడం, కష్టపడడం మామూలే. కానీ ఫుడ్ విషయం అలా కాదు. మన నాలుక ఎన్నో రకాల రుచులను కోరుకుంటుంది. అయితే నేను మాత్రం నా డైట్‌ను కఠినంగా అనుసరిస్తా. అందుకే ఒకే రకమైన ఆహారాన్ని ఆరు నెలలపాటు మూడు పూటలా తినమన్నా తినేస్తా' అని కోహ్లీ తేల్చిచెప్పాడు.

మన పోరు ముగిసింది



- సింధు, ప్రణయ్ కూడా ఇంటిదారి
- ఆసియా చాంపియన్‌షిప్స్

నింగ్‌బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో భారత షట్లర్ల కథ ముగిసింది. గురువారం జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో సింధు 18-21, 21-13, 17-21తో ఆరో సీడ్ హన్ యు (చైనా) చేతిలో పరాజయం పాలైంది. గతంలో హన్ యుపై 5-0తో మెరుగైన రికార్డు కలిగిన సింధు అలవోకగా నెగ్గుతుందని భావించారు. కానీ, గంటకుపైగా సాగిన పోరులో చైనా షట్లర్.. తొలిసారి సింధుపై పైచేయి సాధించింది. ఇక రెండో రౌండ్‌లో ప్రణయ్ 18-21, 11-21తో చిన్ చున్‌యి (చైనీస్ తైపీ) చేతిలో వరుస గేముల్లో చిత్తయ్యాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంట 17-21, 12-21తో మట్సుయామా-చిహారు (జపాన్) చేతిలో ఓటమి చవిచూసింది.

ముంబై జట్టులో హార్విక్ దేశాయ్

ముంబై: ముంబై ఇండియన్స్ బ్యాటర్ విష్ణు వినోద్ గాయం కారణంగా ఐపీఎల్‌కు దూరమయ్యాడు. దీంతో అతడి స్థానంలో సౌరాష్ట్రకు చెందిన వికెట్ కీపర్ హార్విక్ దేశాయ్‌ను తీసుకున్నారు. అతడి కనీస ధర రూ.20 లక్షలు.

పోరాడి ఓడిన నగాల్

మోంటె కార్లో ఓపెన్

మోంటెకార్లో: మోంటె కార్లో ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సుమిత్ నగాల్ జోరుకు తెరపడింది. ప్రపంచ ఏడో ర్యాంకర్ హోల్గర్ రూన్ చేతిలో నగాల్ రెండో రౌండ్‌లో పరాజయం చవిచూశాడు. రూన్ (డెన్మార్క్) కు సుమిత్ గట్టి పోటీ ఇచ్చాడు. అంతిమంగా..3-6, 6-3, 2-6తో ఓడి నిష్క్రమించాడు.

ఓజే సింప్సన్ మృతి



న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన ప్రఖ్యాత ఫుట్‌బాల్ ఆటగాడు, నటుడు ఓజే సింప్సన్ (76) క్యాన్సర్‌తో బుధవారం మరణించాడు. 1994లో తన మాజీ భార్య నికోల్ బ్రౌన్, ఆమె స్నేహితుడు రాన్ గోల్డ్‌మన్ హత్య కేసులో అతడు అరెస్ట్ కావడం సంచలనం రేపింది. కానీ కోర్టు అతడిని నిర్దోషిగా ప్రకటించింది. 2007లో దోపిడీ, కిడ్నాప్ కేసులో అతడు మరోసారి అరెస్టయ్యాడు. ఈ కేసులో సింప్సన్‌కు 33 ఏళ్ల శిక్ష పడగా, 2017లో పెరోల్‌పై విడుదలయ్యాడు.

వీ-గార్డ్ నుంచి అరిజో వైర్స్



హైదరాబాద్: ఎలక్ట్రికల్స్, ఎలక్ట్రానిక్స్, హోమ్ అప్లయెన్సెస్ సంస్థ వీ-గార్డ్ మార్కెట్లోకి అరిజో వైర్స్ పేరుతో ఎలక్ట్రిక్ వైరింగ్ ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేసింది. అడ్వాన్స్‌డ్ ఈ-బీమ్ టెక్నాలజీతో ఈ వైర్లను కంపెనీ తీసుకువచ్చింది. అత్యుత్తమ ప్రమాణాలు, సామర్థ్యాలతో కూడిన ఈ అరిజో వైర్స్.. ఎలక్ట్రికల్ విభాగంలో సరికొత్త శకానికి నాంది పలుకుతాయని వీ-గార్డ్ పేర్కొంది. సాంప్రదాయ ఎఫ్‌ఆర్ పీవీసీ వైర్లతో పోల్చితే అరిజో వైర్స్ 75 శాతం అధికంగా విద్యుత్‌ను తీసుకువెళ్లగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. వేడిని తట్టుకోవటంతో పాటు మెల్ట్ రెసిస్టెంట్, అగ్ని నిరోధకంగా ఈ వైర్లను రూపొందించటంతో గృహ, వ్యాపార సముదాయాలకు మంచి భద్రతను కల్పిస్తాయని వీ-గార్డ్ తెలిపింది. 99.97 శాతం స్వచ్ఛతతో కూడిన కాపర్‌తో తయారు చేసిన అరిజో వైర్స్‌కు ప్రతిష్ఠాత్మకమైన కన్ఫర్మిటీ యూరోపియన్ సర్టిఫికేషన్ (సీఈ)తో పాటు పలు జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు లోబడి ఉందని వెల్లడించింది. కాగా భారతీయ ఇండియన్ హౌసింగ్ వైర్స్, కేబుల్స్ మార్కెట్ ఏటా 9-10 శాతం వృద్ధితో రూ.25,000 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నట్లు తెలిపింది.

జోరుగా 'సిప్' పెట్టుబడులు

2023-24లో రూ.2 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాల్లో పెట్టుబడుల జోరు కొనసాగుతోంది. ఈ సంస్థలు అందించే క్రమానుగత పెట్టుబడుల ప్రణాళిక (సిప్) పెట్టుబడులు మరింత జోరందుకున్నాయి. గత ఏడాది సిప్ పెట్టుబడుల ద్వారా ఎంఎఫ్‌లు రికార్డు స్థాయిలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాయి. అంతకు ముందు సంవత్సరంలో నమోదైన రూ.1.56 లక్షల కోట్లతో పోలిస్తే ఇది 28 శాతం ఎక్కువ. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (యాంఫీ) గురువారం ఈ వివరాలు విడుదల చేసింది. 2016-17 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ పెట్టుబడులు నాలుగు రెట్లు పెరిగినట్టు తెలిపింది.

నెలకు రూ.19,000 కోట్లకుపైగా: ఇక సిప్‌ల ద్వారా జరిగే నెలవారీ పెట్టుబడుల మొత్తమూ గత నెల రికార్డు స్థాయిలో రూ.19,270 కోట్లకు చేరాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 35 శాతం ఎక్కువ. ఈ ఏడాది ఫిబ్రవరిలోనూ సిప్ పెట్టుబడులు రూ.19,000 కోట్లు దాటాయి. ఈ ఏడాది చివరికి సిప్ నెలవారీ పెట్టుబడులు రూ.25,000 కోట్ల స్థాయికి చేరతాయని మార్కెట్ వర్గాల అంచనా.

రూ.10.71 లక్షల కోట్లు: సిప్‌ల ద్వారా వచ్చిన పెట్టుబడుల నిర్వహణలోని ఆస్తుల విలువ (ఏయూఎం) ఈ ఏడాది మార్చి నాటికి రూ.10.71 లక్షల కోట్లకు చేరింది. ఫిబ్రవరితో పోలిస్తే ఇది రూ.19,000 కోట్లు ఎక్కువ. క్రమశిక్షణతో ఆస్తుల వృద్ధిపై మదుపరుల్లో పెరుగుతున్న అవగాహనకు ఇది నిదర్శనమని యాంఫీ సీఈఓ వెంకట్ చలసాని చెప్పారు. మొత్తం మీద సిప్ పెట్టుబడుల పుణ్యమాని ఎంఎఫ్‌ల నిర్వహణలోని ఆస్తుల విలువ ఈ ఏడాది మార్చి నాటికి రూ.53.4 లక్షల కోట్లకు చేరింది.గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది రూ.13.99 లక్షల కోట్లు ఎక్కువ.



- యూరోపియన్ కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ థామ్సన్.. దేశీయ మార్కెట్లోకి బీఎల్‌డీసీ టెక్నాలజీతో కూడిన కూల్ ప్రో, హెవీ డ్యూటీ సిరీస్ ఎయిర్ కూలర్స్‌ను విడుదల చేసింది. ఈ ఎయిర్ కూలర్ల తయారీ కోసం థామ్సన్ ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ లైసెన్స్ సంస్థ ఎస్‌పీపీఎల్.. నోయిడాలో రూ.75 కోట్ల పెట్టుబడితో తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. 28, 105,115,150 లీటర్ల సామర్థ్యంతో అందుబాటులో ఉండనున్న ఈ కూలర్ల ధరల శ్రేణి రూ.3,999 నుంచి రూ.14,999 మధ్యన ఉన్నాయి.
- గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో సోనాలికా ట్రాక్టర్స్.. మార్కెట్ వాటా 15.3 శాతంగా నమోదైంది. దేశీయంగా ఈ స్థాయి మార్కెట్ వాటాను సాధించిన ట్రాక్టర్ బ్రాండ్ సోనాలికా ఒక్కటే కావటం విశేషం. కంపెనీ గత ఏడాది రూ.1,300 కోట్ల పెట్టుబడితో హోషియాపూర్‌లో రెండు కొత్త ప్లాంట్లను ఏర్పాటు చేయటంతో పాటు ఐదు కొత్త ట్రాక్టర్లను మార్కెట్లోకి విడుదల చేసింది.

ముందుంది ముసళ్ల పండగ

ఉదయ్ కోటక్



పొంచి ఉన్న ఆర్థిక సంక్షోభం.. త్వరలో చైనా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం

న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఏ మాత్రం బాగోలేదని ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ ఆందోళన వ్యక్తం చేశారు. ధరల సెగ తగ్గనంత వరకు అమెరికా, భారత్‌తో సహా ఎక్కడా వడ్డీ రేట్లు తగ్గే అవకాశం లేదని స్పష్టం చేశారు. ద్రవ్యోల్బణం నిర్దేశిత 2 శాతానికి వస్తే, అధ్యక్ష ఎన్నికల సమయానికి అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉందన్నారు. బ్యారల్ ముడి చమురు ధర 90 డాలర్లు మించి పోవడంపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇవన్నీ మరోసారి ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న చైనా ఆర్థిక వ్యవస్థ కూడా త్వరలో బద్దలయ్యే ప్రమాదం ఉందని కోటక్ హెచ్చరించారు. ఈ పరిణామాలను ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాలు సిద్ధంగా ఉండాలని 'ఎక్స్' వేదికగా కోటక్ కోరారు.

తగ్గనున్న వస్తు వాణిజ్యం

అంతర్జాతీయ ఉద్రిక్తతలతో ఈ సంవత్సరం కూడా అంతర్జాతీయ వస్తు వాణిజ్యం విలువ తగ్గనుంది. గత ఏడాది 5 శాతం తగ్గిన ఈ వాణిజ్యం, ఈ సంవత్సరం 1.2 శాతం తగ్గుతుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) అనే పరిశోధనా సంస్థ తెలిపింది. అయితే ఇదే సమయంలో వాణిజ్య సేవల ఎగుమతి, దిగుమతుల విలువ 9 శాతం పెరిగి అంతర్జాతీయ వాణిజ్యాన్ని ఆదుకుంటుందని తెలిపింది.

చైనాకు పెరిగిన 'వస్తు' ఎగుమతులు

మరోవైపు చైనాకు మన వస్తు ఎగుమతులు క్రమంగా పెరుగుతున్నాయి. గత ఏడాది ఇనుప ఖనిజం, టెలికాం, ఎలక్ట్రానిక్ పరికరాల వంటి 90 వస్తువుల ఎగుమతులు గణనీయంగా పెరినట్టు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత్ నుంచి చైనా దిగుమతి చేసుకునే 161 వస్తువుల్లో ఈ 90 వస్తువుల వాటా 67.7 శాతం వరకు ఉంటుంది. 71 వస్తువుల ఎగుమతులు మాత్రం 2023లో నీరసించాయి. ఇనుప ఖనిజం ఎగుమతులు 216.8 శాతం, కాటన్ యార్న్ ఎగుమతులు 542.6 శాతం, సుగంధ ద్రవ్యాల ఎగుమతులు 19.4 శాతం, ప్రాసెస్ చేసిన ఖనిజాల ఎగుమతులు 174.19 శాతం పెరిగినట్టు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఈ ఏడాది భారత్ వృద్ధి రేటు 7 % : ఏడీబీ

ముంబై: భారత జీడీపీ వృద్ధి రేటు అంచనాలను ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) మరింత పెంచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం భారత ఆర్థిక వ్యవస్థ 6.7 శాతం వృద్ధి రేటు సాధిస్తుందని గతంలో పేర్కొన్న ఏడీబీ ఆ అంచనాల్ని 7 శాతానికి పెంచింది. వినియోగదారుల డిమాండ్ పెరగడం, ప్రభుత్వ-ప్రైవేట్ పెట్టుబడులు పెరగడం ఇందుకు ప్రధానంగా దోహదం చేస్తాయని తెలిపింది. ఆసియా-పసిఫిక్ ప్రాంత అభివృద్ధికి భారత్ ప్రధాన వృద్ధి చోదక శక్తిగా మారిందని పేర్కొంది. అంతేకాకుండా వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) భారత వృద్ధి రేటు మరింత పెరిగి 7.2 శాతానికి చేరే అవకాశం ఉందని అంచనా వేసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	380	విజయవాడ	393
చిత్తూరు	458	విశాఖపట్నం	408
గోదావరి	393	వరంగల్	382
		డజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	146	గోదావరి	147
వరంగల్	146	విజయవాడ	147
కరీంనగర్	146	గుంటూరు	147
మహబూబ్‌నగర్	146	ఒంగోలు	147
కర్నూలు	146	చిత్తూరు	151
విశాఖపట్నం	129		

బిజినెస్

ఎడెల్‌వీజ్ ఆల్టర్నేటివ్స్ చేతికి ఎల్‌టీఐడీపీఎల్

రూ.6,000 కోట్లకు కొనుగోలు

ముంబై: ఎల్ అండ్ టీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్స్ (ఎల్‌టీఐడీపీఎల్)ను రూ.6,000 కోట్లకు కొనుగోలు చేసే ప్రక్రియను పూర్తి చేసినట్టు ఎడెల్‌వీజ్ ఆల్టర్నేటివ్స్ గురువారం ప్రకటించింది. ఎల్‌టీఐడీపీఎల్ చేతిలో పలు రోడ్డు, విద్యుత్ సరఫరా లైన్ల ప్రాజెక్టులున్నాయి. జాయింట్ వెంచర్ కంపెనీగా ఏర్పాటైన ఎల్‌టీఐడీపీఎల్‌లో ఎల్ అండ్ టీకి 51 శాతం వాటా ఉండగా.. కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ చేతుల్లో మిగతా వాటా ఉంది. ఈ జేవీలో 100 శాతం వాటాను ఎడెల్‌వీజ్ టేకోవర్ చేసింది. తద్వారా ఎల్‌టీఐడీపీఎల్‌కు చెందిన 4,400 కిలోమీటర్ల పొడవైన 7 రోడ్డు ఆస్తులతో పాటు 960 సర్క్యూట్ కి.మీ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్లు ఎడెల్‌వీజ్ చేతుల్లోకి వచ్చాయి.

టెస్లా ఎంట్రీపై బేఫికర్

మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్



న్యూఢిల్లీ: అమెరికన్ ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) కంపెనీ టెస్లా భారత ప్రవేశంపై కలవరపడటం లేదని మెర్సిడెస్ బెంజ్ అంటోంది. టెస్లా వంటి అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించేందుకు మోదీ ప్రభుత్వం ప్రకటించిన కొత్త ఈవీ పాలసీ ప్రస్తుత కంపెనీలకు రక్షణ కల్పిస్తుందని నమ్ముతున్నట్లు జర్మనీ కార్ల దిగ్గజం పేర్కొంది. టెస్లా, విన్‌ఫాస్ట్ వంటి కంపెనీల ప్రవేశంతో భారత మార్కెట్ మరింత విస్తరించడంతో పాటు దేశంలో ఈవీల వినియోగం పెరుగుతుందని అభిప్రాయపడింది. అంతేకాదు, ఈ కంపెనీలు వచ్చినా లగ్జరీ ఈవీల విభాగంలో తమ అగ్రస్థానం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేసింది. "మార్కెట్లో కొత్త పోటీ, కంపెనీల ప్రవేశాన్ని సదా స్వాగతిస్తాం. మార్కెట్ విస్తరణతో పాటు ఈవీ వినియోగ ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన పెరుగుతుంది. ప్రస్తుతం అది అవసరం కూడా" అని మెర్సిడెస్ బెంజ్ ఇండియా సంతోష్ అయ్యర్ అన్నారు. కొత్త ఈవీ పాలసీపైనా ఆయన స్పందించారు. "సుంకం రహిత లేదా సుంకం రాయితీలను ఎప్పటికీ స్వాగతిస్తాం. భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా స్వేచ్ఛా వాణిజ్యం కొనసాగాలనే మేం సూచిస్తున్నాం. కాబట్టి అలాంటి ప్రకటనేదైనా మేం స్వాగతిస్తాం. కొత్త పాలసీ విషయానికొస్తే, మరింత లోతుగా అధ్యయనం చేసి, ప్రస్తుత కంపెనీలపై ఏమైనా ప్రభావం ఉంటుందా అని చూడాలి. కానీ, ప్రభుత్వం కొత్తగా ప్రవేశించబోయే కంపెనీలపై పలు పరిమితులు విధించడంతో పాటు ప్రస్తుత కంపెనీలకు రక్షణ కల్పించేలా నిబంధనలు ఏర్పాటు చేసింది. ప్రస్తుతానికైతే మా వ్యాపారంపై ప్రభావం ఉండబోద"ని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

2023-24లో రికార్డు విక్రయాలు: ఈ మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరానికి భారత్‌లో బెంజ్ కార్ల విక్రయాలు సరికొత్త రికార్డు స్థాయి 18,123 యూనిట్లకు పెరిగాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో నమోదైన 16,497 యూనిట్లతో పోలిస్తే 10 శాతం వృద్ధి చెందాయి.

స్టెల్లాంటిస్ ఈవీ ఎగుమతి హబ్‌గా భారత్

భారత్‌ను తమ ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతిగా హబ్‌గా మార్చుకోవాలని అంతర్జాతీయ వాహన సంస్థ స్టెల్లాంటిస్ భావిస్తోంది. తొలుత ఆగ్నేయాసియా మార్కెట్‌పై దృష్టిసారించనున్నట్లు స్టెల్లాంటిస్ ఇండియా ఎండీ, సీఈఓ ఆదిత్య జైరాజ్ తెలిపారు. స్టెల్లాంటిస్ భారత్‌లో తయారు చేసిన 'ఈ-సీ3' ఎలక్ట్రిక్ కార్లను ఇండోనేషియాకు ఎగుమతి చేసే ప్రక్రియను గురువారం ప్రారంభించింది. తొలుత 500 యూనిట్లను ఎగుమతి చేసింది. ఇటాలియన్ అమెరికన్ వాహన దిగ్గజం ఫియట్ క్రిస్లర్ ఆటోమొబైల్స్, ఫ్రాన్స్‌కు చెందిన పీఎస్ఏ గ్రూప్ విలీనం ద్వారా ఏర్పాటైన స్టెల్లాంటిస్.. ప్రస్తుతం భారత్‌లో జీప్, సిట్రోయెన్ బ్రాండ్ కార్లను విక్రయిస్తోంది.

జీఎస్‌టీఆర్-1 ఫైలింగ్‌కు నేటి వరకు గడువు

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చి నెల.. జీఎస్‌టీఆర్-1 రిటర్న్ ఫైలింగ్ గడువును శుక్రవారం వరకు పొడిగించారు. ఈ రిటర్న్‌లు ఫైల్ చేసే సంస్థలు, ఫైలింగ్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్నట్టు తెలియడంతో జీఎస్‌టీ టెక్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. నెలనెలా ఫైల్ చేసే సంస్థలు మరుసటి నెల 11 తేదీలోపు, మూడు నెలలకు ఒకసారి ఫైల్ చేసే సంస్థలు మరుసటి నెల 13వ తేదీ లోపు ఫైల్ చేస్తుంటాయి.

గోల్డ్‌మెడల్ ఎలక్ట్రికల్స్.. విజయవాడలో కొత్త కార్పొరేట్ కార్యాలయంతో పాటు ఎక్స్‌క్లూజివ్ షోరూమ్‌ను ఏర్పాటు చేసింది. గోల్డ్‌మెడల్ బ్రాండ్.. 1979లో విజయవాడ కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభించింది. సంస్థ బ్రాండ్ అంబాసిడర్ జాక్వెలిన్ ఫెర్నాండెజ్ ఈ కార్పొరేట్ కార్యాలయంతో పాటు షోరూమ్‌ను ప్రారంభించింది.

రాష్ట్రాన్ని గంజాయి వనంగా మార్చిన జగన్

- బినామీలు, దోపిడీదారులతో నిండిన ఆంధ్ర: లోక్‌సత్తా బాబ్జీ
- 'కూటమి'కి లోక్‌సత్తా మద్దతు హర్షణీయం: మనోహర్

తెనాలి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): 'సీఎం జగన్.. రాష్ట్రానికి ఒక్క పరిశ్రమను తీసుకొని రాలేదు. మరే ఇతర అభివృద్ధినీ చేపట్టలేదు. కానీ, ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి వనంగా మార్చగలిగారు. కొన్ని తరాల యువత నిర్వీర్యం కావటానికి, వారి జీవితాలు నాశనం కావటానికి మాత్రం బాటలు వేయగలిగారు. ఇటువంటి వ్యక్తి నుంచి రాష్ట్రానికి విముక్తి ప్రసాదించాలి. అందుకే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి మద్దతు ప్రకటించాం' అని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. గురువారం గుంటూరు జిల్లా తెనాలి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి, జనసేన నేత నాదెండ్ల మనోహర్‌తో కలసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం మొత్తం బినామీలు, దోపిడీదారులతో నిండిపోయిందని దుయ్యబట్టారు. కూటమికి లోక్‌సత్తా తన సంపూర్ణ మద్దతు ప్రకటించటం పట్ల మనోహర్ హర్షం వ్యక్తం చేశారు.

మోసానికే బ్రాండ్ అంబాసిడర్ జగన్ : షర్మిల

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): 'జాబు రావాలంటే జగన్ కావాలంటూ సోషల్ మీడియాలో ప్రచారం ద్వారా వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఘరానా మోసానికి తెరలేపాడు' అని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. గురువారం ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. ఏటా జాబ్ కేలండర్ అని, జంబో డీఎస్సీ అని, ఏపీపీఎస్సీ నుంచి వరుస నోటిఫికేషన్లు అని నివ్వించి నిరుద్యోగులను నిండా ముంచిన జగన్.. మోసానికే బ్రాండ్ అంబాసిడర్ అని ఆగ్రహించారు. ఆయన అవసరాల కోసం వలంటీర్ల వ్యవస్థను తెచ్చి 2 లక్షల ఉద్యోగాలు నింపామని చెప్పుకోవడం తప్ప గౌరవంగా చెప్పుకొనే ఒక్క ఉద్యోగం భర్తీ చేశారా అని ప్రశ్నించారు.

చంద్రబాబును కలిసిన కోడికత్తి శ్రీను కుటుంబం

అంబాజీపేట/పి.గన్నవరం, ఏప్రిల్ 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో ప్రజాగళం బహిరంగ సభకు విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును అడ్వకేట్ గుణ్ణం వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో జనుపల్లి శ్రీనివాస్ అలియాస్ కోడికత్తి శ్రీను కుటుంబం గురువారం కలిసింది. హెలిపాడ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులో చంద్రబాబును కలిసి తమ కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారని కోడికత్తి శ్రీను తల్లి సావిత్రి ఈ సందర్భంగా తెలిపారు. కోనసీమలోని పలు సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లానని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పినట్టు శ్రీను వివరించాడు. ఈ ఎన్నికల్లో తమ కుటుంబం టీడీపీకి మద్దతుగా ఉంటుందని శ్రీను సోదరుడు సుబ్బరాజు స్పష్టం చేశాడు. వారి వెంట అడ్వకేట్లు కె.సునీల్‌కుమార్, కె.ధనరాజు ఉన్నారు.

టీడీపీ ఏజెంట్లను అడ్డుకునే కుట్ర: టీడీపీ

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): "సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా, పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లుగా కూర్చునే అవకాశం లేకుండా చేస్తున్నారు. మా పార్టీ క్రియాశీల నాయకులు, కార్యకర్తలపై అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో పోలీసులు తప్పుడు కేసులు బనాయిస్తున్నారు" అని టీడీపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. గత ఎన్నికల్లో ఏజెంట్లుగా పని చేసిన వారిని...ఉద్దేశపూర్వకంగా పోలీసులు తప్పుడు కేసులు పెట్టి, అడ్డుకునే కుట్రలు చేస్తున్నారని గురువారం అదనపు సీఈవో దృష్టికి టీడీపీ నేతల బృందం తీసుకెళ్లింది.

పులివెందులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

- సీఈఓకి టీడీపీ నేత కనకమేడల లేఖ

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ పోటీ చేస్తున్న పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి పెట్టాలని మాజీ ఎంపీ, టీడీపీ నేత కనకమేడల రవీంద్రకుమార్ కేంద్ర ఎన్నికల ముఖ్య కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. పులివెందులలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఆయన లేఖ రాశారు. "అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ, ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించిన రూరల్ సీఐ అశోక్‌రెడ్డిని వెంటనే బదిలీ చేయాలి. ఆ సీఐ ఐదేళ్లుగా ఒకే స్థానంలో పని చేస్తున్నారు. కానీ కడప జిల్లా ఎస్పీ ఫంక్షనల్ పోస్ట్ అంటూ కవరప్ చేస్తున్నారు. పులివెందుల నియోజకవర్గంలో 68 కేంద్రాల్లో కేవలం 32 మాత్రమే సమస్యాత్మకమని ఎస్పీ ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. కానీ, వాటి సంఖ్యను పెంచాలి. పులివెందుల అర్బన్ డెలవప్‌మెంట్ అథారిటీ ఓఎస్‌డీ అనిల్‌కుమార్‌రెడ్డి వివక్షపూర్వకంగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీకి అనుకూలంగా పని చేసినందుకు సీఎం ఆశీస్సులతో ఇటీవలే అనిల్‌కుమార్‌రెడ్డి ఐఏఎస్ కేడర్ పొందారు" అని ఫిర్యాదుచేశారు.

ఎస్‌ఏలనే పీవోలుగా ఉంచాలి: ఏఎస్ రామకృష్ణ

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు ఎన్నికల విధులు కేటాయించేటప్పుడు అధికార పార్టీ చెప్పిన వారినే పోలింగ్ ఆఫీసర్లుగా వేయడం సరికాదని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ అన్నారు. గురువారం ఈ విషయాన్ని అమరావతి సచివాలయంలో అదనపు సీఈవో దృష్టికి తీసుకెళ్లిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో చాలా చోట్ల జూనియర్లను పీవోలుగా, సీనియర్ ఏపీవోగా నియమిస్తున్నారు. ఉపాధ్యాయుల్లో సీనియర్ ఎస్‌జీటీ అయినా.. పోలింగ్ అధికారిగా నియమించరాదు. స్కూల్ అసిస్టెంట్లనే పీవోలుగా నియమించాలి' అని రామకృష్ణ తెలిపారు.

సరుకు వదలకుంటే.. నీ అంతు తేలుస్తా!

- మద్యం పట్టుకున్న సెబ్ ఎస్ఐకి మంత్రి అంబటి బెదిరింపు

సత్తెనపల్లి, ఏప్రిల్ 11: 'వచ్చేది మా ప్రభుత్వమే. పట్టుకున్న మద్యాన్ని ఇచ్చేయండి. వాహనాన్ని వదిలి పెట్టండి. మా కార్యకర్తలపై కేసు పెట్టొద్దు' అంటూ మంత్రి అంబటి రాంబాబు గురువారం సాయంత్రం సెబ్ ఎస్ఐ శ్రీనివాసరావును బెదిరించారు. పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదలకు చెందిన బొప్పూడి షేక్ మస్తాన్‌వలి, మరో యువకుడు ద్విచక్ర వాహనంపై కొమెరపూడి నుంచి బస్తాలో మద్యం సీసాలు తీసుకువస్తున్నారు. దీనిపై సమాచారం రావడంతో సత్తెనపల్లి సెబ్ ఎస్ఐ కొమెరపూడిలో తనిఖీలు చేపట్టారు. పోలీసులను చూసిన మస్తాన్‌వలి, మరో యువకుడు మద్యాన్ని, బైక్‌ను అక్కడే వదిలేసి పరారయ్యారు. ఈ విషయం అంబటి రాంబాబుకు తెలియడంతో, ఆయన హుటాహుటిన సెబ్ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. 'మస్తాన్‌వలి మా కార్యకర్త, మద్యాన్ని, వాహనాన్ని వదిలేయండి' అని డిమాండ్ చేశారు. వదిలే ప్రసక్తే లేదని ఎస్ఐ చెప్పడంతో మంత్రి పోలీసులపై తీవ్రస్థాయిలో మండిపడ్డాడు. 'వచ్చేది మా ప్రభుత్వమే. నీ అంతు తేలుస్తా' అంటూ రుసరుసలాడుతూ వెళ్లిపోయాడు. ఆతర్వాత ఎస్ఐ మీడియాతో మాట్లాడుతూ.. 170 మద్యం బాటిళ్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మస్తాన్‌వలి మరో యువకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వలంటీర్లతో వైసీపీ సమావేశం



కాకినాడలో వలంటీర్ల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎంపీసీ అధికారులు

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 11: కాకినాడలోని నాగమల్లితోట జంక్షన్ సమీపంలో గురువారం వైసీపీకి చెందిన గుత్తుల సూర్యప్రకాశ్ వలంటీర్లతో సమావేశమైనట్టు వచ్చిన సమాచారంతో కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ కార్యకర్తలతో కలసి వెళ్లి వలంటీర్లను నిలదీశారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్‌తోపాటు పలువురు గోడదూకి పరారయ్యారని నానాజీ తెలిపారు. సంఘటనా స్థలానికి విచ్చేసిన సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వెంకటపతిరాజులకు నానాజీ ఫిర్యాదు చేశారు.

ఈద్గాల వద్ద వాటర్ బాటిల్స్‌తో వైసీపీ ప్రచారం



ముస్లింలకు పంపిణీ చేసేందుకు తీసుకువచ్చిన వాటర్ బాటిల్స్. వాటిపై 'ఓట్ ఫర్ ఫ్యాన్' స్టిక్కర్

కడప,ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా గురువారం ప్రార్థనలకు వచ్చిన ముస్లింలకు 'ఓట్ ఫర్ ఫ్యాన్' అనే స్టిక్కర్ ఉన్న వాటర్‌బాటిల్స్ పంపిణీ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. జమీల్ మొబైల్స్ పేరిట ఉన్న ఈ బాటిల్స్‌ను కడపలోని బిల్టప్, దండు వద్ద ఈద్గాలలో ముస్లింలకు పంపిణీ చేశారు. ఈ ప్రార్థనల్లో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సైతం పాల్గొన్నారు.

ఒక్క చాన్స్‌తో మాఫియా రాజ్!

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. గురువారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట సెంటర్, రాత్రికి అమలాపురంలో జరిగిన ప్రజాగళం ఉమ్మడి బహిరంగ సభల్లో వారిద్దరూ ప్రసంగించారు. జగన్ విధ్వంస పాలనలో దళితులు తీవ్రంగా నష్టపోయారని.. వారిపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఈ ముఖ్యమంత్రిది జగన్నాటకమని.. చేతికి అధికారం ఇస్తే మాఫియా సామ్రాజ్యం నడిపాడని.. పాలించమని పగ్గాలు కట్టబెడితే దోపిడీకి లైసెన్స్‌గా మార్చుకున్నాడని ధ్వజమెత్తారు. ఆయన ఇప్పుడు ఎక్స్‌పెయిరీ సీఎం అని మండిపడ్డారు. ఆయన ఉదయం అల్పాహారం కింద తినేది ఇసుక అయితే.. మధ్యాహ్న భోజనం కింద మద్యం, రాత్రి భోజనం కింద గనులు తినేసి రాష్ట్రం మొత్తాన్ని దోచేశారని విమర్శించారు. మళ్లీ గెలిపిస్తే ఈసారి ప్రజలను చంపేసి ఇళ్లకు డోర్ డెలివరీ చేస్తాడని హెచ్చరించారు. సిద్ధం అంటున్న సీఎం జగన్‌కు ఇక యుద్ధమేనని చంద్రబాబు అన్నారు. 'కోనసీమలో గన్నవరం గర్జించింది. ఇది గోదావరి గర్జన.. ప్రభుత్వ వ్యతిరేకతకు అద్దంపట్టే స్పందన ఇక్కడ కనిపిస్తోంది. ఇక్కడ ఎన్నికలు లాంఛనమే. మనమే గెలుస్తున్నాం. మన ఆడబిడ్డల స్పందన చూస్తుంటే, వీర మహిళలైతే ఎప్పుడు పోలింగ్ వస్తుందా అని ఎదురుచూస్తున్నారు. గాజుగ్లాసుకు ఓటేసి తద్వారా జగన్ గుండెల్లోకి గుచ్చేందుకు

జగన్ కోసం ఉద్యోగాలు వీడొద్దు..

వలంటీర్లతో జగన్ ఊడిగం చేయించుకునంటున్నారు. వారి జీవితాలను నాశనం చేస్తున్నారు. వారికి ఒకటే చెబుతున్నాం. రాజకీయాలు చేయవద్దు. వైసీపీ నేతలు చెప్పారని రాజీనామా చేస్తే మళ్లీ ఉద్యోగం రాదు. వచ్చేది కూటమి.. పోయేది మీ ఉద్యోగాలు. జగన్ ఉద్యోగాల కోసం మీ ఉద్యోగాలు పోగొట్టుకోవద్దు. వలంటీర్లకు పారితోషికం రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతాం.

చూస్తున్నారు. నేను పవన్ కల్యాణ్ వచ్చింది మీకు భరోసా కల్పించేందుకే.. మీ జీవితాల్లో వెలుగులు నింపేందుకే! సిద్ధం.. సిద్ధం అంటున్న జగన్‌ను తన్ని తరిమికొట్టాలి. కోనసీమకు వన్నె తెచ్చిన వ్యక్తి బాలయోగి. ఆయన్ను లోక్‌సభ స్పీకర్‌గా చేసిన పార్టీ టీడీపీ. ముగ్గురు మహానుభావులు బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే, అంబేడ్కర్ జయంతి జరిగే నెల ఇది. వారి సాక్షిగా హామీ ఇస్తున్నా. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదే. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రూ.200 ఉండే కరెంటు చార్జీలు ఇప్పుడు వైసీపీ హయాంలో రూ.2 వేలయ్యాయా లేదా?

సూపర్‌డూపర్ హిట్..

రాష్ట్ర ప్రయోజనాల కోసం జనసేన, టీడీపీ కలిశాయి.. వీటికి బీజేపీ తోడైంది. మేం కలిసి వచ్చామంటే సూపర్‌డూపర్ హిట్. ఎవరైనా అడ్డంగా వస్తే తొక్కుకుంటూ పోతాం. జగన్ ఒక అహంకారి. ఏపీని సర్వనాశనం చేశాడు. చివరకు ప్రజలను బెదిరించి వారి ఆస్తులను మెడపై కత్తి పెట్టి రాయించుకుంటున్నాడు. పట్టాదారు పాసుపుస్తకాల దగ్గర నుంచి సర్వేరాళ్ల వరకు ఫొటోలు వేయించుకున్నాడు. మాట్లాడితే బటన్ నొక్కాను అంటున్న జగన్ మద్యపాన నిషేధం అమలుపై ఎందుకు నొక్కలేదు? సీపీఎస్ రద్దు, డీఎస్సీపై ఎందుకు నొక్కలేదు? ఆయన్ను మళ్లీ సీఎంను చేస్తే రాష్ట్రంలో ఏమీ మిగలదు. అందుకే రాష్ట్రంలో ఉన్న అరాచకశక్తిని సాగనంపాలి. చిరంజీవి చిత్రసీమలో రారాజు. ఎన్నో గొప్ప అవార్డులు అందుకున్న గొప్ప వ్యక్తి. డైరెక్టర్ రాజమౌళి కూడా ఎంతో కీర్తిగడించారు. అలాంటి వ్యక్తులను జగన్ ఇంటికి పిలిపించి అవమానించారు. ఆయనకు సంస్కారం లేదు. కనకపు సింహాసనమున శునకాన్ని కూర్చుండబెట్టిన అనే సామెత ఊరికే రాలేదు. టీడీపీ, జనసేన కల



● గోదావరి ఉన్నా ఇసుక అందుతోందా? టీడీపీ హయాంలో రూ.1,000కే అందేది. ఇప్పుడు రూ.5 వేలు ఇస్తే తప్ప రావడం లేదు. ఈ డబ్బులు ఎవరికి పోతున్నాయి? - చంద్రబాబు

వక ముందు జగన్ దింపుడు కళ్లం ఆశతో ఉన్నారు. ఓట్లు చీలి లాభపడతామనుకున్నారు. కానీ పొత్తు కుదిరాక ఆయన ఆశలు అడియాసలయ్యాయి. ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు రావు. రొయ్యల పిల్లలకు పట్టే వైరస్ కంటే వైసీపీ వైరస్‌తోనే ఆక్వాకు నష్టం.

కోనసీమ అందాలసీమ..

కోనసీమ అందాలసీమ.. మంచినీళ్లు అడిగితే కొబ్బరి నీళ్లు ఇచ్చే మంచి మనస్తత్వం కలిగిన వ్యక్తులు ఉన్నారు. అటువంటి మంచి మనసున్న కోనసీమలో జమ్ముకశ్మీరు మాదిరిగా అల్లర్లు సృష్టించి ఇంటర్నెట్ బంద్ చేయించారు. ప్రజల మధ్య విద్వేషాలు పెట్టి రెచ్చగొట్టిన దుర్మార్గుడు జగన్. గోదావరి జిల్లాలో చిచ్చుపెట్టి చలి కాచుకోవాలని చూస్తున్నాడు.

కాపులకేదీ సాయం?

కాపుల్లో కూడా పేదలున్నారు. వారి కోసం ఏడాదికి రూ.1,000 కోట్లు ఖర్చుపెట్టాం. వారి కోసం ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చుపెడతానని ప్రగల్భాలు పలికిన జగన్.. కనీసం రూ.10 కోట్లయినా ఖర్చు చేశాడా? మీరు కొట్టే దెబ్బతో జగన్‌రెడ్డికి అదిరిపోవాలి. హలో ఏపీ... బై బై జగన్.



జగన్ జైలుకే

కూటమిని ఎవడ్రా ఆపేది?.. పచ్చని కోనసీమలో కుల చిచ్చు రగిల్చింది జగనే

కలహాల సీమ కాదు.. ప్రేమ సీమ కావాలి: పవన్

ఎన్నికల తర్వాత జగన్ వెళ్లేది జైలుకేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ హెచ్చరించారు. జగన్ జీవితం జైలుకు, బెయిల్‌కు మధ్య ఊగిసలాడుతోందన్నారు. 'వైసీపీకి ప్యాకప్ చెప్పడం ఖాయమైపోయింది. జగన్‌కు రోజులు దగ్గరపడ్డాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం రాకుండా ఎవడ్రా ఆపేది? జగన్ రాష్ట్రంలో 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టారు. జేపీ వెంచర్స్‌ను అడ్డం పెట్టుకుని.. మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి, సజ్జల ముఠాగా ఏర్పడి ఇసుక రీచ్‌లను దోచుకున్నారు. ఇది కలహాల సీమ కాదు.. ప్రేమ సీమ.. కొబ్బరి నీళ్ల ఎంత మధురంగా ఉంటాయో అలాంటి లేత మనసున్న కోనసీమను జగన్ వచ్చి కలహాలు సీమగా చెయ్యడానికి ప్రయత్నం చేశాడు. భవిష్యత్‌లో కూడా కలహాల సీమగా కాకుండా, కొట్లాట సీమలా కాకుండా ప్రేమ సీమలా ఉండాలి. శెట్టిబలిజలు, మాలలు, మాదిగలు, క్షత్రియ సామాజికవర్గం, వనబలిజలు, మత్స్యకారులు, క్రిస్టియన్లు సహా 127 బీసీ కులాలు అన్యోన్యంగా ఉండాల్సిన సమయమిది. నేను వస్తే నా కులం నాయకుడితో తిట్టిస్తారు. బీసీ, ఎస్సీ నాయకులు చేత తిట్టిస్తారు. చంద్రబాబు వెళ్తున్న బండిని క్లైమోర్‌మైన్స్‌తో లేపేస్తే కిందపడి చొక్కా దులుపుకొని ఏమాత్రం భయంలేకుండా మళ్లీ ముందుకు వెళ్లి దశాబ్దాల పాటు రాజకీయాలు నడిపిన నేత మన చంద్రబాబు. ఉద్దానం సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్తే.. నాలుగు గంటల్లో పరిష్కారం చూపారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఏపీలోని ఐదుకోట్ల మంది ప్రజలను కాపాడడానికి త్రివేణి సంగమంలాగా కూటమిని ఏర్పాటుచేశాం. కోనసీమలో ఉన్న రెండున్నర లక్షల హెక్టార్లలో విశాలంగా ఉన్న కొబ్బరి తోటల కోసం కనీసం కోకోనట్ బోర్డు ఏర్పాటు చేసుకోలేకపోయాం. అంబాజీపేటలో కొబ్బరి పరిశోధన కేంద్రం ఉన్నప్పటికీ కేరళ, తమిళనాడు తరహాలో అత్యాధునికమైన పరిజ్ఞానంతో కావాల్సిన పరిశ్రమలు నెలకొల్పలేకపోయాం. కోనసీమ రైతాంగం క్రాప్ హాలిడే ప్రకటించింది. ఇలాంటి దుస్థితి రాకుండా ఎన్డీయే రైతు కన్నీరు తుడుస్తుంది. నేను సినిమాలు తీసుకుంటే కోట్ల రూపాయలు సంపాదించకుంటా. ఈరోజు ప్రతి అడ్డమైన వ్యక్తులు నాపై ధ్వజమెత్తుతున్నారు. ప్రజల భవిష్యత్ కోసం అన్నీ వదులుకుని పనిచేస్తున్నాను. యువత సొంత ప్రాంతంలోనే ఉండి ఉపాధి పొందేలా అనువజ్ఞుడైన చంద్రబాబు సహకారంతో కృషిచేస్తా. మా ప్రభుత్వం లా ఆర్డర్ బలంగా ఉండేలా బాధ్యత తీసుకుంటుంది.

కాటన్‌లా పనిచేస్తాం..

ఒకప్పుడు సర్ ఆర్థర్ కాటన్ మీకోసం ఎలా పనిచేశారో మా కూటమిలోని ప్రతి ఒక్కరం అదేవిధంగా పనిచేస్తాం. గంగాబొండాలను ఇచ్చే రకం కొబ్బరి మొక్కలు ఎక్కడో ఉండే వైసీపీ నాయకుల కోసం వేలాదిగా తరలిపోతున్నాయి. కోనసీమ రైతాంగానికి ఒక్క మొక్క కావాలంటే చాలా ఆంక్షలు విధిస్తున్నారు. ఈ రకం కొబ్బరి మొక్కలు ఇక్కడి రైతాంగానికి వచ్చేవిధంగా చాలా గట్టి చర్యలు తీసుకుంటాం. కోనసీమలో కొబ్బరి ఉత్పత్తులు అధికంగా ఉన్న దష్ట్యా అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తాం. రైతుభరోసా కేంద్రాలు రైతులకు అండగా ఉంటాయనుకుంటే కాకినాడలో ఉండే ఒక మాఫియా డాన్‌వైపు వెళ్లిపోయాయి. అదే మాఫియా డాన్‌తో ఇప్పుడు పోరాడుతున్నాం. మాఫియా డాన్లను తన్ని తరిమేసే వరకు నిద్రపోం. వారందరిపై చట్టపరమైన చర్యలు ఉంటాయి.

బీసీలకు 50 ఏళ్లకే 4 వేల పింఛను

- రూ.లక్షన్నర కోట్లతో సబ్ ప్లాన్: చంద్రబాబు

అమరావతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే బీసీ వర్గాలకు 50 ఏళ్లకే నెలకు రూ.4 వేలు పింఛనుగా ఇస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా గురువారం ఆయనకు నివాళి అర్పించారు. ఆయన స్ఫూర్తితో బీసీలకు ప్రత్యేకంగా ఉప ప్రణాళిక తెచ్చిన ఘనత టీడీపీదేనన్నారు. 'బీసీలకు రూ.లక్షన్నర కోట్లతో సబ్ ప్లాన్ అమలు చేస్తాం. వారి స్వయం ఉపాధికి ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తాం. వృత్తిదారులు, చేతి పనుల వారికి ఆదరణ పథకం కింద రూ.5 వేల కోట్ల విలువ చేసే పరికరాలు అందిస్తాం. చంద్రన్న బీమా పథకాన్ని పునరుద్ధరించి పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచుతాం. పెళ్లి కానుకనూ రూ.లక్షకు పెంచుతాం. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి మళ్లీ పెంచడానికి పోరాడతాం. బీసీలు ప్రతిసారీ కుల ధ్రువీకరణ పత్రం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తాం' అని పేర్కొన్నారు. పూలే ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తామన్నారు.



రంజాన్ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న చంద్రబాబు

మత విద్వేషాల సృష్టికి.. జగన్ వేచి చూస్తున్నాడు: బాబు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల ముందు మత విద్వేషాలు సృష్టించడానికి జగన్ దొంగలా వేచిచూస్తున్నాడని టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోపించారు. తన గొంతులో ప్రాణముండగా ఆంధ్రప్రదేశ్‌లో ముస్లింలకు అన్యాయం జరగనివ్వనన్నారు. రంజాన్‌ను పురస్కరించుకుని గురువారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 1999, 2014లో కూడా టీడీపీ, బీజేపీ కలసి ప్రభుత్వం ఏర్పాటు చేశాయని... ఎప్పుడూ ముస్లిం, మైనారిటీల హక్కులు హరించలేదని గుర్తుచేశారు. 'ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు పెట్టి, వాటిని సుప్రీంకోర్టులో కాపాడింది టీడీపీయే. మా ముస్లింలు, మా మైనారిటీలు అనే జగన్ ఏం చేశాడు? కనీసం రిజర్వేషన్లను కూడా కాపాడలేకపోయాడు. మేం అధికారంలోకి వస్తున్నాం. వచ్చిన వెంటనే 4 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తాం. పౌరసత్వ సవరణ చట్టాని(సీఏఏ)కి పార్లమెంటులో సపోర్ట్ చేసింది జగనే. ముస్లింలకు తీవ్ర అన్యాయం చేసిన ద్రోహి. మైనారిటీ కార్పొరేషన్ మేమే ఏర్పాటుచేశాం. హైదరాబాద్‌లో ఉర్దూ వర్సిటీ పెట్టించాను. రాష్ట్ర విభజన తర్వాత మళ్లీ కర్నూలులో ఉర్దూ విశ్వవిద్యాలయం ఏర్పాటుచేశాను. హజ్ హౌస్‌లు కట్టింది, వాటికి ఆర్థిక సాయం చేసింది కూడా మేమే. పేద ముస్లింలను ఆదుకోవడానికి రంజాన్ తోఫా ఇచ్చాం. 10 లక్షల మందికి ఇచ్చాం. ఇవాళ ఈ ప్రభుత్వం ఇస్తోందా? సంక్రాంతి కానుక కూడా ఇచ్చాం. పెళ్లిళ్లకు రూ.50 వేల ఆర్థిక సాయం చేశాం. మసీదులకు ఆర్థిక సహాయం చేశాం. ఇమామ్‌లకు గౌరవ వేతనాలు ఇచ్చాం. ఏదీ.. జగన్ ఇస్తున్నాడా? ముస్లిం పిల్లల కోసం విదేశీ విద్య పెట్టి రూ.15 లక్షలు అందించాం. ఈరోజు అన్నీ పోయాయి' అని స్పష్టంచేశారు.



చెక్‌పోస్టు వద్ద కలెక్టర్, ఎస్పీ, సిబ్బందితో మాట్లాడుతున్న సీఈవో మీనా

రూ.100కోట్ల విలువైన సొత్తు జప్తు

- సీఈవో ముఖేష్‌కుమార్ మీనా వెల్లడి

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రూ.100కోట్లకుపైగా విలువైన నగదు, లిక్కర్, డ్రగ్స్, ఇతర వస్తువులను జప్తు చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత 24గంటల్లోనే రూ.197.66 లక్షల విలువైన వస్తువులను జప్తు చేసినట్టు తెలిపారు. జప్తు చేసిన వాటిలో రూ.2,503.13 లక్షల నగదు, రూ.1,249.68లక్షల విలువైన మద్యం, రూ.205.94లక్షల విలువైన డ్రగ్స్, రూ.5,123.58 లక్షల విలువైన ప్రెషస్ మెటల్స్, రూ.242.94లక్షల విలువైన ఉచిత వస్తువులు, రూ.704.66లక్షల విలువైన ఇతర వస్తువులను జప్తు చేసినట్లు పేర్కొన్నారు.

ప్రకాశంలో చెక్‌పోస్టుల తనిఖీ

ఒంగోలు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులను గురువారం సీఈవో మీనా తనిఖీ చేశారు. మద్దిపాడు మండలం గుండ్లాపల్లి చెక్‌పోస్టును, పాత సింగరాయకొండ చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. వాహనాల తనిఖీ, వీడియో రికార్డింగ్ పనులను పరిశీలించారు.

రూ.5 కోట్ల బంగారం.. వెండి స్వాధీనం

పెద్దాపురం, ఏప్రిల్ 11: కాకినాడ జిల్లా పెద్దాపురంలో రూ.5 కోట్ల విలువైన బంగారం, వెండి వస్తువులను గురువారం అర్ధరాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెద్దాపురంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు.. బీవీసీ లాజిస్టిక్స్‌కు చెందిన వాహనాన్ని సోదా చేయగా.. 8.116 కిలోల బంగారం, 46 కిలోల వెండి వస్తువులు కనిపించాయి. కాకినాడ నుంచి విశాఖపట్టణం వెళుతూ.. పెద్దాపురంలోని ఓ నగల దుకాణం నుంచి వెండి వస్తువులను తీసుకువెళుతుండగా.. పోలీసులు ఆ వాహనాన్ని తనిఖీ చేశారు. పట్టుబడిన బంగారు, వెండి వస్తువులకు సంబంధించి సరైన ఆధారాలు చూపించని కారణంగా పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పాలకొండలో కేజీ బంగారం పట్టివేత

పాలకొండ, ఏప్రిల్ 11: పార్వతీపురం మన్యం జిల్లాలో కారులో తరలిస్తున్న కేజీ బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల దృష్ట్యా పాలకొండలోని గాయత్రీదేవి ఆలయ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో రాయగడ నుంచి శ్రీకాకుళం వెళుతున్న కారులో అక్రమంగా తరలిస్తున్న కేజీ బంగారం పట్టుబడింది.

స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల నిర్వహణే లక్ష్యం: మీనా

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 11: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా, స్వేచ్ఛగా, నిర్భయంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా చెప్పారు. గురువారం నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎంసీసీ, సీవిజిల్, ఓటర్ హెల్ప్‌లైన్ 1950 పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ ఈ నెల 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యాక పూర్తిస్థాయిలో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

అధికారపక్షానికి జెన్కో ఉద్యోగుల ప్రచారం

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జెన్కో ఉద్యోగులు అధికారపక్షానికి అనుకూలంగా యథేచ్ఛగా ఎన్నికలప్రచారం చేస్తున్నారు. వైసీపీ కార్యకర్తల్లా మారి రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్‌టీపీపీ) ఉద్యోగులు ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌కుమార్‌రెడ్డి తరఫున ఆర్‌టీపీపీ ఉద్యోగులు ప్రచారం చేస్తున్నారు. ఉద్యోగులు కొందరు వైసీపీతరఫున ప్రచారం చేస్తున్నా.. జెన్కో యాజమాన్యం పట్టించుకోవడంలేదు. ఎన్నికలప్రచారంలో పాల్గొనే.. ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవల్సి ఉన్నా.. జెన్కో యాజమాన్యం పట్టించుకోకపోవడాన్ని ఉద్యోగులు తప్పుబడుతున్నారు.

'సుమోటో' నాటకం!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఆదేశించారు. వెంటనే పని ప్రారంభించాలంటూ వాట్సాప్ ఆదేశాలిచ్చారు. కోడ్ అమల్లో ఉన్నందున ఇలా చేయలేమని జేసీలు చెప్పినా ఆయన పట్టించుకోలేదు. 'ఈ పని చాలా ముఖ్యం. చేసి తీరాల్సిందే' అని ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. కానీ... ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి కేసుల్లో ఇరుక్కోవడానికి తాము సిద్ధంగా లేమంటూ పలువురు జేసీలు తేల్చిచెప్పేశారు. దీంతో సీన్ రివర్స్ అయింది. అయితే... ప్రభాకర్ రెడ్డి తన పై అధికారికే తెలియకుండా ఈ తతంగం నడుపుతున్నట్లు తెలిసింది.

ఏమిటీ "సుమోటో"?

కుల, ఆదాయ, స్థానికత, ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ఒక పద్ధతి ఉంది. తొలుత విద్యార్థులు తమకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం స్థానిక 'మీ సేవ' ద్వారా దరఖాస్తుచేసుకోవాలి. గ్రామ లేదా వార్డు రెవెన్యూ అధికారి దీనిని పరిశీలిస్తారు. అర్హులని తేలితే తహసీల్దార్ ఆమోదంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. ఇదీ ఇప్పుడు అమలులో ఉన్న విధానం. కానీ... ఎన్నికల సమయంలో రెవెన్యూ సిబ్బందిని ఇంటింటికీ పంపించి, పరోక్షంగా 'జగన్ భజన' చేయించేందుకే 'సుమోటో'ను తెరపైకి తెచ్చారు. అంటే... గ్రామ, వార్డు రెవెన్యూ సిబ్బంది ఇంటింటికి వెళ్లి వారిది ఏ కులమో, ఏ మతమో తెలుసుకుంటారు. దరఖాస్తు చేసుకోకున్నా వీళ్లే సుమోటోగా కుల ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. పనిలో పనిగా... జగన్ అనుకూల ప్రచారం కూడా చేయడమే దీని అసలు ఉద్దేశం.

ఎందుకంత ఆరాటం?

రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఉపాధి హామీ పథకం, సాధికారిక సర్వే డేటాల రూపంలో సర్కారు వద్ద ప్రజలకు సంబంధించిన సకల సమాచారం అందుబాటులో ఉంది. ఆ డేటా ఆధారంగా కుటుంబంలో ఒకరికి కుల ధ్రువీకరణ పత్రం ఇంతకు ముందే ఇచ్చి ఉంటే, మిగిలిన వారికి పెద్దగా విచారణ లేకుండానే సర్టిఫికెట్లు ఇవ్వాలని జీఓ 469 చెబుతోంది. పైగా... కుల ధ్రువీకరణ పత్రాలు అందరికీ అవసరం ఉండదు. కానీ, 'మీరే ఇంటింటికీ వెళ్లండి. అందరికీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వండి' అని ప్రభాకర్ రెడ్డి ఆదేశించడం గమనార్హం.

ఎన్నికల వేళ ఇదేం గోల?

రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఎన్నికల నిర్వహణ విధుల్లో తలమునకలయ్యారు. ఈ సమయంలో సుమోటో కుల ధ్రువీకరణ స్కీమ్‌ను తెరపైకి తేవడంతో వారంతా తలలు పట్టుకుంటున్నారు. నిజానికి జూన్‌లో కొత్త విద్యాసంవత్సరం మొదలవుతుంది. కులం, ఆదాయ సర్టిఫికెట్లు అప్పుడు అవసరమవుతాయి. రాష్ట్రంలో ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకానుంది. మే 13న పోలింగ్ ఉంటుంది. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపడతారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాతే 'సుమోటో' కార్యక్రమం చేపట్టవచ్చు. కానీ... కోడ్ అమలులో ఉన్నప్పుడే రెవెన్యూ సిబ్బందిని ఇంటింటికీ తిప్పాలనే ఆలోచన వెనుక అసలు వ్యూహం వేరే ఉంది. సర్టిఫికెట్ల పేరిట సిబ్బందిని ఇంటింటికీ పంపించి జగన్ అనుకూల ప్రచారం చేయించాలన్నది అసలు కోణమని ఆ వర్గాలు చెబుతున్నాయి.

జేసీలపై ఒత్తిళ్లు

"సమీకృత కుల ధ్రువీకరణ పత్రాల విన్నపాలను వీఆర్‌ఓల లాగిన్‌కు పంపించాం. ఎన్నికల సమయంలో ఈ పనిని తక్షణమే చేపట్టేలా వీఆర్‌ఓలకు ఆదేశాలు ఇవ్వండి" అని బుధవారం జేసీలు, తహసీల్దార్‌లకు పంపించిన వాట్సాప్ ఆదేశాల్లో సీసీఎల్ఏ అధికారి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. అయితే, పలువురు జేసీలు ఈ పనిచేయలేమని చేతులెత్తేశారు. దీంతో గురువారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని, అందులో అన్ని విషయాలు మాట్లాడదామని చెప్పారు. రంజాన్ పండుగ సందర్భంగా గురువారం సెలవురోజు. అయినా ఈ పనిపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి జేసీలను దారికి తీసుకొచ్చి సుమోటో కార్యక్రమం అమలు చేయాలని ప్రభాకర్ రెడ్డి గట్టి ప్రయత్నమే చేశారు. అయితే, జేసీల నుంచి సానుకూల స్పందన రాలేదు.

ఆర్డీవో కోసం అడ్డదారులు!



- విచారణ తీరే మార్చేసిన తిరుపతి జేసీ
- ఫిర్యాదు చేసిన వ్యక్తికే బెదిరింపులు
- లంచం ఇచ్చి నేరం చేశావని వింత వాదన
- సీఎస్, సీసీఎల్ఏ ఆదేశాలూ బేఖాతరు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆయన ఒక ఆర్డీవో. కాకపోతే ప్రభుత్వ పెద్దలకు అత్యం త ఆప్తుడు. అయన్ను తీవ్రస్థాయిలో అవినీతి ఆరోపణలు చుట్టు ముట్టాయి. సాక్షాత్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శినే(సీఎస్) ఆయనపై విచారణకు ఆదేశించారు. ఆర్డీవోలకు బాస్ అయిన సీసీఎల్ఏ కూడా విచారణకు ఆదేశించారు. ఇక అక్కడి నుంచి అసలు కథ మొదలైంది. బెదిరింపులు, హూంకరింపులు, అనేకం జరిగిపోయాయి. కట్ చేస్తే ఆర్డీవో సుద్దపూస అని తేల్చేశారు. తూతూమంత్రంగా విచారణ చేసి, ఫిర్యాదుదారులనే బెదిరించి, అదిలించి కేసును తేల్చేశారు. ఆర్డీవోతోపాటు మరో తహసీల్దార్‌ను సురక్షితంగా అవినీతి ఆరోపణలనుంచి బయటపడేశారు. ఇది రాష్ట్రంలో పాలనకు మచ్చుతునక. సాక్షాత్తూ శ్రీవారి పాదాల చెంత ఉన్న తిరుపతిలోనే ఇదంతా జరిగింది. అసలు విషయంలోకి వెళితే... జగన్ పరిపాలన ఇంత గొప్పగా ఉందా? సీఎస్, సీసీఎల్ఏ ఆదేశాల అమలు ఇంత ఘోరంగా ఉంటుందా అని విస్తుపోతారు.

జరిగింది ఇదీ...

ఆయన ఓ ప్రభుత్వ సాంకేతిక నిపుణుడు. సీఎస్ జవహర్ రెడ్డికి సన్నిహితుడు. ఇద్దరూ ఒకే విభాగంలో కలిసి పనిచేశారు. ఆయన అల్లుడికి పుత్తూరు సమీపంలో హెచ్‌పీసీఎల్ పెట్రోల్‌బంక్ మంజూరయింది. బంక్ ఏర్పాటుకు అవసరమైన అన్ని అనుమతుల ఫైళ్లు కలెక్టరేట్‌కు చేరాయి. రెవెన్యూ శాఖ ఇచ్చే నిరభ్యంతర పత్రం ఒక్కటే పెండింగ్‌లో ఉంది. దాని కోసం ఆయన తిరుపతి ఆర్డీవో కార్యాలయాన్ని సంప్రదించారు. 'నేను ఆర్డీవోకు ప్రతినిధిని, ఆయన మాటే నా మాట' అంటూ ఎన్‌వోసీల జారీ విభాగం చూసే ఓ జూనియర్ అసిస్టెంట్ బేరాలకు దిగారు. దరఖాస్తుదారు తనకు పరిచయం ఉన్న అప్పటి జిల్లా కలెక్టర్ లక్ష్మీశను కలిసి విషయం చెప్పారు. "ఈ పని చాలా ముఖ్యమైనది. నీడ్‌ఫుల్. నిబంధనల ప్రకారం చేయండి' అని తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డికి కలెక్టర్ సూచన చేశారు. విచిత్రంగా అప్పటినుంచి దరఖాస్తుదారును మరింత ముప్పు తిప్పలు పెట్టారు. ముడుపుగా ఇవ్వాల్సిన సొమ్ము మరింతగా పెంచారు. దరఖాస్తుదారు నేరుగా ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని కలిశారు. "నేనొచ్చి సైట్‌ను చూడాలి. ఆ తర్వాతే నిర్ణయం తీసుకుంటాను" అని ఆర్డీవో బదులిచ్చారు. ఆ తర్వాత కలిసినా ఇదే సమాధానం. 'నువ్వు ఎన్నిసార్లు తిరిగినా పనులుకావు. డబ్బులు ఇస్తేనే సంతకం పెడతారు' అని సదరు జూనియర్ అసిస్టెంట్ చెప్పారు. దరఖాస్తుదారు టోకెన్‌గా రూ.లక్ష ఆ జూనియర్ అసిస్టెంట్‌కు ఆర్డీవో చాంబరులో చెల్లించారు. అప్పుడు ఆర్డీవో ఆఫీసులో లేరు. ముడుపులు చెల్లించిన తర్వాత ఫైలుకు కదలిక వచ్చింది. ఎన్‌వోసీకి జత చేసిన భూమిస్కెచ్‌పై(మ్యాప్) పుత్తూరు మండల తహసీల్దార్ సంతకం చేయాల్సి ఉంది. రెగ్యులర్‌గా జరగాల్సిన ప్రక్రియే ఇది. కానీ నాటి పుత్తూరు తహసిల్దార్ కూడా ముడుపు కట్టాల్సిందే అని డిమాండ్ చేశారు. అడిగిన దాంట్లో కొంత చెల్లించారు. దీంతో స్కెచ్‌పై సంతకం చేయకుండా తిరిగి ఆర్డీవోకు పంపించారు. ఇదే క్రమంలో తిరుపతి కలెక్టరేట్‌లో పని చేసే ఓ సూపరింటెండెంట్ ముందుకొచ్చి బేరం మాట్లాడారు. భయపడిపోయిన దరఖాస్తుదారు నేరుగా సీఎస్‌కు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత సీసీఎల్ఏ సాయిప్రసాద్‌ను కలిసి జరిగిన పరిణామాలను వివరించారు. తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టరు, జేసీని ఆదేశించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నాటి తిరుపతి జేసీ శుభం బన్సల్ నిష్పాక్షిక విచారణ చేపట్టాలి. ప్రభుత్వానికి వాస్తవాలతో కూడిన నివేదిక ఇవ్వాలి. కానీ జేసీ విచారణ బాధితులే బెదిరిపోయేలా సాగింది. ఫిర్యాదుదారును కాకుండా ఆయన అల్లుడిని ఓ రాత్రివేళ తిరుపతికి పిలిపించి హడావుడిగా విచారణ చేశారు. ఆ సమయంలో జేసీ క్యాంప్ ఆఫీసు ప్రాంగణంలో ఆర్డీవో, డబ్బులు వసూలు చేసిన అధికారి, ఇతరులు మకాం వేసి ఉన్నారు. బాధితుడి అల్లుడు... తనకు ఎదురైన అవినీతి వసూళ్లు, దందాల గురించి జేసీకి పూసగుచ్చినట్లు వివరించారు. దానికి ఆయన.. 'ప్రభుత్వ అధికారులు లంచం తీసుకోవడం నేరమే. వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మరి లంచం ఇవ్వడం కూడా నేరమే. అందుకు మీపై కూడా కేసులు నమోదు చేసి విచారణ చేయాల్సి ఉంటుంది. అందుకు మీరు సిద్ధమేనా? అని ప్రశ్నించారు. దీంతో ఆయన షాకయ్యారు. క్యాంపు ఆఫీసు నుంచి బయటకు వస్తుండగా.. అక్కడే ఉన్న జూనియర్ అసిస్టెంట్ ఆయన నుంచి తీసుకున్న సొమ్ము తిరిగి ఆయన చేతిలోనే పెట్టి వెళ్లిపోయారు. అప్పటికప్పుడు ఈ విషయం జేసీ దృష్టికి తెచ్చారు. టేబుల్‌పై ఆ డబ్బులు పెట్టేశారు. ఇది జరిగిన వెంటనే బాధ్యత గల జేసీ ఏం చేయాలి? సదరు అధికారులను ఏసీబీకి పట్టించాలి. దీనికి భిన్నంగా మరుసటిరోజు చంద్రగిరి తహసీల్దార్‌కు ఆ డబ్బులు ఇచ్చి పంపించారు. మరోవైపు జేసీ విచారణ పూర్తిచేసి ఫిబ్రవరి 25న నివేదిక ఇచ్చారు. దాని ప్రకారం అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్డీవో, ఇతర సిబ్బంది బయటపడినట్లే. "జూనియన్ అసిస్టెంట్‌కు డబ్బులు ఇచ్చినట్టు ఫిర్యాదుదారు చెబుతున్న సమయంలో అక్కడ తాను లేనని ఆర్డీవో అంటున్నారు. ఆ సమయంలో ఎన్నికల శిక్షణలో ఉన్నానని, డబ్బుల విషయం తెలియదని చెబుతున్నారు" అని నివేదికలో తెలిపారు. ఈ నివేదిక ఇలా తయారుకావడం వెనుక ప్రభుత్వ పెద్దల ఆదేశాలు ఉన్నాయని చెబుతున్నారు. నివేదిక ఫిబ్రవరి 27న సీసీఎల్ఏ కార్యాలయానికి చేరుకుంది. ఆ నివేదికను విజిలెన్స్ విభాగం వెంటనే సీసీఎల్ఏ సాయిప్రసాద్ పరిశీలనకు అందించాలి. కానీ సీసీఎల్ఏలో పనిచేసే ఓ అధికారి...ఆ ఫైలును పక్కన పడేశారని తెలిసింది. తిరుపతి ఆర్డీవో, పుత్తూరు తహసిల్దార్‌తోపాటు మరో ఇద్దరిని కాపాడేందుకు తనదైన శైలిలో ఫైలును పక్కనపెట్టేశారని సమాచారం. ఇక సచివాలయంలోనూ ఓ అధికారి...ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని కాపాడేందుకు శత విధాలా ప్రయత్నిస్తున్నారు. ఆర్డీవో ఏ తప్పూ చేయలేదని జేసీ నివేదిక ఉందని, కాబట్టి చర్యలు తీసుకొనే పనిలేదంటూ సీసీఎల్ఏలోని అధికారి, సచివాలయంలోని మరో అధికారి అడ్డగోలు ప్రయత్నాలు చేస్తున్నారు.

బస్తీవాసులపై బాదుడే బాదుడు

(మొదటి పేజీ తరువాయి)

అదనం. గత ఏడాది పెంచిన పన్నులే భరించలేని స్థాయికి చేరాయని ఇళ్ల యజమానులు వాపోయారు. ఇప్పుడు ఆ భారం మరింత పెరిగింది. ప్రస్తుతం హైదరాబాద్ మహానగరాన్ని మించి విజయవాడ, గుంటూరు నగరవాసులు ఆస్తి పన్ను చెల్లించాల్సి వస్తోంది.

నాలుగేళ్లలోనే 82.27 శాతం పెంపు

కేంద్రం తెచ్చిన ఆస్తి విలువ ఆధారిత పన్నుల విధానాన్ని ఏపీలో జగన్ సర్కారు తప్ప దేశంలో మరే రాష్ట్రం అమలు చేయడం లేదు. అంతకుముందు అద్దె విలువ ఆధారంగా ఆస్తి పన్ను విధించే వారు. ఆస్తి విలువ ఆధారిత పన్నుపై స్థానిక సంస్థలు పాలకమండలిలో తీర్మానం చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్, ముంబయ్, బెంగళూరులాంటి మహానగరాల్లో సైతం ఈ కొత్త విధానం ఇంకా అమల్లోకి రాలేదు. కానీ ఏపీలో దీన్ని అమలు చేసి జనాల నుంచి భారీగా పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏటా భూముల విలువను పెంచుతోంది. దీంతో ఆస్తి విలువ కూడా పెరుగుతుంది. దానికి అనుగుణంగా ఇంటి పన్ను పెరుగుతూనే ఉంటుంది. ఇప్పుడు స్టార్ హోటల్ నుంచి చిన్న షాపు వరకు అందరికీ ఒకేరకమైన పన్నురేటు నిర్ణయించారు. 2021-22 నుంచి ఆస్తి విలువ ఆధారిత పన్నును అమల్లోకి తెచ్చారు.

నాడు... నేడు...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2002లో నివాస భవనాలకు, 2007లో వాణిజ్య భవనాలకు ఆస్తిపన్ను సవరించారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత, రాష్ట్రం ఆర్థికలోటులో ఉన్నప్పటికీ ఆస్తి పన్నును మాత్రం పెంచలేదు. పైగా పట్టణాల్లో అనేక వసతులను మెరుగు పరిచింది. ఎల్ఈడీ వీధిదీపాలను ఏర్పాటు చేసింది. కాలనీల్లో సీసీ రోడ్లు వేసింది. ఇంకా టీడీపీ హయాంలో పట్టణాలకు అనేక వసతులు సమకూరాయి. జగన్ వచ్చిన తర్వాత నగరాలు, పట్టణాల అభివృద్ధికి చేసిందేమీ లేకపోయినా పన్నుల బాదుడు మాత్రం విపరీతంగా పెంచేసింది. మూడేళ్లుగా ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని తెచ్చి... ఏటా పన్ను పోటును పెంచేస్తోంది. దాని ప్రకారం నివాస భవనాలకు రిజిస్ట్రేషన్ విలువలో 0.15 శాతం, వాణిజ్య భవనాలకు 0.30 శాతం చొప్పున ఆస్తి పన్ను నిర్ణయించారు. ఫలితంగా పన్ను కొన్ని రెట్లు పెరిగిపోయింది. ఒకేసారి అంత భారీగా పన్ను పెంచేస్తే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని ఏటా 15 శాతం పెంచాలని నిర్ణయించారు. 2020-21 సంవత్సరంలో ఆస్తి పన్ను డిమాండ్ రూ.1,157 కోట్లు. 2021-22లో అది రూ.1319 కోట్లు, 2022-23లో రూ.1617 కోట్లు, 2023-24 నాటికి రూ.1834 కోట్లకు పెరిగిపోయింది. ఇప్పుడు ఏకంగా ఆస్తి పన్ను డిమాండ్ 2024-25లో రూ.2109 కోట్లు. అంటే నాలుగేళ్లలో 82.27 శాతం పన్నులు పెంచేశారు.

ఎటు చూసినా బాదుడే..

జగన్ ప్రభుత్వం వచ్చాక తాగునీరు, డ్రైనేజీ చార్జీలను విజయవాడలో ఒకేసారి 200 నుంచి 300 శాతానికి పన్నులు పెంచారు. ఆ తర్వాత ఏటా ఏడు శాతం చొప్పున పెంచుకుంటూ పోతున్నారు. ఇల్లు నిర్మించేటప్పుడు భవన నిర్మాణ ఫీజులు, సదుపాయాల కోసం అభివృద్ధి చార్జీలు, ఆఖరికి మొక్కలు వేస్తే దానిచుట్టూ వేసే ట్రీగార్డులకు సైతం ప్రజల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇంటిపన్నుపై అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు కొన్ని చోట్ల అదనంగా వేసి ఆ తర్వాత ఇంటిపన్నులో కలిపేశారు. ఈ రకంగా పరోక్షంగానూ పన్నులు పెంచుతూ పోతున్నారు. ఇల్లు కొనుక్కొన్నప్పుడు పెరిగిన విలువను బట్టి స్టాంప్‌డ్యూటీ చెల్లిస్తారు. ఇన్‌కంట్యాక్స్ క్యాపిటల్ గెయిన్స్, ఇతర పన్నులు ప్రభుత్వానికి చెల్లిస్తారు. సొంత ఇంటిలో నివాసం ఉన్నా, కొంత భాగాన్ని అద్దెకు ఇచ్చినా అద్దె విలువ పెరుగుతుంది తప్ప, ఆస్తి విలువ బట్టి ప్రతి సంవత్సరం అదనపు ఆదాయం రాదు. అయినా ప్రభుత్వం పెరిగిన ఆస్తి విలువకు ఏటా పన్ను చెల్లించమనడం అన్యాయమని పలువురు పేర్కొంటున్నారు.



పోలవరం ఎమ్మెల్యే బాలరాజును నిలదీస్తున్న గ్రామస్థులు

బాలరాజూ.. గో బ్యాక్

- ఐదేళ్లకు గుర్తొచ్చామా.. ఏ మొహంపెట్టుకొని వచ్చారు!
- పోలవరం వైసీపీ ఎమ్మెల్యే, అభ్యర్థికి నిరసన సెగ
- కృష్ణాపురం రాకుండా అడ్డుకున్న స్థానికులు

టి.నరసాపురం, ఏప్రిల్ 11: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఆయన సతీమణి, ప్రస్తుత వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మికి నియోజకవర్గంలో నిరసన సెగ తగిలింది. ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలం కృష్ణాపురంలో గురువారం ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మిని గో బ్యాక్ అంటూ స్థానికులు వారిని గ్రామంలోనికి అడుగుపెట్టకుండా దాదాపు గంట సేపు అడ్డుకున్నారు. 'ఐదేళ్లుగా గ్రామంలో అడుగు పెట్టలేదు. ఇప్పుడు ఎన్నికలు వచ్చాయని వచ్చారు. మరలా ఓట్లు వేస్తే ఇక కనిపించరు. మీ పార్టీ నాయకులు మా ఓట్లతో పనే లేదని చెప్పారు. ఇప్పుడు ఎందుకు వచ్చారు, అంటూ నిలదీశారు. ఐదేళ్లుగా గ్రామ సమస్యలు పట్టించుకోని మీరు ఇప్పుడు ఓటు అడిగే హక్కును కోల్పోయారని, ఊరిలో కూడా అడుగు పెట్టే అర్హత కోల్పోయారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సమస్యలు పరిష్కరించకుండా ఏ మొహం పెట్టుకుని గ్రామంలోకి వచ్చారు. ఎమ్మెల్యే గో బ్యాక్' అంటూ గ్రామస్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఎవరూ తగ్గడం లేదు!

- సీట్ల సర్దుబాటుపై సీపీఎం-కాంగ్రెస్‌ల పట్టు
- 3 అసెంబ్లీ స్థానాల్లో ఇరుపార్టీలూ పోటీకి సిద్ధం

అమరావతి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్-సీపీఎం మధ్య పొత్తుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సీట్ల సర్దుబాటుపై నెల రోజులకు పైగా చర్చలు, సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ ఇంకా 5 అసెంబ్లీ స్థానాల విషయంలో ఇరు పార్టీల మధ్య ఉమ్మడి అవగాహన కుదరలేదు. తాము ఎంపిక చేసుకున్న స్థానాల్లో తప్పకుండా పోటీ చేసి తీరుతామని, వెనక్కి తగ్గేదే లేదంటూ సీపీఎం రాష్ట్రశాఖ ఇప్పటికే ఆయా అసెంబ్లీ స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించగా.. వాటిలోనే 3 స్థానాలకు కాంగ్రెస్ కూడా అభ్యర్థులను ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇరు పార్టీల మధ్య పొత్తు కొనసాగుతుందా? లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పొత్తులో భాగంగా తమ పార్టీకి అరకు, కర్నూలు లోక్‌సభ స్థానాలతోపాటు 16 అసెంబ్లీ సీట్లను కేటాయించాలని కోరుతూ సీపీఎం రాష్ట్రశాఖ కాంగ్రెస్ పార్టీకి జాబితాను అందజేసింది. పలు దఫాల చర్చల సందర్భంగా ఒక లోక్‌సభ, 6 అసెంబ్లీ స్థానాలు వదలుకునేందుకు సీపీఎం నేతలు అంగీకరించారు. అయితే అరకు లోక్‌సభ సీటుతోపాటు కురుపాం, అరకు, రంపచోడవరం, గాజువాక, గన్నవరం, విజయవాడ సెంట్రల్, మంగళగిరి, నెల్లూరు సిటీ, కర్నూలు, సంతనూతలపాడు స్థానాలు తమకు కేటాయించాలని కోరారు. ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలతో హైదరాబాద్‌లో జరిగిన తుది చర్చల సందర్భంగా.. అరకు లోక్‌సభ స్థానంతోపాటు రంపచోడవరం, కురుపాం, గన్నవరం, మంగళగిరి, నెల్లూరు సిటీ.. స్థానాలపై అవగాహన కుదిరింది. అరకు, గాజువాక, విజయవాడ సెంట్రల్, కర్నూలు, సంతనూతలపాడుకు బదులుగా వేరే సీట్లు తీసుకోవాలని కాంగ్రెస్ ప్రతిపాదించింది. అయితే, ఆ 5స్థానాలు తమ పార్టీకి కేటాయించాల్సిందేనని సీపీఎం నేతలు స్పష్టంచేశారు. కాంగ్రెస్ కూడా వాటిని వదులుకోవడానికి సిద్ధంగా లేదు.

ఓటర్లను బెదిరిస్తున్న

భూమనను తప్పించాలి

- ఈసీకి బీజేపీ, జనసేన ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో లక్ష మంది ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్న భూమన కరుణాకర్ రెడ్డిని టీటీడీ చైర్మన్ పదవినుంచి తప్పించాలని ఎన్నికల కమిషన్‌కు బీజేపీ నాయకుడు భానుప్రకాశ్ రెడ్డి ఫిర్యాదు చేశారు. వైసీపీకే ఓటు వేయాలంటూ తిరుమల కొండపై ఉన్న 26వేల మంది ఉద్యోగులతోపాటు చిరు వ్యాపారుల్ని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. టీడీఆర్ బాండ్ల నుంచి భూమన కుటుంబం 600కోట్ల వరకూ కమిషన్ తీసుకుని ఆ సొమ్ముతో ఎన్నికల్లో తన కుమారుడిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడానికి కరుణాకర్‌రెడ్డి కుట్రచేస్తున్నాడంటూ సంచలన ఆరోపణ చేశారు. జనసేన నాయకుడు ఆరణి శివకుమార్ మాట్లాడుతూ తిరుపతిలో ఇప్పటికే బయట పడ్డ 38,496 బోగస్ ఓట్లు తొలగించాలని కోరారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.





దుర్గగుడి ధర్మపథం వేదికపై నవదుర్గా వైభవం కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

నాట్యాచార్యుడికి జ్ఞాపికను అందజేస్తున్న ఈవో రామారావు




దుర్గమ్మకు చామంతులతో

పుష్పార్చన

వన్‌టౌన్, ఏప్రిల్ 11: చైత్రమాస వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో 3వ రోజైన గురువారం అమ్మవారికి పసుపు చామంతులను సమర్పించి అర్చించారు. లలితా సహస్రనామ పారాయణతో పాటు వివిధ ఉపచారాలను నిర్వహించారు. అమ్మవారు చామంతి పుష్ప ప్రియురాలని లలితా సహస్రనామంలో చెప్పబడింది. అమ్మవారిని చామంతులతో పూజించడంతో దివ్యశోభ నెలకొంది. ఈవో కేఎస్ రామారావు మంత్రపుష్పార్చనలో పాల్గొన్నారు. తొలుత ఈవో, ఏఈవో రమేష్‌బాబు, స్థానాచార్యుడు విష్ణుభట్ల శివప్రసాదశర్మ, ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాసశాస్త్రి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ పుష్పాలున్న గంపలను అమ్మవారి పూజామూర్తిని ప్రతిష్ఠించిన వేదిక వద్దకు తీసుకుని వచ్చారు. అమ్మవారికి అర్చన పూర్తయ్యాక లోకకల్యాణం కోరుతూ పుష్పార్చన చేశారు.



దుర్గమ్మవారి పుష్పార్చన అనంతరం మంత్రపుష్ప కార్యక్రమంలో పాల్గొన్న ఈవో రామారావు

దక్షిణామూర్తికి పూజ

ఆలయంలోని మల్లేశ్వరాలయ కుడ్యంలో నెలకొన్న దక్షిణామూర్తికి ఈవో రామారావు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, అర్చకులు అర్చనలు నిర్వహించారు. దీంతో జ్ఞానబుద్ధి, మేధస్సు వృద్ధి చెందుతాయని నమ్మిక. గురువారం దక్షిణామూర్తికి ప్రత్యేకమైన రోజుగా పరిగణిస్తారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

వసంతనవరాత్రులను పురస్కరించుకుని దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై గురువారం కూచిపూడికి చెందిన చింతా రవి బాలకృష్ణ నేతృత్వంలోని 22 మంది కళాకారుల బృందం నవదుర్గా వైభవం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది, ఈ ప్రదర్శన ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. ఆహార్యం, హావం, భావం, లయ అన్నీ ఒకదానికి మించి ఒకటి రమ్యంగా సాగాయి. దుర్గమ్మ 9 అవతారాల విశేషాలను వివరిస్తూ నాట్య ప్రదర్శన సాగింది. మహిషాసుర మర్దని ఘట్టం హర్షధ్వానాలను అందుకుంది. నవదుర్గల అవతారాలు శివతాండవం, కాలభైరవాష్టకం, గం గణపతి, చిదంబరస్తవం, స్వాగత నృత్యం, శివ కల్యాణం, జగదాంబ రావే తల్లి, జయ జయ దుర్గే తరంగం, మహిషాసుర మర్ధని, అయిగిరి నందిని వంటి వాటికి కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. చివరిలో కళాకారులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో రామారావు నాట్యాచార్యుడు రవికృష్ణకు, బృందానికి జ్ఞాపిక అందచేశారు. ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందచేశారు. కనకదుర్గ ఉపాసన విధానం పుస్తకం, సౌభాగ్య పుస్తకం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ దేవస్థానంలో ఇలాంటి ప్రదర్శనలు మరెన్నో జరగాలన్నారు.

20న యాగశాల ప్రారంభం

దుర్గగుడిలో ఈనెల 20న యాగశాలను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులను గురువారం ఈవో రామారావు, స్థానాచార్యుడు శివప్రసాదశర్మతో కలిసి పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో ఆయన మాట్లాడారు. పనులు వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

సంప్రదాయ కూచిపూడిలో

శృతి సమన్వికి ప్రథమ స్థానం

భవానీపురం, ఏప్రిల్ 11: లూథియానాలోని పంజాబ్ అగ్రికల్చర్ వర్సిటీలో గత నెల 28 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగిన 37వ ఇంటర్ వర్సిటీ నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో 45వ డివిజన్ మిథిలానగర్ రాజుగారి ప్లాట్స్ ప్రాంతానికి చెందిన శృతి సమన్వి తన సంప్రదాయ కూచిపూడి నృత్య ప్రదర్శనతో ప్రథమ బహుమతిని వశం చేసుకుంది. అన్ని సంప్రదాయ నృత్య రీతుల్లో ఒకే విభాగంలో జరిగిన పోటీల్లో (ఊతుక్కాడు వెంకట కవి రచించిన స్వాగతం కృష్ణ కీర్తన మోహనరాగం, ఆదితాళం, బి. సుధీర్‌రావు నృత్య దర్శకత్వం)లో ఆమె చేసిన నృత్యం అలరించింది. 1996 తర్వాత శృతి సమన్వి మాత్రమే మన రాష్ట్ర కూచిపూడి నృత్యాన్ని అభినయించి ఈ ఫీట్‌ను సాధించారు. శృతి సమన్వి కేఎల్ వర్సిటీలో బీబీఏ ప్రథమ సంవత్సరం చదువుతోంది.



యువతను ఆకట్టుకునే 'లవ్ మౌళి': నవదీప్

ధర్నాచౌక్, ఏప్రిల్ 11: 'లవ్ మౌళి' చిత్రం యువతను ఆకట్టుకుంటుందని హీరో నవదీప్ తెలిపారు. చిత్రం ప్రమోషన్‌లో భాగంగా గాంధీనగర్‌లోని రాజ్ యువరాజ్ థియేటర్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న విడుదల కానున్న ఈ చిత్రం ప్రమోషన్‌ను నగరం నుంచి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ఇప్పటి వరకు వచ్చిన ప్రేమకథా చిత్రాలకు ఇది భిన్నంగా ఉంటుందన్నారు. ప్రేమంటే ఎంతో తెలియని ఒక యువకుడికి ప్రేమ మాధుర్యం ఎంటో చాటి చెప్పే చిత్రమన్నారు. హీరోయిన్ పంకూరి గిద్వానీ, సినీ గేయ రచయిత అనంతశ్రీరామ్, నటి భావన మాట్లాడుతూ ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆహ్లాదపరిచిన ఏకగళ గానామృత హేల

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 11: తెలుగు చలనచిత్ర పరిశ్రమలో స్వర్ణయుగం అనదగిన కాలంలో తెలుగు సంగీతానికి, సాహిత్యానికి పట్టం కట్టిన రోజుల్లో తెలుగు ప్రేక్షకులను అలరించిన ఎంతోమంది గాయకుల గళాలను అలవోకగా ఏకధాటిగా 5 గంటలపాటు ఆలపించి శ్రోతలను చేసిన ఘంటలసాల పురస్కార గ్రహీత టీవీ శేషగిరిరావు వంటి గాయకులు అరుదుగా ఉంటారని పలువురు వక్తలు కొనియాడారు. గాంధీనగరంలోని కౌతా పూర్ణానందం కళావేదికపై మహి స్వరాలు సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఏకగళ గానామృత హేల పేరుతో జరిగిన సినీ విభావరి శ్రోతలను ఆద్యంతం అలరించింది. సంస్థ అధ్యక్షురాలు మహేశ్వరి, కార్యవర్గ సభ్యులు లక్ష్మి, అమృతవల్లి, శైలజ, రఘుకుమారి, సంధ్య, మల్లీశ్వరి, పద్మశ్రీ, శ్రీనివాస్‌రావు, భాను సహస్ర, చింతకాయలు చిట్టిబాబు, మారుతి వెంకట రమణారావు పాల్గొన్నారు.



పశ్చిమలో సుజనా చౌదరిని గెలిపించాలి

- పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, ఏప్రిల్ 11: పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి కోసం సామాజిక బాధ్యత ఉన్న సుజనాచౌదరిని గెలిపించాలని పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) కోరారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ఆయన పశ్చిమ నియోజకవర్గ కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరితో కలిసి టీడీపీ సీనియర్ నేత ఎంఎస్ బేగ్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా బేగ్‌తో పాటు ముస్లిం సోదరులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లిం మత సంప్రదాయం ప్రకారం ఒకరినొకరు పరస్పరం అభినందనలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్ని మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం పశ్చిమలో నాయకులు చేసిన త్యాగాలు వృథాగా పోనీయరాదన్నారు. ఇదే సమయంలో తెలుగు యువనేత నహీద్ అంజుమ్ నివాసానికి కూడా సుజనా చౌదరి, చిన్ని వెళ్లి శుభాకాంక్షలు తెలిపి అతిథ్యం స్వీకరించారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు దూండీ రాకేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, పశ్చిమ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రజావుల్లా, టీడీపీ నేతలు కొణిజేటి రమేష్, నేతలు ఆర్.మాధవ, భోగవల్లి నాగబాబు, సత్తార్, 45వ డివిజన్‌కు చెందిన షేక్ సుభానీ, 41వ డివిజన్‌కు చెందిన షేక్ సుభానీ, 51వ డివిజన్‌కు చెందిన ఎస్‌కే షబ్బీర్ తదితరులు ఎంఎస్ బేగ్, అంజుమ్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.



ఎంఎస్ బేగ్ నివాసానికి వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సుజనా చౌదరి, కేశినేని చిన్ని

చిట్టినగర్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని చిట్టినగర్ ఈద్గా మసీద్‌లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే అభ్యర్థి సుజనాచౌదరి, నాగుల్‌మీరా, ఎం.ఎస్.బేగ్ ప్రార్థనలు చేశారు.

లబ్బీపేట: మానవాళికి హితాన్ని బోధించే పండుగ రంజాన్ అని బీజేపీ, జనసేన బలపరిచిన టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ అన్నారు. గురువారం ఐజీఎం స్టేడియంలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫతావుల్లా, టీడీపీ ముస్లిం నేతలు ఇర్ఫాన్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన పైలా సోమినాయుడు

- పశ్చిమ ప్రజలకు నేను దత్తుడిని: సుజనా చౌదరి

విద్యాధరపురం, ఏప్రిల్ 11: పశ్చిమ నియోజకవర్గ ప్రజలు తనను దత్తత తీసుకున్నారని కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. గురువారం భవానీపురంలోని బీజేపీ కార్యాలయంలో వైసీపీ నేత, నగరాల సామాజికవర్గ ప్రతినిధి పైలా సోమినాయుడు గురువారం బీజేపీ కండువా కప్పుకున్నారు. ఆయనకు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని అందించి పార్టీ కండువా కప్పి సుజనా చౌదరి ఆయన్ను బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశ్చిమ ప్రజల కష్టాలను, కొండప్రాంత ప్రజల సమస్యలను తాను కళ్లారా చూశానన్నారు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం చేస్తానన్నారు. నియోజకవర్గాన్ని మినీ ఇండియాలా మారుస్తానన్నారు. పైలా సోమినాయుడు వంటి నేతలు బీజేపీలో చేరడం శుభపరిణామమన్నారు. అనంతరం సోమినాయుడు మాట్లాడుతూ వైసీపీ తనకు అన్యాయం చేసిందని, పార్టీ కోసం ఎంతో శ్రమించామని జగన్‌ను కలుద్దామంటే సమయం ఇవ్వలేదన్నారు. సుజనా చౌదరి లాంటి వాళ్లు ఎమ్మెల్యే ఎన్నికల బరిలోకి దిగడం అదృష్టమన్నారు. ఆయన గెలుపునకు కృషి చేస్తామని, ఇంటింటికీ తిరిగి ప్రచారం చేసి ఆయన్ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. సుజనా చౌదరి ఎన్నికైతే పశ్చిమ అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు తీసుకురాగలరన్నారు. ఈ ఎన్నికలలో కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమలో అన్ని వర్గాల ప్రజలున్నారని సుజనా చౌదరితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. దుర్గగుడి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పదవిని తనకు పొడిగించకపోవడం వెనుక వెలంపల్లి శ్రీనివాసరావు హస్తం ఉందని ఆరోపించారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానాన్ని సోదాహరణంగా వివరించారు. అడ్డూరి శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అమ్మిశెట్టి వాసు, బాడిత శంకర్, రజని, బీజేపీ నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



సుజనా చౌదరి సమక్షంలో బీజేపీలో చేరిన పైలా సోమినాయుడు

గొప్ప సాంఘిక సంస్కర్త పూలే: కలెక్టర్

పాయకాపురం, ఏప్రిల్ 11: సాంఘిక సంస్కర్తగా మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలు ఎనలేనివని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కొనియాడారు. గురువారం ఆయన జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఢిల్లీరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యను చిత్తశుద్ధితో మనోధైర్యంతో, శ్రద్ధతో అభ్యసించి ఉన్నతంగా ఎదగాలని సమాజానికి చాటిచెప్పి విజయం సాధించిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని అన్నారు.




అసభ్యకర పోస్టులు పెడుతున్న ఇద్దరిపై కేసు

పెనమలూరు, ఏప్రిల్ 11: సమాచార మాధ్యమాలుగా ఉండాల్సిన సోషల్ మీడియాను విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉపయోగిస్తున్న టీడీపీ, వైసీపీకి చెందిన ఇద్దరిపై పెనమలూరు పోలీసులు కేసులు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల మేరకు వణుకూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఉయ్యూరు మహేష్, అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త ఆరేపల్లి శ్రీకాంత్ ఫేస్‌బుక్, వాట్సాప్, ఇతర ప్లాట్‌ఫాంలలో ప్రధాన ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు, కార్యకర్తలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని, దీంతో ఇరుపార్టీల మధ్య ఉద్రిక్తత, ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నారని కేసులు నమోదు చేశారు. వీఆర్‌వో గద్దె వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత, అసభ్య దూషణలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్పీ అద్నాన్ నయీంఅస్మి హెచ్చరించినట్టు సీఐ తెలిపారు.

రుషికొండ తీరంలో బీటెక్ విద్యార్థి గల్లంతు

సాగర్‌నగర్, ఏప్రిల్ 11: రుషికొండ తీరంలో సముద్ర స్నానానికి దిగిన ఓ విద్యార్థి గల్లంతయ్యాడు. ఆరిలోవ సీఐ గోవిందరావు తెలిపిన వివరాలు ప్రకారం.. స్నేహితులైన జి. సృజన్, జి. హర్ష, వై. వంశీ, ఎస్. సాయి వెంకట్, పి. ప్రణీత్, తేజస్ (20) రంజాన్ సెలవు కావడంతో గురువారం ఉదయం రుషికొండ బీచ్‌కు విహార యాత్రకు వచ్చారు. వారంతా సంపత్ వినాయక్ గుడి వద్ద ఉన్న ఎసెంట్ కళాశాలలో ఇంటర్ కలిసి చదువుకున్నారు. ఈమేరకు బీచ్‌కు విహారానికి వచ్చిన వారు సరదాగా కాసేపు తీరంలో విహరించి, అనంతరం సాయిప్రియా రిసార్ట్స్ వెనుక ఉన్న తీరంలో స్నానాలకు దిగారు. కేరింతలు కొడుతూ... స్నానాలు చేస్తుండగా ఓ రాకాసి అల తాకిడికి తేజస్ సముద్రంలోకి కొట్టుకుపోయాడు. కళ్ల ఎదుటే మిత్రుడు కెరటాల్లో కొట్టుకుపోతుండడాన్ని చూసి మిగిలిన స్నేహితులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో పెద్దగా కేకలు వేయడంతో లైఫ్‌గార్డులు వచ్చారు. అప్పటికే తేజస్ సముద్రంలో గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న ఆరిలోవ సీఐ గోవిందరావు పర్యవేక్షణలో బ్లూకోర్టు పోలీసులు గల్లంతైన విద్యార్థి వివరాలు సేకరించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మెరైన్ పోలీసులు, లైఫ్‌గార్డులు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా కంచరపాలెం ఊర్వశి జంక్షన్‌కు చెందిన తేజస్ (20) అమరావతి విట్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం ఈసీఈ చదువుతున్నాడు. తండ్రి కేఎల్ యూనివర్సిటీలో లెక్చరర్. తల్లి గృహిణి.



టీడీపీతోనే బీసీల సంక్షేమం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 11: ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమికి అధికారం కట్టబెడితే టీడీపీ అధినేత చంద్రబాబు నాయకత్వంలో ఆ వర్గ ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేయనున్నారని గన్నవరం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బుధవారం రాత్రి స్థానిక ఎస్ఆర్ కన్వెన్షన్‌లో యాదవ సామాజిక వర్గీయులతో యార్లగడ్డ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా దివంగత టీడీపీ నేత బచ్చుల అర్జునుడు చిత్రపటానికి యార్లగడ్డ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ యాదవ సోదరుల అభివృద్ధికి అవసరమైన కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఆరంభమైందని వారి సంక్షేమానికే టీడీపీ ఆవిర్భవించిందన్నారు. చంద్రబాబు రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలోకి తీసుకువస్తానన్నారు. ఆయన నాయకత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమర్థవంతమైన చంద్రబాబు నాయకత్వాన్ని బలపర్చాలని విజ్ఞప్తి చేశారు. నేతలు బచ్చుల బోసుబాబు, సర్నాల బాలాజీ, చిమట రవివర్మ, ఎంపీటీసీ సభ్యుడు అమృతపల్లి సూర్యనారాయణ, మజ్జిగ నాగరాజు, మండపాటి రాంబాబు, దండిబోయిన రాంపండు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.



గన్నవరంలో జరిగిన రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న యార్లగడ్డ వెంకట్రావు

అల్లా మార్గంలో నడవాలి

గన్నవరం: అల్లా చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం జామియా మసీదులో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు గురువారం జరిగాయి. యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నేతలు బచ్చుల బోస్, జాస్తి శ్రీధర్, గూడపాటి తులసీమోహన్, షేక్ రఫీ, షేక్ జాకీర్ హుస్సేన్, షేక్ బాబూలాల్ పాల్గొన్నారు. ముస్తాబాద జామియా మసీదులో జరిగిన ప్రార్థనలో ఇమాం హసీన్ ఇక్బాల్ రంజాన్ సందేశాన్ని ఇచ్చారు. దుర్గాపురం మదర్సా దగ్గర ప్రార్థనలు జరిగాయి.

టీడీపీ నగరాల నేతల రహస్య సమావేశం

- సామాజికవర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్

వన్‌టౌన్, ఏప్రిల్ 11: తెలుగుదేశం పార్టీ ఆరంభం నుంచి పార్టీలో చురుగ్గా పాల్గొంటున్న నగరాల సామాజిక వర్గానికి చెందిన వారిని ఆ పార్టీలోని కొందరు ఓటు బ్యాంకుగా వినియోగించుకుంటూ అణగదొక్కుతున్నారని పలువురు సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ అధిష్ఠానం స్పందించి తమ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నేతలకు ప్రాధాన్యత ఇస్తే వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కష్టపడి పనిచేస్తామన్నారు. గురువారం కొత్తపేటలోని ఓ కల్యాణమండపంలో పార్టీలో మొదటి నుంచి ఉంటున్న టీడీపీ నేతల ఆధ్వర్యంలో రహస్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీలో తమ సామాజిక వర్గానికి ఎందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. డివిజన్‌లోని తమ వర్గ మెజారిటీ ప్రకారం డివిజన్ కమిటీలకు ప్రాధాన్యత ఇవ్వకుండా కేవలం ఓటు బ్యాంకుగా వినియోగించడంపై చర్చించారు. పార్టీలోని ముగ్గురు నేతలు తమ సామాజికవర్గాన్ని అణగదొక్కుతున్నారని, వారి వ్యవహార శైలిని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. మొదటి నుంచి పార్టీలో ఉంటున్న వారికి ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో పార్టీపై ఉన్న అభిమానంతో ఇతర పార్టీల్లోకి వెళ్లలేక తటస్థంగా ఉంటున్నారన్నారు. పశ్చిమలో అత్యధికంగా నగరాల సామాజిక వర్గం టీడీపీ చెందిన వారని, కానీ వారిని ముగ్గురు, నలుగురు నేతలు తమ వర్గాన్ని పార్టీలో ఎదగనీయకుండా అణచివేస్తున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక తమ వర్గంలోని మహిళకు మేయర్, మరో వ్యక్తికి దుర్గగుడి చైర్మన్ పదవి ఇస్తే టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఒక్కరికి కూడా పదవులివ్వలేదని ఆరోపించారు. టీడీపీలో కరుడుకట్టిన పార్టీ సానుభూతిపరులు, అభిమానులు, శ్రేణులున్నప్పటికీ వారిని ఉపయోగించుకోవడంలో విఫలమయ్యారన్నారు. పార్టీలోని ముగ్గురు, నలుగురు తమ రాజకీయాల కోసమే పనిచేస్తున్నారు తప్ప పార్టీ బలోపేతానికి పనిచేయడం లేదన్నారు. ఇప్పటికైన పార్టీ అధిష్ఠానం పశ్చిమలోని నగరాల సామాజిక వర్గంపై దృష్టి సారించి ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇస్తే వారంలో సుమారు వెయ్యిమంది పార్టీలో కీలకంగా వ్యవహరించి టీడీపీ-జనసేన బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి, టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) గెలుపునకు కృషి చేస్తామన్నారు. ప్రముఖ లాయర్ పిళ్లా శ్రీనివాసరావు (పీసీ), రాంపిళ్ల శ్రీనివాస్ సహా 30మంది సమావేశంలో పాల్గొన్నారు.



కొత్తపేటలో రహస్యంగా సమావేశమైన టీడీపీకి చెందిన నగరాల సామాజికవర్గం నేతలు

పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై సదస్సు

పటమట, ఏప్రిల్ 11: పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై శ్రీ కృష్ణదేవరాయ ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక దర్శిపేట శ్రీ రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పర్యవేక్షణ అధికారిణి సునీతాదేవి పరిశీలకులుగా హాజరయ్యారు. పోస్టల్ బ్యాలెట్ ఎలా వినియోగించుకోవాలి, వివిధ రకాల ఫారాలు పూర్తి చేసే విధానం, పోస్టల్ బ్యాలెట్ చెల్లుబాటు కాకపోవడానికి గల కారణాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా పోస్టల్ బ్యాలెట్‌లో ఫారమ్ 13ఏ, ఫారమ్ 13బి, ఫారమ్ 13 సీ, ఫామ్- 13 డీ అనే నాలుగు విభాగాలుంటాయని, 13ఏ అంటే పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేవారు ఇచ్చే డిక్లరేషన్, 13 బీ అంటే పోస్టల్ బ్యాలెట్ ఉంచే లోపలి కవర్ అని, 13 సీ అంటే డిక్లరేషన్ ఫారం అని, 13 డీ అంటే పోస్టల్ బ్యాలెట్‌ని ఎలా వినియోగించుకోవాలో తెలిపే సూచనలుంటాయన్నారు. ఈ సదస్సులో శ్రీకృష్ణదేవరాయ ఉద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సోమరౌతు రామకృష్ణ, తలాటం సుబ్బారావు, అనిల్‌కుమార్, లక్ష్మీపతి, కృష్ణా జిల్లా జేఏసీ అధ్యక్షుడు దామోదర్ పాల్గొన్నారు.

జగన్‌రెడ్డికి ఓటు అడిగే హక్కులేదు

ధర్నాచౌక్, ఏప్రిల్ 11: సీఎం జగన్ పాలనలో దళిత, బహుజనుల కు తీరని ద్రోహం జరిగిందని పలువురు నేతలు ధ్వజమెత్తారు. దళిత, బహుజన ఫ్రంట్, కాపునాడు సంయుక్త ఆధ్వర్యంలో 'వైసీపీని ఓడిద్దాం.. అమరావతిని నిర్మిద్దాం..' పేరుతో కరపత్రం ఆవిష్కరించారు. గాంధీనగర్‌లోని కాపునాడు కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ 27 దళితుల సంక్షేమ పథకాలను రద్దు చేసి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను నవరత్నాలకు మళ్లించిన జగన్‌రెడ్డికి ఓటు అడిగే హక్కు లేదని మండిపడ్డారు. విదేశీ విద్య పథకానికి ప్రపంచ మేథావి అంబేడ్కర్ పేరు తొలగించి నీపేరు పెట్టుకుంటావా? అని దుయ్యబట్టారు. చెత్తపై పన్నేసిన చెత్త సీఎం జగన్ రెడ్డి అని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కరపత్రాలను పంపిణీకి కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం, దళితబహుజన ఫ్రంట్ జాతీయ ప్రధానకార్యదర్శి మేళం భాగ్యరావు, కాపు నేత బొండా శ్రీనివాసరావు, చిరంజీవి యువత రాష్ట్ర నేతలు సీహెచ్.కృష్ణ ప్రసాద్, ఎల్.శ్యామ్ ప్రసాద్, దళిత బహుజన యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కోసనం రాము, మహేష్, దుత్తా మురళీ, మహిళా నాయకురాలు సుహాసిని పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కాలనీలో నవమి వేడుకలకు ఏర్పాట్లు

భారతీనగర్: ఈ నెల 17న బుధవారం నాడు శ్రీరామనవమి సందర్భంగా ఎన్టీఆర్ కాలనీలోని శ్రీకోదండ రామాంజనేయ, శ్రీ విజయ కార్యసిద్ధి గణపతి ఆలయంలో ఎన్టీఆర్, వెటర్నరీ, సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ ఆధ్వర్యంలో శ్రీ కోదండ రామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలను సోమవారం నుంచి శుక్రవారం వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10గం టలకు వేదమంత్రాలతో సీతారామ కల్యాణం ఘనంగా జరుగుతుంది. 5రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

20, 21న రాష్ట్ర అండర్- 17 చెస్ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 11: స్థానిక పోరంకి గ్రీన్‌స్కూల్‌లో ఏపీ అండర్-17 రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ ఈ నెల 20, 21న నిర్వహిస్తున్నట్టు స్కూల్ ప్రిన్సిపాల్ జె.సాయి అపర్ణ, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సెక్రటరీ భీమారావు తెలిపారు. ఈ మేరకు టోర్నీ బ్రోచర్లను స్థానికంగా గురువారం ఆవిష్కరించారు. 17న సాయంత్రం 5గంటలకల్లా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీఓఆర్‌జీ.కామ్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు 97007752220, 9247153387 నెంబర్లలో సంప్రదించాలని ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల చెస్ అసోసియేషన్ల సెక్రటరీలు ఫణికుమార్, రాజీవ్ తెలిపారు.

ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీపై పోలీసులు దాడి చేయాలి

▸ రాష్ట్రంలో వైసీపీ కోడ్.. జగన్‌కు తొత్తులుగా అధికారులు: ఉమా



అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల కోడ్‌కు బదులు వైసీపీ కోడ్ నడుస్తోందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మండిపడ్డారు. అధికారులు జగన్‌కు తొత్తులుగా మారడంతో వైసీపీ గూండాలు ప్రజలు, పోలీసులపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాడేపల్లి నెస్ట్ స్పేస్ బిల్డింగ్‌లో సజ్జల రామకృష్ణారెడ్డి, సజ్జల భార్గవ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీని నడుపుతున్నారు. అక్కడి నుంచి ఫేక్ న్యూస్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులు 300 మంది ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. దీనిపై డీజీపీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? వెంటనే ఈ ఫ్యాక్టరీపై దాడి చేసి, ఫేక్ న్యూస్‌ని అడ్డుకోవాలి. సూత్రధారులైన సజ్జల తండ్రీకొడుకులపై చర్యలు తీసుకోవాలి. లేకపోతే ఫేక్ న్యూస్ ఫ్యాక్టరీపై ఈసీకి ఫిర్యాదు చేస్తాం. జగన్, సజ్జల, ధనుంజయరెడ్డి మాటలు విని వైసీపీకి కొమ్ముకాసే అధికారులకు తగిన గుణపాఠం తప్పదు' అని ఉమా హెచ్చరించారు.

పోర్ట్‌బ్లెయిర్‌లో టీడీపీ ప్రచారం

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవుల్లోనూ టీడీపీ, బీజేపీ కూటమి ప్రచారం ఉధృతం చేసింది. తెలుగువాళ్లు ఎక్కువగా ఉన్న పోర్ట్‌బ్లెయిర్ ప్రాంతంలో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి విష్ణుపాదరాయ్ గెలుపుకోసం అండమాన్ నికోబార్ టీడీపీ ఇన్‌చార్జ్, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వీ మాధవ్‌నాయుడు ప్రచారం నిర్వహించారు. తెలుగు వారు అధికంగా నివసించే ఈ ప్రాంతంలో టీడీపీ ఓట్లు కీలకం కావడంతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో కలసి గురువారం ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. బహిరంగ సభలో నడ్డాతో పాటు అండమాన్ బీజేపీ అధ్యక్షుడు అజయ్ భైరవి, బీజేపీ నేతలు మాణిక్యరావు పాల్గొన్నారు.

పోలీసు ఆత్మహత్యలకు జగనే కారణం: వర్ల

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కొంతమంది పోలీసు అధికారులు జగన్‌కు తొత్తులుగా పనిచేయడం వల్ల కిందిస్థాయి పోలీసు సిబ్బంది ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి వచ్చిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. టీడీపీ జాతీయ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'చేతకాని ముఖ్యమంత్రికి తొత్తుగా మారిన డీజీపీతో పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులకు రావాల్సిన సరెండర్ లీవ్స్, అడిషనల్ లీవ్స్, టీఏ, డీఏలను ఎందుకివ్వడం లేదో చెప్పాలి. అప్పుల బాధలు తాళలేక శంకర్రావు చనిపోవడానికి జగనే కారణం' అని వర్ల స్పష్టం చేశారు.

ఉగాది ఉత్సవాల్లో అపశ్రుతి

▸ ప్రభకు విద్యుత్‌వైర్ తగలడంతో షార్ట్‌సర్క్యూట్

▸ విద్యుదాఘాతంతో 13 మంది చిన్నారులకు గాయాలు

▸ తప్పిన పెను ప్రమాదం



ఘటనా స్థలంలో గాయపడ్డ చిన్నారులు

కర్నూలు ఏప్రిల్ 11: కర్నూలు జిల్లా కల్లూరు మండలంలో గురువారం ఉగాది ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. చిన్నటేకూరు గ్రామంలో ఊరేగింపు సమయంలో ప్రభకు విద్యుత్ వైరు తగిలి షార్ట్‌సర్క్యూట్ కావడంతో ప్రభలో కూర్చున్న 13 మంది చిన్నారులు విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డారు. చిన్నటేకూరు గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా మూడు రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆంజనేయస్వామి దేవాలయ ప్రభలను గ్రామమంతా ఊరేగిస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. సుమారు 13 మంది బాలురు కూర్చున్న ప్రభను లాగుతుండగా.. రోడ్డుపైన స్పీడు బ్రేకర్ ఉండటంతో దాన్ని ఎక్కించారు. దీంతో విద్యుత్ తీగలు ప్రభపై ఉన్న ఇనుప చక్రాన్ని తాకడంతో ఒక్కసారిగా విద్యుత్ ప్రవహించింది. ప్రభలో కూర్చున్న చిన్నారులందరూ విద్యుదాఘాతానికి గురయ్యారు. కొంతమంది షాక్‌కు గురై అపస్మారక స్థితికి వెళ్లిపోయారు. ప్రభ వెంటనే కొంచెం ముందుకు వెళ్లడంతో వైర్లు వీడి పెద్ద ప్రమాదం తప్పింది. గాయపడ్డ చిన్నారులను స్థానికులు అంబులెన్సులో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించడంతో చిన్నారులంతా కోలుకున్నారు. ఒకరిద్దరికి మాత్రం ఎక్కువగా గాయాలు కావడంతో మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా విద్యుత్ తీగలకు కరెంటు తీసేశామని, కరెంటు ఎలా సరఫరా అయిందో తెలియడం లేదని గ్రామస్థులు అంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉలిందకొండ ఎస్ఐ నరేష్ తెలిపారు.

తుపాకీతో కాల్చుకుని ఎస్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య



సీతంపేట (విశాఖపట్నం), ఏప్రిల్ 11: స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) కానిస్టేబుల్ ఒకరు గురువారం తుపాకీతో గుండెపై కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, సహ ఉద్యోగులు అందించిన వివరాలు... విజయనగరం జిల్లా వంగర మండలం కొట్టిస గ్రామానికి చెందిన పాలవలస శంకరరావు (35) ఎస్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. భార్య శ్రావణి, కుమారుడు కిశోర్, కుమార్తె జ్ఞానవితతో కలిసి మద్దిలపాలెం ప్రాంతంలోని పీతలవానిపాలెంలో నివాసం ఉంటున్నారు. ఉద్యోగంలో అందరితో కలిసిమెలిసి ఉండేవారు. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం ఐదు గంటలకు ద్వారకా నగర్‌లో గల ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు చెస్ట్‌లో సెంట్రీ డ్యూటీకి హాజరయ్యారు. ఉదయం ఏడు గంటల సమయంలో తన చేతిలో ఉన్న ఎస్ఎల్ఆర్ వెపన్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. సంఘటనా స్థలానికి ఏసీపీ రాంబాబు, ద్వారకా స్టేషన్ సీఐ ఎస్.రమేష్, ఎస్ఐ ధర్మేంద్ర సిబ్బందితో చేరుకుని విచారణ చేపట్టారు. తమ బిడ్డకు ఎటువంటి సమస్యలు లేవని, భార్య శ్రావణి, పిల్లలతో ఎంతో అన్యోన్యంగా జీవితం సాగిస్తున్నట్టు శంకరరావు తల్లిదండ్రులు చెప్పారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. శంకరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

పామేడు అడవుల్లో వైమానిక దాడులు!

▸ 30 చోట్ల దాడులను ఖండిస్తూ మావోయిస్టు పార్టీ లేఖ

చర్ల, ఏప్రిల్ 11: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడు అడవుల్లో ఈనెల 7వ తేదీన నక్సల్స్ లక్ష్యంగా వైమానిక దాడులు జరిగాయని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. గురువారం ఈ మేరకు మావోయిస్టు పార్టీ బస్తర్ డివిజన్ కమిటీ నేత గంగ పేరుతో లేఖ విడుదలైంది. 7వ తేదీన రాత్రి 11 గంటల సమయంలోనూ రాకెట్ దాడులు జరిగినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. పామేడులోని పాలగూడ, ఇట్టగూడ, జిలోర్‌గట్టు, గొమ్మగూడ, కంచాల గ్రామాల అడవుల్లో 30 చోట్ల ఈ దాడులు జరిగాయని తెలిపారు. ఈ రాకెట్లు పడ్డ చోట.. 100-200 మీటర్ల పరిధిలో వన్యమృగాలు చనిపోయాయని, చెట్లు ధ్వంసమయ్యాయని వివరించారు. వైమానిక దాడుల వల్ల గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారని, పోలీసులు-పారామిలటరీ బలగాలు చేస్తున్న 'కాగర్' దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.

స.హ చట్టం కింద ఎన్నికల బాండ్ల వివరాలు ఇవ్వం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు (సహ) చట్టం కింద ఎన్నికల బాండ్ల వివరాలను అందజేసేందుకు ఎస్‌బీఐ నిరాకరించింది. ఇప్పటికే ఆ వివరాలన్నీ ఈసీ వెబ్‌సైట్‌లో ఉన్నప్పటికీ.. డబ్బుకు సంబంధించిన వ్యక్తిగత సమాచారమైనందున బాండ్ల వివరాలను వెల్లడించలేమని ఎస్‌బీఐ తెలియజేయడం గమనార్హం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈసీకి సమర్పించిన ఎన్నికల బాండ్ల పూర్తి వివరాలను డిజిటల్ రూపంలో అందజేయాలని సామాజిక కార్యకర్త లోకేశ్ బాత్రా సహ చట్టం కింద మార్చి 13న ఎస్‌బీఐని కోరారు. అలాగే సుప్రీంకోర్టులో బ్యాంకు తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది హరీశ్ సాల్వేకు చెల్లించిన రుసుము వివరాలనూ వెల్లడించాలన్నారు. అయితే ఎన్నికల బాండ్లలో వ్యక్తిగత సమాచారం ఉన్నందున.. ఆ వివరాలను అందజేయలేమని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. సాల్వే ఫీజు వివరాలను ఇచ్చేందుకూ నిరాకరించింది.

బిహార్లో ఎన్డీయేకే ఎదురీత!

తేజస్వి యాదవ్ సారథ్యంలో పుంజుకున్న ఆర్‌జేడీ-కాంగ్రెస్

▸ ఎన్డీయేకు 10 సీట్లు తగ్గే అవకాశం

▸ జేడీయూ-నితీశ్ ప్రతిష్ఠకే సవాల్



లోక్‌సభ ఎన్నికల్లో 400 స్థానాలు సాధించాలని బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఇదంతా సులభం కాదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ముఖ్యంగా బిహార్లో కూటమి ఎదురీదుతోందని.. ఆర్‌జేడీ నేతృత్వంలోని ఇండియా కూటమి నుంచి గట్టి పోటీ ఇస్తోందని చెబుతున్నారు. రాష్ట్రంలో 40 లోక్‌సభ స్థానాలకు గాను 2019లో ఎన్డీయే (బీజేపీ-17, జేడీయూ-16, ఎల్‌జేపీ-6) 39 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ ఒక చోట విజయం సాధించింది. ఈసారి ఎన్డీయేకి ఏకపక్ష వాతావరణం లేదు. తేజస్వి యాదవ్ నేతృత్వంలో ఇండియా కూటమి గట్టి సవాల్ విసురుతోంది. ఆర్‌జేడీ 26, కాంగ్రెస్ 9, లెఫ్ట్ 5 (సీపీఐ-ఎంఎల్-3, సీపీఐ-1, సీపీఎం-1) చోట్ల పోటీచేయనున్నాయి. గత ఎన్నికల్లో ఆర్‌జేడీ-కాంగ్రెస్ కలిసి పోటీచేసి సుమారు 31% ఓట్లు పొందాయి. లెఫ్ట్ పార్టీలు వేరుగా పోటీచేశాయి. వాటికి 2.2% ఓటుబ్యాంకు ఉంది. మొత్తం కలిపితే 33.2% అవుతుంది. ఎన్డీయే 2019లో 53.25 శాతం ఓట్లు సాధించింది. ఈసారి ఎన్నికల్లో అన్ని ఓట్లు రాకపోవచ్చని అంటున్నారు. తరచూ కూటములు మారుతున్న సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని జేడీయూపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అయినా జేడీయూకి బీజేపీ 16 స్థానాలు కేటాయించింది. తాను 17 చోట్ల, ఎల్‌జేపీకి 5, హిందూస్థానీ అవాం మోర్చా(హెచ్ఏఎం), ఆర్ఎల్ఎంకు చెరొకటి ఇచ్చింది. ఒకప్పుడు రాష్ట్రంలో ఎన్డీయేకి జేడీయూ సారథ్యం వహించేది. ప్రధాన పోటీ కూడా ఆర్‌జేడీ-జేడీయూ మధ్యే ఉండేది. ఇప్పుడు పగ్గాలు బీజేపీ చేపట్టింది. పోటీ ప్రధాని మోదీ, ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వి నడుమ అన్నట్లుగా మారింది. తేజస్వి సభలకు జనం పెద్దఎత్తున హాజరవుతున్నారు. ఈసారి తాము ఎక్కువ సీట్లు గెలవడం కష్టమేనని జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు నీరజ్‌కుమార్ అంగీకరించారు. అయోధ్యలో రామాలయ నిర్మాణం, బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠపై పెద్దఎత్తున బీజేపీ ప్రచారం చేస్తున్నా.. బిహార్‌లో ఇలాంటి భావోద్వేగ అంశాలు ఫలితమివ్వవని ఆ పార్టీ అంతర్గత సర్వేల్లో తేలింది. అయితే బీజేపీకి చిరాగ్ పార్టీ ప్లస్ పాయింట్‌గా మారిందని విశ్లేషకులు అంటున్నారు. అయితే. ఈసారి ఎన్డీయేకు కనీసం 8-10 స్థానాలు ఎన్డీయేకి తగ్గవచ్చని బీజేపీ కూడా అంచనా వేస్తోంది.

- సెంట్రల్ డెస్క్

సామాజిక సమీకరణలే కీలకం

అయితే విపక్షాలు, విశ్లేషకుల అంచనాలను జేడీయూ తోసిపుచ్చుతోంది. నితీశ్ ప్రభ కాస్త మసకబారినా.. బిహార్లో సామాజిక సమీకరణలే కీలకమని స్పష్టం చేస్తోంది. ఆర్‌జేడీ ముస్లిం-యాదవ్ కూటమినే నమ్ముకుంది. కాంగ్రెస్ కూడా ఇంతే. లెఫ్ట్ పార్టీల బలం నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉంది. బీజేపీతో ఉన్నా నితీశ్‌కున్న లౌకికవాద ఇమేజ్ చెక్కుచెదరలేదని జేడీయూ నేతలు అంటున్నారు. పైగా రాష్ట్ర జనాభాలో 15% ఉన్న కుర్మీ, కొయిరీ కులాలు ఆయనకు అండగా ఉన్నాయని.. 36% ఉన్న 130కులాల మద్దతు కూడా ఆయనకేనని స్పష్టం చేస్తున్నారు. కులగణనతో నితీశ్ ప్రతిష్ఠ పెరిగిందని.. ఓబీసీలు(27.13%), ఈబీసీల జనాభా ఎంత ఉందో తేల్చారని.. ఈ ప్రకారం నిధుల పంపిణీ చేస్తున్నారని గుర్తుచేస్తున్నారు. ఈబీసీలు, ఎస్సీలు సంపూర్ణంగా ఎన్డీయేకే మద్దతిస్తారని బీజేపీ, జేడీయూ దృఢంగా విశ్వసిస్తున్నాయి.

ఇజ్రాయెల్‌పై ఏ క్షణాన్నైనా ఇరాన్ దాడి

▸ అమెరికా, ఇజ్రాయెల్ నిఘా సంస్థల వెల్లడి

▸ ఇప్పటికే క్షిపణి ప్రయోగాలు చేస్తున్న ఇరాన్

▸ ఇజ్రాయెల్‌కు అండగా ఉంటామన్న అమెరికా



టెల్‌అవీవ్/న్యూయార్క్, ఏప్రిల్ 11: పశ్చిమాసియాపై యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడులతో సిరియాలో తమ కమాండర్లు మృతిచెందడంపై ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న ఇరాన్ ఇప్పటికే యుద్ధానికి సిద్ధమని సంకేతాలను వెలువరించింది. ఇరాన్ ఏ క్షణాన్నైనా ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులు చేయవచ్చని అమెరికా, ఇజ్రాయెల్ నిఘా సంస్థలు వెల్లడించినట్లు బ్లూంబెర్గ్ ఓ కథనాన్ని ప్రచురించింది. "ఇజ్రాయెల్ శిక్షను అనుభవించాల్సిందే..! శిక్ష అనుభవించి తీరుతుంది" అని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ బుధవారం ప్రకటించిన విషయం తెలిసిందే..! ఆ వెంటనే గల్ఫ్ ఆఫ్ ఒమాన్, హోర్ముజ్ జలసంధి సమీపంలో ఇరాన్ సైన్యం తమ క్షిపణులను పరీక్షించింది. ఏ క్షణాన్నైనా ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసే ప్రమాదముందని బ్లూంబెర్గ్ తన కథనంలో పేర్కొంది. అమెరికా, ఇజ్రాయెల్ నిఘా సంస్థల నుంచి అందిన అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు ఈ కథనాన్ని ప్రచురించినట్లు తెలిపింది. ఇరాన్ సుప్రీం లీడర్ ప్రకటనపై ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కట్జ్ తీవ్రంగా స్పందించారు. ఇరాన్ తన భూభాగం నుంచి దాడులను ప్రారంభిస్తే.. తాము కూడా ప్రతిదాడులకు సిద్ధంగా ఉన్నామంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఇప్పటికే హమాస్, హిజ్బుల్లా ఉగ్రసంస్థలతో పోరాడుతున్న ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేస్తే.. పశ్చిమాసియాపై యుద్ధమేఘాలు కమ్ముకుంటాయని అంతర్జాతీయ వ్యవహారాల విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హమాస్, హిజ్బుల్లా వంటి ఉగ్ర సంస్థలకు అండదండలు అందిస్తున్నది ఇరాన్ ప్రభుత్వమేనని, ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ కూడా ఆ దేశంపై ముందు నుంచి గుర్రుగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు. కాగా.. ఇరాన్ ప్రకటనపై అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ కూడా తీవ్రంగా స్పందించారు. "ఇజ్రాయెల్‌కు ఉక్కు కవచంలా రక్షణ కల్పిస్తాం" అని ప్రకటించారు.

మద్య నిషేధం పేరుతో లక్ష కోట్ల దోపిడీ: కూటమి నేతలు

అమరావతి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మద్యపాన నిషేధం పేరుతో ఐదేళ్లలో జగన్ రూ. లక్ష కోట్లు దోపిడీకి పాల్పడ్డారని కూటమి నేతలు మండిపడ్డారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో కూటమి నేతలు మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్, జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... కల్తీ మద్యం, జే.బ్రాండ్లతో ప్రజా ఆరోగ్యానికి జగన్ తూట్లు పొడిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్‌కు ఏపీని కేరాఫ్‌గా మార్చి రాష్ట్రంలో భారీగా రవాణా చేస్తున్నారన్నారు. జగన్ వచ్చిన తర్వాత రూ.వేల కోట్ల డ్రగ్స్ దందా జరుగుతోందని మండిపడ్డారు. ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో నాసిరకపు మద్యం జగన్ మిత్రులకి ఆదాయ కిక్కు ఇస్తే, పేదల ఆరోగ్యానికి ముప్పుగా మారిందన్నారు. నాసిరకం మద్యం తయారీ వ్యాపారంతో కనీసం రూ.50 వేల కోట్లు జగన్ సన్నిహితులకు, ఆయన సూట్‌కేస్ కంపెనీలకు పెట్టుబడులుగా వెళ్లాయన్నారు. జగన్ కుటుంబ సభ్యులు వైఎస్ అనిల్ రెడ్డి మద్యం వ్యాపారంలో ఆరితేరిపోయారన్నారు. జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ఒక్క చాన్స్ అంటే నమ్మి రాష్ట్ర ప్రజలు దొంగ చేతికి అధికారం ఇచ్చారని అన్నారు. మద్యం అమ్మకాలపై జగన్ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పిస్తున్న ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్

ఏపీ భవన్‌లో ఘనంగా పూలే జయంతి వేడుకలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కుల వివక్ష, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడి, నమ్మిన విలువల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ అన్నారు. దేశంలో సామాజిక విప్లవానికి పునాది వేసిన పూలే సేవలను గుర్తుంచుకోవలసిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఏపీ భవన్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో గురువారం మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్, భవన్ అధికారులు, అతిథులు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లవ్ అగర్వాల్ మాట్లాడుతూ.. ఆడపిల్లలు చదువుకోవడానికి పూలే ఉద్యమాలు చేశారని, సమాజాభివృద్ధికి అక్షరాస్యతే ముఖ్యమని చాటిచెప్పారన్నారు.

నరేంద్ర మోదీ విఫల ప్రధాని

▸ ఈడీ, సీబీఐ, ఐటీ విభాగాలను గుప్పెట్లో పెట్టుకొని రాజకీయ ప్రత్యర్థులను జైలుకు పంపుతున్నారు

▸ వైసీపీ అనుకూలంగా వ్యవహరిస్తున్న డీజీపీని తక్షణమే మార్చాలి: రామకృష్ణ

విశాఖపట్నం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): 'ప్రధాని నరేంద్ర మోదీ 2014, 2019 ఎన్నికల సమయాల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు. ఆయనో విఫల ప్రధాని' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఆరోపించారు. నగరంలోని అల్లిపురం పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'దేశంలో అన్ని వ్యవస్థలను మోదీ నిర్వీర్యం చేశారు. ఈడీ, సీబీఐ, ఐటీ విభాగాలను తన గుప్పెట్లో పెట్టుకొని రాజకీయ ప్రత్యర్థులను జైలుకు పంపడానికి వాటిని ఉపయోగించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీతో సీట్లు సర్దుబాటు చేసుకున్నారనే కారణంగానే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను మద్యం కుంభకోణం ఆరోపణలపై జైలుకు పంపించారు. ఏపీలో మద్యం కుంభకోణంపై అమిత్ షాకు బీజేపీ నాయకురాలు పురందేశ్వరి లేఖ రాశారు. దానిపై ఎందుకు విచారణ చేయలేదు? ఏపీలో సీఎం జగన్ అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకొని ప్రజా వ్యతిరేక పాలన చేశారు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న డీజీపీని తక్షణమే మార్చాలి' అని రామకృష్ణ డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్ర కేబినెట్‌లో తీర్మానం చేయలేదంటూ ఆ పార్టీ కొత్త మోసానికి తెర తీసిందన్నారు. సమావేశంలో సీహెచ్ రాఘవేంద్రరావు, విమల, జిల్లా కార్యదర్శి పైడిరాజు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అమృతరావు తదితరులు పాల్గొన్నారు.

కవితను అరెస్ట్ చేసిన సీబీఐ

▸ సవాల్ చేస్తూ కోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు

▸ కనీస సమాచారం లేకుండా అరెస్టు చేశారని వాదన

▸ ఎలాంటి ఊరటా ఇవ్వలేమని చెప్పిన న్యాయమూర్తి

▸ నేడు ఉదయం పదిగంటలకు ప్రత్యేక కోర్టులో విచారణ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయ్యి.. తిహాడ్ జైలులో ఉన్న కవితను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) గురువారం అరెస్టు చేసింది. ఈ విషయాన్ని గురువారం మధ్యాహ్నం ఆమె భర్త అనిల్‌కు తెలిపింది. ఆమె అరెస్టును సవాల్ చేస్తూ.. కవిత తరఫున న్యాయవాది మోహిత్ రావు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులోని ప్రత్యేక న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై అత్యవసర విచారణ జరపాలని విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం 4.55 నిమిషాలకు ఆ పిటిషన్.. ప్రత్యేక న్యాయమూర్తి మనోజ్ కుమార్ ముందుకు వచ్చింది. కవిత తరఫున సీనియర్ న్యాయవాది నితేష్ రాణా వర్చువల్‌గా వాదనలు వినిపించారు. ఆమెను అరెస్టు చేసే క్రమంలో సీబీఐ కనీస ప్రమాణాలు పాటించలేదని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశాలు ఉన్నా.. సీబీఐ వాటిని పాటించలేదని తెలిపారు. ఆ సమయంలో జోక్యం చేసుకున్న న్యాయమూర్తి మనోజ్‌కుమార్.. 'పిటిషన్‌పై వాదనలు వినాలా? వద్దా?' అనే దానిపై ఇంకా నిర్ణయమే జరగలేదని పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి తన వద్ద ఎలాంటి సమాచారమూ లేదని తెలిపారు. "మీకేమైనా సమాచారం ఉందా?" అని సీబీఐ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను న్యాయమూర్తి ప్రశ్నించగా.. తనకూ ఎలాంటి సమాచారం లేదని ఆయన బదులిచ్చారు. దీంతో.. అసలు సీబీఐ అరెస్టు చేసిందని మీరెలా చెబుతున్నారని కవిత తరఫు న్యాయవాదిని జడ్జి ప్రశ్నించారు. కవితను అరెస్టు చేసినట్టు ఆమె భర్త అనిల్‌కు సీబీఐ సమాచారం అందించిందని మోహిత్ రావు తెలిపారు. అయితే.. అత్యవసర కేసులను మాత్రమే తాము విచారిస్తామని, కాబట్టి ఈ విషయంలో కవితకు ఎటువంటి ఊరట ఇవ్వలేమని న్యాయమూర్తి స్పష్టం చేశారు. "ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించిన సమాచారం మా దగ్గర లేదు. దీనిపై గతంలో ఎప్పుడూ మా దగ్గర వాదనలు జరగలేదు. ఈరోజు సెలవు కదా? అత్యవసరమైన కేసులను మాత్రమే విచారిస్తాం. సుప్రీంకోర్టు, హైకోర్టులు ఏమైనా అత్యవసర ఆదేశాలు ఇస్తే అమలుచేస్తాం. అయినా.. ఇది అత్యవసరంగా విచారించాల్సిన కేసు కాదనేది మా అభిప్రాయం. కాబట్టి ఈ కేసులో ఎలాంటి ఊరటా ఇవ్వలేం." అని తేల్చిచెప్పారు. దీంతో.. తమ పిటిషన్‌ను రెగ్యులర్ కోర్టులో శుక్రవారమైనా విచారించాలని మోహిత రావు విజ్ఞప్తి చేశారు. దీనికి న్యాయమూర్తి.. ఈ కేసుపై రెగ్యులర్‌గా విచారణ జరుగుతున్న సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి కావేరి భవేజా కోర్టులోనే శుక్రవారం ఉదయం 10 గంటలకు వాదనలు వినిపించాలని సూచించారు. పిటిషన్‌ను ఆ న్యాయస్థానానికి బదిలీ చేస్తున్నట్టు తెలిపారు.

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితను తొలుత విచారించింది సీబీఐ అధికారులే. ఆ తర్వాతే ఈడీ రంగంలోకి దిగింది. కవితకు సీబీఐ 2022 డిసెంబరు 2న నోటీసులు పంపింది. డిసెంబర్ 11న హైదరాబాద్‌లోని కవిత ఇంట్లోనే ఆమెను తొలిసారి విచారించింది. అప్పుడు కవితను సాక్షిగా మాత్రమే సీబీఐ పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి 23న.. ఆమెను నిందితురాలిగా చేరుస్తూ సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ ఏడాది మార్చి 15న కవితను హైదరాబాద్‌లో ఈడీ అరెస్టు చేసింది. 16న ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరు పరిచింది. తర్వాత 10 రోజులపాటు కవితను ఈడీ కస్టడీలోకి తీసుకుని విచారించింది. 26న న్యాయస్థానం కవితకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో ఆమెను తిహాడ్ జైలుకు తరలించారు. కవిత 17 రోజులుగా తిహాడ్ జైలులోనే ఉన్నారు.

తిహాడ్ జైలులో ఉన్న కవిత నుంచి మరింత సమాచారం రాబట్టడానికి విచారించడానికి కోర్టు అనుమతి కోరిన సీబీఐ... దానిపై విచారణ జరుగుతుండగానే తీహాడ్ జైలకు వెళ్లి శనివారమే విచారించింది. తాజాగా ఆమెను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించింది.

కేజ్రీవాల్ పీఎస్‌పై వేటు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్న కేజ్రీవాల్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన వ్యక్తిగత కార్యదర్శి బిభవ్ కుమార్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ గురువారం డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొంది. గతంలో ఆయన ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించారని, నియామకం సమయంలో ఆ విషయాన్ని వెల్లడించకుండా దాచిపెట్టారని ఆరోపించింది. ఈ మేరకు విజిలెన్స్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వైవీవీజే రాజశేఖర్ ఆదేశాలు ఇచ్చారు. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్-1965లోని రూల్-5ను పాటించనందున తొలగింపు ఉత్తర్వులు ఇస్తున్నట్టు తెలిపారు. కాగా, ఈడీ సోమవారమే బిభవ్‌ను, ఆప్ ఎమ్మెల్యే దుర్గేష్ పాఠక్‌ను లిక్కర్ స్కామ్‌పై ప్రశ్నించింది. మరోవైపు మంగళవారం తిహాడ్ జైలులో ఉన్న కేజ్రీవాల్‌ను బిభవ్‌కుమార్ కలిశారు.



జూలైలో గోదావరి వరద ముంపులో భద్రాచలం సుభాష్ నగర్ కాలనీ (ఫైల్)

భద్రాచలంలో గోదావరి వరదకు అడ్డుకట్ట

▸ కొనసాగుతున్న మిగులు కరకట్ట నిర్మాణ పనులు

▸ జూన్ నాటికి పూర్తి చేసేలా అధికారుల కసరత్తు

▸ ఇప్పటికే రిటైనింగ్ వాల్‌కు రూ.500 కోట్లు మంజూరు



భద్రాచలం వద్ద కొనసాగుతున్న కరకట్ట నిర్మాణ పనులు

భద్రాచలం, ఏప్రిల్ 11: గోదావరి వరదలతో భద్రాద్రివాసులకు ముంపు బెడద లేకుండా ఇకపై కరకట్ట పూర్తిస్థాయి రక్షణ గోడగా నిలవనుంది. భద్రాచలం సుభాష్ నగర్ కాలనీ వద్ద నుంచి చేపట్టాల్సిన మిగులు కరకట్ట నిర్మాణ పనులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మోక్షం లభించింది. 700 మీటర్ల నిడివి పనులను రూ.38 కోట్ల అంచనా విలువతో చేపట్టారు. వీటిని జూన్ నాటికి పూర్తి చేయాలన్నది లక్ష్యమని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఈ పనులపై గత దశాబ్ద కాలంగా బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్న విమర్శలు ఉన్నాయి. 2022 జూలై 16న గోదావరి మహోగ్రరూపం దాల్చడంతో పట్టణంలోని శివారు కాలనీలన్నీ నీట మునిగాయి. దీంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తమకు ముంపు నుంచి రక్షణ కల్పించేందుకు కరకట్ట మిగులు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ పనులకు అసెంబ్లీ ఎన్నికలకు ముందు శంకుస్థాపన జరిగింది. అయితే తొలి నుంచి భద్రాద్రివాసులకు ముంపు నుంచి రక్షణ కల్పిస్తామని మంత్రి తుమ్మల భరోసా ఇవ్వడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పనులు ప్రారంభమయ్యాయి.

ఆ కరకట్టే శ్రీరామరక్షగా నిలిచింది

భద్రాచలం వద్ద కరకట్టతో 2022 జూలైలో పట్టణానికి వరద గండం తప్పింది. 1986లో వచ్చిన గోదావరి వరదలను చూసి అప్పటి సీఎం ఎన్టీఆర్ చలించిపోయారు. అప్పుడు మంత్రిగా ఉన్న తుమ్మల సూచన మేరకు కరకట్ట నిర్మాణానికి ఎన్టీఆర్ హామీ ఇచ్చారు. కొంతవరకు కరకట్ట నిర్మించారు. ఆ తరువాత పనులు నిలిచిపోగా చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో రూ.53 కోట్లు మంజూరు చేసి, యటపాక నుంచి సుభాష్‌నగర్ వరకు పది కిలోమీటర్లకు పైగా కరకట్ట నిర్మించారు. దీంతో భద్రాచలం పట్టణంతో పాటు శివారున ఉన్న రాజుపేట, మేడువాయి తదితర గ్రామాలకు వరద ముంపు తప్పింది. అయితే 2022 జూలై 16న భద్రాచలం వద్ద గోదావరి 71.3 అడుగుల నీటిమట్టంతో ప్రవహించడంతో అపార నష్టం సంభవించింది. సుభాష్‌నగర్ కాలనీ, శాంతినగర్ కాలనీ, కూనవరం రోడ్డు, సీఆర్‌పీఎఫ్ క్యాంపు కార్యాలయాలు పూర్తిగా నీట మునిగాయి. ఇదంతా కరకట్ట లేని ప్రాంతం నుంచి వచ్చిన వరద వల్లే జరిగింది. భద్రాద్రికి భవిష్యత్తులో వచ్చే వరదలతో ముంపు లేకుండా శాశ్వత రక్షణ కావాలంటే పూర్తిస్థాయి కరకట్ట నిర్మాణంతోనే సాధ్యమని స్థానికులు పేర్కొంటున్నారు. కరకట్ట స్లూయిస్‌ల నుంచి లీకులు లేకుండా చర్యలు చేపట్టి, గోదావరి స్నాన ఘట్టాలు, విస్తా కాంప్లెక్సు పరిసరాల్లో ఉన్న కరకట్ట అంతర్భాగం పటిష్ఠం చేసి, 15 అడుగులకు ఎత్తు పెంచాలని కోరుతున్నారు.

రిటైనింగ్ వాల్‌కు రూ.500 కోట్లు


భద్రాచలం, పినపాక నియోజకవర్గాలకు గోదావరి వరద ముంపు నుంచి శాశ్వత రక్షణ కల్పించేందుకు ఇప్పటికే రూ.500 కోట్లను సీఎం రేవంత్ రెడ్డి మంజూరు చేశారు. రిటైనింగ్ వాల్ నిర్మించి ముంపు కష్టాలను తీర్చే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని మార్చి 11న భద్రాచలంలో జరిగిన బహిరంగ సభలో రేవంత్ తెలిపారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో నగ్న చిత్రాలకు చెక్

▸ కొత్తగా బ్లర్ ఫీచర్

లండన్, ఏప్రిల్ 11: సోషల్ మీడియాలో యువతుల నగ్న ఫొటోలు షేర్ చేస్తామని బెదిరించడం.. ఆపై వారిని లైంగికంగా వేధించడం, డబ్బులు డిమాండ్ చేయడం వంటి చర్యలకు చెక్ పెట్టే విధంగా ప్రముఖ సోషల్ మీడియా సంస్థ ఇన్‌స్టాగ్రామ్ సరికొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్‌ల్లో ఎక్కడైనా నగ్నత్వం కనిపిస్తే దాన్ని 'బ్లర్' (మసకబార్చడం) చేసేలా కొత్త ఫీచర్‌ను ప్రారంభించింది. లైంగిక నేరాలు, ఫొటోల దుర్వినియోగాన్ని ఎదుర్కొనేందుకు నేరస్థులు యువతను టార్గెట్ చేయకుండా అరికట్టడానికి తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని, దీనిలో భాగంగా ఈ కొత్త ఫీచర్లను పరీక్షిస్తున్నామని ఇన్‌స్టాగ్రామ్ గురువారం తెలిపింది. 18 ఏళ్లలోపు వయసున్న వారికి ఈ ఫీచర్ డీఫాల్ట్‌గా ఆన్ అవుతుందని, 18 ఏళ్లు నిండిన వినియోగదారులకు మాత్రం దీన్ని యాక్టివేట్ చేసుకోవాల్సిందిగా నోటిఫికేషన్ వస్తుందని పేర్కొంది. ఈ ఫీచర్‌తో నగ్నత్వం ఉన్న ఫొటోలు బ్లర్‌గా కనిపిస్తాయి. వాటిని పంపిన వ్యక్తిని బ్లాక్ చేయడానికి అవకాశం ఉంటుంది.

భారత్‌కు ఇబ్బంది కలిగినా సరే.. కెనడా పౌరుల హక్కులను పరిరక్షిస్తాం: ట్రూడో



న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భారత్‌పై మరోసారి నోరు పారేసుకున్నాడు. ఢిల్లీలోని మోదీ ప్రభుత్వానికి ఇది ఇబ్బంది కలిగించినా.. తమ దేశ పౌరుల మాట్లాడే హక్కును తమ ప్రభుత్వం పరిరక్షిస్తుందని వ్యాఖ్యానించారు. అలాగే కెనడాలోని గత కన్జర్వేటివ్ ప్రభుత్వం మోదీ, ఆయన మంత్రివర్గంతో స్నేహంగా వ్యవహరించిందని కూడా ట్రూడో ఆరోపించారు. ఒక చర్చాకార్యక్రమంలో అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ట్రూడో ఈ వ్యాఖ్యలు చేశారు. 'కెనడాలోని మైనారిటీలను ఎవరు ఇబ్బంది పెట్టినా సరే వారి కోసం మాట్లాడే వారి హక్కులను కాపాడేందుకు మా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుంది. ఇది వారి స్వదేశాల్లోని వారిని ఇబ్బంది పెట్టినా సరే మేం కెనడియన్లకు మద్దతుగా ఉంటాం' అని ఖలిస్థానీ మద్దతుదారులను ఉద్దేశించి ట్రూడో అన్నారు.

ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో పీహెచ్‌డీ

విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్(స్పా)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ డాక్టోరల్ ప్రోగ్రామ్‌లో ఫుల్ టైం, పార్ట్ టైం విధానాలు ఉన్నాయి. ఫుల్ టైం ప్రోగ్రామ్‌నకు ఇన్‌స్టిట్యూషనల్ ఫెలోషిప్ అర్హత ఉన్న రీసెర్చ్ స్కాలర్స్, సెల్ఫ్ ఫైనాన్స్‌డ్ రీసెర్చ్ స్కాలర్స్, స్పాన్సర్డ్ రీసెర్చ్ స్కాలర్స్ అప్లయ్ చేసుకోవచ్చు. పార్ట్ టైం ప్రోగ్రామ్‌కు ప్రాజెక్ట్ స్టాఫ్, అకడమిక్ ఫ్యాకల్టీ మెంబర్లు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ అర్హులు.

విభాగాలు: ప్లానింగ్, ఆర్కిటెక్చర్, బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో పీజీ (ఆర్కిటెక్చర్/అర్బన్ డిజైన్/ప్లానింగ్/బిల్డింగ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్) పూర్తిచేసి ఉండాలి. కనీసం 70 శాతం మార్కులతో బీఈ(సివిల్ ఇంజనీరింగ్)/బీ ఆర్క్/బీ ప్లానింగ్ ఉత్తీర్ణతతోపాటు మూడేళ్ల బోధన/రీసెర్చ్/ప్రొఫెషనల్ అనుభవం ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: నిబంధనల ప్రకారం షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించినవారిని పర్సనల్ ఇంటర్వ్యూకి పిలుస్తారు. రీసెర్చ్ రైటప్‌నకు 20, ప్రజంటేషన్ ఆఫ్ రీసెర్చ్ ఇంట్రెస్ట్‌కు 30, ఇంటర్వ్యూ స్కోర్‌కు 50 మార్కుల వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రిటెన్ టెస్ట్ సిలబస్ తదితర వివరాలను త్వరలో ప్రకటిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.3,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 8
- **అభ్యర్థుల షార్ట్ లిస్ట్ విడుదల:** మే 10
- **రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** మే 21, 22
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 24
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** మే 31
- **చిరునామా:** రిజిస్ట్రార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, సర్వే నెం.4/4, ఐటీఐ రోడ్, విజయవాడ-520008
- **వెబ్‌సైట్:** www.spav.ac.in



నిఫ్టెమ్‌లో ఎంటెక్, ఎంబీఏ

హరియాణాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ అంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (నిఫ్టెమ్)- ఎంటెక్, ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్/నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. సంస్థ నిబంధనల ప్రకారం స్కాలర్‌షిప్ అందిస్తారు.

ఎంటెక్

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ క్వాలిటీ మేనేజ్‌మెంట్, ఫుడ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్లాంట్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 20 సీట్లు ఉన్నాయి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం సంబంధిత సబ్జెక్టులతో బీఈ/బీటెక్/పీజీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులు సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు. ఎంపిక ప్రక్రియలో ముందుగా గేట్ అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తారు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మెంటల్ ఎబిలిటీ, ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్ అంశాల నుంచి మొత్తం 30 ప్రశ్నలు; అభ్యర్థి ఎంచుకొన్న సెక్షన్ నుంచి 70 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం గంటన్నర.

సెక్షన్లు: ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్, డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్; ఫుడ్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ప్రాసెస్ ఇంజనీరింగ్, బయో కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్; ఫుడ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ అంత్రప్రెన్యూర్‌షిప్; ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, బయో కెమిస్ట్రీ; అగ్రికల్చర్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ.



ఎంబీఏ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీని స్పెషలైజేషన్ ఫుడ్ అండ్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 60 సీట్లు ఉన్నాయి. సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసిన వారు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. క్యాట్/మ్యాట్/సీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులు సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ఇందులో మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. లాజికల్ రీజనింగ్/డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి 15, క్వాంటిటేటివ్ అనాలిసిస్ నుంచి 15, వెర్బల్ ఎబిలిటీ/రీడింగ్ కాంప్రహెన్షన్ నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు నిర్దేశించారు. మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 15
- **గేట్/క్యాట్/మ్యాట్/సీమ్యాట్ స్కోర్ ఆధారంగా మెరిట్ లిస్ట్ విడుదల:** మే 17
- **నాన్ క్యాట్/మ్యాట్/సీమ్యాట్ అభ్యర్థులకు ఎంట్రెన్స్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్స్, ఇంటర్వ్యూలు:** మే 30
- **ఎంబీఏ ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 3
- **గేట్ అభ్యర్థులకు కౌన్సెలింగ్:** మొదటి రౌండ్ - మే 20 నుంచి 22 వరకు; రెండో రౌండ్ - మే 27 నుంచి 29 వరకు; మూడో రౌండ్ - జూన్ 3 నుంచి 5 వరకు
- **ఎంటెక్‌లో మిగిలిన సీట్ల వివరాల వెల్లడి:** జూన్ 7
- **నాన్ గేట్ అభ్యర్థులకు ఎంట్రెన్స్ టెస్ట్:** జూన్ 17
- **నాన్ గేట్ అభ్యర్థుల ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల:** జూన్ 19
- **నాన్ గేట్ అభ్యర్థులకు కౌన్సెలింగ్:** జూన్ 20 నుంచి 23 వరకు
- **వెబ్‌సైట్:** www.niftem.ac.in

యూపీఎస్సీ ఐఈఎస్/ఐఎస్ఎస్ఈ 2024

ఎకనామిక్స్/స్టాటిస్టికల్ సర్వీసుల్లో జూనియర్ టైం స్కేల్ పోస్టుల భర్తీకి ఉద్దేశించిన ఇండియన్ ఎకనామిక్ సర్వీస్/ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ ఎగ్జామినేషన్-2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) నిర్వహిస్తోంది. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌లో 18 పోస్టులు, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌లో 30 పోస్టులు చొప్పున మొత్తం 48 పోస్టులు ఉన్నాయి.

అర్హత: ఎకనామిక్ సర్వీస్‌కు పీజీ(ఎకనామిక్స్/అప్లయిడ్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/ఎకనామెట్రిక్స్); స్టాటిస్టికల్ సర్వీస్‌కు డిగ్రీ(స్టాటిస్టిక్స్/మేథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్) లేదా పీజీ(స్టాటిస్టిక్స్/మేథమెటికల్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు నిబంధనల ప్రకారం సడలింపు వర్తిస్తుంది.

పరీక్ష వివరాలు

- ఇందులో రాత పరీక్ష, వైవా-వోస్ అనే రెండు పార్ట్‌లు ఉంటాయి. రాత పరీక్షకు 1000 మార్కులు, వైవాకు 200 మార్కులు నిర్దేశించారు. తరవాత డాక్యుమెంట్స్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్‌లు కూడా ఉంటాయి.
- ఇండియన్ ఎకనామిక్ సర్వీస్‌కు నిర్వహించే రాత పరీక్షలో జనరల్ ఇంగ్లీష్, జనరల్ స్టడీస్ సబ్జెక్టులకు ఒక్కోదానికి 100 మార్కులు; జనరల్ ఎకనామిక్స్-1, జనరల్ ఎకనామిక్స్-2, జనరల్ ఎకనామిక్స్-3 సబ్జెక్టులకు ఒక్కోదానికి 200 మార్కులు నిర్దేశించారు. ఒక్కో సబ్జెక్టుకు 3 గంటల సమయం ఇస్తారు.
- ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్‌కు నిర్వహించే రాత పరీక్షలో జనరల్ ఇంగ్లీష్, జనరల్ స్టడీస్ సబ్జెక్టులకు ఒక్కోదానికి 100 మార్కులు, మూడు గంటల పరీక్ష సమయం కేటాయించారు. స్టాటిస్టిక్స్-1(ఆబ్జెక్టివ్), స్టాటిస్టిక్స్-2(ఆబ్జెక్టివ్) సబ్జెక్టులకు ఒక్కోదానికి 200 మార్కులు, రెండు గంటల పరీక్ష సమయం నిర్దేశించారు. స్టాటిస్టిక్స్-3(డిస్క్రిప్టివ్), స్టాటిస్టిక్స్-4(డిస్క్రిప్టివ్) సబ్జెక్టులకు ఒక్కోదానికి 200 మార్కులు, మూడు గంటల పరీక్ష సమయం నిర్దేశించారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200(మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **ఐఈఎస్/ఐఎస్ఎస్ఈ 2024 ఎగ్జామ్ తేదీ:** జూన్ 21
- **వెబ్‌సైట్:** www.upsc.gov.in/, upsconline.nic.in

ఏపీ డీఎస్సీ ఎస్‌జీటీ మోడల్ ప్రశ్నలు

తెలుగు కంటెంట్ & మెథడాలజీ

1. 'భార్య' పదానికి పర్యాయపదాలు గుర్తించండి
   1) సతి 2) కళత్రం 3) దార 4) పైవన్నీ
2. 'అంగం' పదానికి నానార్థాలు ఎన్నుకోండి
   1) అవయవం 2) భాగం 3) శరీరం 4) పైవన్నీ
3. 'ప్రాణులకు జీవనాధారమైనవాడు' అనే వ్యుత్పత్తినిచ్చే పదం?
   1) అనంతుడు 2) అనిహుడు 3) అనీశుడు 4) అనిలుడు
4. పుట్టెడు శనగల్లో ఒకటే రాయి? ఈ పొడుపునకు విడుపు?
   1) సీతాఫలం 2) చుక్కల్లో చంద్రుడు 3) అగ్గిపెట్టె 4) ఆకాశంలో నక్షత్రం
5. కింది వాటిలో సర్వనామాన్ని గుర్తించండి
   1) మేము 2) లత 3) చెట్టు 4) బడి
6. క నుంచి మ వరకు ఉన్న హల్లులకు గల పేరు?
   1) స్పర్శాలు 2) స్థిరాలు 3) ఊష్మాలు 4) సరళాలు
7. కింది వాటిలో ఉపవిభక్తులు అని వేటిని అంటారు?
   1) ఇ, టి, తి 2) య, వ, ర 3) ఆ, ఈ, ఏ 4) పైవన్నీ
8. వధూపేతుడు పదాన్ని విడదీయగా వచ్చిన రూపం
   1) వధు + ఉపేతుడు 2) వధు + ఊపేతుడు 3) వధూ + ఊపేతుడు 4) వధూ + ఉపేతుడు
9. కింది వాటిలో ద్విగు సమాసాన్ని గుర్తించండి
   1) ఏడు ద్వారాలు 2) మూడు కన్నులు 3) పంచ పాండవులు 4) పైవన్నీ
10. మండే ఎండ నిప్పుల కొలిమా? అన్నట్లు ఉంది- ఇందులో ఉన్న అలంకారాన్ని గుర్తించండి
    1) ఉపమాలంకారం 2) యమకాలంకారం 3) రూపకాలంకారం 4) ఉత్ప్రేక్షాలంకారం
11. కింది వాటిలో సరికాని దాన్ని గుర్తించండి
    1) సమ్యక్‌దృష్టి- UUUI 2) కారకముల్- UIIU 3) చదువుచున్- IIIIU 4) మర్కటము- UIII
12. సమప్రాధాన్యం గల రెండు గాని అంతకంటే ఎక్కువ వాక్యాలు కాని కలిస్తే వాక్యం ఏర్పడుతుంది
    1) సామాన్య వాక్యం 2) సంయుక్త వాక్యం 3) సంశ్లిష్ట వాక్యం 4) సంక్లిష్ట వాక్యం
13. భావితరాల వారికి మన భావాలను అందించేందుకు సమస్యలను పదిమందికి తెలిసేలా పత్రికల్లో ప్రచారం చేసేందుకు అవసరమయ్యే నైపుణ్యం?
    1) లేఖనం 2) పఠనం 3) భాషణం 4) శ్రవణం
14. కిండర్ గార్టెన్ పద్ధతిని ప్రవేశపెట్టిన విద్యావేత్త?
    1) బ్లూమ్ 2) కాల్డ్‌వెల్ 3) ఫ్రోబెల్ 4) గలిక్
15. విద్యాపరంగా ఊహాజనిత సుదూర గమ్యాలు?
    1) విద్యాదర్శాలు 2) విద్యోద్దేశాలు 3) విద్యాలక్ష్యాలు 4) విద్యాస్పష్టీకరణలు
16. ప్రథమ భాషగా తెలుగు బోధనోద్దేశం?
    1) భాషా సంస్కృతిని, భాషీయుల సంస్కృతిని పరిచయం చేయడం
    2) శ్రవణ, భాషణ, పఠన, లేఖన సామర్థ్యాలను పెంచి భాషపై పట్టు కలిగించడం
    3) శ్రవణ, భాషణ, పఠన, లేఖన నైపుణ్యాలకు కావాల్సిన సాధారణ పరిజ్ఞానం కలిగించడం
    4) దైనందిన వ్యవహారాలను తెలుగులో నిర్వహించే జ్ఞానం ఉండడం



17. పద్య బోధన ప్రధాన ఉద్దేశం?
    1) భాషా సంపదను పెంపొందించడం
    2) విద్యార్థుల్లో రసానందాన్ని కలిగింపజేయడం
    3) భాషలోని నుడికారాన్ని తెలుసుకునేటట్లు చేయడం 4) విషయ పరిజ్ఞానానికి తోడ్పడడం
18. విద్యా సాంకేతిక శాస్త్రం అనే భావనను మొదట ప్రవేశపెట్టింది?
    1) డేవిడ్ టేలర్ 2) చార్లెస్ బాబేజ్ 3) ఎడ్గార్ డేల్ 4) బోస్టన్
19. 'భాషామేళాలు' పాఠశాలల్లో నిర్వహించడం వలన కలిగే ప్రయోజనం?
    1) పాఠశాల కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించుట
    2) పాఠశాల కీర్తి ప్రతిష్ఠలు పెంచుట
    3) విద్యార్థుల్లో భాషాభివృద్ధి జరుగుట
    4) ఉపాధ్యాయుల నైపుణ్య పరీక్షణం
20. విద్యార్థులను సమగ్రంగా మూల్యాంకనం చేయాలని అలాగే వారి యోగ్యతా పత్రాల్లో విద్యార్థులు ఉత్తీర్ణులా, అనుత్తీర్ణులా అనే అంశం ఉండకూడదని సూచించిన కమిషన్?
    1) మొదలియార్ 2) కొఠారీ 3) ఈశ్వరీబాయి పటేల్ కమిటీ 4) రాధాకృష్ణన్

ఇంగ్లీష్ కంటెంట్ & మెథడాలజీ

21. Match following Poet/Author with their Poem/Lesson

Poet/Author	Poem/Lesson
1. T.S.ELIOT	a) Bepin Chaudhury's Lapse of Memory (Lesson)
2. SATYAJIT RAY	b) The Lat Bargain(poem)
3. RABINDRANATH TAGORE	c) The Summit Within (Lesson)
4. H.P.S.AHLUWALIA	d) Macavity: The Mystery Cat(Poem)

   1) 1-d, 2-c, 3-b, 4-a
   2) 1-c, 2-a, 3-d, 4-b
   3) 1-d, 2-a, 3-b, 4-a
   4) 1-b, 2-c, 3-d, 4-a
22. When was Frank Flynn born?
   1) 16 November 1906
   2) 6 December 1906
   3) 26 October 1916
   4) 16 October 1916
23. Which of the following were written by William Griffis?
   a) Dutch Fairy Tales for Young
   b) Belgian Fairy Tales
   c) Welsh Fairy Tales
   d) The Malkado's Empire
   e) Corea:The Hermit Nation
   1) a, b, c 2) b, c, d 3) a, b, d, e 4) a, b, c, d, e
24. Techniques can be used in note making......
   1) Use abbreviations
   2) Use color and image
   3) Use keywords 4) all above
25. What is a 'Biography'?
   1) A Life story written by another person
   2) A Life story that tells the life of some persons
   3) A self-written life story
   4) A life story made into film by the person him/herself
26. Mrs. Sudha Murthy the chairperson of Infosys has written her husband Narayana Murthy's life story. What type of book is it?
   1) Biography 2) Travel Book 3) Autobiography 4) Memoir
27. Choose the noun phrase with the correct order of adjectives
   1) A dirty black crow
   2) A crow dirty black
   3) A crow black dirty
   4) A black dirty crow
28. Choose the correct expression with the correct order of adjectives
   1) A silk nice saree
   2) A nice silk saree
   3) A saree nice silk
   4) A silk saree nice
29. When did you see him at home? This sentence is in:
   1) The past perfect tense
   2) The present perfect tense
   3) The simple present tense
   4) The simple past tense
30. If Mother Terresa........ alive today, how would people receive her? Choose the correct word to complete the sentence meaningfully.
   1) was 2) were 3) has 4) had
31. I have completed my work, I went to bed. These two sentences can be combined as:
   1) Going to bed, I have completed my work
   2) I went to bed to complete my work
   3) Having completed my work, I went to bed
   4) To go to bed, I complete your work


సమాధానాలు

1) 4 2) 4 3) 4 4) 2 5) 1 6) 1
7) 1 8) 4 9) 4 10) 4 11) 3
12) 2 13) 1 14) 3 15) 1 16) 2
17) 2 18) 1 19) 3 20) 2 21) 3
22) 2 23) 4 24) 4 25) 1
26) 1 27) 1 28) 2 29) 4
30) 2 31) 3



ఆకిశెట్టి వెంకటస్వామి,
సీనియర్ ఫ్యాకల్టీ


లిటిల్స్



దేవుడు ప్రతిచోటా...

గురువు దగ్గర శిష్యులంతా గుమికూడారు. పాఠం చెబుతూంటే పిల్లలందరూ శ్రద్ధగా వింటున్నారు. పాఠం మధ్యలో ప్రతి చోటా దేవుడుంటాడని గురువు అన్నాడు. 'నిజమా గురువుగారు' అంటూ ఓ పిల్లవాడు అడిగాడు. 'అవును' అన్నాడు గురు. 'అయితే.. నీలో నాలో కూడా దేవుడు ఉన్నాడా?' అని అడిగాడు ఆ విద్యార్థి. 'ఇది ముమ్మాటికీ నిజం. నీలో నాలోనే కాదు. ప్రతి ప్రాణిలో దేవుడున్నాడు. ఆయన లేని చోటు లేదు' అంటూ గురువుగారు సెలవిచ్చారు.

ఒకరోజు ఐదుమంది పిల్లలు అడవికి కట్టెలు తీసుకురావటానికి వెళ్లారు. కట్టెల మోపులతో ఇంటికి వస్తోంటే ఒకటే అరుపులు. పక్కకు జరగండి.. అంటూ కేకలు వేస్తున్నారు. ఎదురుగా ఏనుగు పరిగెత్తుకొస్తోంది. నలుగురు పిల్లలు దూరంగా పరిగెత్తారు. ఒక పిల్లవాడు మాత్రం దారిలోనే నిలబడ్డాడు. పిల్లలు అరిచినా పక్కకు వెళ్లలేదు. 'దేవుడు అన్ని చోట్లా ఉన్నాడు. ఏనుగులోనూ దేవుడు ఉన్నాడు. ఇక్కడే ఉంటా'నన్నాడు. వెంటనే ఏనుగు వచ్చి తొండంతో ఆ బాలుడిని కిందపడేసింది. ఆ పిల్లవాడికి దెబ్బలు తగిలాయి. వైద్యుడు వచ్చి వైద్యం చేశాడు. అంతలోనే గురువుగారు తన శిష్యులతో పాటు ఆ విద్యార్థి దగ్గరకు వచ్చాడు. 'ఎందుకు నాయనా.. ఇలా చేశావు. ఏనుగుకి అడ్డం వచ్చావంట'అని అడిగారు. ఏడుస్తూనే.. 'మీరే చెప్పారు కదా గురువుగారు. ప్రతి ప్రాణిలో దేవుడు ఉంటాడని చెప్పారు కదా!' అన్నాడా విద్యార్థి. 'పిచ్చివాడా.. ఏనుగులో దేవుడున్నాడు. అదే సమయంలో మావటి వాడు నిన్ను పక్కకు వెళ్లమని కేకలు వేశాడు. మావటివాడిలో కూడా దేవుడు ఉన్నాడు. నువ్వు అతని మాట విని ఉంటే ఏమీ అయ్యేది కాదు' అన్నాడు. 'గురువుగారు తప్పుగా అర్థం చేసుకున్నా. క్షమించు' అన్నాడు ఆ విద్యార్థి. 'నీదేమీ తప్పులేదు నాయనా. నా పాఠం నీకు అలా అర్థమైంది. అనుభవమే నీకు అన్నీ నేర్పుతుంది' అంటూ ఆశీర్వదించాడు గురువు.







10 తేడాలు గుర్తించండి





డైలీ సుడోకు - 279

	8						2	
9			2			1		8
		7	8			9		
			5		2		6	
4								1
	7		6		9			
		9			6	3		
8		1			5			6
	3						4	

సుడోకు - 278 సమాధానం

7	8	9	4	5	6	3	1	2
6	2	1	9	7	3	5	8	4
3	4	5	8	1	2	9	6	7
9	5	3	2	8	7	1	4	6
1	6	2	3	4	5	8	7	9
8	7	4	1	6	9	2	5	3
5	9	6	7	2	1	4	3	8
2	1	8	6	3	4	7	9	5
4	3	7	5	9	8	6	2	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.